# తెలుగు దేవభాషే

## నూర్‌బాషా రహంతుల్లా

**తెలుగుమిత్ర ప్రచురణలు**
11-121, పోలకంపాడు - 522 501
తాడేపల్లి, గుంటూరు జిల్లా
ఫోన్ : 08645 - 273789, 9948878833

**తెలుగు దేవభాషే**

**(telugu dEva bhAShE)**

రచన : నూర్‌బాషా రహంతుల్లా

© రచయిత

మొదటి ముద్రణ : మే 2012

ముఖపత్రాలంకరణ :

షేక్ అబ్దుల్లా, 9394822411

విజయవాడ

కాపీలు : 1000

పుస్తకాలకు పంపిణీదారులు :

**తెలుగు బుక్‌హౌస్**

3-3-862, కాచిగూడ 'x' రోడ్స్

హైదరాబాదు - 500 027

ఫోన్ : 040 65347374, 9247446497

మరియు

అన్ని పుస్తక విక్రయ కేంద్రాలలో

e.book : www.kinige.com

ముద్రణ :

శ్రీశ్రీ ప్రింటర్స్

విజయవాడ - 520 002

సెల్ : 9490634849

వెల : రూ. 60/-

అమ్మ నాన్నలకు

# అంకితం...



రోశమ్మ (రోషన్‌బీ)
1938 - 25.4.2000

మౌలాలి
1930 - 17.10.2006

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | ఆత్మగౌరవం కోసం మాతృభాషాభిమానం | మండలి బుద్ధప్రసాద్ | 7 |
| | ఏది దేవభాష | డా. జి.వి.పూర్ణచంద్ | 10 |
| | తల్లిభాష కోసం ప్రజా ఉద్యమాలు సాగాలి | ప్రొ॥అబ్దుల్ నూర్‌భాషా | 15 |
| | నామాట | నూర్‌బాషా రహంతుల్లా | 18 |
| | పెద్దల అభిప్రాయాలు | | 23 |
| 1. | చిన్న భాషల్ని మింగేస్తున్న పెద్ద బాషలు | | 25 |
| 2. | తెలుగు నిఘంటువులు | | 28 |
| 3. | మహానిఘంటు నిర్మాణమే జీవితాశయం | | 30 |
| 4. | ఇలా చేస్తే బాగుంటుంది | | 37 |
| 5. | శ్రీకృష్ణదేవరాయలు ఇప్పుడుంటే ఏం చేస్తారు? | | 40 |
| 6. | ప్రజల పదాలతో నిఘంటువు చేయాలి | | 43 |
| 7. | భాషల లెక్కలు తేల్చటానికి ఏడేళ్ళా? | | 49 |
| 8. | మాతృభాషలో జరిగే పాలనలో దళారులుండరు | | 54 |
| 9. | లిపి సంస్కరణ జరగాలి | | 60 |
| 10. | అధికారులారా ఇలా మీరెందుకు రాయలేరు? | | 63 |
| 11. | ఇంటిభాషంటే ఎంత చులకనో ! | | 73 |
| 12. | అధికారభాషా కార్యశీలి ప్రసాద్ | | 79 |
| 13. | కంప్యూటర్లో తెలుగు - తెలుగు వెబ్‌సైట్లు | | 82 |
| 14. | దస్త్రాలన్నీ తెలుగుభాషలోనే | | 87 |
| 15. | తెలుగు సాహిత్యంలో ముస్లిం కవులూ రచయితలు | | 89 |
| 16. | తెలుగు కుత్తుకపై కత్తి | | 95 |
| 17. | తెలుగు భాషకు తీవ్రమైన అన్యాయం | | 99 |
| 18. | తమిళులు ఎలా చేస్తే మనమూ అలాచేద్దాం | | 104 |
| 19. | తెలుగు తల్లి భాష కూడా దేవభాషే | | 106 |
| 20. | అన్ని భాషలూ దేవభాషలే | | 118 |
| 21. | తెలుగులో పెళ్ళి | | 130 |
| 22. | తెలుగు భాషకు సత్యసాయి అండ | | 134 |



# ఆత్మగౌరవం కోసం మాతృభాషాభిమానం

- మండలి బుద్ధప్రసాద్

*ఆంధ్రప్రదేశ్ పూర్వపు మంత్రివర్యులు*

mandalibuddhaprasad@gmail.com

Cell : 9848780872

రాజాదరణ కలిగిన భాష రాజభాష! అది ప్రాచీన భాష కావాలని లేదు. దేశీయ భాషే కావాలని కూడా లేదు. పాలనా పరమైన వ్యవహారాలకు మాత్రమే అది పరిమితమైనప్పటికీ, రాజాదరణ కారణంగా ఆ భాష పట్ల ప్రజలలో ఒక విధమైన వ్యామోహం సహజంగా ఉంటుంది. అది అన్నం పెడుతుందేమోననే ఆశ, అందలం ఎక్కిస్తుందనే నమ్మకం, అవసరాలు తీర్చగలదనే భావన... ఇవన్నీ రాజభాషకు జనాదరణ ఏర్పడటానికి కారణం అవుతాయి. ఆ భాషని ధారాళంగా మాట్లాడగలిగిన వారు దాన్ని అడ్డం పెట్టుకొని రాచకార్యాలు, ఇతర అవసరాలు తీర్చుకో గలుగుతారు. సామాన్యుడికి మాతృభాష తప్ప ఇంకొక భాష నేర్చుకునే అవకాశం ఉండదు. అందువలన వెనుకబాటుతనానికి దారితీసి, మాతృభాషను నేరిస్తే పేదరికం వస్తుందనే భావన కలుగుతుంది. అందువలన రాచభాష మాట్లాడేవారు ఉన్నతులుగానూ, మాతృభాష మాట్లాడేవారు దీనులు గానూ చెలామణి అవుతారు.

నా విష్ణుః పృథ్వీపతిః అనీ, రాజు దైవాంశ సంభూతుడనీ అనేక తరాలుగా నరనరాన జీర్ణించుకొని పోయిన భావనలోంచి ఏర్పడిన సమాజం మనది! అలాంటి దైవ సమానుడయిన రాజు ఆదరించిన భాష దేవభాషే కావటం సహజం. ప్రస్తుతం తెలుగు సమాజంలో ఇంగ్లీషు ఈ విధమైన రాచమర్యాదలు పొందుతూ, దైవత్వాన్ని సంతరించుకొన్నట్టు మనకు స్పష్టమౌతూనే వుంది. టెంపుల్ కెళ్ళి కోకోనట్ బ్రేక్ చేసి వచ్చా. అనగలుగుతున్నాం అంటే, ఇంగ్లీషుని మనం మనకు తెలియకుండానే దైవభాషగా భావించుకొంటున్నాం అన్నమాట.

ప్రపంచంలో ఏ దేశంలోనయినా, మాతృభాష రాచభాష కాలేనప్పుడు జరిగేది ఇదే! పాలకులకు భాషా విధానం లేకపోవటం, మాతృభాషలో పరిపాలన, విద్య, నిత్యవ్యవహారాలన్నీ జరగాలని గాంధీ మహాత్ముడు ప్రబోధించిన అంశాలను పరిగణనలోకి తీసుకోక పోవటం, ప్రజలలో మాతృభాషాభిమానం కొరవడటం... ఇవన్నీ ఆంగ్లభాషాధిపత్యానికి కారణాలు.

ఆంగ్లేయుల దాస్యం నుంచి జాతి బయట పడినా, ఆంగ్ల బాషా దాస్యం నుంచి బయట పడలేపోవటం ఒక దురదృష్టం. రాజకీయ నిర్ణయం లేకుండా ఈ పరిస్థితిని చక్కదిద్దటం కష్టసాధ్యం అవుతుంది. రాజకీయ నిర్ణయాన్ని సాధించాలంటే మన ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రజల వత్తిడి ఎంతయినా అవసరం. అందుకని ప్రజా చైతన్యాన్ని మొదట ప్రోది చేయగలగాలి.

జైన, బౌద్ధ ధర్మాలను ఆనాటి ప్రజల ప్రాంతీయ జనభాషలలో మాత్రమే రూపొందించారు. అంతేగానీ, వేద భాషను లేదా, సంస్కృత భాషను ఆశ్రయించలేదు. గాంధీ మహాత్ముడు కూడా మాతృభాషల అవసరాన్ని ఎంతగానో నొక్కి చెప్పారు. అది మన జాతీయోద్యమ విధానం కూడా! మాతృభాషలో ప్రాథమిక విద్యను నేర్పించే విధానాన్ని నయీ తాలీమ్ పేరుతో ఆయన ప్రతిపాదించిన సంగతి ఇక్కడ మనం గుర్తు చేసుకోవాల్సి వుంది. మాతృభాష అనగానే అది సంస్కృతికో, ఆంగ్లానికో లేక ఉర్దూ భాషకో వ్యతిరేక ఉద్యమంగా భావించనవసరం లేదు. మొదట మనం భారతీయులమే! తరువాతే తెలుగువారిగా చెప్పుకొంటాం. జాతీయ భాషగా హిందీని కూడా మనం సమాదరిస్తాం. వీటన్నింటి తరువాతే ఆంగ్లం గానీ, ఇతరభాషలకు గానీ, మనం ప్రాధాన్యత నివ్వవలసి ఉంటుంది. వీటిలో ఏ భాషను నేర్వడం అయినా అది మన అమ్మభాషను దెబ్బతీసేదిగా ఉండకూడదని మాత్రమే మాతృభాషోద్యమం కోరుకొంటోంది. మన దైనందిన జీవిత వ్యవహారాలన్నింటిలోనూ తెలుగు భాష ఉండాలని కోరుకోవటం ఒక భాషకు గానీ, ఒక మతానికి గానీ, ఒక కులానికి గానీ వ్యతిరేకం కాబోదు. ఆ విధంగా ఎవరు భావించినా అది మాతృభాషను మరింత దెబ్బతీయటమే అవుతుంది.

వివాహాది కార్యక్రమాలను తెలుగులోనే నిర్వహించే ప్రయత్నాలు మనకు కొత్తకాదు. అయితే ఆనాటి జస్టిస్ పార్టీ ప్రభావం కూడా కొంత తోడవటంతో దీని వెనుక బ్రాహ్మణ వ్యతిరేకతే ప్రముఖాంశం అయ్యింది. ఆ విధంగా కులపరమైన అంశాలు చోటు చేసుకోవటంతో ఆనాటి ఉద్యమం బలంగా వ్రేళ్లూనుకోలేకపోయింది. కమ్యూనిస్టులు పార్టీ పెళ్ళిళ్ళ పేరుతో తెలుగు పెళ్ళిళ్ళకు మంచి ప్రాచుర్యం కల్పించారు. కానీ, రాజకీయ దృష్టితో చూడటంతో ఇది కూడా ప్రాచుర్యం పొందలేకపోయింది. ఆడంబరాలమీద సమాజంలో వ్యామోహం ఎక్కువ కావటంతో తెలుగులో పెళ్ళిళ్ళ ఊసే లేకుండా పోయింది. ఇప్పుడు భాషోద్యమం అన్ని జీవన వ్యవహారాలూ, సామాజిక వ్యవహారాలూ, పాలనా వ్యవహారాలూ తెలుగులోనే నిర్వహించాలనే బలమైన వాదనను ముందుకు తీసుకొస్తోంది. దీనిలో స్వాభిమానమే తప్ప దురభిమానం లేదు. ఇది కుల, మత, రాజకీయ పరమైన కోణాలలోంచి కాక, కేవలం మాతృభాష అనే అంశమే ప్రధానంగా తీసుకొని మనం ఆలోచించాల్సి ఉంటుంది.

ప్రియమిత్రులు, సహృదయులూ, తెలుగు భాషాభిమాని అయిన ప్రభుత్వాధికారి శ్రీయుత నూర్ భాషా రహంతుల్లా గారు భాషా పరమైన ప్రజా చైతన్యాన్ని రేకెత్తించడం కోసం ఎంతో

కాలంగా చేస్తూ వస్తున్న కృషి స్వయంగా నేనెరుగుదును. తన మాతృభాష తెలుగేనని ఎలుగెత్తి చాటిన తెలుగు ముస్లిం ఆయన! ఆయనను చూసినపుడల్లా బంగ్లాదేశ్ లోని ముస్లిములు వంగ భాషే తమ మాతృభాష అంటూ ఆ భాష కోసం ప్రాణాలొడ్డిన భాషోద్యమ స్ఫూర్తి గుర్తుకొస్తుంది. తెలుగు ముస్లిములకు నమాజుతో సహా అన్ని మతాల మతపరమైన కార్యాలనూ తెలుగు ప్రజలు తెలుగులోనే జరుపుకొనే న్యాయమైన అవకాశం రావాలని ఆయన కోరుతున్నారు. రహంతుల్లాగారిలోని మాతృభాషా చైతన్యం ఆయనను ఈ సమంజసమైన హక్కులు అడిగేందుకు పురిగొల్పిందని భావిస్తున్నాను. నా మిత్రులు క్రైస్తవ మత ప్రచారకులు డా. యన్. జయకుమార్ రావు గారు కూడా క్రైస్తవంలో మాతృభాషాపరంగా ఇలాంటి సంస్కరణలే కోరుతూ అనేక రచనలు చేశారు. అలాగే, నిత్య జీవితంలో కర్మకాండలకు తెలుగు పనికిరాదా? అని ప్రశ్నిస్తూ వైదిక పరమైన ఆచార వ్యవహారాలు తెలుగులోనే జరగాలనే ఒక ఉద్యమం ఇప్పుడు విస్తృతంగా నడుస్తోంది.

రహంతుల్లా గారి “తెలుగు దేవభాషే!” గ్రంథం అనేక కొత్త ఆలోచనలకు తలుపులు తెరుస్తోంది. భాషోద్యమ లోతుల్లోకి వెళ్ళి, తెలుగు ప్రజలలో భాషా చైతన్యం పెంపొందింపచేసే ఒక కొత్త చోదకశక్తిగా ఈ గ్రంథాన్ని నేను భావిస్తున్నాను.

మాతృభాష ప్రాధాన్యతని యునెస్కో గుర్తించి, ప్రాచుర్యంలోకి తీసుకు రావటం కోసమే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం లాంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. మాతృభాషాభిమానం ఆత్మాభిమానానికి సంబంధించిన విషయం. ఉద్యోగావకాశాల కోసం ఏ భాష అవసరం అయితే దాన్ని నేర్చుకోవటం తప్పు కాదు. కానీ, “ఆస్తి ఇస్తేనే అమ్మకు అన్నం పెడతాను” అనే కొరగాని కొడుకులా తెలుగు భాషకూ ఉద్యోగాలకూ లంకె పెట్టి మాతృభాషా ద్రోహానికి పాల్పడటాన్ని క్షమించకూడదు. విజయవాడలో పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ రహంతుల్లా గారు అందిస్తున్న స్ఫూర్తిని రాష్ట్రం అన్ని స్థాయిలలోని అధికారులూ అందుకొని తెలుగుభాష గౌరవాన్ని కాపాడగలరని ఆకాంక్షిస్తున్నాను. ఒక మంచి సంస్కారయుతమైన సంస్కరణ కోసం పాటుపడుతున్న రహంతుల్లా గారిని మనసారా అభినందిస్తున్నాను.



# ఏది దేవ భాష ?

- డా. జి.వి.పూర్ణచందు, B.A.M.S.,
ప్రధాన కార్యదర్శి, కృష్ణాజిల్లా రచయితల సంఘం
Purnachandgv@gmail.com
Cell : 9440172642, 9490865365

మాతృ దేవోభవ అని నమ్మిన జాతి మనది. తల్లిని దైవంగా భావించటం ఆస్తికత్వమూ కాదు, నాస్తికత్వమూ కాదు. అది మానవత్వం. తల్లి ఎంత దైవమో ఆ తల్లి భాష కూడా ఆమె బిడ్డలందరికీ అంతే దైవం! తల్లి భాషను బట్టే తల్లి సంస్కృతి కూడా రూపు దిద్దుకొంటుంది. మాతృభాష, మాతృ సంస్కృతులలోంచే మానవ జీవితం రూపుదిద్దుకొంటుంది. కన్నతల్లిని పస్తుబెట్టి సవతి తల్లికి పట్టుచీరలు కొనిపెట్టే పుత్రుల వలన అమ్మకూ, అమ్మభాషకూ, అమ్మ సంస్కృతికీ ద్రోహం జరుగుతుంది. మానవ భాషలు, దేవ భాషలు అని ప్రపంచంలో రెండురకాల భాషలు ఉండవు. ఉన్నవన్నీ మాతృభాషలే! మాతృభాషలన్నీ దేవభాషలే! సంస్కృతం లాంటి సంస్కరించబడిన భాషలు, ఎస్పిరాంటో లాంటి కృత్రిమంగా తయారయిన భాషలు ఎవరికీ మాతృభాషలు కానివి కొన్ని ఉండగా, జనం నాలుకల మీంచి తప్పుకొని అంతరించిపోయిన మాతృభాషలు ఇంకా అనేకం ఉన్నాయి. దేని ప్రాధాన్యత దానిది. దేని ప్రభావం దానిది. దేని ప్రయోజనం దానిది. ఒక ప్రయోజనం కోసం, ఒక ప్రాధాన్యత కోసం అమ్మభాషను బలిపెట్టుకో నవసరం లేదు. బలి పెట్టాలని ప్రయత్నించే వారిని క్షమించనవసరమూ లేదు.

దేవుడున్నాడా అనే ప్రశ్న లాంటిదే ఆ దేవుడి భాష ఏదనే ప్రశ్న కూడా! దేవభాషని అధ్యయనం చేసే శాస్త్ర విభాగానికి "బయోలోగోస్" అని నామకరణం చేశారు. దేవుని భాష ఈ ప్రాపంచిక భాషల్లో ఏదీ కాదనీ, ఆ భాషని డీకోడ్ చేయాలనీ వాదిస్తున్నారు. ఫ్రాన్సిస్ కోలిన్స్ అనే అమెరికన్ జన్యుశాస్త్ర నిపుణుడు. "మన నమ్మకాలలో శాస్త్రీయత" అనే గ్రంథంలో ఈ శాస్త్ర విశేషాలను ఆయన ఉటంకించాడు.

ఇంతకీ ఏది దేవ భాష? ఎవరు మాట్లాడే భాషని మాత్రమే దేవుడు మాట్లాడతాడు...? ఇంకొకరి భాష దేవుడికి తెలియదా? మనం పూజించుకొనే దేవుడికి మన భాష రాదా? రాకనే దుబాషీని పెట్టుకొని, మనం "మమ" అంటున్నామా? ఇలాంటి ప్రశ్నలు తల ఎత్తినపుడు

వితండవాదం, నాస్తికత్వం ముద్ర వేయటాలకన్నా, నిదానించి మాతృభాషని కించపరిచే అంశాలను పరిష్కరించుకోవడం విజ్ఞత అనిపించుకొంటుంది. జోరాష్టరును, బుద్ధుణ్ణీ, క్రీస్తునూ, అల్లానీ ఇంకా అనేక హిందూదేవతలను ఆఫ్రికన్, గ్రీకు దేవతా మూర్తులను ప్రపంచంలో ఎందరో పూజిస్తున్నారు. ఆరాధిస్తున్నారు. భక్తితో కొలుచుకొంటున్నారు. వారివలనే తమకు జన్మరాహిత్యం కలుగుతోందని, పుణ్యలోకాలు సంప్రాప్తిస్తున్నాయని, నమ్ముతున్నారు. ఇక్కడి వాడు ఎక్కడి దేవుణ్ణో కొలుచుకోవటానికి భాష అడ్డం కాదు. కాకూడదు కూడా! ఎక్కడి వాడయినా తన దేవుణ్ణి " ఓ దేవుడా.. కాపాడు'' అని తన మాతృభాషలోనే వేడుకొంటాడు. కాబట్టి, దేవుడితో మాట్లాడుకోవటానికీ, దేవుడికి సంబంధించిన పూజాది క్రతువులు నడుపుకోవటానికి, దేవుడి ప్రవచనాలను చదువుకోవటానికి మాతృభాష అడ్డంకాదని అర్థం అవుతోంది.

ఒక భాషాజాతీయుల సంస్కృతి ఆ జాతీయుల భాషని బట్టి, వారి కట్టూ, బొట్టూ, ఆహార విహారాలను బట్టి, ఆ జాతీయులు నివసించే ప్రాంతాన్ని బట్టి, అక్కడి వాతావరణాన్ని బట్టి అక్కడి పాలనా విధానాలను బట్టి, అక్కడి జీవన స్థితిగతులను బట్టి ఏర్పడుతుంది. ఒక అలవాటునో ఒక ఆచారాన్నో దిగుమతి చేసుకోగలమేమో గానీ, ఒక వాతావరణాన్ని తెచ్చుకోలేం కదా! భాష, ఆ భాషలోని పదాలు రూపొందటానికి ఇవన్నీ కారణాలే! అన్నింటినీ పక్కనబెట్టి ఫలానా భాష దేవభాష. అందులోనే దేవుణ్ణి పూజించాలి అనటం అన్యాయం. తాను నమ్మిన దేవుడికి దణ్ణం పెట్టుకోవడానికి భక్తుడికి ఒక పురోహితుడినీ, సిఫారసు మంత్రాన్నీ ఉపయోగించవలసి రావటం మాతృభాష పరంగా ఇబ్బంది కలిగించే అంశమే!

పురోహిత వర్గ ఆధిపత్యానికి మాతృభాష అడ్డం అవుతుంది కాబట్టి, మాతృభాషలలో దైవపూజలు నిరాకరించబడ్డాయి. తన దేవుడికి తాను తినేదే తెచ్చిపెట్టిన భక్తకన్నప్ప ప్రదర్శించిన ముగ్ధభక్తి అస్సలైన తెలుగు సంస్కృతికి అక్షర సాక్ష్యం. వడపప్పుని సంస్కృతంలో ఏమనాలో తెలియక 'వడపప్పు, పానకం సమర్పయామీ' అంటారు గానీ, 'దేవుడా ఈ వడపప్పు తిను' అంటే, తీసుకోడేమోననే అనుమానం మనకు ఎందుకు? ఈ అనుమానమే అన్ని రంగాలలోనూ తెలుగుభాషని వాడకంలోంచి తప్పించింది.

అయినదానికీ, కానిదానికి సంస్కృత పదాలను వాడటం, ఆచార వ్యవహారాలన్నీ సంస్కృతంలోనే జరిపించడం, మాతృభాషను పక్కనపెట్టి, సంస్కృతానికి పెద్దపీట వేయడం... క్రీస్తు శకం తొలి శతాబ్దాలలోనే ఘనత వహించిన విషయాలు (status symbols) గా చెలామణి అయ్యాయి. మాతృభాషను తక్కువపరిచే ఆలోచనకు ఇలా రెండువేళ ఏళ్ళ చరిత్ర ఉన్నదన్నమాట. సంస్కృత పదాలతో ద్రావిడభాషలు పరిపుష్టినొందిన మాట నిజం కానీ, ఇది అటునించి ఇటే జరిగిందనటానికి వీల్లేదు. ఆదానప్రదానాలు రెండూ ఉంటాయి. అనేకద్రావిడ పదాలు సంస్కృత భాషలో చేరిన సంగతిని మన పండితులు మరుగు పరిచారు. మహత్తరమైన భారతీయ

సంస్కృతిని, సంస్కృత భాషను పటిష్ట పరచటంలో తెలుగు పాత్రనీ, తెలుగు వారిపాత్రనీ తొక్కిపెట్టారు. ఎఫ్‌బిజె క్వీపర్ అనే పరిశోధకుడు, షుమారు 350 పదాలు ఇండో యూరోపియన్ భాషాకూటమికి చెందనివి అరువుపదాలుగా ఋగ్వేదంలో ప్రయోగించబడ్డాయని పేర్కొన్నాడు. మయూర, గజ, కార్పాస లాంటివి సంస్కృత పదాలు కావనీ, అవి ముండా లేదా ద్రావిడ పదాలు కావచ్చని అభిప్రాయపడ్డాడు. ఋగ్వేద కాలంలోనే ద్రావిడభాషల ఉనికి భారత దేశంలో ఉంది. సింధూ నాగరికతలోనే తెలుగు వాడకంలో ఉండేందుకు అవకాశం ఉందని ఐరావతం మహదేవన్ లాంటి తమిళ పరిశోదకులు కూడా భావిస్తున్నారు. అయినా మనం తెలుగంటే పెదవి విరవటం మానుకోలేకపోతున్నాం.

జీవనదికి ఆవలి గట్టు సంస్కృతం అయితే ఈవలి గట్టు తెలుగు. పొర్లిపోకుండా నదిని కాపాడటం గట్టు చేయాల్సిన పని. భాష మరణించడం అంటే, గట్టు తెగటమే! మన తెలుగు గట్టు తెగింది. గండి పడి, పరభాషా పదాల వెల్లువ బైటనుంచి ముంచెత్తి జీవనది కలుషితమౌతోంది. పరస్పర ప్రభావాలు, సంఘర్షణలూ, సంలీనాల ఫలితంగా ఏర్పడిన ఈ దేశ సంస్కృతిలో మన మాతృభాష కూడా ఒక భాగం. మన మాతృభాషను కించపరుస్తూ మన సంస్కృతికి సంబంధించిన అంశాలలో దానికి ప్రాధాన్యత లేకుండా చేయాలని ఏకపక్షంగా చూడటాన్ని మనం ఎందుకు ఆమోదించాలి? వెయ్యేళ్ళ క్రితం శివకవులు ఇదే ప్రశ్నను లేవనెత్తారు. జాను తెనుగులో సాహిత్య సృష్టి చేశారు కూడా. క్రీస్తు తర్వాత 12వ శతాబ్ది వాడయిన పాల్కురికి సోమనాథుడు, ప్రజలు పాటించే ధర్మాలలో ప్రజలభాష లేకపోవడాన్ని తప్పు బట్టాడు. ఆయన లేవనెత్తిన అంశాలకు వెయ్యేళ్ళయినా సమాధానం చెప్పకుండా ఆయన ఆక్షేపించినదాన్నే ఆచరిస్తూ వస్తున్నాం మనం! కానీ, మనలో మాతృభాష పట్ల చిన్నచూపు గలవారు అధికులు కావటాన పాల్కురికి సోమనార్యుల ఉద్యమం అరణ్య రోదనం అయ్యింది. తిక్కనాదులు వారి వారసులుగా ఎందరొచ్చినా, కృష్ణదేవరాయలు దేశభాషలందు తెలుగులెస్స అని ఎలుగెత్తి చాటినా, అది మనలో మాతృభాషా చైతన్యాన్ని తట్టి లేపలేకపోయిందంటే మనం మొద్దు నిద్ర నటిస్తున్నామన్న మాటే!

మాతృభాషోద్యమం సంస్కృత భాషకు వ్యతిరేకంగా ప్రారంభమైందనటం అన్యాయం. మాతృభాషోద్యమం అనేది ఏ ప్రాపంచిక భాషకూ వ్యతిరేకం కాదు. సంస్కృతం, తెలుగూ రెండూ కలిసే భారతీయ సంస్కృతిని సంరక్షిస్తున్నాయి. ఆ రెండవ పార్శ్వాన్ని ఎవరు కించపరిచినా మాతృభాషా ద్రోహమే అవుతుంది. ఏదయినా అమ్మభాష తరువాతే అనుకోలేకపోయినప్పుడు మనం ఎంత మేధావులమైతే మాత్రం జాతికి ఒరిగేదేమిటీ?

మన ఆచార వ్యవహారాలలో ప్రతి చిన్న విషయాన్నీ మతంతోనూ, కులంతోనూ, దేవుడితోనూ ముడిపెట్టకుండా. “సామాజిక ప్రయోజనం” అనే కోణంలోంచి చూస్తే, జాతికి

మేలు కలుగుతుంది. అమ్మభాషకు వాడకం పెరుగుతుంది. మన సంస్కృతిని ఉగాది పండగలాగా అచ్చంగా తెలుగులో నడుపుకో గలిగితే తెలుగే దేవభాష అవుతుంది. ఏది దేవ భాష అనే ప్రశ్నకు ఒక్కటే సమాధానం.. కష్టం కలిగినప్పుడు మనసు ఏ భాషలో రోధించి సహాయం అర్థిస్తుందో, సంతోషం కలిగినప్పుడు మనసు ఏ భాషలో సంతృప్తిని వెళ్ళబుచ్చుకుంటుందో, భావోద్వేగం కలిగినప్పుడు మనసు ఏ భాషలో ఆరాటపడుతుందో, అదే దేవ భాష.

దయచేసి ఇక్కడ నాస్తికత్వం, ఆస్తికత్వం చర్చ తీసుకురావద్దు. ఇది కేవలం మాతృభాష పట్ల జరుగుతున్న చిన్న చూపు ధోరణికి మాతృభాషోద్యమం ప్రదర్శించే ఆవేదన మాత్రమే! ఈ చిన్న చూపు మతపరంగా జరుగుతున్నా, చదువు పరంగా జరుగుతున్నా, పాలనా పరంగా జరుగుతున్నా గొంతెత్తవలసిన బాధ్యత భాషోద్యమానికుంది. “తెలుగు దేవభాషే” పుస్తకం ఈ ఉద్యమ మహా వృక్షానికి చిటారు కొమ్మ. మేమంతా తెలుగును పాలనాభాషగా చూడాలని కలలుకంటున్నాం. రహంతుల్లా గారు ఒకడుగు ముందుకేసి తెలుగును దేవభాషగా కూడా చూడాలను కొంటున్నారు.

దేవ భాషల విషయంలో క్రీస్తుపూర్వ కాలంలోనే వివిధ మతాల స్థాయిలో జరిగిన అనేక పరిణామాలను ఒక పరిశోధకుడిగా శ్రీ రహంతుల్లా విశ్లేషించిన తీరు గొప్పది. మాతృ స్వామ్య వ్యవస్థ నించి, పితృస్వామ్య వ్యవస్థలోకి మానవ సమాజం పరిణమించిన క్రమంలో మాతృభాషా హననం పితృభాషా భావనలు ఏ విధంగా రూపుదిద్దుకొన్నాయో బహుశా భాషోద్యమ పరంగా తొలిసారిగా విశ్లేషించిన ఘనత రహంతుల్లా గారికే దక్కుతుంది.

చిన్న చేపల్ని పెద్ద చేపలుమింగేసినట్టు చిన్న భాషలను పెద్దభాషలు మింగేస్తున్న తీరును ఈ పుస్తకంలో రహంతుల్లా చక్కగా విశ్లేషించారు.ప్రమాదం అంచుకు చేరిన మాతృభాషల చిట్టాని యునెస్కో ప్రకటించిన తరువాతే ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషోద్యమాలు బయలుదేరాయి. తెలుగు భాషోద్యమం అనేక ఫలితాలను సాధించింది కూడా! ఇంగ్లీషు లింక్ తెగితే, ఆక్సిజన్ ట్యూబు కనెక్షను తెగినట్టయి జాతీయ సమగ్రతే దెబ్బతినే పరిస్థితి ఏర్పడటం పట్ల రహంతుల్లా ఆవేదన చేరవలసిన వారికి చేరాలి.

సాంకేతికంగా తెలుగును అభివృద్ధి చేసుకోవటంలో దేశంలోని చాలా భాషలకన్నా మనం ముందున్నాం. ఇది బాషోద్యమ కృషి ఫలితమే! సాంకేతికతని తెలుగు భాషద్వారా మనం సద్వినియోగ పరచుకోవాలంటే, ప్రజలు వాడుకొనే అన్ని పదాలతోనూ, మాండలికాల తోనూ, వృత్తిపరమైన, సాంకేతిక పరమైన పదజాలంలో పరిపూర్ణమైన లెక్సికాన్ లేదా మహా నిఘంటువు తయారు కావలసిన ఆవశ్యకతని ఆయన చక్కగా గుర్తించారు. ఆన్‌లైన్ డిజిటల్ డిక్షనరీలు అందుబాటులోకి వచ్చినప్పుడు తెలుగు తనను తాను ప్రపంచ భాషగా తీర్చిదిద్దుకోగలుగుతుంది. యూనీకోడ్ ఫాంట్లలో తెలుగు లిపిని ఆవిష్కరించేందుకు జరిగిన

చర్చలలో రహంతుల్లా గారిది ముఖ్యపాత్ర. రహంతుల్లా ఫాంటుగా ప్రసిద్ధి చెందిన ఒక తెలుగు ఫాంటుమారకాన్ని నిపుణులు వీరి కోసం రూపొందించారు.

మౌలికంగా రహంతుల్లా సామ్యవాది. ప్రజాస్వామ్యవాది. ఆయనకు అన్ని మతాల పట్ల సమాన గౌరవమే ఉంది. తెలుగే ఆయన మాతృభాష. ఆయన తెలుగు ముస్లిం. నమాజుతో సహా అన్ని మతాల దేవతా ప్రార్థనలూ తెలుగులోనే జరిగేందుకు అన్ని మతాల పెద్దలు చొరవ తీసుకోవాలనేది ఈ పుస్తకంలో రహంతుల్లా అభ్యర్థన. నిఖానామా పత్రాలు కూడా తెలుగులోనే ఉండాలని ఆయన కోరుతున్నారు. ఆయనది మతదృష్టి కాదు. భాషా దృష్టి మాత్రమే. తెలుగులో తొలి కురాన్ అనువాదం 1925లో చిలుకూరి నారాయణరావు చేశారు. అన్ని మతాల మతపరమైన అంశాలు కూడా మాతృభాషలలోనే సాగాలని రహంతుల్లా కోరుకొంటున్నారు.

తెలుగు దేవభాషే అని ఎలుగెత్తి చాటుతున్న ఆత్మీయ మిత్రులు, తెలుగుభాష కోసం అనునిత్యం పరితపించే భాషోద్యమ కారుడు. ఒక ఉన్నతాధికారిగా తన పరిధిలో తెలుగులోనే పాలనా వ్యవహారాలు నడుపుతున్న సహృదయులు నూర్‌భాషా రహంతుల్లా గారి మనసులోని ఆర్తిని బయటకు తీసుకు రావటానికి ఈ నాలుగు మాటలు 'బండి ముందు నడిచే బంటు'లా ఉపయోగపడితే సంతోషం. రహంతుల్లా గారికి మనఃపూర్వక అభివాదాలు.



# తల్లిభాష కోసం ప్రజా ఉద్యమాలు సాగాలి

- ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌భాషా M.Com, M.Phil, P.hd.

*అధిపతి వాణిజ్య శాస్త్రము మరియు వ్యాపార నిర్వహణ విభాగం*

*ఆచార్య నాగార్జున యూనివర్శిటీ,*

email : abdulnoorbasha.nu@gmail.com

Cell : 9490175786

తెలుగు భాష నానాటికీ చిన్న చూపుకీ, చీదరింపులకు గురౌతున్నది. ప్రపంచీకరణ పాచికతో ఈ పరాజయం మరింత పరాకాష్టనందుకొంది. ఇళ్ళలోను, బళ్ళలోను ఇంగిలీస్ మిడిమూలంగా ఎగిసి పడుతోంది. తల్లిలాగా ఆరాదించి ఆదరించాల్సిన తెలుగు బిడ్డలే సంపాదనకీ, హోదాలకి బానిసలై ఆ తల్లి భాషనే నిరాదరణకి గురిచేయడమే లజ్జాకరమైన ఘటన. ఇక సరిదిద్దాల్సిన సర్కారే చోద్యం చూస్తూ మొకం తప్పిస్తూ పోవడం మరో సిగ్గు పడాల్సిన విషయం. కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నబిడ్డలే ఇలా తల్లినే కాటేసే దుస్థితిలో, ఎవరో కొందరు భాషాభిమానులు గొంతెత్తి చేసే రోదనలు, నినాదాలు ఎవరి దొంగనిద్రను తట్టిలేపుతాయి?

అందుకేనేమో, ఎవరినో అర్థించడం కన్నా అమ్మరుణం ఎవరికి వారే తీర్చుకోవాలని తీర్మానించుకుని, తెగువచూపి, తెలుగు తల్లిని వెలుగుబాట పట్టించడానికి నడుం కట్టిన పిడికెడు పుత్రరత్నాల్లో ఒకరు నా తమ్ముడు రహంతుల్లా కావడం ఎంతో ఆనందదాయకం. తెలుగుభాష జీవం కలిగిన దేవభాషనీ, తెలుగులోనే పరిపాలన సాగించడం, తెలుగులోనే కోర్టుల్లోనూ వాదనలు జరపడం, తెలుగులోనే ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడం తెలుగులోనే ప్రాధమిక విద్యా బోధన జరగడం వంటివి తల్లి భాషను అజరామరంగా జీవించి ఉంచడమే గాక, ప్రజలకు సామాజిక జీవనాన్ని సుఖవంతం చేస్తాయని నమ్మి, ఆ భావాలని తన కలం ద్వారా తెలుగు ప్రజల్లో విరజిల్లిన వ్యవసాయకుడు సోదరుడు రహంతుల్లా. ప్రస్తుత ఈ సంకలనంలో కూర్చిన 22 అధ్యాయాలే అందుకు సజీవ తార్కాణాలు.

ప్రభుత్వాధికారిగా ఉంటూ అనాదిగా ఇంగ్లీషు లోనే నడుస్తున్న ఆఫీసు ఫైళ్ళను బద్దలు కొట్టి తెలుగు మార్గం పట్టించడం ద్వారా నవశకానికి నాంది పలికాడు రహంతుల్లా. గుండెలోని భావాలను తేటగా వెల్లడించడానికి ఆస్వాదించడానికి నిజంగా తల్లి భాషకి మించింది మరొకటి లేదని నిరూపించి ప్రశంసలందుకోవడం ముదావహం. ఆ విధంగా ఇంగ్లీషు ఆధిపత్య ప్రవాహానికి ఎదురీదిన పులసపక్కె రహంతుల్లా. ఎత్తుపడుతున్న తల్లిని ఎత్తుకి ఎదిగించడానికి తన యావత్తు శక్తితో బాధ్యతని మోస్తున్న మంచి సమరయుడు మా తమ్ముడు రహంతుల్లాకి అభినందనలు. మాతృభాషాదినోత్సవం లో వేదికపై తెలుగు వర్ధిల్లాలంటూ ప్రబోధించి తిరిగి ఆఫీసులో ఆసీనులైన వెంటనే మైకం కమ్మి, ఇంగ్లీషు ఫైళ్ళతోనే వ్యవహారాలు నడిపే స్పృహలేని అధికార గణానికి రహంతుల్లా ఒక హెచ్చరికే గాక ఒక వేగు చుక్క కూడా.

తెలుగులోనే దరఖాస్తులు, తెలుగులోనే పాస్ పుస్తకాలు, అవార్డులు తయారు చేసి అవి ఎంతగా పరిపాలనా సౌలభ్యాన్ని ప్రజలకు సుఖాన్ని అందించగలిగాయో, రచయిత తమ వ్యాసాల్లో వివరించిన వైనం హృద్యంగా ఉంది. ఉత్తేజాన్నిచ్చింది. ఎబికె ప్రసాద్ లాంటి తెలుగు భాషాభిమానుల మన్ననలను రచయిత పొందడం “మీరు ఇలా చెయ్యలేరా?” అని అంగ్ల భాషోన్మాదులను హెచ్చరించడం నా లాంటి తెలుగు బిడ్డలకు మరింత ఆనందాన్ని కలిగిస్తున్న అంశాలు.

ఆలోచన అమ్మ భాషలోనే పుడుతుందన్న రహంతుల్లా వ్యాఖ్య ముమ్మాటికీ నిజం. ఆ ఆలోచనని అమ్మ భాషలోనే కాగితాలపై కెక్కిస్తేనే దానిలోని సహజత్వం హృదయాలలో పరిమళిస్తుంది. అలా మాతృభాషాభివృద్ధితోనే సమాజాభివృద్ధి జరుగుతుందన్న రచయిత విశ్లేషణకు ఇదే మూలరాయి.

మా యూనివర్శిటీలో మూడేళ్లపాటు నేను పరీక్షల విభాగానికి అధికారిగా ఉన్న కాలంలో నేను సైతం ఇంగ్లీషు ఫైళ్ళ పెత్తందారీ తనానికి చెల్లుచీటీ రాశాను. ఫైళ్ళన్నీ తెలుగులోనే నడిపాను. ఫలితంగా క్రిందిస్థాయి ఉద్యోగులంతా తమ భావాల్ని సరళంగా స్వేచ్ఛగా రాయగలిగారు. పని కూడా వేగవంతమయింది. ఇక సామాన్య జనంలో నేను క్లిష్టమైన ఆర్థిక అంశాలపై ప్రసంగించేటపుడు సరళమైన వాడుక భాషలో తెలుగులో మాట్లాడటం వల్లనే ప్రజల్లోకి నేను అంతగా చేరువకాగలిగానన్నది స్పష్టం. ఎపుడో పదేళ్ళక్రితం, ఇరవై ఏళ్ళ క్రితం పక్కా పల్లెటూళ్ళలో నేను ప్రపంచీకరణ, గాట్ ఒప్పందాలంటూ చేసిన ప్రసంగాల్ని అవి విన్న చదువు లేని జనం ఈ పూటకీ గుర్తించుకోవడానికి జీర్ణించుకోవడానికి నిజమైన కోణం. తల్లి భాషే కాక మరేమిటి? పల్లెపదాలలో పదిలపడి వున్న సాదాభాషలోని జనపదాలను మహానిఘంటువులోకి జమ చేయమన్న రచయిత తపన ఫలించి తీరాలి మరి.

రచయిత ఎంతోకాలంగా ప్రతిపాదిస్తూ తెలుగులిపి సంస్కరణ కూడా తెలుగు

ప్రాభవాన్ని బలోపేతం చేయడానికి ఎంతో ఉపయుక్తం. ప్రతి తెలుగు బిడ్డా ప్రాథమిక విద్యనంతటినీ తెలుగులోనే చదవాలి. ఐతే దానికి ఉపాధి, భద్రత బాధ్యతని ప్రభుత్వాలు తీసుకోవాలి. విశ్వవిద్యాలయాల్లో జరిగే తెలుగు పరిశోధనలు కూడా తెలుగు భాష చరిత్ర పునరుజ్జీవానికి తోడ్పడే విధంగా ఉండేట్లు చూడాలి. తెలుగు ప్రాశస్త్యాన్ని నిలబెట్టడానికి ఏర్పడిన వ్యవస్థల్ని నిర్వీర్యం కాకుండ ప్రజా ఉద్యమాలు సాగాలి. ఎంతసేపటికీ ఆర్థిక సమస్యలపై పోరాటాలకి అలవాటుపడిన పెద్దపెద్ద ప్రజా సంఘాలు, పార్టీలు సైతం తల్లి భాషను కాపాడాలనే ధ్యేయంతో నిర్మాణాత్మక కృషి చేయకపోవడం బాధాకరమే. తెలుగులోనే ప్రభుత్వ ఉత్తర్వులన్నీ విడుదల చేయాలన్న ఆదేశాలున్నా అవి అమల్లోకి రాకపోవడానికి కారణం ప్రజా ఉద్యమం చైతన్యం లేకపోవడమే కదా? ప్రత్యేక మంత్రిత్వ శాఖలున్నా పట్టించుకునే తత్వం లేనపుడు ఆ మంత్రిగారి వలనా బావుకునేది ఏది లేదు కదా?

అంతదాకా ఎందుకు? యూనివర్శిటీల్లో ప్రొఫెసర్లందరికీ తెలుగు తల్లి భాష. వారి ముందు కూర్చుని ఆలకించే విద్యార్థులు తెలుగువారే ఐనా ప్రొఫెసర్లు వచ్చీరానీ ఇంగ్లీషు భాషలోనే మాట్లాడడానికి కుస్తీపడుతున్నారు కానీ తెలుగు జోలికి పోవడానికి సంకోచిస్తున్నారు. కారణం అలా చేస్తే వారి విలువ తగ్గిపోతుందని వారి ఆలోచన. ఐతే నా ముప్పదేళ్ళ ప్రొఫెసర్ జీవితంలో అటు విద్యార్థుల తరగతుల్లోనూ, ప్రొఫెసర్ల సమావేశాల్లోను అచ్చమైన తెలుగు భాషలో ప్రసంగించడం ఒక పద్ధతిగా ఎంచుకున్నాను. దానివల్ల విద్యార్థుల కళ్ళలో కొత్త వెలుగు వారి గుండెలోతుల్లో శాశ్వతంగా నిలిచిపోయే విజ్ఞానాన్ని నేను ఎపుడూ చవి చూస్తూనే ఉన్నాను. తల్లి భాషలో అంత తాదాత్మ్యత ఉంది.

అందుకే నేను అనుకుంటాను. తల్లిభాషను రక్షించుకోవడం కేవలం చట్టాలతోను సర్కారుతోను గట్టెక్కే పనికాదు. ప్రతి అధికారి, ప్రతి మేధావీ తమ ఆంగ్ల భేషజాల్ని వదిలేసి తెలుగుతల్లిని ఆలింగనం చేసుకోవాలి. అందలం ఎక్కించాలి. వీలైనన్ని మార్గాల్లో కూడా.



# నా మాట

"భాషలందు పుణ్య భాషలు వేరయా" అన్నట్లు కొందరు పండితులు కొన్ని భాషలు గొప్పవి, కొన్ని భాషలు హీనమైనవి అంటూ శతాబ్దాల తరబడి చేసిన విష ప్రచార బాధితురాలు మన తెలుగు భాషామతల్లి. డబ్బు సంపాదించి పెట్టగల భాషలే ఎప్పుడూ దేవభాషలుగా ఘనకీర్తిని పొందాయి. డబ్బు రాని విద్య దరిద్రానికే అన్నట్లు ఇప్పుడు మన తెలుగు తృణీకారానికి గురి అవుతోంది. వ్యాపారం కోసం, పరిపాలన కోసం, మతం కోసం దేవ భాషలుగా భావించిన వాటిని అధికారులూ, వ్యాపారులూ,మత పెద్దలూ తలా ఓ చెయ్యి వేసి కాపాడుతున్నారు. మేపీ పోషిస్తున్నారు. పనికిరాదనుకుంటే మాతృభాషను కూడా నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారు. మాతృభాషను కూడా మార్చుకుంటున్నారు.

దేవభాష అన్నది మనం కలిపించుకున్న పదమే. దేవుళ్ళూ, దేవతలూ, దయ్యాలూ మనుషులను ఆవహించినప్పుడు పూనకంలో వెలువడే మాటలే దేవభాష అయ్యేటట్లయితే మాతృభాషలన్నీ దేవభాషలే అవుతాయి. ఎందుకో గానీ కొంతమందికి ఈ వాదన రుచించదు. నీ ఇష్టమొచ్చిన భాషలో, నీకు వచ్చిన భాషలో పూనకం కుదరదు అంటారు. దైవావేశితులైన స్వాముల పూనకం వేరు, ప్రవక్తల పూనకం వేరు, మామూలు మనుషుల పూనకం వేరు అంటారు.

అరబీ, సంస్కృతం, ఇంగ్లీషు లాంటి దేవభాషల వల్ల అనేక భాషలున్న రాజ్యాలలో సమైఖ్యత సిద్ధించింది. మతపరమైన కర్మకాండలన్నీ అందరూ ఏకరీతిన జరుపుకోగలిగారు. నిజమే. అలాగని అమ్మను అవతలపడేసి అమ్మమ్మను ఎత్తుకో అంటే ఎలా? మనం అమ్మనూ గౌరవిస్తాము అమ్మమ్మను, నాయనమ్మను కూడా గౌరవిస్తాము. పాస్‌పోర్టు జాతీయతను బట్టి మాత్రమే ఇస్తారు కానీ భాషను బట్టి కాదు. కాబట్టి నేను తెలుగువాడిని అని ఇక ఎక్కడా చెప్పుకోవద్దు అంటే ఎలా?

ఎవరి మాతృభాషపై వారికి అభిమానం ఉండడం సహజం. ఎవరి మాతృభాష కోసం వారు పాటుపడటం ధర్మం. ఆ క్రమంలో ఏదైనా భాష వాళ్ళు "మాదీ దేవ భాషే" అంటే మిగతా దేవ భాషలవాళ్ళు ఉదార బుద్ధితో హర్షించాలి. సరసన చేర్చుకోవాలి గానీ ఇలా అడగటం తమ దేవ భాషను దిగజార్చాలనే ప్రయత్నం అని ఆక్రోశించవచ్చా? భాషల రంగంలోని గొంతుకోత పోటీలో ఓడిపోయిన భాష తన శక్తిని కూడ దీసుకొని తిరిగి లేవటానికి ప్రయత్నిస్తే చేయూతనివ్వాలిగానీ ఇంకా చంపవచ్చా? పతనమైపోయిన ఒక భాష తన పూర్వ వైభవం

కోసం పరితపిస్తే నిజమైన దేవ భాష దాని పీఠాన్ని దానికిచ్చి ఆదుకోవాలిగానీ ఇంకా కిందకు పడదోయవచ్చా? నీ రాజ్యంలో నీవుండు. నా రాజ్యంలో నేనుంటాను. నా జోలికి నీవు రాకు. నీ జోలికి నేను రాను అనటం తప్పెలా అవుతుంది? నీ పప్పులూ నా పొట్లూ కలిపి ఊదుకు తిందాం రా అంటే ఎవరైనా ఎంతకాలం వస్తారు? కాలం గడిచేకొద్దీ తమకు జరుగుతున్న నష్టం తెలిసి నోరు విప్పి అడగరా?

మాతృభాషాభిమానుల్ని అవమానించటం, దేవభాషల పేరుతో అజమాయిషీ చెయ్యటం ఎందుకు? ఎవరి భాషతో వారిని బ్రతకనివ్వండి. ఒకరి మీద ఒకరిని రెచ్చగొట్టవద్దు. తమను తాము దిద్దుకోక తప్పని పరిస్తితి వచ్చినప్పుడు అటు నుంచి నరుక్కు రమ్మంటారు. మీకు నిజంగా మీ భాష పైన మమకారం ఉంటే మా సంగతి తరువాత చూద్దురుగానీ అవతలి మతం వాళ్ళతో మీ భాషా సంస్కరణ మొదలు పెట్టుకు రండి అంటారు. చివరికి అన్ని భాషలూ తమ మీదకు వలస వచ్చిన పెద్ద భాషల పాలన నుండి స్వాతంత్ర్యం అయినా పొందాలి లేదా తమ ఉనికినైనా కోల్పోవాలి. పాలిత భాషలు చేసేది తమ బ్రతుకు పోరాటమే గానీ మరో భాష మీద దాడి కాదు కాబట్టి చిన్న భాషలని దయచేసి కించపరచవద్దు.

ఒక మతం వాళ్ళ భాషపై మరో మతం వాళ్ళు చేసే అధ్యయనాలు జనం ప్రామాణికంగా తీసుకోరు. ఒక భాష పైకి రాకపోవడానికి ఇంకొక భాష కారణం అనే ఆలోచన ఎప్పుడు వస్తుంది? ఎందుకు వస్తుంది? ఇంకో భాష నేర్చుకుంటే తప్ప బ్రతుకు తెరువు దొరకని పరిస్థితి ఏర్పడినప్పుడు. మాతృభాష బ్రతకటం కోసం, దాని కనీస హక్కుల కోసం చేసే పోరాటాన్ని భాషా దురభిమానం అనటం బలిసిన భాషల అహంకారమే. ఏమీ లేని పేదవాడు తన భాషలోని మల్లెపూలు కోసి ఉంచుకోవడానికి తన దగ్గర ఉన్న మురికి గోచీ బట్టలైనా వాడతాడు. అది నేరమేమీ కాదు. అన్నీ ఉన్న వాడు పేదవాడికి సహాయం చెయ్యకపోగా ఛీఛీ అనటం అహంకరించడం అన్యాయం.

తెలుగు దేవభాష అనగానే తెలుగు కూడా దేవభాషా? అని ఆవేశపడవద్దు. ఎగతాళి చేయొద్దు. నిదానంగా స్థిమితంగా ఆలోచించండి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంత చర్చ జరిగితే అంత మేలు. ఏదో జరగరానిది జరగబోతున్నట్లు కొంతమంది ఆందోళన చెందుతారు. మతపరమైన అంశాలు మాతృభాషలలోనే సాగాలంటే ఇప్పటికప్పుడే ఏమీ జరుగదు. జనానికి నచ్చితే క్రమేణా దైవ ప్రార్థనలు, పూజలూ, పునస్కారాలూ, కర్మకాండలూ స్వచ్ఛందంగానే మాతృభాషలలోకి మరలుతాయి. ఎందుకు మరలాలి? ఏమిటీ ప్రయోజనం? ఇవి మాతృభాషలలో ఎవరికి వారే చేసుకుంటారు కాబట్టి దైవారాధనలో మనసు తృప్తి చెందుతుంది. ఆనందం కలుగుతుంది. అంతా చక్కగా అందరికీ అర్థమౌతుంది. భాషల వాడకంలో నిర్బంధం పనికిరాదు. నిరంకుశత్వాన్ని వ్యతిరేకించే సౌమ్యవాదులు తెలుగు ప్రజల పట్ల కూడా అదే రకం ఉదారతను

ప్రదర్శించాలి. 'తెలుగే దేవభాష', 'తెలుగు దేవ భాషే', 'తెలుగూ దేవభాషే' అనే మాటల్లో ఒకదానికీ మరొక దానికీ అర్థంలో ఎంత తేడా వుందో చూడండి. తెలుగుకు మరొక భాషను ఆదేశించే స్థాయి లేదు కానీ నేనూ బతికే ఉన్నాను, నన్ను ఉపయోగించుకోండి అని అభ్యర్థించుకునే అర్హత ఇంకా ఉంది.

భాషలన్నీ మనిషే తయారు చేసుకున్నాడు. కానీ మతస్తుల నమ్మకం ప్రకారం "అన్ని భాషలూ దేవుడు పుట్టించినవే" అయినప్పటికీ మాంత్రిక భాషలూ, తాంత్రిక భాషలూ, యాంత్రిక భాషలూ సాంకేతిక భాషలూ అని మనిషి వాటిని చీల్చాడు. కుల వివక్ష, మత వివక్ష లాగానే భాషా వివక్ష కూడా పుట్టించాడు. ఈ నేరాన్నీ దేవుడికే అంటగట్టాడు. అసలు దేవుడికి కొన్ని "దరిద్రపు భాషలు" రావు పొమ్మన్నాడు. తెలుగు తల్లి అంటే ఒక 'దరిద్రదేవత' అనీ, ఆమె భాషను దేవుడే నశించిపోయే భాషల జాబితాలోకి నెడుతున్నాడు అనీ వాదిస్తున్నారు. రాజ్యాంగ రక్షణ, రిజర్వేషన్లు లేనిదే కొన్ని జాతులు ఎలా ఎక్కిరాలేవో అలాగే దేవుడి రక్షణ లేకపోతే కొన్ని భాషలు కూడా అభివృద్ధి చెందలేవు. అందుకే ఈ భాషల సమరంలో ఇలా 'తెలుగూ దేవభాషే' అనాల్సి వచ్చింది.

తెలుగు తల్లి భాష కూడా దేవ భాషే అని నమ్మి "తెలుగు దేవ భాషే" అనే పేరు ఈ పుస్తకానికి పెట్టాను. భాషలన్నీ దేవుడివే అయినప్పుడు నా తల్లి బాషకూడా దేవ భాషే అవ్వాలి గదా అని అతి సాధారణంగానే అనుకున్నాను.

ఏదైనా ఒక భాష దేవ భాష లేదా దేవతా భాష అనే అభిప్రాయం కలిగితే ఆ భాషను ఎంతో గౌరవిస్తారు. పూజ్య భావంతో మొక్కుతారు, సాగిల పడతారు. అందుకే తెలుగు భాషామతల్లిని మన పెద్దలు తెలుగుతల్లి అనే దేవతగా భావించి విగ్రహాలు ఏర్పాటు చేశారు. "మా తెలుగు తల్లికి మల్లెపూదండ – మా కన్న తల్లికీ మంగళారతులు" అంటూ అడపాదడపా పూజలూ జరిపిస్తున్నారు. మనిషికి జడవని వారు కొందరు దేవుడికి భయపడతారు. దేవుడి భాష పట్ల శ్రద్ధా భక్తులు కనబరుస్తారు. ఒక సంస్కృత శ్లోకమో, అరబ్బీ లిపిలోని సూరానో కనబడితే కళ్ళకద్దుకొని జేబులో దాచుకున్న వారిని నేను చూశాను. అదే వాటి అర్థాలు వివరించిన తెలుగు లిపిలోని కాగితానికి, సంస్కృత శ్లోకానికో, అరబీ లిపిలోని సూరాకో ఇచ్చినంత విలువ ఇవ్వకపోవటాన్ని గమనించాను. నా భాషకు విలువ లేకపోవటానికి ఏమిటి కారణం? అని పరిపరి విధాలా ఆలోచించాను. తెలుగుకు పూర్వ వైభవం రావాలంటే ఏమేం పనులు చెయ్యాలో అన్నీ చెయ్యాలి.

తెలుగును దేవభాష అంటేనే ఒప్పుకోలేక కడుపు రగిలిపోయే తెలుగు బిడ్డలు ఒక పక్క, సంస్కృతం, అరబీలతో తెలుగును సమానం చేసి మాట్లాడుతారా? ఎంత ధైర్యం? అని కారాలు మిరియాలు నూరే తెలుగు బిడ్డలు మరోపక్క. "దేవభాష అంటే మృత భాష" ఆ భాష

ప్రజల రోజువారీ వాడకంలో వుండదు. దేవుడి కోసం ప్రార్థనల్లో, కర్మకాండలలో మాత్రమే దేవ భాషను వాడుతారు. ఇంకా తెలుగుకు బోలెడంత ఆయుషు ఉంది కదా? అప్పుడే తొందరపడి తెలుగును దేవభాషల జాబితాలో చేరుస్తారా? అని వాదించే తెలుగు బిడ్డలు ఇంకో పక్క. అడుక్కు తినే వాడి దగ్గరకు గీరుకుతినే వాడొచ్చినట్లు, కూర్చొని తన్నేవాడి దగ్గరకు కూలబడితన్నే వాడు వచ్చినట్లు తెలుగును కూడా మరో దేవ భాషగా మార్చి మా పొట్టకొట్టొద్దు అని ఆక్రోశించే తెలుగు బిడ్డలు మరో వైపు. ఇలా రకరకాల శాపనార్థాలతో "తెలుగు కూలిందాకా ఒకటే పోరు" అన్నట్లుగా ఉంది. ఇవన్నీ తీరుబడిగా ఆలోచిస్తే అర్థమయ్యే వాస్తవం ఏంటంటే – జనం దైవారాధనల కోసమైనా అలాంటి భాషలకు చావు లేకుండా చేస్తున్నారు. ప్రపంచ భాష దెబ్బకు కాలక్రమేణా వేలాది భాషలు చనిపోతాయి. అంటే మృత భాషలు అవుతాయి. మృత భాషలన్నీ దేవ భాషలు కాలేవు. దేవుడిని చేరిన భాషలను దేవ బాషలు అనటంలో తప్పులేదు. మనిషే వాటిని దేవ భాషలుగా సమాజంలో నిలబెట్టాలి. ఎలాగా? బతికున్న రోజుల్లో తల్లికి కూడు పెట్టని కొందరు ఘనంగా వర్ధంతులు చేస్తూ అమ్మను స్మరించుకుంటారే? అలాగన్నమాట. శవాన్ని మేళతాళాలతో ఆనందంగా ఊరేగిస్తూ స్మశానానికి తీసుకెళ్ళే జాతులనెప్పుడైనా చూచారా? మృతుడు దుఃఖ విముక్తుడయ్యాడని వాళ్ళు సంతోషపడతారట. ఆ దేవుడే ఇన్ని భాషలను పుట్టిస్తూ చంపేస్తూ వుంటే మానవమాత్రులం మనమేం చేయగలం? మనకెందుకు బాధ? ఆ మహా మహా రాజ భాషలకే చావు తప్పలేదు. అవన్నీ దేవుడి దగ్గరకు చేరి దేవ భాషలైపోలా? మనం ఈనాటికీ వాటిని గౌరవించటం లేదా? తెలుగు చనిపోయి నామరూపాలు లేకుండా నాశనమై, కనుమరుగు కావటం కంటే దేవ భాషగానైనా మన కళ్ళముందు శాశ్వతంగా కొనసాగటం మహా భాగ్యం కదా? చేజేతులా మన భాషను మనమే చంపుకొంటున్న ఇలాంటి పరిస్థితుల్లో చచ్చీ సాధించే గొప్ప భాషల సరసన తెలుగును చేర్చటమే మన భాషకు మనం చేసే కనీస మేలు. ప్రయత్నాలు ఇప్పటి నుండి మొదలు పెడితే ఇంకో వందేళ్ళకైనా తెలుగూ దేవ భాషల సరసన చేరవచ్చు.

ఈ పుస్తకంలోనే చెప్పాలనుకున్నవన్నీ చెప్పలేకపోయాను. కాలం మార్పుల మాయం కదా. భవిష్యత్తులో చెప్పాల్సి వచ్చినప్పుడల్లా చెబుతూనే ఉంటాను. మన మాటలోని మాధుర్యం మనమెందుకు వదులుకోవాలి ? ఒకనాడు పరమ దేవభాష ఇంగ్లీషుకున్న సౌలభ్యాలన్నీ తెలుగుకు కూడా ఉంటే బాగుండునే అనుకునేవాడిని. ఇప్పుడీ పుస్తకానికి ముందుమాట తెలుగులో నా చేతులతో నేనే కంప్యూటర్లో టైపు చేసుకునే స్థాయికి తెలుగును మన సాంకేతిక నిపుణులు చేర్చారు. ఆనందంగా ఉంది. మన భాషకు సాంకేతిక ఊపిరులూదుతున్న వాళ్ళందరికీ నమస్కారం. అలాగే రాజభాష కావలసిన తెలుగుకు ఇప్పుడున్న ఆటంకాలన్నీ తొలిగేలా అధికారులు, రాజకీయ నాయకులు, మతపెద్దలు, పురోహితులు, ముల్లాలు, కళాకారులు,

అధ్యాపకులు, ఆచార్యులు అంతా ఎవరి పరిధిలో వాళ్ళు సహకరించాలి అని మనవి చేస్తున్నాను.

తెలుగులో పాలన జరగాలనీ, విద్యాబుద్ధులు తెలుగులోనే ఉండాలనీ 1980 నుండీ నేను పత్రికలకెక్కటం మొదలుపెట్టాను. తెలుగు కూడా చనిపోయే భాషల జాబితాలో చేరింది అన్న వార్తలు వినబడ్డ తరువాత నా తల్లి భాషకు ఎందుకింత దుస్థితి కలిగింది అనే ఆవేదన పెరిగింది. నా అమ్మ భాష బతకాలి, ప్రజారంజకంగా నా భాషలో కూడా పాలన జరగాలి అని నాకు చిన్న ఆశ పుట్టింది. అది దురాశ అని కొందరూ అత్యాశ అని కొందరు విమర్శించారు, విమర్శిస్తూనే వున్నారు.

నేను అత్యాశపరుణ్ణీ, దురాశావాదినీ, నిరాశావాదినీ కాదు. కేవలం సమంజసమైన, సహజ న్యాయం కోరే, ఆశావాదిని. అమ్మకు న్యాయం చెయ్యని కొడుకూ ఒక కొడుకేనా? అనే సామెత గుర్తొచ్చింది. తెలుగుకు సరైన న్యాయం జరిగే వరకు, తెలుగుకు పట్టం కట్టేదాకా నా ప్రయత్నం నేను చేస్తూనే వుండాలి అనుకున్నాను. అప్పటివరకూ పత్రికల్లో వచ్చిన నా వ్యాసాలతో "తెలుగు అధికార భాష కావాలంటే..." పుస్తకం 19 అధ్యాయాలతో 2004లో ఒకసారి, 28 అధ్యాయాలతో 2006లో మరొకసారీ తెచ్చాను. 2006 నుండి పత్రికలలో వచ్చిన 22 వ్యాసాలతో ఈ పుస్తకం తెస్తున్నాను.

ముందుమాటలు రాసిచ్చిన గౌరవనీయులు మండలి బుద్ధప్రసాద్ గారికీ, డాక్టర్ జి.వి. పూర్ణచందు గారికీ, అన్నయ్య ప్రొఫెసర్ నూర్‌బాషా అబ్దుల్ గారికీ, దానీ గారికీ, నిసార్ అహ్మద్ గారికీ, ముఖపత్రం అందంగా తీర్చి ఇచ్చిన అబ్దుల్లా గారికీ, పుస్తకం ముద్రించిన శ్రీశ్రీ విశ్వేశ్వరరావు గారికి నా కృతజ్ఞతలు.

**– నూర్ బాషా రహంతుల్లా**

"మాతృభాషలో చెప్తే బాగా అర్థం అవుతుంది. మళ్ళీ వివరించటమూ సులభం. సాహిత్యమూ, దానిలోని లోతుపాతులూ, అందాలూ, మాతృభాషలో ఆస్వాదించినట్లు మరో భాషలో ఆస్వాదించలేము. కనుక మాతృభాష కాని మరే భాషనైనా తప్పని సరిగా నేర్చుకోవలసిన పాఠ్యాంశంగా ఉండటానికి నేను వ్యతిరేకం"

– పుచ్చలపల్లి సుందరయ్య

*(విప్లవపథంలో నా పయనం)*

# పెద్దల అభిప్రాయాలు :

“తెలుగు భాషను పరిరక్షించడానికి మూడు దశాబ్దాలకు పైగా మీరు చేస్తున్న కృషి అభినందనీయం. పుట్టుక రీత్యానే మీ మాతృభాష తెలుగు. అది మీకు ‘బైఛాన్స్’. నా విషయం అలాకాదు. నేను ఇష్టపడి నేర్చుకున్న భాష తెలుగు. ఇది నాకు ‘బైఛాయిస్’! రెండు సార్లూ నేను తెలుగు మాట్లాడే హిందూ అమ్మాయిల్నే పెళ్ళిచేసుకున్నాను. మీ మాతృభాషైన తెలుగు వెనకబడి పోతున్నదని మీరు చెందుతున్న ఆవేదన కంటే నా ఆవేదన ఇంకా తీవ్రమైనది. నా మాతృభాష ఉర్దూ ఏకంగా అంతరించిపోతున్నది. ఒక భాష అందరించిపోవడం అంటే, కొన్ని కోట్ల మంది, కొన్ని వందల, కొన్ని వేల సంవత్సరాలపాటు, సమిష్టిగా, సంయుక్తంగా, వ్యక్తిగతంగా సాధించిన సాంస్కృతికాభివృద్ధి సమస్తాన్నీ పూడ్చిపెట్టడమే.ఒక జాతికి గతం లేకుండా చేయడమే. ఆ మేరకు, దానికి భవిష్యత్తు లేకుండా చేయడమే.

విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల ఆలయంలో ఒక చోరీ జరిగింది. అమ్మవారి మంగళసూత్రాలు. ముక్కపుడకపోయాయి. తరువాత ఒక భక్తుడు కొత్త నగలు చేయించి అమ్మవారికి కానుకగా సమర్పించుకుని. ఆ లోటును తీర్చాడు. అయితే, ఈ నగల మార్పిడిని చూసి నాకు చాలా బాధేసింది. ఎందుకంటే, అసలు నగల్ని దుర్గాదేవికి ఆపడచు కానుకలుగా నిజాం నవాబు సమర్పించాడు. ఆ దొంగ దోచుకున్నది బంగారాన్నే కాదు, ఒక చరిత్రను ఒక లౌకిక సాంప్రదాయపు చిహ్నాన్ని...

ఇంతకీ తెలుగుభాషను అణిచేస్తున్నది ఎవరూ? మీ యాగానికి తాటకి ఎవరూ?

వర్గసమాజంలో మనుషులు చేసే ప్రతి పనికి అంతిమ విశ్లేషణలో మూడే లక్ష్యాలుంటాయి. ఆస్తి, అధికారం, అంతస్తు (ప్రాపర్టీ, పవర్, ప్రిస్టేజ్). ఈ మూడే సాంస్కృతిక రంగాన్ని నిర్దేశిస్తుంటాయి. నిజాం కాలంలో ఉర్దూ అధికార భాష కాబట్టి, అప్పట్లో ఉర్దు కోచింగ్ కోసం విద్యార్థులు మౌలానాల ఇళ్ళ ముందు బారులు తీరేవారు. 1948లో హైదరాబాద్ స్టేట్ ఏర్పడగానే ఉర్దూ అధికారగణాల్లో రద్దై, తెలుగు వచ్చింది. ఆ తరువాత అమెరికా మార్కెట్ తెరుచుకున్నాక తెలుగు కూడా పోయి ఇంగ్లీషు వచ్చింది. రేపు చైనా అగ్రరాజ్యంగా మారితే, దేశం నిండా చైనా భాషకు కోచింగ్ సెంటర్లు వెలుస్తాయి. అమెరికాకు వలసపోయి, అక్కడ సెటిల్ అయినవాళ్ళే ఇక్కడ అందరికన్నా ముందుగా తెలుగును పక్కన పెట్టినవాళ్ళు. వాళ్ళు అమెరికా కోసం తెలుగును పక్కనపెట్టారు. అమెరికా కోసం ఇంగ్లీషు నేర్చుకున్నారు. విదేశాల్లో వాళ్ళ పురోగతిని చూసే, ఇక్కడి వాళ్ళు తెలుగు చదవడం మానేశారు. తెలుగు మీడియం స్కూళ్ళను మూసేశారు.

దేన్నయినా మాతృభాషలో చదివినపుడు చాలా సూక్ష్మమైన వివరాలు కూడా అర్థం అవుతాయి. భావోద్వేగాలు ఉన్నత స్థాయికి చేరుతాయి. ఆ భాష సృష్టించిన సాహిత్యానికీ, అందులోని సాంస్కృతిక సాంప్రదాయాలకూ వారసులం అనే భావన జాతి జనుల్లో ఒక ఆత్మవిశ్వాసాన్ని కల్గిస్తుంది. అయితే, అధికారభాషను నిర్ణయించేది మనుషులు కాదు. మార్కెట్ మాత్రమే. భాషను రక్షించుకోవడం అంటే మార్కెట్ శక్తుల్ని అడ్డుకోవడమే."

**– ఉషా యస్ డానీ**

*సీనియర్ జర్నలిస్టు*

khanyazdani@yahoo.co.in , *9866541148*

దైవపూజ అన్నది మాతృభాషలో చేయడం అసాధ్యం. ఇది ఏ మతంలోనైనా అసాధ్యమే. పూజ అర్థం, వాటి ఉద్దేశాలు మాతృభాషలో తర్జుమా చేసుకొని చదవవచ్చు. వాటిని అవగాహన చేసుకోవడానికి మాతృభాషలో చాలా సులువు అవుతుంది. అందుకే ప్రాంతీయ భాషల్లోను ఖురాన్‌ను అనువాదం చేశారు. కానీ ప్రార్థన మాత్రం మహమ్మద్ ప్రవక్తనీయులు పాటించిన పద్ధతి ప్రకారమే చేస్తున్నాం. అలానే చేయాలి కూడా.

**– సయ్యద్ నిసార్ అహమ్మద్**

*జర్నలిస్ట్, సూర్యదినపత్రిక*

nisarahamedsyed@gmail.com, *960346224*

# 1. చిన్న భాషల్ని మింగేస్తున్న పెద్ద భాషలు

గత పది సంవత్సరాలలో 516 భాషలు దాదాపుగా అంతరించి పోయాయట. చాలా కొద్దిమంది పెద్దవాళ్ళు మాత్రమే ఆ భాషలు మాట్లాడుతున్నారట. ప్రస్తుతం 7299 భాషలు ప్రపంచంలో వాడకంలో ఉన్నట్లు గుర్తించిన సంస్థలు, వాటిలో సగానికి సగం రాబోయే తరానికి అందకుండా అంతరించిపోయే దశలో ఉన్నాయని చెబుతున్నాయి. అంతరించిపోయే దశలో ఒక భాష ఉంది అనటానికి ప్రాతిపదికలు ఏంటంటే -1. ఆ భాషను పెద్దవాళ్ళు పిల్లలకు నేర్పరు. 2. రోజువారీ వ్యవహారాల్లో వాడరు. 3. ఆ భాష మాట్లాడే జనం సంఖ్య తగ్గిపోతుంటుంది. 4. ప్రభుత్వం, దేవాలయం కూడా ఆ భాషను ఉపయోగించవు. 5. ఆ భాషను కాపాడుకోవాలని ప్రజలు సంఘటితంగా ఉద్యమించరు. 6. ఆ భాష పట్ల గౌరవ భావం ప్రజల్లో ఉండదు. 7. ఆ భాష అక్షరాలను గానీ, సాహిత్యాన్ని గానీ ఆ ప్రజలు విరివిగా వాడరు.

Ethnologue.com లో ఈ అంతరించిపోతున్న భాషల చిట్టా ఉంది. ఆఫ్రికాలో 46, అమెరికాలో 170, ఆసియాలో 78, ఐరోపాలో 12 పసిఫిక్‌లో 210 భాషలు ఈ చిట్టాలో ఉన్నట్టు తెలిపారు. ఇక ఇండియా విషయానికి వస్తే 17 భాషలు అంతరించాయట. అవి :

**1. పుచిక్ వార్ :** అండమాన్ దీవుల్లో 2000 సంవత్సరంలో కేవలం 24 మంది షెడ్యూలు తెగల వాళ్ళు మాట్లాడుతున్నారు. ఈ భాషను హిందీ మింగేసింది.

**2. కామ్యాంగ్ :** 2003 నాటికి అస్సాంలో 50 మంది ఈ భాషను మాట్లాడేవాళ్ళు మిగిలారు. కాస్త ముసలివాళ్ళు మాత్రం తాయ్ లిపిలో ఈ భాష రాసేవాళ్ళట. ఇదీ గిరిజన భాషే. అస్సామీ భాష దీన్ని మింగింది.

**3. పరెంగా :** 2002 నాటికి ఒరిస్సా, కోరాపుట్ జిల్లాల్లో 767 మంది మిగిలారు. ఈ భాష మీద మన తెలుగు విశ్వవిద్యాలయం వాళ్ళు కూడా పరిశోధన చేశారు. ఈ భాష మాట్లాడే 'గడబ' అనే గిరిజన తెగ క్రమేణా ఆదివాసీ ఒరియా భాషలోకి మారిపోయారు.

**4. రూగా :** మేఘాలయలోని ఈ భాష నామరూపాల్లేకుండా అంతరించి పోయింది. మిగిలిన కొద్దిమంది గారో భాషలోకి మళ్ళారు.

**5. అహోం :** అస్సాం ప్రాంతంలో పూర్వం 80 లక్షల మంది మాట్లాడే ఈ భాషను మాట్లాడే వాళ్ళే లేరు. కేవలం మంత్ర తంత్రాల్లో మాత్రమే ఈ భాషను వాడుతున్నారు.

**6. అకాబియా :** అండమాన్ దీవుల్లోని ఈ భాషలు అంతరించిపోయాయి. అవి : 7. అకాబో, 8. అకాకరి, 9. అకాజెరు, 10. అకాకెడి, 11. అకాకోల్, 12. అకాకోరా, 13. అకర్‌బాలె, 14. ఒకొౌజువోయ్.

**15. పాలి :** బౌద్ధమత సాహిత్యం ఈ భాషలో ఓనాడు వికసించింది. 1835లో బైబిల్‌లోని కొత్త నిబంధన కూడా ప్రచురించారీ భాషలో. ఇండియాలో నాశనమైపోయింది. శ్రీలంక, బర్మా, టిబెట్‌లలో ఇంకా కొంతమంది ఈ భాష మాట్లాడే వాళ్ళున్నారంటారు.

**16. రంగకస్ :** ఉత్తరాంచల్ ప్రాంతాల్లో జౌహరి అని కూడా పిలిచే ఈ భాషస్తులు ఓ వెయ్యి మంది ఉండొచ్చట. ఈ భాషాపోయింది.

**17. తురుంగ్ :** అస్సాం గొలాగట్ జిల్లాలోని ఈ గిరిజన జనం మెల్లగా సింగ్‌పో భాషలోకి మళ్ళారట.

ప్రతి రెండు వారాలకు ఒక భాష చచ్చిపోతోందని భాషా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రపంచంలోని 6800 భాషలలో 90 శాతం భాషలు ఈ శతాబ్దంలోగా అంతరించిపోతాయట. ఎందుకంటే వాటిలో సగం భాషలు మాట్లాడేవారు 2500 మంది కంటే తక్కువగా ఉన్నారట. వరల్డ్ వాచ్ సంస్థ హెచ్చరిక ఇది. యుద్ధాలు, హత్యాకాండలు, ప్రకృతి బీభత్సాలు పెద్ద భాషల్ని ఆశ్రయించటం లాంటివన్నీ ఇందుకు కారణాలట. ఒక తరం నుండి మరో తరానికి భాషను తరలించటానికి కనీసం లక్ష మందైనా ఆ భాష మాట్లాడే వాళ్ళుండాలని లేకపోతే ఆ భాష అంతరిస్తుందని యునెస్కో ప్రకటించింది.

ఏ మతం వాళ్ళు ఎంత మంది పెరిగారు. ఎంతమంది తరిగారు లాంటి లెక్కల్ని తప్పుల తడకలతో హడావుడిగా పార్లమెంటుకు అందజేసి, తరువాత నాలుక కరచుకున్న కేంద్ర గణాంక శాఖ 2001 నాటి భాషల వారీ జనాభా లెక్కల్ని ఇంతవరకూ మన ప్రజల ముందు ఉంచలేదు. భాషల అభివృద్ధికి, పంచవర్ష ప్రణాళికల్ని ఆపుచేసి దశ వర్ష ప్రణాళికగా మార్చుకోవాల్సిందేనా? భాషల జనాభా వివరాలు చెప్పటానికి ఆరేళ్ళు సరిపోలేదా? 90 లక్షల మంది గుడ్డివాళ్ళు, కోటీనలభై లక్షల మంది చెవిటి వాళ్ళకు లేని బాధ మీకెందుకంటున్నారు సెన్సస్ వాళ్ళు. ఇప్పుడు 2001 జనాభా లెక్కల్లో 428 భాషలు నమోదయితే వాటిలో 415 వాడకంలో ఉంటే 13 భాషలు నశించిపోయాయట. ఎనిమిదవ షెడ్యూలు లోకి మరో నాలుగు భాషలు కలిపినందున, షెడ్యూలు భాషల సంఖ్య 22కు పెరిగింది. వాటి వివరాలు పట్టికలో చూడండి.

**భారతీయ షెడ్యూల్డు భాషల పరిస్థితి :**

| క్రమ సంఖ్య | భాష పేరు | 2001 జనాభా లక్షల్లో | % | లిపి | తొలి భగవద్గీత అచ్చువేసిన సంవత్సరం | తొలి బైబిల్ అచ్చువేసిన సంవత్సరం | తొలి ఖురాన్ ముద్రించిన సంవత్సరం | అధికార భాషగా ఉన్న రాష్ట్రాలు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | హిందీ | 4220 | 41.03 | దేవనాగరి | | 1818 | 1915 | అరుణాచల్‌ప్రదేశ్, అండమాన్ నికోబార్, బీహార్, చంఢీఘర్, ఛత్తీస్‌ఘర్, ఢిల్లీ, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉ.ప్రదేశ్, ఉత్తరాంచల్ |
| 2. | బెంగాలీ | 834 | 8.11 | బెంగాలీ | | 1809 | 1886 | త్రిపుర, ప.బెంగాల్ |
| 3. | తెలుగు | 740 | 7.19 | తెలుగు | | 1854 | 1930 | ఆంధ్రప్రదేశ్ |
| 4. | మరాఠి | 719 | 6.99 | దేవనాగరి | | 1821 | 1973 | మహారాష్ట్ర |
| 5. | తమిళం | 608 | 5.91 | తమిళ్ | | 1727 | 1879 | తమిళనాడు, పాండిచ్చేరి |
| 6. | ఉర్దూ | 515 | 5.01 | అరబిక్ | | 1848 | 1731 | జమ్ము కాశ్మీర్, (ఢిల్లీ, ఉ.ప్రదేశ్ ఆంధ్రప్రదేశ్ 2వ) |
| 7. | గుజరాతీ | 461 | 4.48 | గుజరాతీ | | 1823 | 1879 | గురజాత్, దయ్యూబ్, డామన్, నాగర్‌హవేలి |
| 8. | కన్నడ | 379 | 3.69 | కన్నడ | | 1831 | 1978 | కర్నాటక |
| 9. | మళయాళం | 331 | 3.21 | మళయాళం | | 1841 | 1970 | కేరళ, లక్షద్వీప్ |
| 10. | ఒరియా | 330 | 3.21 | ఒరియా | | 1815 | | ఒరిస్సా |
| 11. | పంజాబీ | 291 | 2.83 | గురుముఖి, దేవనాగరి | | 1959 | 1870 | పంజాబ్ (ఢిల్లీ 2వ) |
| 12. | ఇంగ్లీషు | 179 | 2.10 | రోమన్ | 1783 | 1382 | 1649 | ఇండియా 2వ అధికార భాష |
| 13. | అస్సామీ | 132 | 1.28 | బెంగాలీ | | 1833 | 1970 | అస్సోమ్ |
| 14. | మైథిలీ | 122 | 1.18 | నేపాలీ, దేవనాగరి | | 1914 | | బీహార్ |
| 15. | సంతాలి | 65 | 0.63 | ఒరియా, రోమన్ | | 1914 | | బీహార్, చత్తీస్‌ఘర్, జార్ఖండ్ ఒరిస్సా |
| 16. | కశ్మీరీ | 55 | 0.54 | ఉర్దూ | | 1899 | 1887 | జమ్ము & కశ్మీర్ |
| 17. | సింధీ | 25 | 0.25 | అరబిక్, గురుముఖి | | 1954 | 1867 | ........... |
| 18. | నేపాలి | 29 | 0.28 | నేపాలి | | 1914 | 2008 | సిక్కిం |
| 19. | కొంకణి | 25 | 0.24 | కొంకణి | | 1970 | | గోవా |
| 20. | మణిపురి (మైథీ) | 15 | 0.14 | బెంగాలీ | | 1984 | | మణిపూర్ |
| 21. | బోడో | 14 | 0.13 | రోమన్, దేవనాగరి, బెంగాలీ | | 1981 | | అస్సాం |
| 22 | డోగ్రి | 23 | 0.24 | ఉర్దు, హిందీ, నాప్తాలిక | | 1826 | | జమ్ము, కాశ్మీర్ |
| 23. | సంస్కృతం | 0.14 | 0.01 | దేవనాగరి | | 1822 | 1897 | ...... |
| | | **10112.1** | **98.68** | | | | | |

***28.4.2006, గీటురాయి వారపత్రిక***

# ౨. తెలుగు నిఘంటువులు

"తెలుగు వాళ్ళు పలికే ఉర్దూ పదాలు", "తెలుగు నిఘంటువుల్లో చేరాల్సిన ఇంగ్లీషు పదాలు" గురించి "తెలుగు అధికార భాష కావాలంటే" పుస్తకంలో సవివరంగా రెండు అధ్యాయాలున్నాయి. 1900 సంవత్సరానికి ముందు వెలువడిన పాత నిఘంటువుల జాబితా కూడా ఉంది. వాటిలో నా వాదన ఒకటే, తెలుగులో పద సంపద పెరగాలి. తెలుగు ప్రజలు వాడుకలోకి తెచ్చిన పరభాషా పదాలు కూడా చక్కగా మన వాడుకలో ఇమిడిపోయి, తెలుగుపదాలే అన్నంతగా మనలో స్థిరపడిపోతే వాటిని ఎప్పటికప్పుడు మన నిఘంటువుల్లోకి చేర్చుకుంటూ వెళ్ళాలి. ఈ నిఘంటువులన్నీ ఇంటర్నెట్‌లో ఉంచాలి. ఆయా పదాల అర్థాలను వెతుక్కునే సౌలభ్యం, సాంకేతిక నిపుణులు కల్పించేలా నిధుల విడుదల జరగాలి.

లకంసాని చక్రధరరావు, ఆంధ్రా యూనివర్శిటీ ప్రొఫెసర్ సంపాదకత్వంలో "తెలుగు వ్యుత్పత్తి కోశం" పేరుతో తెలుగు నుండి తెలుగు నిఘంటువు 1,08,330 పదాలతో 8 సంపుటాలుగా వెలువడినది.

1. అ-ఔ (1978) 412 పేజీలు, పొట్టి శ్రీరాములు కి అంకితం. ఎమ్.ఆర్. అప్పారావు తొలిపలుకులు. 12219 పదాలు.
2. క-ఘ (1981) 455 పేజీలు, కట్టమంచి రామలింగారెడ్డికి అంకితం. ఆవుల సాంబశివరావు ముందుమాట. 19670 పదాలు.
3. చ-ణ (1981) 277 పేజీలు, ఆవుల సాంబశివరావు ముందుమాట. 11000 పదాలు.
4. త-న (1985) 440 పేజీలు, వాసిరెడ్డి శ్రీకృష్ణకి అంకితం. కోనేరు రామకృష్ణారావు మున్నుడి. 16000 పదాలు.
5. ప-భ (1987) 498 పేజీలు, లంకపల్లి బుల్లయ్యకి అంకితం. కోనేరు రామకృష్ణారావు మున్నుడి. 19000 పదాలు.
6. మ (1987) 268 పేజీలు, ఎమ్.ఆర్. అప్పారావుకి అంకితం కోనేరు రామకృష్ణారావు ముందుమాట. 9754 పదాలు.
7. య-వ (1989) 272 పేజీలు, ఆవుల సాంబశివరావుకి అంకితం కనిశెట్టి వెంకటరమణ తొలిపలుకు. 10132 పదాలు.
8. శ-హ (1995) 315 పేజీలు, కోనేరు రామకృష్ణారావుకి అంకితం మద్ది గోపాలకృష్ణారెడ్డి ప్రవచనం. 6651 పదాలు. 3904 (అ-హ) అనుబంధం.

ఈ సంపుటాలను ఆన్‌లైన్‌లో పెడితే బాగుంటుంది.

**తెలుగు-ఉర్దూ నిఘంటువులు :**

మన రాష్ట్రంలో తెలుగు మొదటి అధికార భాష కాగా ఉర్దూ రెండవ అధికార భాష. ఈ రెండు భాషల ప్రజల మధ్య వారివారి భాషా పదాల పరిచయం, అవగాహన, మరింత

పెరగటానికి నిఘంటువులు ఎంతగానో తోడ్పడతాయి. ఉర్దూ-తెలుగు నిఘంటువు, ఉర్దూ-తెలుగు జాతీయాలు, తెలుగు-ఉర్దూ సామెతలు లాంటి పుస్తకాలు ఎక్కువగా దొరకడం లేదు. ముద్రించాల్సిన అవసరం వుంది.

- 1938-మొదటి ఉర్దూ - తెలుగు నిఘంటువు 1938లో వరంగల్ ఉస్మానియా కాలేజీలో అరబిక్ ప్రొఫెసర్ ఐ. కొండలరావు సంకలనపరచి ప్రచురించారు. ఇది అలీఫ్ నుండి లామ్ వరకు ఆహ్మదియా ప్రెస్ కర్నూలులో మీమ్ నుండి యే వరకు వరంగల్ కుమార్ ప్రెస్‌లోను ప్రింటు చేయబడింది. మొత్తం 857 పేజీల పుస్తకం.
- ఈ పురాతన ప్రతిని తెలుగు అధికార భాషా సంఘం చైర్మన్ ఏబికె ప్రసాద్ గారికి 6.10.2008న అందజేశాను. 2009 ఏప్రిల్ 25వ తేదీన 862 పేజీలతో ఈ నిఘంటువును పునర్ముద్రించి అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఏబికె ప్రసాద్ గారు విడుదల చేశారు.
- ఉర్దూ అకాడమీ ముప్పై ఆరు వేల పదాలతో శ్రీ పటేల్ అనంతయ్య కమిటీ చేత తెలుగు-ఉర్దూ నిఘంటువు డి.టి.పి చేయించింది కానీ నిధులలేమి కారణంతో ప్రచురించలేదు.
- కొండలరావు గారి తెలుగు - ఉర్దూ నిఘంటువు కూడా పునర్ముద్రణకు నోచుకోలేదు.
- 2010లో ఎమెస్కో సంస్థ లక్ష్మణరావు పతంగే సంకలన పరచిన ఉర్దూ-తెలుగు నిఘంటువును 328 పేజీలతో తెలుగు లిపిలో తెలుగు అక్షరక్రమంలో ప్రచురించింది.ఇందులో 12500 పదాలున్నాయి.
- తెలుగు పరిశోధన అనే వెబ్‌సైట్ http : //www.teluguthesis.com / forumdisply.php?fid=27@action=indice&order=subject లో ఆర్.పి.శర్మ, విమల్ తదితరులు సేకరించిన **అమరకోశము, అచ్చ తెలుగు పదాల నిఘంటువు, తెలుగు వ్యుత్పత్తి కోశం, త్రిభాషా నిఘంటువు, పత్రికా భాషా నిఘంటువు, పత్రికా పదకోశం, ప్రాసాక్షర పదకోశం, బాలల శబ్దరత్నాకరం, బ్రౌణ్య నిఘంటువు, లలిత కళా పదకోశం, విద్యార్థి కల్పవల్లి, విద్యార్థి కల్పతరువు, విశ్వకోశము, వేదాంత పారిభాషిక పద కోశం, శబ్దరత్నాకరము, సంస్కృతాంధ్ర నిఘంటువు** వంటి చాలా రకాల నిఘంటువులు దొరుకుతున్నాయి.

ఎన్ని ఎక్కువ తెలుగు నిఘంటువులు నెట్‌లో చేరితే తెలుగు అంతగా బలపడుతుంది. కాగితం, కలం రోజులు పోయాయి. ఆధునిక అవసరాలకు ధీటుగా తెలుగు భాష తయారు కావాలి. ఇంగ్లీషులో ఉన్న సౌలభ్యాలన్నీ తెలుగుకూ కల్పించాలి. పదాల శుద్ధి-యంత్రం, గుణింత, వ్యాకరణ పరిష్కారయంత్రం, సాంకేతిక నిఘంటువులు, మాండలిక నిఘంటువులు, డిజిటల్ నిఘంటువులు, అమరకోశాలు, పదశోధనా యంత్రాలు, ఉచ్ఛారణ - పద ప్రయోగ నిఘంటువులు, వ్యుత్పత్తి కోశాలు, లిపిబోధినిలు, సాహిత్య శోధనా పరికరాలు, పదాను క్రమణికలు... ఇలా ఎన్నో రావాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్‌లోనే నిఘంటువులకు కొత్త పదాలను జోడించే అవకాశం అందరికీ ఇవ్వాలి. ఏయే ప్రాంతాల్లో ఏ పదాన్ని ఎందుకు, ఎలా వాడుతుంటారో ఆయా ప్రాంతాల ప్రజలనే చెప్పనివ్వాలి. సరిగా ఉన్నట్లు భావించిన కొత్త పదాలను ఎప్పటికప్పుడు నిఘంటువుల్లో చేరుస్తూ పోవాలి. మన నిఘంటువుల సైజు పెరగాలి. అవి జన బాహుళ్యానికి వాడకంలోకి విస్తారంగా వస్తూనే ఉండాలి.

# 3. మహానిఘంటువు నిర్మాణమే జీవితాశయం

దాదాపు పాతికేళ్ళుగా ఆయన తెలుగు భాషాభివృద్ధి, అధికార భాషగా అమలయ్యేందుకు అనుసరించాల్సిన విధానాలు, ఎక్కడ ఎందుకు అధికార భాషగా తెలుగు పటిష్టంగా అమలవడం లేదు? అన్న అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తున్నారు. తానో ప్రభుత్వ ఉద్యోగి అయినా, భాషాభివృద్ధి, భాష పరిరక్షణలపై తనకున్న ప్రత్యేక ఆసక్తితో తెలుగు భాష గురించి, రాష్ట్రంలో అధికార భాషగా తెలుగు అమలు గురించి ఎంతో సమాచారాన్ని ప్రోది చేశారు. తాను సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తులనాత్మక విశ్లేషణ చేస్తూ, తప్పొప్పుల్ని సరిచూసుకుంటూ, ఆయా విషయాల్ని గ్రంథంగా మలిచారు. 'తెలుగు అధికార భాష కావాలంటే!?' శీర్షికతో వెలువడిన ఆ పుస్తకం పలువురు విజ్ఞుల్ని, భాషాభిమానుల్ని ఆకట్టుకుంది. ప్రభుత్వోద్యోగి అయినా తెలుగు భాష వీరాభిమానిగా ఆయన చేస్తున్న భాషా సేవ అందర్నీ ఆకట్టుకుంటోంది. ఇటీవలే రాష్ట్ర అధికార భాషా సంఘం ఆయన సేవల్ని గుర్తించి 'అధికార భాషను సమర్థంగా అమలుచేస్తున్న ఉత్తమ అధికారి' పురస్కారంతో సత్కరించింది కూడా. తెలుగు భాష, సంస్కృతి, తెలుగు జాతి సంప్రదాయాలంటే ప్రాణం పెట్టే ఆయనే... విశాఖపట్నం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నూర్‌భాషా రహంతుల్లా. ప్రస్తుతం ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంగ్లీషు అంతర్జాతీయ భాషగా మారి ప్రాంతీయ, దేశ భాషల్ని మింగేస్తున్న నేపథ్యంలో తెలుగు భాష పరిరక్షణ, అభివృద్ధి తదితర అంశాలపై ఆయన స్పందన ఇది....

ప్రశ్న : మాతృభాష పరిరక్షణ కోసం పాతికేళ్ళుగా ఉద్యమం చేసేంత ఆసక్తి, స్ఫూర్తి మీకు ఎప్పుడు ఎలా కలిగాయి?

జవాబు : నాకు చిన్నప్పటి నుంచి తెలుగు అంటే ప్రత్యేక అభిమానం. నా చదువంతా తెలుగు మీడియంలోనే చదివా. నా మాతృభాష తెలుగు. ఉర్దూ, ఇతర భాషలేవీ రావు. నా తల్లి నాకెంత ఇష్టమో... నా తల్లి భాష నాకు అంత ఇష్టం. ఆ భాషంటే నాకెంతో ప్రాణం. ఎక్కడికి వెళ్ళినా గత్యంతరం లేని స్థితిలో ఇంగ్లీషు మాట్లాడటం పలు సందర్భాల్లో ఎంతో బాధ కల్గించేది. ఆ బాధ, తీయనైన తెలుగు భాషను మింగేస్తున్న ఇతర భాషల ఆధిపత్యంపై అసంతృప్తి, ఆవేదనల నుంచే భాషాభివృద్ధి, పరిరక్షణకు ఏదో చేయాలన్న తపన జనించింది. పదో తరగతి స్కాలర్‌షిప్ దరఖాస్తుల నుంచి జీవితంలో అన్ని దశల్లోనూ ఇంగ్లీషు ప్రమేయం నన్ను ఎంతగానో బాధించింది. అదే చివరికిలా తెలుగు భాష ప్రేమికుడిగా మారేందుకు స్ఫూర్తినిచ్చింది.

ప్రశ్న : ఇన్నేళ్ళలో మీ ప్రయత్నాలు విజయవంతం అయ్యాయని భావిస్తున్నారా?

జవాబు : అసలిది యుద్ధమే కాదు కాబట్టి విజయం – పరాజయం వంటి ప్రశ్నలే లేవు. నా వరకూ నా వ్యక్తిగతంగా ఇది సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని ఏదీ చెయ్యలేదు. విజయమా? అనేది కచ్చితంగా చెప్పలేను గానీ, మొదట్లో తిరస్కరించినవాళ్ళు, అవహేళన చేసిన వాళ్ళు సైతం నేడు నన్ను మంచి పని చేస్తున్నావ్ అంటూ ప్రోత్సహిస్తున్నారు. మరింత చురుగ్గా పనిచేయమని వెన్ను తడుతున్నారు. ప్రస్తుతానికి ఇది నాకెంతో స్ఫూర్తినిస్తోంది. అయినా నా ప్రయత్నమల్లా తెలుగు భాషను బతికించండి... అనే అభ్యర్థనే తప్ప మరేం లేదు. తెలుగు భాషను ఉజ్వలంగా, సమాజం దృష్టిలో సమున్నతమైన భాషగా నిలబెట్టాలన్నదే నా అభిలాష. ఇందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ... ప్రత్యేకించి తెలుగు ప్రజలంతా నడుం బిగించాలని అభ్యర్థిస్తున్నా.

ప్రశ్న : మాతృభాష పరిరక్షణతో సమాజాభివృద్ధి జరుగుతుందంటారా? నిజమేనా? అయితే ఎలా?

జవాబు : తప్పకుండా మాతృభాషాభివృద్ధితో సమాజాభివృద్ధి జరుగుతుంది. ఎలా అంటే మానవ సమాజావసరాలూ, సాంఘిక సంక్షేమం, జాతి అవసరాలు ఆయా మాతృభాషల్లో చెప్పినంత స్పష్టంగా పరాయి భాషల్లో చెప్పలేం. పరుగులు పెడుతున్న ప్రపంచాభివృద్ధితో పోల్చితే.. మాతృభాషలో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛగా చేయలేకపోతున్నందున తెలుగు ప్రజల్లో అభివృద్ధి అంతగా జరుగలేదనే చెప్పాలి. మాతృభాషలో భావవ్యక్తీకరణ జరగకపోతే మనిషి ఆలోచనలు వికసించవు. అభివృద్ధి జరుగదు. ఉదాహరణకు కోర్టులో వాద ప్రతివాదనలు, తీర్పులు వంటివన్నీ ఇంగ్లీషులో జరగటం వల్ల న్యాయమూర్తులకు – బాధితులు, ముద్దాయిలకు మధ్య లాయర్లు కేవలం దుబాసీల పాత్రకే పరిమితం కావాల్సి వస్తోంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆయా శాస్త్రాలూ, మేధావుల బోధనలు అన్నీ ఇంగ్లీషులో జరుగుతుండటంతో ఆ విజ్ఞానమేదీ సామాన్యులకు సరిగా అందటం లేదు. మాతృభాషని వదిలేసి పరాయి భాషలో భావ వ్యక్తీకరణ జరిగినంత కాలం సమాజాభివృద్ధి అనుకున్నంతగా సాగదు. రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లుగా 'విద్యార్థుల గ్రాహ్యతకు, భావ వ్యక్తీకరణకు మాతృభాష కీలకం. మాతృభాషలో విద్య నేర్వడం, నేర్పడం ఎంతో సులభం" అన్న అంశాన్ని నేను మనఃస్ఫూర్తిగా నమ్ముతా.

ప్రశ్న : తెలుగు అధికారభాషగా అమలు కావటానికి ఉన్నతాధికారులే ఆటంకమన్న వాదనలున్నాయి. మీరేమంటారు?

జవాబు : వ్యక్తిగా ఏ ఉన్నతాధికారీ తెలుగు అధికారభాషగా అమలయ్యేందుకు ఆటంకమని

నేను అనుకోను. వ్యవస్థలో ఉన్నతాధికారులు అధికార భాష తెలుగును పక్కాగా అమలు చేయటంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ ఇబ్బందులు - సమస్యల్ని తొలగించాల్సి వుంది. అలా చేస్తే ఉన్నతాధికారులు అడ్డు... అన్న అభిప్రాయం తొలగిపోతుంది. రాష్ట్ర ఉన్నతాధికారులు కేవలం కేంద్ర ఉన్నతాధికారులు, ఇతర రాష్ట్రాలతో జరిపే సంప్రదింపులు, ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఇంగ్లీషులో చేసినా ఫర్వాలేదు. కానీ హైదరాబాద్ నుంచి జిల్లాలకు, రాష్ట్రంలోనే జారీ చేసే ఆదేశాలు మాత్రం తప్పనిసరిగా తెలుగులోనే ఉండాలన్న నిబంధన తేవాలి. ఆ నిబంధన కచ్చితంగా అమలయ్యేలా అధికారభాషా సంఘం (అ.భా.సం) ఒత్తిడి తేవాలి. అప్పుడు అధికారుల పాత్ర పరిమితమై, రాష్ట్రంలో తెలుగు అధికార భాషగా సక్రమంగా అమలవుతుంది.

ప్రశ్న : పాలకుల్లో... పాలితుల్లో... మార్పు ప్రధానంగా ఎవరి నుంచి మొదలవ్వాలి?

జవాబు : ఇద్దరిలోనూ మార్పు మొదలవ్వాలి. యధారాజా తధా ప్రజ... యధా ప్రజా తధా రాజా... అన్న రెండు వాక్యాలూ నేడు సత్యాలుగానే కనిపిస్తున్నాయి. అధికార భాష అమలు విషయంలో ఎక్కడ ఎవరి ఒత్తిడి సత్ఫలితాలిస్తుందంటే వారే చొరవ చూపటం అవసరం. ప్రస్తుతం అటు పాలకులు, ఇటు పాలితులు ఇరువర్గాలూ మాతృభాష రక్షణకు, అధికార భాషగా తెలుగు అమలుకు చిత్త శుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ప్రశ్న : తెలుగు భాష అంతరించి పోదని, పైగా తెలుగు మాట్లాడేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని... పనీ పాటా లేని వాళ్ళే భాషా పరిరక్షణ పేరుతో హడావుడి చేస్తున్నారని కొందరి విమర్శ. వీరిలో భాషా పండితులూ ఉన్నారు. తెలుగుభాష నిజంగా ప్రమాదంలో పడిందా? లేక ఇది నిజంగా అనవసర ఆందోళనేనా?

జవాబు : అలా ఎందుకు వివమర్శిస్తున్నారో ఆ మహాభాషా పండితులే చెప్పాలి మరి! వాళ్ళ దగ్గరేమైనా తెలుగు మాట్లాడేవాళ్ళు క్రమేణా పెరుగుతున్నారన్న డేటా ఏమైనా ఉందా? 2001 జనాభా లెక్కల ఆధారంగానూ, ఐక్య రాజ్యసమితి చేసిన సర్వే ఆధారంగా కూడా తెలుగు భాష ప్రాభవం క్రమేణా తగ్గుతోందని స్పష్టం అయింది. ఏటికేడుగా తెలుగువారి జనాభా పెరుగుతున్నా, భాషగా తెలుగు మాత్రం పూర్వప్రాభవాన్ని కోల్పోతోంది. మరి ఆయా నివేదికల సమాచారాన్ని తెలుగు భాషకు రానున్న ప్రమాదాన్ని ముందుగానే తెలిపే హెచ్చరికలుగా భావించి తదనుగుణంగా చర్యలు చేపట్టడంలో తప్పేం ఉంది? ఒకవేళ భాషా పండితుల విమర్శలే నిజమైతే... అంతకన్నా కావాల్సింది లేదు. కానీ...ఐరాస తదితర

అంతర్జాతీయ సంస్థల హెచ్చరికలే నిజమైతే... అమ్మో....! అప్పుడీ భాషా పండితులేం చేస్తారు? అయినా మాతృభాషను విరివిగా వినియోగించండి... భాషను సుసంపన్నంగా, శక్తిమంతంగా తయారు చేయండని చెప్పడం హర్షణీయమే కదా!

ప్రశ్న : రాష్ట్రంలో తెలుగు అధికారభాషగా అమలు కాకపోవటానికి ప్రధాన అవరోధాలు ఏమిటి?

జవాబు : దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య, ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య సేతు భాష (లింక్ లాంగ్వేజి)గా ఇంగ్లీషు రూపొందడమే అధికార భాషగా తెలుగు అమలుకు ప్రధాన అవరోధంగా కనబడుతోంది. ఆంగ్లం ప్రబావం ముందు ప్రాంతీయ భాషల ప్రాభవం వెలవెలబోతోంది. దీనికి పరిష్కారంగా స్థానికంగా ప్రాంతీయ మాతృభాషల్లో, జాతీయ – అంతర్జాతీయ వ్యవహారాల్లో సేతు భాషల్ని విజ్ఞతతో ప్రయోగించటంలో మెలకువ పాటించాలి. తెలుగును శక్తిమంతంగా వినియోగించేందుకు తగిన పారిభాషిక పదకోశాలు – వాటిని నిత్యం నవీకరించకపోవడం రెండో ప్రధాన సమస్య. ఇక తెలుగు రాతకు సంబంధించి అన్నిచోట్లా, అందరికీ సులభంగా అందుబాటులో ఉండే తెలుగు సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయకపోవడం మూడో అవరోధం. ప్రధానంగా ఈ మూడు అడ్డంకులూ తెలుగు అమలును నిరోధిస్తున్నాయి.

ప్రశ్న : ప్రపంచీకరణ పవనాలు ఉధృతంగా వీచే నేటి తరుణంలో పిల్లలు తెలుగు మాధ్యమంలో చదివి నెగ్గుకురాగలరా? ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో వెనుకబడి పోరా?

జవాబు : విషయ పరిజ్ఞానం, భాషా పాండిత్యాలు రెండు వేర్వేరు అంశాలు. రెంటిల్లోనూ ప్రావీణ్యం అభిలషణీయం. కానీ ప్రస్తుతం విషయ పరిజ్ఞానాన్ని పట్టించుకోకుండా, కేవలం భాషా పరిజ్ఞానంపై అంతర్జాతీయంగా విద్యా, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఇది సహజంగానే భావితరాల్ని పరభాషలవైపు ఆకర్షిస్తోంది. ఉపాధి హామీ లభించే విద్యను నేర్చేందుకు, భావి జీవితానికి భరోసా ఇచ్చే భాషనే నేర్చుకునేందుకు సాధారణ విద్యార్థి ఆసక్తి చూపటం చాలా సహజం. అదే ఇప్పుడు జరుగుతోంది. తల్లిదండ్రుల నుంచి విద్యార్థుల వరకూ ఆంగ్లం బాగా నేర్పితే జీవితం బంగారు బాటన నడుస్తుందని వారిలో నమ్మకం కలిగించారు. అలా కాకుండా తెలుగు భాషలో చదివినా ఉపాధికి ఢోకా లేదన్న భరోసా కలిగిస్తే వాళ్ళంతా మళ్ళీ తెలుగువైపు పరుగు పెడతారు. తెలుగు చదివినా, తెలుగులో చదివినా ఉపాధి తథ్యం అన్న హామీ లభిస్తే, తప్పకుండా మళ్ళీ తెలుగుకు

గౌరవస్థానం, అద్వితీయ ఆకర్షణ సమకూరుతాయి. ఇందుకు నేనే ఉదాహరణ. ఎలాగంటే.. గ్రూప్ 1 వంటి సర్వీస్ కమిషన్ పరీక్షల్లో అప్పట్లో తెలుగు మాధ్యమంలో డిగ్రీ చదివిన వాళ్ళకి అదనంగా ఇచ్చినారు. అలా ఇచ్చిన 5 శాతం ప్రోత్సాహక మార్కులతోనే నేను అధికారిని అయ్యా... కాబట్టి మళ్ళీ అలాంటి అదనపు ఆకర్షణలు మన మాతృభాష అభివృద్ధికి చేసాయంగా అందించాలన్నది నా అభిప్రాయం.

ప్రశ్న : ఆధునిక సాంకేతిక అవసరాలకు తగ్గట్టు తెలుగు లిపిలో మార్పులు చేయాలని మీ వ్యాసాల్లో సూచించారు. అది మరింత గందరగోళానికి దారి తీయదా?

జవాబు : ప్రస్తుతమున్న తెలుగు లిపిలో మార్పులు చేయాలన్న స్వర్గీయ వేటూరి ప్రభాకరశాస్త్రి గారి అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నా. నిపుణులు శ్రద్ధ పెడితే ఇందులో గందరగోళమేదీ ఉండదని భావిస్తున్నా. అయితే లిపిని మార్చటం, లేక ఇప్పుడున్న లిపికి అనుగుణమైన సాఫ్టవేర్‌ను సమకూర్చు కోవడం రెండింటిల్లో ఏదీ సులభం... అనుసరణీయం అనేది ఆలోచించి, ఆ రెండింటిల్లో ఏది చేసినా నాకు సమ్మతమే. మొత్తమ్మీద అంతర్జాతీయంగా ఇప్పుడు ఇంగ్లీషును అంతా ఎంత సులభంగా, ఎంత చౌకగా నేర్చుకుంటున్నారో - వినియోగిస్తున్నారో అంతకన్నా సులభంగా, చౌకగా తెలుగు భాషను నేర్చుకోవడం, వినియోగించడం జరిగేలా చూడాలన్నదే నా కోరిక.

ప్రశ్న : తెలుగు సాఫ్ట్‌వేర్ తయారీదారులు స్వార్థవైఖరి వల్లే ఆ రంగంలో తెలుగు వాడకం మందగించిందని మీరు విమర్శించటానికి ఆధారాలేమిటి?

జవాబు : ఇంగ్లీషు సాఫ్ట్‌వేర్ అంత సులభంగా విస్తారంగా తెలుగు సాఫ్ట్‌వేర్ దొరకడం లేదు. దీనికి కారణం తెలుగు సాఫ్ట్‌వేర్ తయారీదారుల ఏకస్వామ్య పోకడలే కారణం. రాష్ట్రంలో అధికార భాషగా తెలుగు పూర్తి స్థాయిలో అమలు అవ్వాలంటే తెలుగు సాఫ్ట్‌వేర్ తయారీదారుల ఏకచ్ఛత్రాధిపత్యం పోవాల్సిందే. తెలుగు సాఫ్ట్‌వేర్ తయారీదారులంతా కలిసి సాధారణ పౌరులు సైతం సులభంగా వినియోగించేలా ఒకే తరహా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి చౌకగా అందచేసేందుకు ఉదారంగా ముందుకు రావాలి.

ప్రశ్న : మహా నిఘంటువు తెలుగు భాషావ్యాప్తికి ఏరకంగా దోహదం చేస్తుందని భావిస్తున్నారు?

జవాబు : మహా నిఘంటువు నిర్మాణం తెలుగు భాషాభివృద్ధికి తప్పకుండా దోహదం చేస్తుంది. ఇప్పటికీ రాష్ట్రంలోని భిన్న ప్రాంతాల్లోని ప్రజల తెలుగు మాండలికాలు, ఆయా ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన కొన్ని వేల ప్రత్యేక పదాలు ఇపుడున్న

నిఘంటువుల్లో లేవు. దీంతో ప్రస్తుతమున్న నిఘంటువులు కొంతమేరకే ఉపయోగ పడుతున్నాయి. ఆయా కొత్త పదాలన్నింటినీ సేకరించి, వరుస క్రమంలో పేర్చి కొత్తగా మహా నిఘంటువు నిర్మాణం చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఉదా : కొల్లేరు ప్రాంతంలో పదుల సంఖ్యలో చేపల పేర్లు వాడకంలో ఉన్నాయి. అలాగే ఇతర ప్రాంతాల్లో పంటలు, ధాన్యాల పేర్లు కూడా.

ప్రశ్న : ఇన్నేళ్ళలో తెలుగు అధికార భాషా సంఘం ఏం చేసిందని మీ అభిప్రాయం?

జవాబు : ఇన్నేళ్ళల్లో అధికార భాషా సంఘం తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేస్తూనే వుంది. కాకుంటే తొలి అ.భా.సం. అధ్యక్షుడు వావిలాల గోపాలకృష్ణయ్య మొదలు ప్రస్తుత అధ్యక్షుడు ఏబీకే ప్రసాద్ వరకూ అధ్యక్షులంతా వారి వారి అభిరుచి, ఆసక్తి మేరకు తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశారు. ప్రత్యేకించి గత రెండేళ్ళుగా అ.భా.సం. మరింత క్రియాశీలకంగా పని చేస్తోంది. న్యాయస్థానాల్లో తీర్పులు, రాష్ట్రవ్యాప్తంగా అధికార భాష అమలుపై చైతన్య సదస్సుల నిర్వహణ, తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వుల (జీవోలు) జారీ వంటి కొన్ని చెప్పుకోదగిన విజయాలు ఈ కాలంలో సాకారం అయ్యాయి.

ప్రశ్న : తెలుగు భాషా పరిరక్షణలో ప్రసార మాధ్యమాల పాత్ర ఎలా ఉండాలి?

జవాబు : తెలుగు భాషా పరిరక్షణలో ప్రసార మాధ్యమాలది కీలక పాత్ర. ప్రస్తుతం తెలుగు భాషాభివృద్ధికి 'ఈనాడు' వంటి దినపత్రికలు చిత్తశుద్ధితో పాటుపడుతున్నాయి. తెలుగు టీవి ఛానెళ్ళు, పత్రికలు తెలుగు భాషను సజీవంగా, బలోపేతంగా నిలిపేందుకు ఎంతో కృషి చేస్తున్నాయి. కార్యాలయాల్లో, ప్రభుత్వాధికారులు తెలుగు సాఫ్ట్‌వేర్ వినియోగంలో పడుతున్న ఇబ్బందుల్ని "ఈనాడు" తెలుగు పత్రికలు సునాయాసంగా అధిగమిస్తున్నాయి. ఇలాంటి సులభమైన సాంకేతిక మెలకువల్ని అందరికీ వివరించి, ఆయా సాఫ్ట్‌వేర్‌లను ప్రభుత్వానికి అందించి సాధారణ పౌరులు సైతం ఆయా సాఫ్ట్‌వేర్‌లను వినియోగించేలా సాయం చేయాలి. నేడు తెలుగు పత్రికలు ఎన్నో శాస్త్ర సాంకేతిక పదాలకు చక్కటి తెలుగు పదాల్ని వాడుతున్నాయి. తెలుగు పదం లేని చోట కొత్త పదాన్ని సృష్టిస్తున్నాయి. దీన్ని కొనసాగించాలి. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలన్నీ ప్రజల్లో తెలుగు భాషపై అనురక్తిని పెంచేందుకు కృషి చేయాలి. తెలుగుభాష సేవ చేసే వాళ్ళను గుర్తించి వారి పరిచయాలను ప్రచురిస్తే, మరింత మంది ఆ స్ఫూర్తితో తెలుగు భాషాభిమానులుగా మారే అవకాశముంది.

ప్రశ్న : భవిష్యత్తులో మీ భాషోద్యమాన్ని ఎలా విస్తరించదలిచారు?

జవాబు : తెలుగు భాష అభివృద్ధి, పరిరక్షణలకు అంకిత భావం ఉన్న కార్యకర్తలాగా నా కృషిని కొనసాగిస్తా,అ.భా.సం. అధ్యక్షుడు ఏబీకే నా కృషిని చూసి నన్ను ప్రోత్సహిస్తున్నారు. నేనూ ఇకపై నాలా భాషాభివృద్ధిని కాంక్షించే వారిని ప్రోత్సహిస్తా, నాలాంటి భావజాలంతో తెలుగు భాషాభివృద్ధిపై ఆసక్తి ఉన్నవాళ్ళందరితో కలిసి తెలుగుభాషను మరింత శక్తిమంతంగా తీర్చిదిద్దటమే నా ఆశయం. ఎవరూ పూనుకోకుంటే, ఇప్పటికి చేరని కొన్ని వేల కొత్త పదాలతో 'మహా నిఘంటువు' నిర్మాణం చేపట్టాలన్నది నా ఆకాంక్ష. మరోవైపు 50 ఏళ్ళ క్రితం నాటి తెలుగు పాటల్ని సేకరించి, నేటి తరానికి మన తెలుగు పాటల గొప్పతనాన్ని, ఆయా పాటలు ఏ రాగంలో స్వరపరిచారు?ఎవరు రాశారు? వంటి వివరాలన్నింటితో మంచి పుస్తకం తేవాలని ప్రయత్నిస్తున్నా. దీనికి వి.ఎ.కె. రంగారావు గారి సహకారంతో ఇప్పటికి మొత్తం 830 పాటల్ని రాగాల వివరాలతో సేకరించా. అలాగే ప్రస్తుతం వాడుకలోని తెలుగు సామెతల్ని సేకరించి గ్రంథస్థం చేయాలని కృషి చేస్తున్నా.

ప్రశ్న : ఉన్నత ప్రభుత్వోద్యోగిగా మీ కార్యాలయంలో తెలుగు అమలుపై మీరు ఎలాంటి శ్రద్ధ వహిస్తున్నారు? సిబ్బందిని ఎలా మలుచుకు వస్తున్నారు. వ్యక్తిగా ఎలాంటి బాధ్యత తీసుకుంటున్నారు?

జవాబు : మా కార్యాలయంలో గతంలో ఇంగ్లీషులో ఉన్న అన్ని దరఖాస్తు నమూనాల్ని తెలుగులోకి మార్పించా. మా కార్యాలయం నుంచి జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ విధిగా తెలుగులోనే నిర్వహించాలని ఆదేశించా. దాన్ని వందశాతం అమలు చేసేందుకు కృషి చేస్తున్నా. సాధ్యమైనంత వరకూ అన్ని అధికారిక కార్యక్రమాల్లో తెలుగుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ముఖ్యంగా న్యాయ స్థానాలతో చేసే ఉత్తరప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నా. సిబ్బంది అంతా తెలుగులోనే నిత్య వ్యవహారాలు నిర్వహించేందుకు వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకుంటున్నాను.

*29.2.2008, గీటురాయి వారపత్రిక*

**అవమానమేలరా అనుమాన మేలరా**
**పాడరా నీ తెలుగు బాల గీతములు**

**- రాయప్రోలు**

# 4. ఇలా చేస్తే బాగుంటుంది

తెలుగుభాష అమలు గురించి పత్రికలకు నేను రాయడం మొదలుపెట్టి 30 సంవత్సరాలు గడిచిపోయాయి. తెలుగు భాష అధికారికంగా కార్యాలయాల్లో అమలు కావడానికి ఎంతోమంది సూచనలు చేస్తున్నారు. అయితే ఎవరెవరు ఏమేం చేశారో ఎలా చేసి సఫలీకృతులయ్యారో తెలియజేస్తే ఇంకా బాగుంటుందని అనిపించి. భాష అమలు కోసం ఎవరెవరు ఏమేం చేశారో తెలిపితే ఔత్సాహికులకు ప్రోత్సాహకంగా ఉంటుందని భావించీ నా అనుభవాలు రాస్తున్నాను. ఏం చేస్తే బాగుంటుందో గూడా మళ్ళీ చెబుతున్నాను.

ఆనాటి అధికార భాషా సంఘం అధ్యక్షులు గజ్జెల మల్లారెడ్డిగారు నేను గుమాస్తాగా పనిచేస్తున్న ఒక కార్యాలయ తనిఖీకి వచ్చారు. పూర్తిగా తెలుగులోనే ఫైళ్ళు నిర్వహించే ఉద్యోగి ఎవరైనా ఉన్నారా అంటే అందరూ చర్చించుకొని ఆయన్ని నా దగ్గరకు తీసుకొచ్చారు. ఆయన నేను రాసిన ఫైళ్ళన్నీ చూసి తెగ సంబరపడ్డారు. ఈ కుర్రవాణ్ణి చూసి మీరంతా నేర్చుకోవాలి. తెలుగు పదాలు దొరక్కపోతే ఏ మాత్రం సంకోచించకుండా ఇంగ్లీషు పదాలనే తెలుగులో రాశాడు. ఇతని వాక్య నిర్మాణం చాలా సులువుగా సహజంగా అందరికీ అర్థమయ్యేలా ఉంది. ఇదే మేము కోరుకునేది. అంటూ నన్ను అభినందించారు. అది హైదరాబాద్‌లోని డైరెక్టరేట్ కార్యాలయం కావడంతో అక్కడ పనిచేసే ఉర్దూ సోదరులు ఆంగ్ల మేధావుల మధ్య నాకూ నా భాషకూ ఒక గుర్తింపు వచ్చింది. పూర్తిగా తెలుగులో ఫైళ్ళు నిర్వహించవచ్చు అనే సత్యం అందరికీ తెలిసింది.

**తెలుగులో జవాబులు :**

పశ్చిమ గోదావరిలో ఎమ్మార్వోగా ఉండగా 23 రిట్ పిటీషన్‌లకు పేరావారీ జవాబులు తెలుగులోనే రాసి పంపాను. కలెక్టరేట్ నుండి ఫోన్ తెలుగులో ఎందుకు పంపారనే ప్రశ్న. తెలుగులోనైతే జవాబులు తప్పుల్లేకుండా సూటిగా స్పష్టంగా ఇవ్వగలననీ. అర్థంకాకపోవడమనే సమస్యే రాదనీ వాటిని యథాతథంగా హైకోర్టుకు సమర్పించమనీ కాదు కూడదంటే ఇంగ్లీషులోకి తర్జుమా చేయించి జిల్లా కేంద్రం నుండే హైదరాబాద్‌కు పంపించండనీ వేడుకున్నాను. అధికార భాషా చట్టం పుణ్యాన వారు వాటిని హైకోర్టులో నివేదించారు. యథాతథంగానో, ఆంగ్లంలోకి మార్పించో నాకు తెలియదుగానీ అన్ని కేసులూ గెలిచాం. ఆలోచన మన అమ్మ భాషలోనే పుడుతుంది. అమ్మ భాషలో వాదిస్తే గెలుపు ఖాయం అనే సంగతి అందరికీ అర్థమయ్యింది.

**తెలుగులో దరఖాస్తులు :**

ఇంకో మండలంలో ఎమ్మార్వోగా ఉండగా ధరఖాస్తు ఫారాలు నింపడానికి నా ఆఫీసు బయట ఒక ప్రైవేటు వ్యక్తి పనిచేస్తూ ఉండేవాడు. వచ్చిన వ్యక్తుల అవసరాలనుబట్టి ఇంతింత ఈ ఫారం నింపడానికివ్వాలని వసూళ్ళు చేస్తున్నాడని ఫిర్యాదులు వచ్చాయి. ఆ ఫారాలు ఇంగ్లీషులో ఉండేవి. ఏయే పనుల కోసం ఈ ఆఫీసుకు ప్రజలు వస్తున్నారు. ఏమేమి ఫారాలు వాళ్ళు

పూరించి ఆఫీసులో ఇవ్వాలో తెలుసుకున్నాను. ఓపికగా ఆయా ఫారాలన్నీ తెలుగులోకి అనువదించాను. నాలుగైదు తరగతులు చదివిన వారెవరైనా సులువుగా పూర్తిచేయటానికి వీలుగా అన్ని రకాల ధరఖాస్తుఫారాలు తయారయ్యాయి. వాటిని ఆ ఊళ్ళోని జిరాక్సు షాపులన్నిటికీ ఇచ్చి కేవలం అర్థరూపాయికే ఏ ఫారమైనా అమ్మాలని చెప్పాము. ఎవరికివారే ఫారాలు నింపుకొని వస్తున్నారు. ప్రతిఫారమూ నాలుగైదు దశలు దాటివచ్చే పద్ధతి తీసేశాం. గ్రామ పాలనాధికారి రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ సంతకాలు చేస్తే చాలు. వాటిపైన నేను సంతకం చేసేవాడిని. ఆఫీస్‌లో గుమాస్తాల ప్రమేయం తగ్గింది. పత్రాల జారీ వేగం పెరిగింది.

**పిల్లల బాధలు :**

నేను హైస్కూల్ చదువుకు రోజూ 7 కి.మీ. బాపట్ల నడిచి వచ్చే వాడిని. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం తహసీల్ దార్ ఆఫీస్‌కు వారం రోజులపాటు తిరిగేవాడిని. ఎండకు తాళలేక బాపట్ల తహసీల్దారు ఆఫీసు ఆవరణలో చెట్టు కింద నిలబడేవాడిని. ప్రతిరోజూ డఫేదారు దగ్గర ఒకటే సమాధానం. “దొరగారు క్యాంపుకెళ్ళారు. రేపు రండి”. ఆనాడు ఆ చెట్టు కింద అనుకున్నాను “నేను గనక తాసీల్దారునైతే చిన్న పిల్లలకు చకచకా సంతకాలు చేసి పంపిస్తాను” అని. తహసీల్దారునయ్యాక మాట నిలుపుకున్నాను.

స్కూళ్ళు తెరిచే జూన్ మాసంలో సర్టిఫికెట్ల కోసం పిల్లలు బారులు తీరేవాళ్ళు. రద్దీ ఎక్కువగా ఉన్నపుడు ఆ పిల్లల చేతనే సర్టిఫికెట్లపై నంబర్లు వేయించి స్టాంపు సీలు కొట్టుకోమనేవాడిని. అరగంటలో పిల్లలంతా ఉత్సాహంగా తమ పని ముగించుకొని, సర్టిఫికెట్లతో వెళ్ళిపోయేవారు. అంతా తెలుగులోనే. తెలుగు పిల్లలు తెలుగులో ఎంతో వేగంగా పనిచేసే వాళ్ళు. నా 13 సంవత్సరాల ఎమ్మార్వో పదవీ కాలంలో తెలుగు పిల్లలు ఎక్కడా పొరపాటు చేయలేదు. మా రిజిస్టర్లన్నీ చక్కటి తెలుగులో మన తెలుగు పిల్లలే నిర్వహించారు. ఆ కాలమంతా నాకు మధురానుభూతి. మండలంలోని అన్ని హైస్కూళ్ళ ప్రధానోపాధ్యాయులకూ ఒక ప్రొఫార్మా ఇచ్చి వారి స్కూల్లోని పిల్లలందరి కులం, స్వస్థలం, పుట్టినతేదీ... మొదలైన వివరాలు నింపి ధ్రువీకరించి పంపమని కోరాను. ఆయా గ్రామ పాలనాధికారులు కూడా ఆ వివరాలను ధ్రువీకరించారు. పిల్లలెవరూ మండల కార్యాలయానికి రానక్కరలేకుండా శాశ్వత కుల, నివాస స్థల, పుట్టిన తేదీ ధ్రువపత్రాన్ని వారి ఫోటోలు అంటించి వారి వారి పాఠశాలల్లోనే పంపిణీ చేశాం.

పట్టాదారు పాసు పుస్తకాలు రైతుల ఇళ్ళకు పంపిణీ చేయించాం. వీటన్నిటిని తెలుగు రాత పనిలో మంచి చేతిరాత కలిగిన గ్రామ సేవకులు, ఉపాధ్యాయులు, గ్రామ పాలనాధికారులు, విద్యార్థుల్ని కూడా ఉపయోగించుకున్నాం. ఎలాంటి తప్పులూ దొర్లలేదు. ఏ ఊరి ప్రజల పని ఆ ఊళ్ళోనే ఆ ఊరి వాళ్ళే చేసుకున్నందువలన ఎంతో స్పష్టంగా పని జరిగింది. పల్లెటూళ్ళ అందం వాళ్ళు రాసిన తెలుగు అక్షరాలతో మరింత పెరిగింది. తల్లి భాషకు దూరమైన రోగులు పల్లెటూళ్ళకెళ్ళి ప్రాణవాయువెక్కించుకోవచ్చుననే అనిపించింది.

ప్రజలకు అవకాశం ఇస్తే వాళ్ళు మాట్లాడే భాషలోనే శక్తివంతంగా జ్ఞానయుక్తంగా

దరఖాస్తులు పెడుతున్నారు. విన్నవిస్తున్నారు. పోరాడుతున్నారు. ప్రశ్నిస్తున్నారు. ఆంగ్లం వారికి అరగటం లేదు. తెలుగు చక్కగా జీర్ణమౌతున్న అమృతాహారం. మాటలవరకైతే ఎంతో బాగుంటుంది కానీ అప్పు తెచ్చుకున్న సంస్కృతాక్షరాలు వరుసవావి లేకుండా తయారుచేసిన లిపి మన పిల్లలకు అరక్కపోవడమేగాక మళ్ళీ దాని జోలికి వెళ్లటానికి బెదిరిపోయే పరిస్థితి వచ్చింది. 18 లక్షరాలతో తమిళ లిపి తమిళులకు వరమయ్యింది. 50 అక్షరాలు వత్తులు, గుణింతాలు మనకున్నా, అవి శాస్త్రీయంగానూ క్రమపద్ధతిలోనూ పిల్లల మనస్సులపై సుళువుగా ముద్రవేసేవిగానూ లేనందువల్ల తెలుగు లిపి మనకు మనమే తెచ్చిపెట్టుకున్న చేటుగా మారింది. ఇది భాష తప్పు కాదు. దాన్ని చెడగొట్టిన మన పెద్దల తప్పు.

కర్త కర్మ క్రియలతో సంబంధం లేకుండా అసలు వాక్యం అర్థమయితే చాలునని ఇంగ్లీషు వాళ్ళు తమ భాష వాడకానికి సడలింపులిచ్చారు. మరి మనవాళ్ళో, అసలీ కర్త, కర్మ, క్రియ అనే పదాలు పల్లెటూరి తెలుగువాళ్ళు పలుకుతారా? పలకరు. చేసినవాడు, చేసినపని చేయించుకున్నవాడు... అంటారు. అలా అంటే సంస్కృత పండితులు ఊరుకోరు. శతాబ్దాల తరబడి వీళ్ళు చేసిన పెత్తనం వల్లనే మన తెలుగు వికృతం అయ్యింది. మన కూడిక సంకలనం అయ్యింది. మన తీసివేత వ్యవకలనం అయ్యింది. మన సాగు సేద్యం అయ్యింది. మన నెత్తురు రక్తంగా మారింది. మన బువ్వ అన్నం అయ్యింది. మన జనం పలికే తెలుగుపదాలు సంస్కృత పదాలుగా మార్చి, మన పూర్వీకుల నాలుకలు సంయుక్తాక్షరాలు పలికేలా సాగగొట్టిన ఘనత ఈ సంస్కృత పండితులదే. వీళ్ళ వల్లనే తెలుగుకు పురాతన భాష హోదా దక్కకుండా పోయింది. నన్నయ్యకు ముందు తెలుగు కవులెవరూ లేరనే పిడివాదం మనకు మనమే తగిలించుకున్న గుదిబండ.

ఇక ఇప్పుడు తెలుగు వాడకంలోంచి సంస్కృతం ఇంగ్లీషు, ఉర్దూ పదాలను తీసివేయలేము. అవి మన భాషలో అంతర్భాగాలైపోయాయి. అక్కరలేని ఆపరేషన్ ఎవరు చేయించుకుంటారు? చేసినా గాయాలవడం తప్ప మరే మేలూ కలుగదు. అందువలన మన భాష సంకరమైన బలమైన హైబ్రీడ్ భాషలాగా తయారైనందుకు సంతోషపడుతూ ఈ సంకర తెలుగు భాషలోనే ఆఫీసులో ఫైళ్ళు నడిపితే అదే పదివేలుగా భావించాలి. చాందసవాదులు వాళ్ళు చెయ్యరు. ఇంకొకళ్ళను చేయనివ్వరు. ఒకవేళ ఈ పనిని వాళ్ళకప్పజెబితే ఎవరికీ అర్థంగాకుండా పాడుచేస్తారు. ప్రజలు ఇంతకంటే ఇంగ్లీషే నయమని వాపోయేలా చేస్తారు. మన శాసన సభలో ఎమ్మెల్యేలు ఈ మూడు భాషల పదాల కలగలిపి మనోరంజకంగా మాట్లాడుతున్నారు. అదే నేటి తెలుగు. వాడుక తెలుగు. వారు అడిగింది అడిగినట్లుగా తెలుగు లిపితో, సాగదనుకుంటే ఆంగ్లలిపినే వాడుకోండి. మన మాట ముఖ్యం. వాళ్ళు ప్రజాప్రతినిధులు. వాళ్ళు మాట్లాడుతున్నది మన ప్రజల భాష. ఆ భాషలో యాసలో జీవోలు రావాలి. అప్పుడే తెలుగు అధికార భాషగా విరాజిల్లుతుంది.

***(22.6.2007, గీటురాయి వారపత్రిక జూలై, 2007 విపుల)***

# 5. శ్రీకృష్ణ దేవరాయలు ఇప్పుడుంటే ఏం చేస్తారు?

శక్తి చాలనివాడు సాధుత్వం వహించినట్టుగా ప్రాంతీయ భాషలన్నీ జాతీయ భాషను, అంతర్జాతీయ భాషనూ నెత్తిన మోస్తూ ఇచ్చిన కూలీ తీసుకొని బతకవలసిందే గాని, మరో మార్గంలేదు. అమృత భాషలు మృతభాషలు కాలేదా? ఎన్నో భాషామతల్లులు చనిపోయాయి. పేద జనానికి తెలుగు, ధనవంతులుకు ఇంగ్లీషు నేర్పుతూ అంతరాలను కొనసాగిస్తున్నారనే వాదం ఈ మధ్య గట్టిగా వినిపిస్తోంది. ఇంగ్లీషును దేశబాషగా మారిస్తే, ఇంగ్లీషునే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తే, అన్ని కులాల వారు విమానాలెక్కే స్థాయికి వస్తారని కొందరు అంటున్నారు. ఈ రకమైన ఆశ తప్పేమీ కాదు. కానీ ఇంగ్లీషు భాష వల్లనే దళితులు, వెనుకబడిన తరగతుల వారు, ముస్లింలు.. బాగుపడతారా? అభివృద్ధికీ, అంతర్జాతీయ సౌకర్యాలు పొందడానికి ఆంగ్లమే శరణ్యమని ప్రజలు ఎగబడడానికీ కారణాలు ఏమిటి? ఆ కారణాలను అన్వేషించి మన భాషకు కూడా ఆంగ్లమంతటి శక్తిని తెచ్చే ప్రయత్నాలు చేయకూడదా? ఆంగ్లానికున్నంత శక్తి తెలుగుకు రాదా? మన ప్రజలు తలుచుకుంటే ఇది సాధ్యంకాదా?

భాషకూ కులానికీ ముడిపెట్టడం అనవసరం. పెద్ద పెద్ద చదువులు ఇంగ్లీషులో చదివినవాళ్లే అమెరికా వెళ్ళినా కుల సంఘాలు వదలడంలేదు. కులతత్వాన్ని, మత ఛాందసాన్ని ఇంగ్లీష్ పోగొట్టదు. పైగా తెలుగువాడిని ఇంగ్లీషులో హడలగొట్టే వాళ్ళు తయారయ్యారు. తెలుగు ముస్లింలను ఉర్దూ, అరబీలతో, తెలుగు హిందువుల్ని సంస్కృతంతో బెదిరించి బానిసలుగా చేసినట్టే, తెలుగు ప్రజల్ని నేడు ఇంగ్లీషుతో పాలిస్తున్నారు. అయినా ఇంకా తెలుగు చచ్చిపోలేదు.

దేశానికి లింకు భాష కావలసిరావడమే మన భాషకు దౌర్భాగ్యం. మనదేశ భాషలన్నీ స్వయంపోషకత్వాన్ని కోల్పోయి, వాడిపోయి రాలిపోయే దశకు చేరుకుంటున్నాయి. ఇంగ్లీషు లింకు తెగితే ఆక్సిజన్ సరఫరా ఆగిపోయినట్లు దేశాలు విలవిలలాడుతున్నాయి. దేశభాషలన్నింటికీ ఇంగ్లీషు సెలైన్ బాటిల్ వలె పనిచేస్తోంది. వరల్డ్‌వైడ్ వెబ్‌లో ఈగల్లా చిక్కుకున్న అన్ని భాషల్నీ ఇంగ్లీష్ అనే సాలెపురుగు పీల్చి పిప్పి చేసింది. ఇంగ్లీష్ లేకుండా ఎవరి భాష వాళ్ళకు తెలిసే అవకాశం కూడా లేదనే పరిస్థితి దాపురించింది. ఇవన్నీ నిజాలు. మన భాషను ఇలాంటి స్థితిలో ఉద్ధరించడం సాధ్యమవుతుందా? మన భాష ద్వారా ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు రాగలరా? ఉపాధినిచ్చే భాషను ప్రజలు ఎగబడి నేర్చుకుంటారు. లక్షలాది మందికి ఉపాధిని, విజ్ఞానాన్ని అందించగల స్థాయికి మన భాషను తీసుకుపోగలమా? అలాంటి ఆశ, అంకితభావం గల వాళ్ళు ఎంతమంది ఉన్నారు? మన పొలాన్ని మరొకడికి కౌలికిచ్చి, వాడి దగ్గరే కూలీగా పనిచేస్తున్నట్టుంది మన పరిస్థితి.

1984లో వావిలాల గోపాలకృష్ణయ్య ఇలా అన్నారు."ఆనాడు మన దేశంలోనే మనం బానిసలం. 1947లో బ్రిటీష్‌వాళ్ళ నుంచి స్వేచ్ఛను పొంది మన భాష అభివృద్ధి చెందుతుం దనుకున్నాం. కానీ మన భాషాభివృద్ధికి అవసరమైన ప్రభుత్వం మనకు రాలేదు. అమెరికా పోయే నలుగురికోసం అంతా ఇంగ్లీష్ చదవాలా? అమెరికా వెళ్ళే వాడితోపాటు మా ఊళ్లో ఉన్న గుమస్తాకు, తలారి కూడా ఇంగ్లీష్ నేర్పాలట. ఎందుకో మరి? మన ప్రభుత్వం ప్రజలకు అర్థం కాకుండా పోయింది. ఇంగ్లీష్ మోజు దారులు మాకు ఇంగ్లీష్ అలవాటైపోయిందండీ అంటారు. మొదట పొరపాటు, తరువాత గ్రహపాటు. ఆ తరువాత అలవాటు. ఈ అలవాటు అనే ప్రమాదకరమైన శత్రువును నిషేధించకపోతే మనం ఇక ఈ స్థితిలో కూడా నిలవం. ప్రజాపాలన ప్రజల మాతృభాషలో ఉండాలి. తెలుగు ఇవాళ చదవకపోతే భాష మరిచిపోతాం. భాష ఎంత మాట్లాడుతుంటే అంత వస్తుంది. ఎన్ని విషయాలు మాట్లాడితే అంత పదజాలం పెరుగుతుంది. మన భాషను నిరంతరంగా వాడితేనే తాజాగా ఉంటుంది, ప్రవహిస్తుంది. ఇన్ని సంవత్సరాల తరువాత కూడా ఇంగ్లీష్ వాళ్ళే మనల్ని పరిపాలిస్తున్నట్లుగా ఉంది. కాన్వెంట్ స్కూళ్ళు అంటువ్యాధికంటే ప్రమాదకరమైనవి. తెలుగురాని పిల్లవాడికి ఇంగ్లీషు నేర్పుతున్నారు. మన భాష ఏమైపోతుంది?

పూజారి నోట్లోని సంస్కృత మంత్రంలా, ముల్లా నోట్లోని అరబీ సూరాలా ఇంగ్లీషు గొప్పశక్తి సంపాదించుకుంది. మంత్రాలొస్తేనే గదా పూజారి అయ్యేది? అలాగే ఇంగ్లీషు వస్తేనే అధికారం, ఉద్యోగం దక్కుతున్నాయి. ఇంగ్లీష్ వాడికంటే ఎక్కువ జ్ఞానం తెలుగులో సంపాదించినా వ్యర్థం. ఎందుకంటే బోలెడంత విషయ పరిజ్ఞానంతో కూడిన తెలుగుకంటే, అసలు ఏ పరిజ్ఞానం లేకపోయినా సరే. వట్టి ఇంగ్లీష్ భాష వస్తేచాలు బతుకుదెరువు దొరుకుతుందని హామీ ఇస్తున్నారు. ఆంగ్ల భాషావాదుల అవసరం అలాంటిది మరి! హిందీ, ఇంగ్లీష్ రాని తెలుగువాళ్ళు ఒంటరి వారిలా బతుకెలా గుడుస్తుందోననే భయంతో ఉన్నారు. పరాజితులు విజేతల భాష నేర్చుకోక తప్పదు. గత్యంతరం లేకే తెలుగు వాళ్ళు హిందీ, ఇంగ్లీషులకు పట్టం గట్టారు. బతుకుదెరువు కోసమే ఆ భాషల పంచన చేరారు. ఇంగ్లీషు గుంపులో చేరితేనే, 'ఇక ఫరవాలేదు బతుకుతాను' అనే నమ్మకం కలుగుతోంది. ఇంగ్లీష్ రాని శ్రీకృష్ణదేవరాయలు ఇప్పుడుంటే ఏం చేస్తారు?

పక్షులు తమ కూతను మార్చుకోకపోయినా వలసవెళ్ళిన ప్రాంతాలనుబట్టి తమ అరుపుల్లో యాసను మారుస్తాయట. అవసరం అన్వేషణకు తల్లి అంటారు. పశువులు, పక్షులే తమతమ భాషలతో ఆటలాడుకుంటుంటే మనిషి ఊరుకుంటాడా? గుంపులు కట్టి కొన్ని భాషల్ని అధికారపీఠం మీద కూర్చోపెడతాడు. కొన్ని భాషల్ని అణిగిమణిగి పడి ఉండమని ఆదేశిస్తాడు. ఒకదానిని దేవభాష అంటాడు. ఒకదానిని అధికారభాష అంటాడు. మరొకదానిని బానిస భాష, పనికిమాలిన భాష అంటాడు. ఏమైనా శక్తిచాలనివాడు సాధుత్వం వహించినట్టుగా

ప్రాంతీయ భాషలన్నీ జాతీయ భాషను, అంతర్జాతీయ భాషనూ నెత్తిన మోస్తూ ఇచ్చిన కూలీ తీసుకొని బతకవలసిందేగాని, మరో మార్గం లేదు. అమృతభాషలు మృతభాషలు కాలేదా? ఎన్నో భాషామతల్లులు చనిపోయాయి. అమ్మా తెలుగుతల్లీ, ఇక చచ్చిపో. ఎంతకాలం మంచం మీద రోగిష్టిలా ఉంటావ్! నిన్ను బాగుచేయించే ఆర్థిక స్థోమత మాకులేదు. అంత గొప్ప వైద్యమూ లేదని స్పెషలిస్టులూ తేల్చిచెప్పారు. నీవు ఇంట్లో వాళ్ళందరికీ అడ్డమైపోయావు అని నీ పిల్లలే విసుక్కుంటున్నారు. మొండి ప్రాణమే తల్లీ నీది. నీమీద మాకు ఎంత ప్రేమ ఉన్నా ఏమీ చేయలేని అశక్తులం. బానిసలం. రెక్కాడితేగాని డొక్కాడని వలసకూలీలమయ్యాం. నిన్ను పోషించనందుకు మమ్మల్ని క్షమించమ్మా!

***(12.9.2008, గీటురాయి వారపత్రిక,***
***7.10.2006 వార్త)***

**స్వాతంత్ర్య సమరాన స్వచ్ఛంద గతులీన**
**ఉగ్రనేత్రం తెరిచి ఉరికింది తెలుగు**
**– సి. నారాయణరెడ్డి**

రాయల వారు ఎలా ఉంటారో మనకు తెలియదు.
తెనాలి రామకృష్ణ సినిమాలో శ్రీకృష్ణదేవరాయలు పాత్రలో
ఎన్టీ రామారావు తెలుగంత అందంగా ఉంటాడు.
ఈ సన్నివేశం చూచి తీరాల్సిందే.

స్వామీ కావ్య రచన మీకు సంస్కృతంలో అలవాటుగా ?
మరి ఈ ఆముక్త మాల్యదను తెలుగులో వ్రాస్తున్నారే ?
**"తెలుగదేలయన్న దేశంబు తెలుగు**
**యేను తెలుగు వల్లభుండ తెలుగొకండ**
**ఎల్లనృపులు గొలువ ఎరుగవే బాసాడి**
**దేశ భాషలందు తెలుగు లెస్స"**
అని ఆంధ్ర దేవుని ఆనతి!

**మన భాషకు రాయల కాలం నాటి అలాంటి వైభవం మళ్ళీ వస్తుందా?**

# 6. ప్రజల పదాలతో నిఘంటువు చేయాలి

**('తెలుగువెలుగు' ఈటీవీ 2 ఇంటర్వ్యూ 20.5.2007)**

ఈటీవీ ప్రేక్షకులకు నమస్కారం. నూర్‌బాషా రహంతుల్లాకి తెలుగు భాష అంటే ఎనలేని అభిమానం. గత 25 సంవత్సరాలుగా తెలుగు భాష అభివృద్ధి గురించి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు.పుస్తకాలు రాశారు. ప్రస్తుతం విశాఖ జిల్లా డిప్యూటీ కలెక్టరుగా బాధ్యతలు నిర్వహిస్తూ అధికార భాషగా తెలుగు వినియోగానికి అహర్నిశలూ కృషి చేస్తున్న ఆయనే ఈ నాటి మన తెలుగు వెలుగు విశిష్ట అతిథి.

నూర్‌బాషా రహంతుల్లా స్వస్థలం గుంటూరు జిల్లా బాపట్ల మండలం కంకటపాలెం. తెలుగు మాధ్యమంలోనే ఆయన చదువుకున్నారు. 1978లో ఎల్.డి.సి. గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరింది మొదలు అనేక పదవులు పొంది నేడు డిప్యూటీ కలెక్టరు స్థాయికి ఎదిగారు. ఉద్యోగంలో ఎదగటం ఒక్కటే ఆయన లక్ష్యం కాదు. అధికార భాషగా తెలుగుకి పరిపాలనా వ్యవహారాల్లో పట్టం కట్టాలన్నదే ఆయన ప్రధాన ఆశయం. ఈ లక్ష్య సాధన కోసం ప్రత్యేక శ్రద్ధతో తెలుగుభాష గురించి అధ్యయనం చేశారు. ఈ అంశాలన్నీ ప్రోది చేసి "తెలుగు అధికారభాష కావాలంటే.." అనే శీర్షికన ఒక పుస్తకాన్ని ప్రచురించారు. తాను నిర్వహించే కార్యకలాపాలన్నింటా అధికార భాషకి పెద్దపీట వేసి ఎందరికో స్ఫూర్తినిచ్చారు. ఇలా తెలుగు భాషకి బహుముఖ సేవలందించడం ద్వారా అధికార భాషా సంఘం నుంచి విశిష్ట భాషా పురస్కారం అందుకున్నారు. ఈనాటి మన కార్యక్రమంలో రహంతుల్లాని అడిగి ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు భాష ఎదుర్కొంటున్న సవాళ్ళను గురించి, అధికార భాషగా తెలుగు అమలుకి చేపడుతున్న చర్యల గురించి తెలుసుకుందాం.

మృణాళిని : నమస్కారమండీ రహంతుల్లాగారు..

రహంతుల్లా : నమస్కారమండీ.

మృణాళిని : అధికార భాషగా తెలుగును అమలు చేయడంలో మనం ఎందుకు విఫలమయ్యాం?

రహంతుల్లా : రానురాను తెలుగు భాషను అమలు చేసే విషయంలో, తెలుగును నేర్పే విషయంలో ప్రభుత్వ ఆదరణ తగ్గిపోతుంది. ఎప్పుడైతే రాజపోషణ, ప్రభుత్వ ఆదరణ దొరుకుతూ ఉంటుందో అప్పుడు మన భాషకి ఆదరణ కూడా పెరుగుతుంది. శ్రీకృష్ణదేవరాయలు రాజ్యం చేశాడు. ఆయనే స్వయంగా తెలుగు అభిమాని, తెలుగులో మంచిగా రాసినటువంటి వ్యక్తి కాబట్టి పరిపాలనంతా తెలుగులో బాగా జరిగింది. మనమే ఆయన కాలం స్వర్ణయుగం అని అనుకుంటున్నాం. ఎందుకనుకుంటున్నామంటే రాజపోషణ ఉంది. రాజపోషణ గనుక ఉంటే క్రింద

ఉద్యోగులంతా కూడా ఖచ్చితంగా తెలుగుని అమలు చేస్తారు.

మృణాళిని : అధికార భాషగా తెలుగును అమలు చేయాలంటే ప్రభుత్వ కార్యాలయాల్లో విధిగా తెలుగు వాడాలి. అయితే దానికి పై అధికారులే అడ్డుపడుతున్నారు అనే ఒక వాదన ఉంది.

రహంతుల్లా : పై అధికారులేంటంటే వాళ్ళు ఇంగ్లీషులోనే చదువుతారు. ఇంగ్లీష్‌నే అమలు చేయమని ఒత్తిడి చేస్తారు. కారణం మీరు తెలుగులో రాస్తే పై అధికారికి అర్థం కాదు అనుకోండి అతను ఏం చేస్తాడు? ఈ ఫైల్‌ని మళ్ళీ ఇంగ్లీషులోకి తర్జుమా చేసి చెప్పమంటారు. లేకపోతే ఇంగ్లీష్‌లోకి మార్చి మళ్ళీ పంపించమంటారు. అప్పుడు రెండు పనులవుతాయి. అలా కాకుండా మన తెలుగు అధికారులే మన తెలుగు ప్రాంతం మీద పై స్థాయి అధికారులై ఉన్నారనుకోండి పరిస్థితి తేడాగా ఉంటుంది. వాళ్ళు తెలుగుని ఆదరిస్తారు.

మృణాళిని : అయితే అన్ని రాష్ట్రాల్లోనూ ఈ సమస్య ఉంది కదా మిగతా రాష్ట్రాల్లో అధికార భాషగా ఆయా భాషలు కొనసాగుతున్నాయి కదా?

రహంతుల్లా : ఇప్పుడు, కన్నడం తీసుకోండి, తమిళం తీసుకోండి ఈ ప్రాంతాల్లో కూడా వేరే భాషస్థులు వచ్చి అక్కడ ఐఎఎస్ ఆఫీసర్లుగా, ఉన్నతస్థాయి అధికారులుగా పనిచేస్తున్నటువంటి సందర్భాలున్నాయి. అయినప్పటికీ అక్కడ ప్రజల కోరిక చాలా బలంగా ఉంటుంది. తమిళనాడులో 'లాంగ్‌లివ్ క్లాసికల్ డివైన్ తమిళ్' అని ఒక పెద్ద బోర్డు ఉంటుంది. వాళ్ళు తమిళాన్ని క్లాసికల్‌గానే కాకుండా డివైన్ తమిళ్ అంటున్నారు. అంటే భక్తి కూడా ఉంది ఆ భాష మీద. ఆ భాషను అంతగా గౌరవిస్తున్నారు. అటువంటి చిత్తశుద్ధి ఎక్కడైతే ఉంటుందో, ఏ భాషస్థులకైతే ఉంటుందో అప్పుడు అధికారులు కూడా గత్యంతరం లేని పరిస్థితుల్లోకి వస్తారు. మరి మన రాష్ట్రంలో కూడా అలాంటి పరిస్థితి ఉంటే పరాయి భాషకు సంబంధించిన ఐఎఎస్ ఆఫీసర్ వచ్చినా సరే మన భాషలో పని చెయ్యక తప్పదు.

మృణాళిని : మీరు తెలుగుభాషని అధికార బాషగా అమలు చెయ్యాలి అని అనుకోవడంలో ఎదుర్కొంటున్న సమస్యలేంటి?

రహంతుల్లా : మాకేమీ సమస్యలు ఎదురు కావడం లేదు. చక్కగా అమలు చేస్తున్నాను. మాకు సాఫ్ట్‌వేర్ ప్రాబ్లం ఉన్నా, లేకపోతే రకరకాల సమస్యలు, చిన్నచిన్నవి వచ్చినా పదకోశాలు తెప్పించుకొని మరీ వాటిని చూసి దానికి సరైన పదం మన తెలుగులో ఉంటే వాడుతున్నాం. లేకపోతే ఇంగ్లీషు పదాన్నే వాడుతున్నాం. భూసేకరణకి

అవార్డులున్నాయి. ఆ అవార్డులిచ్చే పద్ధతంతా కూడా బ్రిటిష్‌వాళ్ళు పెట్టినటువంటి పద్ధతుల్లో ఇంగ్లీషులోనే కొనాసగేవి. అటువంటి అవార్డుల్ని కూడా మేము తెలుగులో మార్చుకున్నాము. మనకి ఆసక్తి ఉంటే చట్టాన్ని తెలుగులోకి మార్చుకొని మన భాషల్లోనే ఆ నమూనా ఫారాలను రాసుకొని చక్కగా చెయ్యొచ్చు.

మృణాళిని : మీరు తెలుగు సమానార్థకాలు వాడాలి. ఈ ఇంగ్లీషు పదాలకి అవి చెప్తున్నప్పుడు చాలా జటిలంగా ఉండే పదాలని కనిపెట్టాలనుకుంటున్నారా లేక కొన్ని యదాతథంగా వాడేసుకుందామనుకుంటున్నారా?

రహంతుల్లా : ఇప్పుడు పేపరు, పెన్ను, పెన్సిల్, రబ్బరు, రోడ్డు, కారు, బస్సు ఇలాంటి పదాలు ఎన్నో ఉన్నాయి. బ్రిటీష్ వాళ్ళు మనల్ని పరిపాలించినందువల్ల ఇంగ్లీషు పదాలు, అలాగే నిజాం రాజులు, ముస్లిం రాజులు పరిపాలించినందువల్ల ఉర్దూ పదాలు మన భాషలో అంతర్భాగమై పోయాయి. వాటిని వాడితేనే అర్థమవుతుంది. వాటికి సమానార్థక పదాలు సృష్టించుకొని శ్రమపడేదానికంటే వాటిని మన నిఘంటువుల్లోకి తీసేసుకుని ఇవీ మన పదాలే అన్నట్లు స్వతంత్రించుకోవాలి. ఎప్పుడూ ఇవి నావి కాదు అనే అంటరాని తనాన్ని పాటిస్తూ ఉంటే మన భాష బలహీనపడి పోతుంది.

మృణాళిని : అయితే మరి దాన్నే ఇంకొంచెం విస్తరించి ఎక్కువ పదాల్ని మనం వాడుతున్నాం కదా తెలుగుకు అన్యాయం చేస్తూ ఈ పరిమితి ఎక్కడ విధించుకోవాలి?

రహంతుల్లా : ఉన్న పదాన్ని కూడా పక్కన పెట్టేసి ఇంగ్లీష్ పదాన్నే వాడుతున్నామనుకోండి అది అన్యాయం అనండి. అసలు పదం లేదు, కొత్తగా వచ్చింది మీరు ఉదాహరణగా తీసుకోండి అమానత్ రిజిస్టర్ అని ఉంటుంది. బ్రిటీష్‌వాళ్ళు కూడా దానికి ఏ పదం తోయక అమానత్ రిజిస్టర్ అనే పెట్టారు. ఇది ఇంగ్లీషు పదం కాదు కదా. జమాబందీ ఉంది రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో శిస్తు ఉంది, రసీదు ఉంది, అసలు ఉంది, నకిలీ ఉంది. ఇవన్నీ ఉర్దూ పదాలే మరి బ్రిటీష్‌వాళ్ళు కూడా దాన్నే వాడుకున్నారు. ఇవి మనవి అన్నట్లు అయిపోయాయో వాటిని వదులుకోవడం మంచిదికాదు.

మృణాళిని : మీరు సాఫ్ట్‌వేర్ సమస్య అన్నారు. అది ఏరకంగా మీ పనులను ఆటంకపరుస్తోంది?

రహంతుల్లా : సాఫ్ట్‌వేర్స్‌లో కొన్ని అలవాటు కాక, అవి అసలు ఇన్‌స్టాలేషన్ దశలోనే ఇన్‌స్టాల్ కాక, ఒకవేళ ఇన్‌స్టాల్ అయినా ఈ ఒత్తులు, గుణింతాలు వీటిల్లో సరిగ్గా దాన్ని కొట్టలేక అటువంటి సమస్యలు, చిన్న చిన్న సమస్యలే వాటిని తెలిసినవాళ్ళని రప్పించుకొని మరీ చేయడం జరుగుతోంది. కొన్నిసార్లు మేము ఈ పేపర్ల

ఆఫీసులకు కూడా వెళ్ళి, వాళ్ళు ఏ సాఫ్ట్‌వేర్ అయితే వాడుతున్నారో అందులో బాగా సులభంగా ఉండేవాటిని తెచ్చుకొని మరీ వాడుతున్నాం.

మృణాళిని : మీకింది స్థాయి ఉద్యోగుల సహకారం మీకు లభిస్తోందా?

రహంతుల్లా : కిందిస్థాయి ఉద్యోగుల తోటి మనకెప్పుడూ సమస్య ఉండదు. అధికారికి ఫస్టు చిత్తశుద్ధి ఉండాలి. ఇది చెయ్యాలి అనే పట్టుదల ఉండాలి. మొట్టమొదట్లో వాళ్ళు కాస్త సణుక్కుంటారు. ఇదేంటీ దీనికి తగిన పదాల్లేవు. లేకపోతే కంప్యూటర్ మీద కూడా విసుక్కుంటారు. అయితే వాళ్ళకి ఓర్పుతో చెప్పాలి. వారికి జవాబు కూడా మనం తెలుగులోనే ఇద్దామని. చాలా సంతోషంగా వాళ్ళు ఒప్పుకుంటారు. తెలుగు రాయడంగాని, తెలుగులోనే ఫైళ్ళను నిర్వహించడం గానీ వాళ్ళకి ఇష్టమేనండి.

మృణాళిని : వీళ్ళకి శిక్షణ అనేది నిర్ధిష్టంగా ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది కదా?

రహంతుల్లా : సొంత భాష తెలుగు అయినప్పుడు దాంట్లో రాయమంటే చాలా స్వేచ్ఛగా రాస్తారు. తప్పులు లేకుండా రాస్తారు. చెప్పదలుచుకున్న భావాన్ని చాలా సూటిగా చెప్తారు. శక్తివంతంగా చెప్తారు. చిక్కల్లా ఎక్కడొస్తుందంటే ఇప్పుడు ఈ కంప్యూటర్ల వ్యవస్థలోకి పాత ఉద్యోగస్థులు మారాల్సిన అవసరం ఉంది. వాళ్ళు మారాలంటే వాళ్ళకి శిక్షణ ఇవ్వాలి. ఇచ్చారు కూడా. ప్రతి ఉద్యోగస్థుడికి కూడా ఆయా మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఇప్పుడు కొత్తగా ఒక సాఫ్ట్‌వేర్ అధికార భాషా సంఘం వాళ్ళు మండల స్థాయికి కూడా అందరికీ సరఫరా చేశారు. దానిలో ఎంత స్వేచ్ఛగా మన భాషని వాడొచ్చో చూసుకుని అది బాగుంటే సక్సెస్ అవుతుంది.

మృణాళిని : ఇప్పటి ఆధునిక అవసరాలకు తగినట్టుగా తెలుగు లిపిని మార్చాల్సిన అవసరం ఏమైనా ఉందా?

రహంతుల్లా : “తెనుగు మెరుగులు” అని 1945లో వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఒక పుస్తకం రాశారు. ఈ సంస్కర్తలెవరన్నా ఉంటే వాళ్ళందరూ ఆ పుస్తకం చదవడం మంచిది. దాంట్లో ఆయన రెండు రకాల లిపులను తానే స్వయంగా తయారుచేసి అమలు చేయండి అన్నారు. అప్పుడు భోగరాజు పట్టాభిసీతారామయ్య గారు ఆ లిపి నేర్చుకొని ఆ లిపితోటే ఆయనకు జవాబు ఇచ్చారు. ఆ ఉత్తరం కూడా ఆ పుస్తకంలోనే ప్రచురించారు. అందులో ఆయన చేసింది ఏమీలేదు. అ,ఆ,ఇ,ఈ.... 16 అచ్చులు ఉన్నాయి. ఈ శబ్దాలు నేర్పడానికి 16 అచ్చులు అక్కర్లేదు. ఆ ఒక్కటే సరిపోతుంది. ‘అ’కు దీర్ఘం ఇస్తే ‘ఆ’, ‘అ’కు గుడి ఇస్తే ‘ఇ’. ‘అ’ కు

కొమ్మిస్తే 'ఉ' అట్లా ఒకే అక్షరం.

అ, ఆ లకు ఇ, ఈ లకు పోలికేమన్నా ఉందా? ఆ ఒకరకంగా ఉంటుంది. ఈ ఒక రకంగా ఉంటుంది. అసలు వావి వరుస లేకుండా ఉన్నాయి. పొందిక లేకుండా ఉన్నాయి ఈ అక్షరాలు. పసి పిల్లల మెదడు మీద ఇంత భారం మోపితే వాడికి విసుగొచ్చి ఈ అక్షరాలు నేర్చుకోవడం కష్టమని చెప్పి ఈ భాష నేర్చుకోడు. మన పిల్లల చదువులు ఇట్లా వెనుకబడిపోవడానికి ఈ అక్షరమాల, ఈ లిపి ఒక కారణం అని ఆయన కనుక్కొని పసిపిల్లల బాధను కూడా అతను అర్థం చేసుకొని తను చాలా కష్టపడి ఒక లిపిని తయారు చేశాడు. దాన్ని వీళ్ళు గుర్తించి ఆ సులభ లిపిని గనుక అమలు చేస్తున్నట్లయితే ఎంతో బావుండేది.

మృణాళిని : మీకు భవిష్యత్తు ప్రణాళికలేమైనా ఉన్నాయా? ఈ భాషకి సంబంధించి.

రహంతుల్లా : మహానిఘంటువు నిర్మాణం జరగాలని ఒక ఆకాంక్ష ఉంది నాకు. అది ఎందుకొంస్తుందంటే మన తెలుగు పదాలు చాలా పదాలు నిఘంటువులోకి ఎక్కలేదు. ముఖ్యంగా ఈ పల్లెటూళ్ళలో చాలా చిన్న చిన్న కులాల్లోనూ, వృత్తుల్లోనూ మాట్లాడే వాళ్ళ పదాలు కొన్ని విస్మరించబడ్డాయి. సగానికి సగం సంస్కృత పదాలున్నాయి. ఒక 20 శాతం ఉర్దూ పదాలున్నాయి. నేను కొన్ని పదాలు చదువుతాను అవి ఉన్నాయేమో మీరు చెప్పండి.

కొల్లేరు ప్రక్షాళన కార్యక్రమం ఎలా జరుగుతుందో చూద్దామని వెళ్ళిన విలేకరులకు అక్కడి ప్రజలు ఎన్ని రకాల చేపలు, పక్షుల పేర్లు చెప్పారో చూడండి :- మట్టగిడిస, కొర్రమేను, బొమ్మిడాయి, శీలావతి, గొరక, ఇంగిలాయి, జల్ల, బొచ్చ, జడ్డువాయి, చేదుపరిగె, వాలుగ, పండుకప్ప, గండి బొడిగి, కొయ్యంగ, మునగపాము, గుడగ్గాయి, చామరాయి, పొట్టిదిలాసు, కట్టినెరసు, బుడపార, చాకిరొయ్య, గడ్డికొయ్య, మాలతప్పడాలు, ఏటిజల్ల, మార్పులు, పల్లెంకాయ, పాలజల్ల, పారాటాయి. మనవాడు, మన కొల్లేరులో ఉన్న వ్యక్తి అనునిత్యం చేపలు పట్టుకుంటూ ఈ చేప ఇది, ఈ చేప ఇది అని దాని నిర్మాణాల్ని బట్టి దానికి పేరు పెట్టుకున్నాడు. ఇది తెలుగు పేరు కాదా? ఇది మన నిఘంటువులోకి రావద్దా? పక్షులు చూడండి పరజ, ఆసాబాతు, కళాయి, చేతేనబాతు, నల్లముక్కలు, సముద్రపు చిలక, నత్తకొట్టుడు ఇలా చాలా ఉన్నాయి. ఈ భాషా పదాలు వాడుతున్నప్పుడు వాటిని నిఘంటువులోకి తేవాల్సిన బాధ్యత ఎవరిదండి? అందుకని, ఆ జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. పల్లెటూళ్ళ ప్రజల్లో ఏమీ తప్పులేదు. వాళ్ళు దాన్ని నిలుపుకుంటున్నారు. కావాల్సిందల్లా దానికి ప్రోత్సాహం, ఎక్కువ

నిధులు రావాలి. ఈ భాష మీద పరిశోధన పెరగాలి. పునాది పుస్తకాలు అంటారు చూడండి అవి పెరగాలి.

మృణాళిని : రహంతుల్లా గారు అధికార భాషగా తెలుగుని అమలు చెయ్యాలంటే పై అధికారుల్లో మరింత చొరవ, చిత్తశుద్ధి అవసరం అని అన్నారు. అలాగే తెలుగు భాష మరింత సుసంపన్నం కావాలంటే మామూలు ప్రజల భాషల్లోంచి పదాలను తీసుకొని ఒక మహానిఘంటువును తయారు చెయ్యాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

తన అభిప్రాయాలను, సూచనలను మనతో పంచుకున్నందుకు ఈటీవి ప్రేక్షకుల తరపున రహంతుల్లా గారికి ధన్యవాదాలు. నమస్కారమండీ...

రహంతుల్లా : నమస్కారం.

***(20.6.2008, గీటురాయి వారపత్రిక)***

**తెలుగుజాతి వెలుగు జ్యోతి**
**తెలుగు జాతి గూటిలో తెగులొకటి ఉద్భవించింది**
**నవ్వుల పాలయ్యింది తెలుగుజాతి నమ్మలేనంతగా నేడు**
**- పోతుకూచి సాంబశివరావు**

# 7. భాషల లెక్కలు తేల్చడానికి ఏడేళ్ళా?

2001 జనాభా లెక్కలు పూర్తయినప్పటి నుండి ఏ భాష మాట్లాడేవాళ్ళు ఎంతమంది ఉన్నారో కనుక్కుందామని భాషల లెక్కలకోసం విశ్వప్రయత్నం చేశాను. శ్రామికులు, వికలాంగులు, మతస్థులు, బాలలు... ఇలా అన్నీ అందుబాటులోకి తెచ్చారు గానీ భాషల సమాచారం విడుదల చేయలేదు. 2008లో అంటే ఏడేళ్ళ తరువాత మాత్రమే భాషల జనాభా విడుదల చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, కంప్యూటర్ల వాడకం బాగా పెరిగిన తరువాత కూడా జనాభా లెక్కల విడుదలలో జాప్యం తగ్గలేదు.

1991 జనాభా లెక్కల ప్రకారం 18 షెడ్యూల్డ్ భాషలు. సంస్కృతం కంటే ఎక్కువ ప్రజలు మాట్లాడే 45. షెడ్యూలేతర భాషల వివరాలు 26.9.2003 నాటి గీటురాయిలో ఇచ్చాను. ఇప్పుడు 2001 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ భాషలు 22కు పెరిగాయి.

సంస్కృత భాషస్తుల సంఖ్య 14, 135కు పడిపోయింది. సంస్కృత భాషస్తుల కంటే ఎక్కువగా మాట్లాడే షెడ్యూలేతర భాషల సంఖ్య 96కు పెరిగింది. ఆ వివరాలు క్రింది 3 పట్టికల్లో ఇస్తున్నాను చూడండి.

1. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తెలుగు జనాభా
2. 1971 నుండి 2001 వరకు షెడ్యూల్డ్ భాషల జనాభా
3. 100 షెడ్యూలేతర భాషల జనాభా

2001 జనాభా లెక్కల ప్రకారం తెలుగు ప్రజలు భారతదేశంలో ఎక్కడెక్కడ ఎంత మంది ఉన్నారో చూడండి.

| సం. | రాష్ట్రం | తెలుగుజనం | | | |
|---|---|---|---|---|---|
| 1. | లక్షద్వీప్ | 28 | 11. | చండీఘర్ | 1,380 |
| 2. | మిజోరాం | 228 | 12. | అరుణాచల్‌ప్రదేశ్ | 1,573 |
| 3. | డామన్ & డయ్యూ | 298 | 13. | ఉత్తరాంచల్ | 1,882 |
| 4. | సిక్కిం | 340 | 14. | త్రిపుర | 3,812 |
| 5. | మేఘాలయ | 560 | 15. | హర్యానా | 6,248 |
| 6. | దాద్ర, నాగర్‌హవేలీ | 607 | 16. | పంజాబ్ | 7,296 |
| 7. | మణిపూర్ | 699 | 17. | జమ్ము& కాశ్మీర్ | 7,509 |
| 8. | హిమాచల్‌ప్రదేశ్ | 1,176 | 18. | ఉత్తరప్రదేశ్ | 7,645 |
| 9. | నాగాలాండ్ | 1,286 | 19. | రాజస్థాన్ | 8,467 |
| 10. | బీహార్ | 1,378 | 20. | గోవా | 11,926 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 21. | మధ్యప్రదేశ్ | 26,602 | 29. | చత్తీస్‌ఘడ్ | 1,48,131 |
| 22. | అస్సాం | 27,463 | 30. | పశ్చిమబెంగాల్ | 2,08,769 |
| 23. | ఢిల్లీ | 28,067 | 31. | ఒరిస్సా | 7,12,614 |
| 24. | జార్ఖండ్ | 35,957 | 32. | మహారాష్ట్ర | 14,05,958 |
| 25. | అండమాన్ నికోబార్ | 45,631 | 33. | తమిళనాడు | 35,27,594 |
| 26. | కేరళ | 48,633 | 34. | కర్నాటక | 36,39,657 |
| 27. | పాండిచ్చేరి | 50,908 | 35. | ఆంధ్రప్రదేశ్ | 6,39,04,791 |
| 28. | గుజరాత్ | 68,743 | | ఇండియా మొత్తం | 7,40,02,856 |

జనాభా లెక్కల ప్రకారం సంస్కృతం మాట్లాడేవాళ్ళు 14, 135 మంది మాత్రమే. అయితే అంతకంటే ఎక్కువగా మాట్లాడే భాషల జనాభా ఎంతెంత ఉందో చూడండి. ఇవన్నీ షెడ్యూల్డ్ భాషలు కావు.

| క్ర.సం | భాష | జనాభా | | | |
|---|---|---|---|---|---|
| 1. | భిలి / భిలోడి | 95,82,957 | 19. | ఆవో | 2,61,387 |
| 2. | గోండి | 27,13,790 | 20. | సవర | 2,52,519 |
| 3. | ఖందేషి | 20,75,258 | 21. | కొన్యాక్ | 2,48,109 |
| 4. | కురుక్ / ఒరాన్ | 17,51,489 | 22. | ఖారియా | 2,39,608 |
| 5. | తులు | 17,22,768 | 23. | ఇంగ్లీష్ | 2,26,449 |
| 6. | కాశి | 11,28,575 | 24. | మాల్టో | 2,24,926 |
| 7. | ముందారి | 10,61,352 | 25. | నిస్సి / డాప్లా | 2,11,485 |
| 8. | హెూ | 10,42,724 | 26. | అడి | 1,98,462 |
| 9. | కుయ్ | 9,16,222 | 27. | థాడో | 1,90,595 |
| 10. | గరో | 8,89,479 | 28. | లోతా | 1,70,001 |
| 11. | త్రిపురి | 8,54,023 | 29. | కూర్గి / కొడగు | 1,66,187 |
| 12. | లుషాయి/మిజో | 6,74,756 | 30. | రాభా | 1,64,770 |
| 13. | హలబి | 5,93,443 | 31. | తంగ్‌ఖుల్ | 1,42,035 |
| 14. | కొర్కూ | 5,74,481 | 32. | కిసాన్ | 1,41,088 |
| 15. | మిరి / మిషింగ్ | 5,51,224 | 33. | అంగమి | 1,32,225 |
| 16. | ముందా | 4,69,357 | 34. | ఫోం | 1,22,508 |
| 17. | కర్బి / మికిర్ | 4,19, 534 | 35. | కొలామి | 1,21,855 |
| 18. | కోయా | 3,62,070 | 36. | ఖోండ్ / కోంద్ | 1,18,597 |

| | | | | | |
|---|---|---|---|---|---|
| 37. | డిమాసా | 1,11,961 | 67. | హలాం | 38,275 |
| 38. | లడఖీ | 1,04,618 | 68. | కీయాంనుంగన్ | 37,755 |
| 39. | సీమా | 1,03,529 | 69. | మారాం | 37,340 |
| 40. | కబూయి | 94,758 | 70. | లింబు | 37,265 |
| 41. | లాండా | 92,234 | 71. | లఖీర్ | 34,751 |
| 42. | యించంగ్రీ | 92,144 | 72. | కోర్వా | 34,586 |
| 43. | టిబెటన్ | 85,278 | 73. | షినా | 34,390 |
| 44. | సాంగ్తాం | 84,273 | 74. | లియాంగ్మి | 34,232 |
| 45. | చక్రూ / చోక్రి | 83,560 | 75. | జెమి | 34,110 |
| 46. | హమర్ | 83,404 | 76. | మిష్మి | 33,955 |
| 47. | భోటియా | 81,012 | 77. | నాక్టీ | 32,957 |
| 48. | బిష్ణుపూరియా | 77,545 | 78. | కోచ్ | 31,119 |
| 49. | కిన్నారి | 65,097 | 79. | మోఘ్ | 30,639 |
| 50. | పైటీ | 64,100 | 80. | నికోబారిసీ | 28,784 |
| 51. | చాంగ్ | 62,408 | 81. | డియోరి | 27,960 |
| 52. | జెలియాంగ్ | 61,547 | 82. | లాలుంగ్ | 27,072 |
| 53. | రెంగ్మా | 61,345 | 83. | గడబా | 26,262 |
| 54. | కొండా | 56,262 | 84. | పావి | 24,965 |
| 55. | మోన్పా | 55,876 | 85. | జూంగ్ | 23,708 |
| 56. | కుకి | 52,873 | 86. | అనల్ | 23,191 |
| 57. | అరబిక్ / అర్బి | 51,728 | 87. | లహోలి | 22,646 |
| 58. | పార్జీ | 51,216 | 88. | మారింగ్ | 22,326 |
| 59. | లెప్కా | 50,629 | 89. | జో | 20,857 |
| 60. | వాన్కో | 49,072 | 90. | బాల్టి | 20,053 |
| 61. | భూమిజ్ | 47,443 | 91. | షెర్పా | 18,342 |
| 62. | కోడా / కోరా | 43,030 | 92. | తమాంగ్ | 17,494 |
| 63. | ఖీజా | 40,678 | 93. | పోఖురీ | 16,744 |
| 64. | తంగ్సా | 40,086 | 94. | కోం | 14,673 |
| 65. | వైఫెరి | 39,673 | 95. | గ్యాంగ్టీ | 14,500 |
| 66. | జటాపు | 39,331 | 96. | రాయ్ | 14,378 |

పది లక్షల కంటే ఎక్కువ మంది మాట్లాడే 'బిలి' నుండి 'హెూ' వరకు ఉన్న మొదటి 8 భాషల్ని షెడ్యూల్డ్ భాషల జాబితాలో చేర్చవచ్చు.

సంస్కృతం కంటే తక్కువమంది మాట్లాడే భాషలు 4 మాత్రమే.

1. పెరిసన్ 11,688
2. చాకేసాంగ్ 11,415
3. ఆఫ్గని / కాబూలి / పాస్టో 11,086
4. సమ్‌టి 10,225

1971 నుండి 2001 వరకు షెడ్యూల్డ్ భాషల జనాభా

| మాతృభాష | జనాభా | | | | శాతం | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1971 | 1981 | 1991 | 2001 | 1971 | 1981 | 1991 | 2001 |
| 1. హిందీ | 20,27,67,971 | 25,77,49,009 | 32,95,18,087 | 42,20,48,642 | 36.99 | 38.74 | 39.29 | 41.03 |
| 2. బెంగాలీ | 4,47,92,312 | 5,12,98,319 | 6,95,95,738 | 8,33,69,769 | 8.17 | 7.71 | 8.30 | 8.11 |
| 3. తెలుగు | 4,47,56,923 | 5,06,24,611 | 6,60,17,615 | 7,40,02,856 | 8.16 | 7.61 | 7.87 | 7.19 |
| 4. మరాఠీ | 4,17,65,190 | 4,94,52,922 | 6,24,81,681 | 7,19,36,894 | 7.62 | 7.43 | 7.45 | 6.99 |
| 5. తమిళం | 3,76,90,106 | ---- | 5,30,06,368 | 6,07,93,814 | 6.88 | --- | 6.32 | 5.91 |
| 6. ఉర్దూ | 2,86,20,895 | 3,49,41,435 | 4,34,06,932 | 5,15,36,111 | 5.22 | 5.25 | 5.18 | 5.01 |
| 7. గుజరాతి | 2,58,65,012 | 3,30,63,267 | 4,06,73,814 | 4,60,91,617 | 4.72 | 4.97 | 4.85 | 4.48 |
| 8. కన్నడం | 2,17,10,649 | 2,56,97,146 | 3,27,53,676 | 3,79,24,011 | 3.96 | 3.86 | 3.62 | 3.21 |
| 9. మళయాళం | 2,19,38,760 | 2,57,00,705 | 3,03,77,176 | 3,30,66,392 | 4.00 | 3.86 | 3.91 | 3.69 |
| 10. ఒరియా | 1,98,63,198 | 2,57,00,705 | 3,03,77,176 | 3,30,17,446 | 3.62 | 3.46 | 3.35 | 3.21 |
| 11. పంజాబి | 1,41,08,443 | 1,96,11,199 | 2,33,78,744 | 2,91,02,477 | 2.57 | 2.95 | 2.79 | 2.83 |
| 12. అస్సామీ | 89,59,558 | ... | 1,30,79,696 | 1,31,68,484 | 1.63 | .... | 1.56 | 1.28 |
| 13. మైథిలి | 61,30,026 | 75,22,265 | 77,66,921 | 1,21,79,122 | 1.12 | 1.13 | 0.93 | 1.18 |
| 14. సంతాలీ | 37,86,899 | 43,32,511 | 52,16,325 | 64,69,600 | 0.69 | 0.65 | 0.62 | 0.63 |
| 15. కాశ్మీరీ | 24,95,487 | 31,76,975 | .... | 55,27,698 | 0.46 | 0.48 | ... | 0.54 |
| 16. నేపాలీ | 14,19,835 | 13,60,636 | 20,76,645 | 28,71,749 | 0.26 | 0.20 | 0.25 | 0.28 |
| 17. సింధీ | 16,76,875 | 20,44,389 | 21,22,848 | 25,35,485 | 0.31 | 0.31 | 0.25 | 0.25 |
| 18. కొంకణీ | 15,08,432 | 15,70,108 | 17,60,607 | 24,89,015 | 0.28 | 0.24 | 0.21 | 0.24 |
| 19. డోగ్రీ | 12,99,143 | 15,30,616 | .... | 22,82,589 | 0.24 | 0.23 | ... | 0.24 |
| 20. మణిపురి | 7,91,714 | 9,01,407 | 12,70,216 | 14,66,705 | 0.14 | 0.14 | 0.15 | 0.14 |
| 21. బోడో | 5,56,576 | ... | 12,21,881 | 13,50,478 | 0.10 | ... | 0.15 | 0.13 |

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 22. సంస్కృతం | 2,212 | 6,106 | 49,736 | 14,135 | ... | ... | 0.01 | ... |
| షెడ్యూలు భాషల | | | | | | | | |
| మొత్తం జనాభా | 54,81,59,652 | 66,52,87,849 | 83,85,83,988 | 1,02,06,10,328 | 97.14 | 89.23 | 97.05 | 96.56 |
| మిగతా నాన్‌షెడ్యూల్డ్ భాషల | | | | | | | | |
| మొత్తం జనాభా | 1,61,38,940 | 1,98,96,843 | 77,18,700 | 10,92,55,826 | 2.86 | 10.77 | 2.95 | 3.44 |
| భారతదేశం | | | | | | | | |
| మొత్తం జనాభా | 56,42,98,592 | 68,51,84,692 | 84,63,02,688 | 1,12,98,66,154 | 100.00 | 100.00 | 100.00 | 100.00 |

హిందీ, ఇంగ్లీషు, పంజాబీ, మైధిలీ, కాశ్మీరీ, నేపాలీ, బోడో భాషల శాతం పెరిగితే, మిగతా భాషల శాతం తగ్గింది.

***(6.6.2008, గీటురాయి వారపత్రిక)***

**చెక్కు చెదరని యేనాడు మొక్కవోని**
**ఆంధ్ర పౌరుషమిప్పుడుఅద్వాన్నమాయే**
**మరలనొకమాటు వెనుకకు మరలి చూచి**
**దిద్దుకోవమ్మ బిడ్డల తెలుగు తల్లీ — కరుణశ్రీ**

# 8. మాతృభాషలో జరిగే పాలనలో దళారులుండరు

(ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ఇంటర్వ్యూ 21.2.2007)

నాగసూరి వేణుగోపాల్ : ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21వ తేదీ "ప్రపంచ మాతృభాషా దినోత్సవం"గా జరుపుకుంటున్నాం. అది అందరికీ తెలిసిందే. మాతృభాషకు సంబంధించి చాలా రకాల విషయాలు గుర్తు చేసుకోవడం, మనం చేయాల్సిన పనులేంటి, ఇలా నిర్లిప్తంగా ఉంటే జరగబోయే ప్రమాదం ఏంటి? మొదలైన అంశాల గురించి చర్చించుకోవడం పరిపాటి. మరి ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఈ రోజు మా ఆకాశవాణి కేంద్రానికి నూర్‌భాషా రహంతుల్లా గారు వచ్చారు. వీరు ఎన్.టి.పీ.సీ భూసేకరణకు సంబంధించిన డిప్యూటీ కలెక్టరు. వీరు తెలుగును అధికార భాషగా చక్కగా వర్తింపచేసి మన్ననలు పొందడమే కాకుండా తెలుగు అధికార భాషా సంఘం నుంచి పురస్కారాన్ని గత సంవత్సరం అంటే 2006 ఫిబ్రవరి 21న అందుకున్నారు.

నాగసూరి : రహంతుల్లా గారు నమస్కారమండీ...

రహంతుల్లా : నమస్కారం

నాగసూరి : తెలుగు అధికార భాషగా అంటే పాలనా భాషగా ఉన్నప్పుడు క్లుప్తత ఉంటుంది. స్పష్టత ఉంటుంది. అమలు విషయంలో కావాలసినంత రీతిలో అమలు కావడం లేదు అని అంటున్నారు. మరి ఎందువల్ల ఇలా జరుగుతోంది? ఉద్యోగుల ఆలోచనా ధోరణి ఎంత వరకు దీనికి కారణం అంటారు?

రహంతుల్లా : అమలులో ఇబ్బందులు ఎదురౌతున్న మాట వాస్తవమే. అయితే తెలుగు ప్రజల నుంచే ఉద్యోగులొస్తున్నారు. తెలుగు మాతృభాషగా ఉన్న ఉద్యోగులు వేలాదిమంది, లక్షలాది మంది ఇక్కడ పని చేస్తున్నారు. మీ మాతృభాషలోనే ఫైళ్ళు రాయండి, మీ మాతృభాషలోనే ఆఫీస్ కార్యక్రమాలు నడపండి అని అన్నప్పుడూ మాతృభాషలో నడపడానికి ఏ ఉద్యోగి కూడా వెనుకాడడు. చాలా సంతోషంగా మాతృభాషలో ఫైళ్ళు నడుపుతారు. అయితే ఇక్కడొచ్చిన ఇబ్బందల్లా ఏంటంటే మన సాంకేతిక పరిజ్ఞానం మనం ఇప్పుడు కంప్యూటర్ల యుగంలో ఉన్నాం. ఈ కంప్యూటర్లు కూడా మన మాతృభాషకి సహకరించేటట్లుగా, మన మాతృభాషలోనే కంప్యూటర్లను ప్రతీ దానికీ వాడేటట్లుగా మన సాంకేతిక

పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి. ఇప్పుడు కూడా నేను కొన్ని ఉదాహరణలు చెప్తాను. ఆఫీసర్‌కి ఎంతో చిత్తశుద్ధి ఉండి, పట్టుదలగా దాన్ని అమలు చేయాలని చూస్తే, ఒక టైపిస్టు దగ్గర నుండి, ఒక కంప్యూటర్ ఆపరేటర్ దగ్గర నుండి దానిని వాడటానికి అమలులో ఆటంకాలు ఎన్నైతే ఎదురౌతున్నాయో వాటిని ఇంకా పూర్తిగా పరిష్కరించుకోలేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుండి తెలుగుకు సంబంధించిన ఒక సాఫ్ట్‌వేర్‌ను వారు ఉచితంగానే ఇచ్చారు. అయితే దాన్ని కనీసం ఇన్‌స్టాల్ చేయడానికి కూడా సమస్యలు ఎదురైనాయి. ఫాంట్స్ మరొక సమస్య. వీటిని మనం ప్రాక్టికల్‌గా చూస్తే ఈ ఫాంట్స్ ఇన్‌స్టాల్ చేయడం గానీ, ఇంగ్లీషును ఏ విధంగానైతే టైప్ చేయగలుగుతున్నామో అంత సుళువుగా తెలుగుని కూడా టైప్ చేయగలగాలి. ప్రింట్ తీయాలి. ఎక్కడైతే సమస్యలున్నాయో వాటిని ఎదుర్కోవడానికి కూడా మరి ఈ ప్రభుత్వం నుంచి నిరంతరం దాని మీద పరిశీలన జరుగుతూ అభివృద్ధి చేయటానికి కొంత మందిని దాని మీద వినియోగించినట్లయితే ఇటువంటి సమస్యలని ఎదుర్కొనవచ్చు. సాంకేతిక పదజాలం గురించి పెద్ద వర్రీ ఏమీ లేదు. దానికి ప్రజలు అర్థం చెప్పగలుగుతారు. ప్రజలు కొత్త పదాలను పుట్టిస్తుంటారు. అయితే సామాన్య ప్రజానీకంలో ఉన్నటువంటి మాటల్ని నిఘంటువుల్లోకి ఎక్కించి, వాటికి కూడా విలువ ఇచ్చి, ఇవి మన పదాలే కదా అని వాటిని తీసుకున్నట్లయితే మనకు పదసంపద పుష్కలంగా ఉంటుంది. నన్నయ్య కంటే ముందు కాలం నుంచి ఎంతో మంది సాహిత్యాన్ని సృష్టించిన వాళ్ళున్నారు. సాహిత్యభాష, అట్లాగే గ్రామీణుల్లో ఉన్నటువంటి సజీవ భాష, వాళ్ళు పుట్టిస్తున్నటు వంటి పదాలు, వీటన్నింటినీ మనం తీసుకొని మన నిఘంటువుల్ని పటిష్ట పరచుకొని వాటిని కంప్యూటర్ల మీద వినియోగించే స్థాయికి తీసుకెళ్తే తప్పనిసరిగా ఇది విజయవంతం అవుతుంది. మనం భయపడకూడదు. సిగ్గుపడకూడదు. ఇంగ్లీషులో చేస్తేనే గొప్పవాడు, ఆఫీసరంటే ఖచ్చితంగా ఇంగ్లీషు వచ్చి ఉండాలి అనుకోకూడదు. ఇంగ్లీషులో చేయగలిగితేనే అతన్ని ఆఫీసర్ అనాలి, కేవలం తెలుగులో చేసేవాళ్ళను ఆఫీసర్ అని లెక్కకట్ట కూడదు అనే ఒక చిన్నచూపు మనందరిలో వేళ్లూనుకొని పాతుకొని పోయి వుంది. ఇప్పుడు ఐఏఎస్ అన్నారండీ, ఐఏఎస్ అంటే వానికి ఖచ్చితంగా ఇంగ్లీష్ వచ్చి ఉండాలి. ఏం మనకు పరిపాలకులు లేరండీ? శ్రీకృష్ణదేవరాయలుకి ఏం ఇంగ్లీషు వచ్చు? శివాజీ గారికి ఏం ఇంగ్లీషు వచ్చు? లేదు. తెలుగులో పరిపాలన చక్కగా

చెయొచ్చు. కానీ మనలో మనకే ఒకలాంటి చెప్పుకోలేని సిగ్గుతనం. ఈ ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా చెప్తున్నాం. ఎవరి మాతృభాషను వారు గౌరవించుకోవడం తనను తాను గౌరవించుకోవడమే. గిడుగు రామమూర్తి పంతులుగారు ఏమన్నారు? “మాతృభాషను ప్రేమించే వాడే నిజమైన దేశభక్తుడు”. కాబట్టి మన భాషను మనం అమ్మలా ప్రేమించడం. మన భాషలో పాలన ఎక్కడెక్కడ ఎలా అమలు చెయ్యొచ్చో అలా చేద్దామన్నది నా ఉద్దేశ్యం.

నాగసూరి : ఇద్దరు తెలుగు వాళ్ళు కలిస్తే వేరే భాషలో మాట్లాడుకుంటారు అని వెటకారంగానో, ఎకసెక్కంగానో అంటుంటారు. మరి తమిళం, కన్నడం, మళయాళం లేదా హిందీ ఇటు వంటి ప్రాంతాలతో పోలిస్తే మన నిర్లిప్తత ఏ మేరకు ఉంది? అంటే కనీసం ఆ కోణం నుంచైనా చూస్తే మనకు కాస్త ఉత్తేజం కలిగే అవకాశం ఉంటుంది.

రహంతుల్లా : నిజమేనండీ, మన తెలుగు వాళ్ళలో నిర్లిప్తత చాలా ఎక్కువ. ఈ విషయంలో మనం తమిళుల్ని చూసి ఎంతో నేర్చుకోవాలి. ఇటు కర్నాటకలోగానీ, తమిళనాడులో గానీ, కేరళలోగానీ ఎక్కడైనా సరే ప్రతీ రాష్ట్రం వాళ్ళు వాళ్ళ భాషల్ని రక్షించుకోవడం కోసం పటిష్టమైన చట్టాల్ని తెచ్చుకున్నారు. విద్యా వ్యవస్థలో కూడా వాళ్ళు తగిన మార్పులు చేసుకుంటున్నారు. అసలు వాళ్ళ మాతృభాషలో చదవకుండా పదో తరగతి దాటి విద్యార్థి బయటకు రాడు. ఖచ్చితంగా నేర్చుకొని ఉండాల్సిందే. అది ఎందుకు చేస్తున్నారు అంటే ఇంకా కొంతకాలం అట్లాగే నిర్లిప్తంగా ఉండేటట్లయితే వారి భాషలు అంతరించి పోతాయి. వాటిని రక్షించుకోవడం కోసమైనా వారు ప్రయత్నం చేస్తున్నారు. అటువంటి ప్రయత్నం మన రాష్ట్రంలో కనిపించడం లేదు. రెండోదేంటంటే, ఆలోచన ఏ భాషలో పుడుతుందో అదే మాతృభాష ఎవడికైనా. ఒక దెబ్బ తగిలిందనుకోండి అతను ఏ భాషలో బాధపడతాడో అదే అతని మాతృభాష. అంటే ఆలోచన ఆ భాషలో అతనికి మొదలౌతుంది. కొన్ని కోట్ల మంది గ్రామీణ జనం ఉన్నారు. వీళ్ళందరికీ ఒక భాష ఉంది. ఆ భాషలోనే పరిపాలన జరగాలని వాళ్ళు కోరుకుంటున్నారు. వాళ్ళ మొర వాళ్ళ మాతృభాషలో విన్నవించుకుంటున్నారు. దీన్ని కృత్రిమంగా ఇంకొక భాషలోకి మార్చి ఆ భాషలోనే తీర్పులిస్తున్నారు. తెలుగు తగాదాలకు ఇంగ్లీషు తీర్పు ఇటువంటి పరిస్థితికి మనం వచ్చిపడ్డాం. ఎవరి భాషలో వారికి తీర్పులొచ్చేటటువంటి రోజు రావాలి. ఆఫీసుల్లో పనులన్నీ మన వాళ్ళ భాషలో జరగాలి. అప్పుడే

ప్రజలు సుఖపడతారు. ఇప్పుడు ఇంకొక భాషలోకి మార్చి కృత్రిమంగా ఇస్తే దానికి అర్థం చెప్పడానికి ఇంకొకడి దగ్గరికి వెళ్ళాలి. చెప్పించుకోవాలి. చదివించుకోవాలి. ఇదంతా ప్రజలపై కొత్తభారం పెట్టినట్లు కాదా? ఇది మొదటి విషయం; రెండోదేంటంటే – ఆర్థికంగా మనవాళ్ళు బలపడాలంటే తెలుగుభాష నసలు బలి చేసైనా సరే ఇంగ్లీషు నేర్చుకోవాల్సి వస్తుంది. అది నేర్చుకుంటేనే అతనికి మనుగడ, అభివృద్ధి, అది నేర్చుకుంటేనే అతనికి ఉద్యోగం. అలా కాకుండా తెలుగు మీడియంలోనే చదివి, తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు నడపగలిగే వారికి కూడా ఉద్యోగం గ్యారెంటీ అనే పరిస్థితి ఏదైనా ఉంటే తెలుగు ఎగబడి చదువుకుంటారు. తెలుగు మీడియంను ఎవరూ కాదనరండీ.

నాగసూరి : రహంతుల్లా గారు... మీరు 'తెలుగు అధికార భాష కావాలంటే' అనే చక్కని తెలుగు పుస్తకాన్ని వెలువరించారు. దాదాపు రెండు దశాబ్దాలుగా తెలుగుకు సంబంధించి చాలా పత్రికల్లో వ్యాసాలు రాశారు. తెలుగు వాడకంలో మరీ ముఖ్యంగా కంప్యూటర్, టైపింగ్ వీటికి సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయి. ఇంకోరకంగా చూస్తే హిందీ విషయం తీసుకుంటే కంప్యూటర్ వచ్చాక లిపికి సంబంధించి చాలా సంస్కరణలు చేసినట్లు మనకు చాలా సులువుగా తెలుస్తుంది. అలాగే, తమిళం గానీ, మరో భాషగానీ అటువంటి పరిస్థితే ఉంది. మరి అధికార భాషగా తెలుగుని వర్తింపచేయాలంటే సాంకేతికంగా ఎటువంటి మార్పులు రావాలి? ఎందుకంటే ఈ దిశలో పెద్దగా కృషి జరిగినట్లు కనడడం లేదు కాబట్టి.

రహంతుల్లా : మీరు చెప్పింది నిజమేనండీ. లిపి వేరు భాష వేరు అని అనుకునేటట్లయితే మొత్తాన్ని సంస్కరించవచ్చు. సంస్కరించేటప్పుడు లిపి ఏమన్నా మారితే భాషే నాశనమై పోయినట్లుగా గుండెలు బాదుకునేవాళ్ళు ఉన్నారు ఇక్కడ. మన లిపి యంత్రానికి అనుకూలంగా లేదు అనుకున్నప్పుడు దాన్ని యంత్రానికి అనుకూలంగా మార్చాలి. ఇప్పుడు ఒత్తులు, గుణింతాలు అనేవి చాలా ఇబ్బంది పెడుతున్నాయి. అదే మీరు ఇంగ్లీషు గానీ, తమిళంగానీ తీసుకోండి. హిందీ అయినా తీసుకోండి. అంతా ఒక లైన్‌లో సాఫీగా సాగిపోయేటట్లుగా అక్షరాలు ఉంటాయి. ఒత్తుగానీ, గుణింతం కానీ ఒకే లైన్‌లో వస్తాయి. అది కంప్యూటర్‌కి చాలా సౌలభ్యంగా ఉంటుంది. లిపిని కంప్యూటర్‌కి అనుకూలంగా మార్చుకోవాలి. మార్చలేమా? అంటే దానికి తగిన సాంకేతిక నిపుణులు ఉన్నారు మార్చగలరు. కానీ మార్పుని ఎవరో పండితులు అంగీకరించాలి. అట్లా

అంగీకరింపజేస్తే సరిపోతుంది. లేదంటే ఇంగ్లీషు లిపినే తెలుగుకి వాడుకుంటే అంతా చక్కగా జరిగిపోతుంది. భాషంటే ఏంటి? శబ్దం ఆ శబ్దాన్ని ఇలా రాయాలి అని మనం ఏర్పాటు చేసుకున్న అక్షరాలే లిపి. ఈ అక్షరాలు ఇంగ్లీషు వాళ్ళు అమర్చిపెట్టి మన మీద కొన్ని వందల సంవత్సరాలు పాలించటం వల్ల మన భారతీయులంతా ఇంగ్లీషు అక్షరాలకి అలవాటుపడిపోయారు. అ,ఆ..లు రాక పోయినా ఏ,బి,సి,డిలు వచ్చేస్తున్నాయి. కాబట్టి ఆ లిపిని యధాతథంగా వాడుకోవడం అన్నా జరగాలి. లేదా మన అక్షరమాలను, అక్షరాలను, ఒత్తులు, గుణింతాలు కూడా ఒకే లైన్‌లో వచ్చేలా సరిచేసుకుంటే భవిష్యత్తు తరాలు సుఖంగా ఈ అక్షరాలను వాడుకొని తెలుగును బాగా అమలు చేస్తాయి అని నా ఉద్దేశ్యం.

నాగసూరి : రహంతుల్లా గారు, మాతృభాషా దినోత్సవం ప్రపంచస్థాయిలో జరుపు కుంటున్నాం. ఫిబ్రవరి 21న ఈ మాతృభాషా దినోత్సవం నేపథ్యం ఏమిటి? అలా జరుపుకోకపోతే రాబోయే సమస్యలేంటి? కాస్త గుర్తు చేస్తే బాగుంటుంది.

రహంతుల్లా : చూడండి, పాకిస్తాన్ ఇది వరకు తూర్పు పాకిస్తాన్, పశ్చిమ పాకిస్తాన్ అని రెండు భాగాలుగా ఉండేది. అప్పుడు బంగ్లాదేశ్ అనేవాళ్ళం కాదు. తూర్పు పాకిస్తాన్ అనేవాళ్ళం. అయితే దీని అజమాయిషీ అంతా పశ్చిమ పాకిస్తాన్ నుండి జరుగుతుండేది. అప్పుడు ఉర్దూలో పరిపాలన జరుగుతుండేది. తూర్పు పాకిస్తాన్ వాళ్ళ మాతృభాషేమో బెంగాలీ, మా మాతృభాష బెంగాలీలోనే మా పరిపాలన జరగాలని పోరాటం మొదలు పెట్టారు. ఆ పోరాటంలో చాలా మంది బెంగాలీయులు చనిపోయారు. మతం కంటే భాషే గొప్పదనీ, భాష ఊపిరిలాంటిదనీ నిరూపించారు. చివరికి అది ఒక దేశంగా ఏర్పాటు అవడం, తప్పనిసరిగా బెంగాలీ భాషలోనే పరిపాలన జరగాల్సి రావడం జరిగింది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని ఐక్యరాజ్యసమితి వాళ్ళు ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 21వ తేదీన మాతృభాషా దినోత్సవం జరగాలని నిర్ణయించారు. అలాగే మన దేశంలో ఒరియా అంటే బెంగాలీలో ఒక యాస అనేవాళ్ళు. బెంగాలీలు ఒరియా అధికార భాష కావడానికి ఒప్పుకోలేదు. ఒరియా వాళ్ళు ఉద్యమాలు చేసి వాళ్ళకొక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒరియాలో పరిపాలన సాగించుకున్నారు. అక్కడిదాకా ఎందుకు మన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఉంది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. మన రాష్ట్రం మొట్టమొదటిది. అది స్ఫూర్తిగా తీసుకుంటున్నారే తప్ప మరి ఎంత వరకు ఆ భాష మీద ఆ భాషతోటి

పరిపాలన జరుగుతుందనేది మనం ఖచ్చితంగా ఆలోచించుకోవాలి. దాన్ని సార్థకం చేయడానికి, అధికార పీఠం మీద మన భాషను కూర్చోబెట్టడానికి మనమంతా కూడా కృషి చెయ్యాలి.

నాగసూరి : చాలా చాలా ధన్యవాదాలండీ... రహంతుల్లా గారు. భాషకు సంబంధించి మన దృక్పథం కాస్త విభిన్నంగా, ప్రయోజనకరమైన ఆలోచనా ధోరణితో ఉండి, అవసరమైన రీతిలో మార్పులు చేసుకుంటూ కాస్త చిత్తశుద్ధితో చేస్తే ప్రజలకు అంటే ఎక్కువ మందికి ఇది ఉపయోగపడుతుంది. తక్కువ శ్రమౌతుంది. అలాగే దళారీలు ఉండరు అని చాలా విషయాలు ఈ సందర్భంగా గుర్తుచేశారు. వారిని ఆలోచింపచేశారు. ధన్యవాదాలు, నమస్కారం.

***(13.6.2008, గీటురాయి వారపత్రిక)***

**తెలుగువారల పేరు పెంపుము**
**తెలియ కుండగ ఉండబోకుము**
**తెలుగుబాలుర ఇంపు నింపుము**
**తెలుగు బాలుర పేరు పెంపుము**

**– త్రిపురనేని రామస్వామి**

# 9. లిపి సంస్కరణ జరగాలి !

సంస్కృతం, తమిళంతోపాటు తెలుగు కన్నడ భాషలను కూడా ప్రాచీన భాషలుగా కేంద్రం ప్రకటించింది. ప్రాచీన హోదాతో వచ్చే నిధుల్ని ఆధునిక అవసరాలకు వినియోగించాలనే వాదనలు అప్పుడే మొదలయ్యాయి. చైనా భాష తమిళంకంటే ప్రాచీనం. వారు లిపి ఆధునిక అవసరాలకు అనువుగాలేదని చాలాసార్లు సంస్కరించుకున్నారు. మనం కుండపెంకుల మీద, బండరాళ్ళమీద రాసుకుంటున్న రోజులలో ఒక లిపి సహితం లేని రష్యావాళ్ళు, జపాన్ వాళ్ళు వారి భాషలను ఆధునిక అవసరాలకు అనువుగా మార్చారు. మన లిపిని మనం ఎందుకు మార్చుకోలేము? జాతి ఎదుగుదలకు కావలసింది వారి భాషను ప్రాచీనహోదాతోపాటు ఆ భాషను ఆదునిక అవసరాలకు కూడా సరిపడేలా తీర్చిదిద్దుకోవడం. భాషాభిమానంతో పాటు ప్రజల నిత్య జీవితానికి సంబంధించి పాలనా వ్యవహారాలలో స్వభాష పెత్తనం చేయాలి.

తెలుగు అధికార భాష చట్టం 1966లో వచ్చింది. ఉర్దూ హైదరాబాద్, అనంతపురం, కర్నూలు, కడప, గుంటూరు, మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలలో రెండవ అధికార భాష అన్న సవరణ 1966లో జారీ అయింది. ప్రభుత్వం జారీచేసే చట్టాలూ ఆదేశాలూ నియమాలూ, ప్రభుత్వం ఇతర సంస్థలతో జరిపే ఉత్తరప్రత్యుత్తరాలూ అధికార భాషలలోనే ఉండాలనీ చట్టంలో ఉంది. కానీ ఉర్దూలో కానీ తెలుగులో కానీ అమలు కావటం లేదు. ఇద్దరికీ ఇంగ్లీషే శరణ్యమయ్యింది. 1988 నవంబరు 1 నుంచి అన్ని ప్రభుత్వ ఉత్తర్వులూ ఉత్తర ప్రత్యుత్తరాలూ తెలుగులోనే ఉండాలనీ, ఇంగ్లీషు కేవలం కేంద్ర ప్రభుత్వంతో, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడే భాష అని జీవో జారీ అయ్యింది. ప్రభుత్వ ఉత్తర్వులు, ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని, వారి అభిప్రాయాలు అభ్యంతరాలు వినడానికి బహిరంగ విచారణ జరపాలనీ చట్టం అయింది. కానీ అవి ప్రజలకర్థమయ్యే భాషలో ఉండటంలేదు. ఎన్నిసార్లు మొత్తుకున్నా ఆ పనిమాత్రం చేయటంలేదు. అలాగే న్యాయస్థానాలలో స్థానిక భాష వాడటం లేదు. తెలుగు ప్రజల జీవితాలు, ఆస్తులు, కుటుంబ వ్యవహారాలకు సంబంధించిన వ్యాజ్యాలలో విచారణ, వాదోపవాదాలు తమకు అర్థంకాని భాషలో జరుగుతుంటే తెలుగు ప్రజలు నోరు వెళ్ళబెట్టుకొని చూస్తున్నారు. ఇది మన జాతికి అవమానకరం. తమిళులు 1976 నుంచి క్రిమినల్ కేసులు సెషన్స్ కోర్టు దాకా, 1982 నుండి సివిల్ కేసులు పూర్తిగా తమిళంలోనే జరుపుతున్నారు. హిందీ రాష్ట్రాలు హైకోర్టులో తప్ప మిగతా అన్ని కోర్టుల్లో తమ తమ భాషలలోనే న్యాయవ్యవస్థను నడుపుతున్నాయి.

మెజిస్ట్రేట్ కోర్టులలో కూడా తమిళం ఇంగ్లీషుతో పోటీపడి ఎదుగుతున్నది. వత్తులు,

గుణింతాలు అన్నీ పక్కపక్కనే ఇంగ్లీష్‌లోలాగా ఒక వరుసలో యంత్రానికి అనుకూలంగా తమిళ లిపి వారికి వరంగా మారింది. 'అరవమయిన డెమ్మీ ఫారము ముద్రణకు నాలుగు రూపాయలు చార్జి చేయగా తెలుగునకదే మాదిరి ఫారమునకు ఎనిమిది రూపాయలు ఛార్జి చేయుచున్నారు. ఇలా ధర తక్కువయగుటకు కారణం అరవ లిపిలో సంకేతముల సంఖ్య మిక్కిలి తక్కువగా ఉండుట. తెలుగు కంపోజిటర్లు నేర్చుకొనుటకు ఆరునెలలు పడితే అరవము ఒక నెలలో నేర్చుకొనవచ్చును. తెలుగు లిపిని గూర్చుట జాలజాగగును. గంటకు ఒక గాలీ అరవము కూర్చగలుగగా తెలుగున అరగాలీ మాత్రమే కూర్చగలం. అచ్చునకే ఇన్ని చిక్కులుండగా నింక టైపురైటింగ్ కుదురునా? అని వేటూరి ప్రభాకరశాస్త్రి వాపోయారు. ఇంగ్లీషున అరవమున ఉన్నట్లు లిపి సంకేతములు పక్కపక్కనే (ఒక దాని కిందనొకటి యుండకుండుట) యుండవలెనని ఆయన కోరారు.

(ఆంధ్ర లిపి సంస్కారము, *"తెనుగు మెరుగులు" 1948)*

"ప్రపంచంలోని అన్ని భాషల ముద్రణ ఒక ఎత్తు. తెనుగు ముద్రణే ఒక ఎత్తు. ఇదొక గారడీ. తెనుగు అక్షరాలు కూర్చడానికి కంపోజిటరు 700 దిమ్మలు, గళ్ళు జ్ఞాపకం ఉంచుకోవాలి. ప్రతి కంపోజిటరు శతావధాని, సహస్రావధాని కావలసి ఉంటుంది. ఈ చిక్కును తొలగించుకోడానికి ఏ రోమన్ లిపినో అనుసరిస్తే అచ్చు సౌకర్యం కలుగుతుందనుకుంటే అనూచానంగా వచ్చిన ఈ లిపిని వదులుకోడం ఎలా?"

*(తిరుమల రామచంద్ర, మన లిపి పుట్టు పూర్వోత్తరాలు 1957)*

"ముత్యాలలాంటి తెలుగక్షరాలంటూ లేనిపోని సెంటిమెంట్లు పెట్టుకోవడం మాని రోమన్ లిపిలో (a,aa,i,ee.... ఈ విధంగా) తెలుగును నేర్పితే అప్పుడు మన దేశం ఆధునిక యుగంలోకి ప్రవేశిస్తుందని నా నిశ్చితాభిప్రాయం 'ప్రపంచ తెలుగు మహాసభవారు ఈ విషయమై ఆలోచించడం మంచిది'

*( శ్రీశ్రీ 'అనంతం' పేజి 196, ప్రజాతంత్ర 18.4.1976)*

రాజీవ్‌గాంధీ హత్య కేసు విచారణ కూడా తమిళంలోనే జరిగిందట. అప్పీలును విచారించే సుప్రీంకోర్టు తమిళంలో ఉన్న పత్రాలన్నిటినీ ఇంగ్లీష్‌లోకి అనువాదం చేయించుకొంది. ఇంగ్లీషు వచ్చినవారికే మంచి ఉద్యోగాలు వస్తున్నందు వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఆంగ్లమాధ్యమం ప్రవేశపెడుతున్నారు.

పిల్లలు కొత్త భాషలు సునాయాసంగా నేర్చుకుంటారని వాదిస్తున్నారు. మాతృభాషలో విద్యాబోధనే పిల్లలకు మంచిదంటే హేళన చేస్తున్నారు. మీ పిల్లలు ఏ మాధ్యమంలో చదువుకుంటున్నారని ఎదురు ప్రశ్నిస్తున్నారు. పిల్లలందరినీ ఆంగ్లమాధ్యమంలో పడేస్తే నిజంగానే

గొప్ప అవకాశాలొస్తాయా? ఉద్యోగాలు వస్తున్నది ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం వల్లనా లేక విషయ విజ్ఞానం వల్లనా? ఇంగ్లీష్ వచ్చినవాళ్ళలో కూడా విషయపరిజ్ఞానం లేని శుంఠలకు కూడా ఉద్యోగాలు వస్తాయా?

భాష నేర్చుకోవడం వేరు, భాషలో చదువు నేర్చుకోవడం వేరు. పరభాషలో చదువు పిల్లలకు హింసే, పిల్లలందరినీ ఇంగ్లీషు మీడియంలోకి నెట్టడంకంటే ప్రైవేట్ పాఠశాలలు కూడా మాతృభాషలో చదువు నేర్పటం తప్పనిసరి చేయాలి. ఇంగ్లీష్‌ను కేవలం ఒక భాషగా నేర్పాలి. ఇంగ్లీషు, తమిళభాషలలాగా మన తెలుగులిపి సంకేతములు పక్కపక్కనే కూడా ఉండేలా లిపి సంస్కరణ కోసం ప్రాచీన హెూదాద్వారా వచ్చే నిధుల్ని వినియోగించాలి.

***(19.12.2008, గీటురాయి వారపత్రిక)***

**తెలుగు తల్లి అందాల నిండు జాబిల్లి**
**ఆనందాల కల్పవల్లి**
**తెలుగువాడా ఎందాక ఊగిసలాట ?**
**ఇదే నీ గులాబీ తోట**
**ఎవడు వాడు ఎచ్చటి వాడు ఇటు వచ్చిన తెల్లవాడు**
**కండబలం కొండ బలం కబళించే దుండగీడు**
**మానధనం ప్రాణ ధనం దోచుకునే దొంగవాడు**
**తగిన శాస్తి చెయ్యరా తరిమి తరిమి కొట్టరా - శ్రీశ్రీ**

# 10. అధికారులారా! ఇలా మీరెందుకు రాయలేరు?!

గుంటూరు జిల్లా డా॥ కె.యల్.రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టు భూసేకరణ విభాగం-1, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు శ్రీ నూర్‌బాషా రహంతుల్లా, గుంటూరు జిల్లా కలెక్టరు గారికి "సమ్మతి అవార్డు"ను తెలుగులో పంపించారు. రాష్ట్రవ్యాప్తంగా పాలనా వ్యవహారాలు తెలుగులో జరపడానికి అధికారులందరూ తమ శాయశక్తులా కృషి చేస్తారని ఆశిస్తున్నాం. శ్రీ రహంతుల్లాను అభినందిస్తూ, దీనిని యథాతథంగా ప్రచురిస్తున్నాం.

సమ్మతి అవార్డు

(ఫారం-8)

శ్రీ నూర్‌భాషా రహంతుల్లా, యం.కాం., ప్రత్యేక ఉపకలెక్టరు మరియు భూసేకరణాధికారి,

భూసేకరణ విభాగము -1,

డా॥ కె.ఎల్.రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టు, గుంటూరు వారిచే చేయబడింది.

(ఆంధ్రప్రదేశ్ భూసేకరణ చట్టం 11(2) సెక్షన్ మరియు జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ నియమావళి 1998 (జి.ఓ.ఎం.ఎస్.382 (రెవెన్యూ) భూసేకరణ తేది. 4.6.1998)

గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం రాజుపాలెం గ్రామం సర్వేనెంబరు 229/38 వగైరాలలోని 14.98 ఎకరాల భూమి డా॥ కె.ఎల్.రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబాల పునారావాసం కోసం సేకరించబడుతుందని జిల్లా రాజపత్రంలో ప్రచురించబడింది. భూసేకరణ అధికారులు ప్రకటించిన నష్టపరిహారం రేటు ఎకరా 1కి 3,32,910 రూపాయలు అంగీకరించక భూ యజమానులు ఎకరానికి 15 లక్షల రూపాయల చొప్పున పరిహారం కోరారు. జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీకి నివేదించవలసినదిగా కోరారు. సంప్రదింపుల అనంతరం ఎకరాకు 6,65,820/- రూపాయల చొప్పున పరిహారం ఇవ్వడానికి కలెక్టరుగారు, తీసుకునేందుకు భూయజమానులు పరస్పరం అంగీకరించారు. అందువలన ఆంధ్రప్రదేశ్ భూసేకరణ చట్టం 11/2, 31/2 సెక్షన్లు మరియు భూసేకరణ సంప్రదింపుల కమిటీ చట్టం 1992 ప్రకారం ఈ సమ్మతి అవార్డును జారీ చేయడమైనది. సెక్షన్ 18 ప్రకారం ఏ న్యాయస్థానములోనూ దావా వేయటానికి వీలు లేదు.

1. భూమి నికర విస్తీర్ణం : య. 13.96 సెం॥
2. ఎకరాకు 6,65,820/- రూపాయల చొప్పున మొత్తం భూమికి ఇచ్చే పరిహారం
   : రూ. 92,94,847/-
3. భూమి మార్కెట్ విలువ (బి.ఎ.ఆర్. ఓ.సం. 90 పేరా 14(1)(ఐ)
   నోట్ 1 ప్రకారం) భూమి కౌలు పూర్తిగా మదింపు చేయబడినప్పుడు

లేదా ఇండ్ల స్థలాలకైతే మార్కెట్ విలువతో కాకుండా ఇతర
అన్ని స్థలాలకు చెట్లు భవనాలు, పంటలు మినహాయించి : ......................

4. ఈనాం భూములైతే (బి.ఎస్.ఓ.నెం.పేరా(14) (ఐ)(ఐ) ప్రకారం ఈనాం సెటిల్మెంటు సమయంలో ఈనాందారుకు అనుభవ హక్కు కింద నిర్ణయించబడిన నికర మదింపు విలువ : .......................

5. బి.ఎస్.ఓ.నెం.90 పేరా 14(ఐ)(ఐ)లో ప్రస్తావించిన ఇతర ఈనాం భూములైతే బి.ఎస్.ఓ.నెం. పేరా 14(1) నోట్ 2 ప్రకారం ఈనాందారు అనుభవ హక్కును కోల్పోయినందుకు గాను ప్రభుత్వ మదింపుచేసిన శిస్తుకు 20 రెట్లు పరిహారం వర్తించదు: ......................

6. చెట్ల విలువ (కాయలు కాచేవి మరియు కాయలు కాయనివి) : ......................

7. కట్టడాల విలువ (బావులు, ఇళ్ళు మొదలైనవి : ........................

మొత్తము : రూ. 92,94,847 /-

(తొంభై రెండు లక్షల తొంభై నాలుగు వేల ఎనిమిది వందల నలభై ఏడు రూపాయలు మాత్రమే)

## అనుబంధం - 1

## సేకరణ భూమికి సరిహద్దులు

| వరు. నెం. | సర్వే నెం. | విస్తీర్ణం | పట్టాదారు పేరు | భూమికి సరిహద్దులు ఉత్తరం | పడమర | తూర్పు | దక్షిణం |
|---|---|---|---|---|---|---|---|
| 1. | 229/38-4ఎ | 1.00 | పోతంశెట్టి గోపయ్య తండ్రి కొండయ్య | 229/39 | 214 | 229/38-3 | 229/41 |
| 2. | 229/38-4ఎ | 0.91 | కన్నెగంటి రామయ్య తండ్రి నరసింహారావు | 229/39 | 214 | 229/38-3 | 229/41 |
| 3. | 229/38-4ఎ | 0.79 | కొర్రపాటి శ్రీనివాసరావు తండ్రి రాములు | 229/39 | 214 | 229/38-3 | 229/41 |
| 4. | 229/39-1బి | 1.11 | చల్లా పెదమస్తాన్ రావు తండ్రి లింగయ్య | 224 | 224 | 229/38-3 | 229/4 |
| 5. | 229/40-2 | 8.46 | బత్తుల వెంకటరమణ భర్త కరీముల్లారావు | 229/39 | 229/41 | 229/41 | 229/40-1 |
| 6. | 229/40-2 | 1.69 | జంగం చెంచయ్య తండ్రి సుబ్బారావు | 229/39 | 229/41 | 229/41 | 229/40-1 |
| | మొత్తము | 13.96 | | | | | |

## అనుబంధం - 2

## పరిహారం పొందవలసిన భూ యజమానులు

| సర్వే నెం. | మొత్తం విస్తీర్ణం | క్లెయించేసిన విస్తీర్ణం | అవార్డుదారుని పేరు | దాఖలు చేసిన హక్కు పత్రం 1బి | దస్తావేజు | 10(1) | ప్రకటించిన పరిహారం |
|---|---|---|---|---|---|---|---|
| 229/38-4ఎ | 1.00 | 1.00 | పోతంశెట్టి గోపయ్య తండ్రి కొమరయ్య | .... | 255/66 | .... | 6,65,820/- |
| 229/38-4ఎ | 0.91 | 0.91 | కన్నెగంటి రామయ్య తండ్రి నరసింహారావు | .... | .... | .... | 6,05,896/- |
| 229/38-4ఎ | 0.79 | 0.79 | కొర్రపాటి శ్రీనివాసరావు తండ్రి రాములు | 902 | .... | .... | 5,25,998/- |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 229/39-1బి | 1.11 | 1.00 చల్లా పెదమస్తాన్ రావు తండ్రి లింగయ్య | 808 | .... | .... | 7,39,060/- |
| 229/40-2 | 8.46 | 8.46 బత్తుల వెంకటరమణ భర్త కరీముల్లారావు | ... | 48/07 | .... | 56,32,837/- |
| | | | తేది | 5.1.07 | | |
| 229/40-2 | 1.69 | 1.69 జంగం చెంచయ్య తండ్రి సుబ్బారావు | 600 | .... | .... | 11,25,236/- |
| **మొత్తము** | | **13.96** | | | | **92,94,847/-** |

రూ. 92,94,847/- (తొంభై రెండు లక్షల తొంభై నాలుగు వేల ఎనిమిది వందల నలభై ఏడు రూపాయలు మాత్రమే)

1. అవార్డులో భాగంగా భూసేకరణ చట్టం సెక్షన్ 9 ప్రకారం పై అవార్డులందరికీ నోటీసులు అందజేయడమైనది.
2. సేకరించదలచిన భూమి హద్దులతో కూడిన ప్లాను నాముందు ఉంది.

**భూసేకరణాధికారి మరియు ప్రత్యేక ఉప కలక్టరు,**
భూసేకరణ విభాగము - 1
డా॥ కె.ఎల్.రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టు
గుంటూరు

**స్పెషల్ డిప్యూటీ కలక్టరు, భూసేకరణ విభాగము -1**
**డా॥ కె.ఎల్.రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టు, గుంటూరు వారి ఉత్తర్వులు**

ప్రస్తుతం : శ్రీ నూర్ భాషా రహంతుల్లా, యం.కాం.

ఫైలు సంఖ్య : 116/2008-సి1 తేది 10.11.2008

విషయము : భూసేకరణ - సహాయం మరియు పునరావాసం - డా॥ కె.ఎల్.రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టులో నిర్వాసితులకు పునరావాసం కోసం ఇండ్ల స్థలాల సేకరణ - రాజుపాలెం మండలం - రాజుపాలెం గ్రామం - సర్వే నెంబరు 229/38-1 వగైరాలలో 13.96 ఎకరముల భూమి సేకరించడానికి సమ్మతి అవార్డు జారీ చేయడమైనది.

సూచిక :
1. ముసాయిదా నోటిఫికేషన్ ఆంధ్రభూమి, కృష్ణాపత్రిక, తేది 10.01.2008
2. 5-ఎ విచారణ తేది 25.03.2008
3. ముసాయిదా డిక్లరేషన్, సాక్షి, తేది 20.05.2008 మరియు ఈనాడు తేది 20.5.2008
4. ప్రాథమిక విలువ నిర్ధారణ తేది. 26.7.2008
5. జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీ ఎకరా రూ. 6,65,820/-లుగా విలువ నిర్ధారణ తేది 20.09.2008.
6. ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ) డా॥ కె.ఎల్.రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టు, గుంటూరు వారి ఆర్.సి.నెం.1/395/08, తేది 7.11.2008

**ఉత్తర్వులు**

పులిచింతల ప్రాజెక్టులో భూములు, ఇళ్ళు కోల్పోయి నిర్వాసితులౌతున్న వారి పునరావాసం కోసం రాజు పాలెం గ్రామం సర్వే నెంబరు 229/38-4 వగైరాలలో 14.98 ఎకరాల భూమిని సేకరించడానికి పై 1 నుండి 3 సూచికలలో ప్రతిపాదించడమైనది.

**సర్వే మరియు సబ్ డివిజన్‌ల పని**

ప్రతిపాదిత భూమి సర్వే మరియు సబ్ డివిజన్ రికార్డు స్ర్కూటినీ అనంతరం ఇలా ఉంది.

| సర్వే నెం. | వర్గీకరణ | విస్తీర్ణము |
|---|---|---|
| 229/38-4ఎ | పట్టా | 2.70 |
| 229/39-1బి | పట్టా | 1.11 |
| 229/40-2 | పట్టా | 10.15 |
| మొత్తము | | 13.96 |

**సీలింగ్ భూమి**

ఈ భూసేకరణలోని భూ యజమానులందరూ ఆంధ్రప్రదేశ్ భూ సంస్కరణల (సి.ఒ.ఎ.హెచ్) చట్టం 1973 పరిధిలోకి రారు.

**ముసాయిదా నోటిఫికేషన్ :**

కలెక్టరుగారి ఆమోదం ఫైలు సంఖ్య జి1/5042/07, తేది 7.1.08, జిల్లా రాజపత్రం నెం. 3, తేదీ 10.01.2008 మొదటి పేపరు ఆంధ్రభూమి, రెండవ పేపరు కృష్ణా పత్రిక.

అప్పటి భూసేకరణ అధికారి వారు మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, గుంటూరు వారు 14.98 ఎకరాల భూమికి ముసాయిదాలో నోటిఫికేషన్ ఇచ్చినారు. కానీ తదుపరి సబ్‌డివిజన్ రికార్డు సమయములో వాస్తవముగా ఈ లబ్దిదారులు అనుభవంలో కల్గి ఉన్న భూములు పరిశీలించగా 14.98 ఎకరాలకు బదులుగా 13.96 ఎకరాలుగా నిర్ణయించడమైనది.

**ముసాయిదా డిక్లరేషన్**

కలెక్టరు గారి ఆమోదం ఫైలు సంఖ్య ఎ/395/08, తేది 15.5.08 మొదటి పేపరు ఈనాడు, తేది. 20.05.2008, రెండవ పేపరు సాక్షి తేది. 20.5.2008

**5-ఎ విచారణ**

సెక్షన్ 5-ఎ ప్రకారం స్పెషల్ డిప్యూటి కలెక్టరు, భూసేకరణ విభాగము-1, డా॥ కె.యల్.రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టు, గుంటూరు వారి కార్యాలయములో తేది. 25.3.2008న విచారణ జరిగినది.

**స్థల వివరణ**

రాజుపాలెం గ్రామంలో సేకరణ కోసం ప్రతిపాదించబడిన ఈ భూమి రాజుపాలెం మండల కేంద్రంలోనే ఉంది. అర కిలోమీటరు దూరంలో గుంటూరు–మాచర్ల రహదారి ఉంది. స్థలానికి విద్యుత్ సౌకర్యం వెంటనే కల్పించే వీలు ఉంది. రైతులు ఈ భూమిలో మామిడి, బత్తాయి లాంటివి సాగుచేసుకుంటున్నారు. కొంత భూమి ఇళ్ళ స్థలాలకు లే అవుట్ వేసి విడగొట్టి ఉంది.

**చెట్లు మరియు కట్టడములు**

ఈ భూమిలో చెట్లు మరియు కట్టడములు ఏమియూ లేవు.

**బేసిక్ విలువ**

ఈ సర్వే నంబర్లలోని భూమి బేసిక్ విలువ రూ. 66,000/–లుగా ఉంది.

**భూమి విలువ నిర్ధారణ డి.యన్‌కు మూడేళ్ళ ముందు నుండి జరిగిన క్రయవిక్రయాలు**

| నెం. | దస్తావేజు నెం./తేది | సర్వేనెం. | విస్తీర్ణము | వర్గీకరణ | క్రయ విలువ | ఎకరాకు రేటు |
|---|---|---|---|---|---|---|
| 1. | 1009, 01.05.06 | 229/39-1 | 201.80 | మెట్ట | 38,500 | 9,23,389 |
| 2. | 1500, 10.04.07 | 229/39-1 | 243 | మెట్ట | 56,000 | 11,15,390 |
| 3. | 3138, 09.07.07 | 229/39-1 | 267.19 | మెట్ట | 61,500 | 11,14,309 |
| 4. | 3137, 09.07.07 | 229/39-1 | 267.68 | మెట్ట | 61,500 | 11,16,168 |
| 5. | 3136, 09.07.07 | 229/39-1 | 266.60 | మెట్ట | 62,500 | 11,16,504 |
| 6. | 3135, 09.07.07 | 229/39-1 | 269.85 | మెట్ట | 62.000 | 11,20,993 |
| 7. | 3133, 08.07.07 | 229/39-1 | 268.57 | మెట్ట | 62,000 | 11,17,325 |
| 8. | 942, 28.02.08 | 229/40-2 | 242 | మెట్ట | 56,000 | 11,20,000 |
| 9. | 48, 05.01.07 | 229/40-2 | 8.46 | మెట్ట | 4,65,500 | 55,023 |
| 10. | 3518, 30.07.07 | 229/39-1 | 0.24 | మెట్ట | 24,000 | 1,00,000 |

**సమీప ప్రాంత మార్కెట్ విలువ**

నోటిఫికేషన్‌కు ముందు మూడు సంవత్సరాల కాలంలో జరిగిన క్రయ విక్రయాల వివరాలు సబ్ రిజిస్ట్రారు, పిడుగురాళ్ళ కార్యాలయం నుండి సేకరించాము. మొత్తం 10 వ్యవహారాలు జరిగాయి. వాటిలో 2 మాత్రం సేకరణ భూమి సమీపంలో జరిగాయి. వాటి వివరాలు

| నెం. | దస్తావేజు నెం./తేది | సర్వేనెం. | విస్తీర్ణము | వర్గీకరణ | క్రయ విలువ | ఎకరాకు రేటు |
|---|---|---|---|---|---|---|
| 1. | 48, 05.01.07 | 229/40-2 | 8.46 | మెట్ట | 4,65,500 | 55.023 |
| 2. | 3518, 30.07.07 | 229/39-1 | 0.24 | మెట్ట | 24,000 | 1,00,000 |

క్రమసంఖ్య 1 నుండి 8 వరకు జరిగిన వ్యవహారాలు చాలా తక్కువ విస్తీర్ణాలకు

జరిగాయి. పైగా ఎకరా రేటుకు రూ. 9 లక్షల పైబడి ఉన్నాయి గనుక వదిలిపెట్టడమైనది.

క్రమసంఖ్య 9,10 లోని క్రయాలు ఎక్కువ విస్తీర్ణానికి సేకరణ భూమి అదే సర్వే నెంబరులో జరిగాయి. 0.24 సెంట్లకు ఎకరా 1 లక్ష చొప్పున జరిగిన క్రయాన్ని (క్రమసంఖ్య 10) పరిగణనలోనికి తీసుకోవడం జరిగింది.

| | |
|---|---|
| బేసిక్ విలువ | రూ. 66,000 |
| రిజిస్ట్రేషన్ ప్రకారం అత్యధిక అమ్మకంవిలువ (30.07.2007న క్రయం) | రూ. 1,00,000 |

ఈ భూమి రోడ్డు ప్రక్కన సౌకర్యవంతమైన స్థానంలో ఉంది. భూ యజమానులు స్వంత ఖర్చుతో సాగునీటి సౌకర్యంతో అభివృద్ధి చేశారు. భూసేకరణ వెంటనే జరగాల్సి ఉంది. ఇళ్ళ స్థలాలకు బాగా పనికొచ్చే విలువైన భూమి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఈ భూములకు గజాల రేటులో లెక్కిస్తుంది. భూమి ఇప్పటికే లే అవుట్ ప్లాట్లుగా విడగొట్టి ఉంది. సమీపములో తోటలు కూడా ఉన్నాయి. భూమి గ్రామానికి దగ్గరలో ఉంది. పైగా మండల కేంద్రం కూడా. కాబట్టి ఎకరా 1కి మార్కెట్ విలువ రూ. 2,43,000/-గా నిర్ణయించడమైనది.

| | | |
|---|---|---|
| నిర్ధారించిన మార్కెట్ విలువ - ఎకరా | రూ. | 2,43,000 |
| 30% సొలేషియం | రూ. | 72,900 |
| 12% అదనపు మార్కెట్ విలువ (డి.యన్. 17.01.2008నుండి) | రూ. | 17,010 |
| నిర్ధారించిన ప్రాథమిక విలువ - ఎకరాకు | రూ. | 3,32,910 |

**జిల్లాస్థాయి కమిటీలో నిర్ణయం**

రైతులు ఈ రేటుకు అంగీకరించలేదు. అందువలన కలెక్టరుగారి అధ్యక్షతన జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీకి నివేదించడమైనది. 20.09.2008న జిల్లా కలెక్టరు గారి అధ్యక్షతన జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశమై ఎకరానికి రూ. 6,65,820/- ఇచ్చేందుకు నిర్ణయించింది. ఈ రేటుకు భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించారు.

**అవార్డు విచారణ**

భూసేకరణ చట్టం 9(1),10 సెక్షన్ నోటీసులు రాజుపాలెం తహశీల్దారు, మండలాభివృద్ధి అధికారి, సబ్ రిజిస్ట్రారు, స్టేషన్ హౌస్ ఆఫీసర్, గ్రామ పంచాయితీ మొదలైన ప్రభుత్వ కార్యాలయములో ప్రదర్శించడం జరిగింది. సెక్షన్ 9(3), 10ల ప్రకారం నోటీసులను భూ యజమానులకు కూడా అందజేసి 15.07.2008వ తేదీన అవార్డు విచారణకు హాజరు కావలసిందిగా కోరడం జరిగింది. 15.07.2008న భూ యజమానులు హాజరై వారి దగ్గర ఉన్న యాజమాన్య హక్కు పత్రాలను ఈ క్రింది విధంగా సమర్పించారు.

| వరు. నెం. | అవార్డుదారు పేరు తండ్రి/భర్త పేరు | సర్వే నెం. | క్లెయిం చేసిన విస్తీర్ణం | మొత్తం విస్తీర్ణం | 1బి | సమర్పించినహక్కుపత్రం | అవార్డుచేసిన దస్తావేజు మొత్తం |
|---|---|---|---|---|---|---|---|
| 1. | పోతంశెట్టి గోపయ్య తండ్రి కొండయ్య | 229/38-4ఎ | 1.00 | 1.00 | ... | 2651/66 | 6,65,820 |
| 2. | కన్నెగంటి రామయ్య తండ్రి నరసింహారావు | 229/38-4ఎ | 0.91 | 0.91 | ... | ... | 6,05,896 |
| 3. | కొర్రపాటి శ్రీనివాసరావు తండ్రి రాములు | 229/38-4ఎ | 0.79 | 902 | | ... | 5,25,998 |
| 4. | చల్లా పెదమస్తాన్ రావు తండ్రి లింగయ్య | 229/39-1బి | 1.11 | 1.11 | 808 | ... | 7,39,060 |
| 5. | బత్తుల వెంకటరమణ భర్త కరీముల్లారావు | 229/40-2 | 8.46 | 8.46 | ... | 48/07 5.1.07 | 56,32,837 |
| 6. | జంగం చెంచయ్య తండ్రి సుబ్బారావు | 229/40-2 | 1.69 | 1.69 | 600 | ... | 11,25,236 |
| | | **మొత్తము** | | **13.96** | | | **92,94,847** |

**సబ్ డివిజన్ రికార్డు దాఖలా ఈ క్రింది ఉదహరించబడిన సంబంధిత రైతులకు నష్ట పరిహారమును సంబంధిత అవార్డునందు పొందుపరచడమైనది.**

**1. సర్వే నెంబరు 229/38-4ఎ, య.1.00 సెంట్లు, భూమివిలువ రూ. 6,65,820/- పట్టాదారు మరియు అనుభవదారు : శ్రీ పోతంశెట్టి గోపయ్య, తండ్రి కొండయ్య**

శ్రీ పోతంశెట్టి గోపయ్య, తండ్రి కొండయ్య ఈ భూమికి పట్టాదారు మరియు అనుభవదారు అయి ఉన్నారు. అవార్డు విచారణకు ఇతను హాజరైనాడు. భూమికి తానే పట్టాదారుడనని, ఈ భూమిని పిడుగురాళ్ళ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ దస్తావేజు నెం. 2551/66, తేది 26.7.1966న శ్రీ మారబోయిన గురుస్వామి తండ్రి శీతయ్య గారి నుండి సర్వే నెం. 229/33-4ఎలో య.1.50 సెం. భూమిని కొనుగోలు చేసి, ఆనాటి నుండి యింతవరకు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచున్నానని, పేర్కొని ఉన్నారు. జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీలో నిర్ణయించిన భూమి విలువ ఎకరా 1 కి రూ. 6,65,820లు ఆమోదించి ఉన్నాడు. ఈ భూమి నష్టపరిహారం విషయమై వేరెవరూ క్లెయిం చేసి ఉండలేదు. కావున రూ. 6,65,820లు పరిహారాన్ని పట్టాదారైన శ్రీ పోతంశెట్టి గోపయ్యగారికి యిచ్చుటకు నిర్ణయించడమైనది.

**2. సర్వేనెంబరు 229/38-4ఎ, య.0.91 సెంట్లు, భూమి విలువ రూ. 6,05,896/- పట్టాదారు మరియు అనుభవదారు : శ్రీ కన్నెగంటి రామయ్య, తండ్రి నరశింహారావు**

శ్రీ కన్నెగంటి రామయ్య, తండ్రి నరశింహారావు ఈ భూమికి పట్టాదారు మరియు అనుభవదారు. అవార్డు విచారణకు ఇతను హాజరుకాలేదు. ఈ భూమికి తానే యజమాని అనేందుకు రుజువుగా పాస్‌పుస్తకం గానీ, మరియు దస్తావేజులు గానీ దాఖలు చేసియుండలేదు. అతని తరఫున ప్రతినిధులు కూడా ఎవరూ రాలేదు. కాబట్టి ఈ విలువను రెవెన్యూ డిపాజిట్‌నందు

ఉంచాలని నిర్ణయించడమైనది.

**3. సర్వేనెంబరు 229/38-4ఎ, య. 0.79 సెంట్లు, భూమివిలువ రూ. 5,25,998/-**
**పట్టాదారు మరియు అనుభవదారు : శ్రీ కొర్రపాటి శ్రీనివాసరావు, తండ్రి రాములు**

శ్రీ కొర్రపాటి శ్రీనివాసరావు, తండ్రి రాములు ఈ భూమికి పట్టాదారు మరియు అనుభవదారు. అవార్డు విచారణకు ఇతను హాజరైనాడు. భూమికి తానే పట్టాదారుడనని, అనుభవదారుడననీ ఈ భూమి తనకు వంశపారంపర్యంగా సంక్రమించిన పిత్రార్జితమనీ నష్టపరిహారం తనకు ఇప్పించవలసిందిగా కోరాడు. తానే ఈ భూమి యజమాని అనేందుకు రుజువుగా పాస్‌పుస్తకం మరియు దస్తావేజు నెం. 902ను దాఖలు చేశాడు. జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీలో నిర్ణయించిన రేటుకు తన భూమిని ఇచ్చేందుకు అంగీకరించాడు. ఇతనికి పోటీగా మరెవరూ ఈ భూమిని క్లెయిం చెయ్యలేదు కాబట్టి రూ. 5,25,998/-లు పరిహార మొత్తాన్ని ఇతనికి ఇవ్వడానికి నిర్ణయించడమైనది.

**4. సర్వేనెంబరు 229/39-1బి, య.1.11 సెంట్లు, భూమి విలువ రూ. 7,39,060/-**
**పట్టాదారు మరియు అనుభవదారు : శ్రీ చల్లా పెద మస్తాన్‌రావు, తండ్రి లింగయ్య**

శ్రీ చల్లా పెదమస్తాన్‌రావు తండ్రి లింగయ్య ఈ భూమికి పట్టాదారు మరియు అనుభవదారు. అవార్డు విచారణకు ఇతను హాజరైనాడు. ఈ భూమికి తానే పట్టాదారుడనని, అనుభవదారుననీ ఈ భూమి తనకు వంశపారంపర్యంగా సంక్రమించిన పిత్రార్జితమనీ నష్టపరిహారం తనకు ఇప్పించవలసిందిగా కోరారు. తానే ఈ భూమికి యజమాని అనేందుకు రుజువుగా పాస్‌పుస్తకం మరియు దస్తావేజు నెం. 808 దాఖలు చేశారు. జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీలో నిర్ణయించిన రేటుకు తన భూమిని ఇచ్చేందుకు అంగీకరించారు. ఇతనికి పోటీగా మరెవరూ ఈ భూమిని క్లెయిమ్ చెయ్యలేదు. కాబట్టి రూ. 7,39,060/-లు పరిహార మొత్తాన్ని ఇవ్వడానికి నిర్ణయించడమైనది.

**5. సర్వేనెంబరు 229/40-2, య.8.46 సెంట్లు, భూమి విలువ రూ. 56,32,837/-**
**పట్టాదారు మరియు అనుభవదారు : శ్రీమతి బత్తుల వెంకటరమణ, భర్త కరీముల్లారావు**

శ్రీమతి బత్తుల వెంకట రమణ, భర్త కరీముల్లా రావు ఈ భూమికి పట్టాదారు మరియు అనుభవదారు. అవార్డు విచారణకు ఈమె హాజరైనది. భూమికి తానే పట్టాదారుననీ, అనుభవ దారుననీ, ఈ భూమి తనకు వంశపారంపర్యంగా సంక్రమించిన పిత్రార్జితమనీ, నష్టపరిహారం తనకు ఇప్పించవలసిందిగా కోరారు. తానే ఈ భూమికి యజమాని అనేందుకు రుజువుగా పాస్‌పుస్తకం మరియు దస్తావేజు నెం. 48/2007, తేది 5.1.2007ను దాఖలు చేసినది. జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీలో నిర్ణయించిన రేటుకు తన భూమిని ఇచ్చేందుకు అంగీకరించినది. శ్రీమతి బత్తుల వెంకటరమణ రిజిస్టరు అయిన 8.46 ఎకరాల భూమిలో

తనకు 1.69 ఎకరాల వాటా ఉందనీ, ఈ భూమిని గురించిన తమ వ్యాజ్యం సి.యస్.ఆర్. 5639/2008 ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి వారి కోర్టులో నడుస్తున్నదనీ, అది తేలేదాకా పరిహార మొత్తాన్ని పంపిణీ చేయకుండా ఆపవలసిందిగా శ్రీ జంగం నల్ల కోటయ్య మరియు కిరణ్ కుమార్ అనేవారు 22.10.2008న పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టరును కూడా ప్రతివాదిగా చేర్చారు.

కాబట్టి 8.46 ఎకరాల భూమిలో కోర్టు దావాలో ఉన్న 1.69 ఎకరాలు మినహాయించి మిగతా 6.77 ఎకరాలకు రూ. 45,07,601 రూపాయల పరిహారం శ్రీమతి బత్తుల వెంకటరమణకు ఇవ్వాలని నిర్ణయించడమైనది. మిగతా 1.69 ఎకరాలకు రూ. 11,25,236 రూపాయల పరిహారం కోర్టు తీర్పు ఎవరి పక్షాన వస్తే వారికి ఇవ్వడానికి నిర్ణయించడమైనది.

**6. సర్వేనెంబరు 229/40-2, య.1.69 సెంట్లు, భూమి విలువ రూ. 11,25,236/-**
**పట్టాదారు మరియు అనుభవదారు : శ్రీ జంగం చెంచయ్య, తండ్రి సుబ్బారావు**

నంబర్ 600 పాస్‌పుస్తకం ప్రకారం ఈ భూమికి శ్రీమతి జంగం శ్యామల, భర్త కీ॥శే॥ సుబ్బారావు గారు పట్టాదారు. ఈమె 19.07.2008న చనిపోయారు. ఆమెకు 1. జంగం చెంచయ్య, 2. జంగం రాంబాబు ఇద్దరు కుమారులని తహశీల్దారు, పిడుగురాళ్ళ వారు ధృవపత్రం ఇచ్చారు. (ఎల్.పరి.6/1, తేది 26.09.2008). ఈ భూమికి చెందిన నష్టపరిహారం శ్రీ జంగం చెంచయ్యగారు పొందుటకు సరియైన వ్యక్తిగా తహశీల్దారు వారు ధృవీకరించి ఉన్నారు. వీరు జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీలో ఆమోదించిన భూమి విలువ రూ. 6,65,820/- ఆమోదించి ఉన్నారు. ఇతని సోదరుడు జంగం రాంబాబు నుండి నిరభ్యంతర వాంఙ్మూలము తీసుకున్న మీదట శ్రీ జంగం చెంచయ్య తండ్రి సుబ్బారావు గారికి నష్టపరిహారం యివ్వడానికి నిర్ణయించడమైనది.

**వడ్డీ**

ఈ భూములు యజమానులు సమ్మతించాక, నష్టపరిహారం చెల్లించాకే స్వాధీపరచు కుంటున్నందుకు వడ్డీ చెల్లించడం అనే ప్రశ్న తలెత్తదు.

**ఆదాయపన్ను**

వ్యవసాయేతర భూములపై కట్టడాలపై లక్ష రూపాయలు పైబడి ఆదాయం పరిహారంగా పొందే వారి జాబితాను ఆదాయపు పన్ను శాఖకు పన్ను విధింపు నిమిత్తమై పంపడం జరుగుతుంది గనుక మూలంలో పన్ను మినహాయింపు చేయడం లేదు.

**క్లరికల్ తప్పుల సవరణ సెక్షన్ 13ఎ (3)**

క్లరికల్ తప్పుల మూలంగా ఎవరికైనా ఎక్కువ మొత్తం చెల్లించినట్లు కనుక్కుంటే అలా ఎక్కువగా చెల్లించిన మొత్తాన్ని తిరిగి వసూలు చేయడం జరుగుతుంది. తిరిగి చెల్లించడానికి

నిరాకరించిన వారి నుండి రెవిన్యూ రికవరీ చట్టం ప్రకారం సదరు మొత్తాన్ని రాబట్టడం జరుగుతుంది.

**యాజమాన్య హక్కు మార్పిడి నమోదులు**

యాజమాన్య హక్కుదారుల పేర్లను మారుస్తూ శాశ్వత రెవెన్యూ రికార్డుల్లో రాజుపాలెం తహశీల్దారు నమోదులు చేయవలసి ఉంది.

**నిధులు**

హైదరాబాదు ఇంజనీరు ఇన్ ఛీఫ్ ఈ సేకరణకు అవసరమైన నిధులు సమకూర్చారు. కాబట్టి ఇకమీదట ఈ 13.96 ఎకరాల సేకరించబడ్డ భూమి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, పులిచింతల ప్రాజెక్టు, డివిజన్ నెం. 4, సత్తెనపల్లి వారి యాజమాన్యంలోకి మారిపోతున్నది.

పై విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని రూ. 92,94,847/-(రూపాయలు తొంభై రెండు లక్షల తొంభై నాలుగు వేల ఎనిమిది వందల నలభై ఏడు రూపాయలు మాత్రమే) ముసాయిదా అవార్డును 13.96 ఎకరాలకు పాస్ చేయడమైనది. ఈ మొత్తాన్ని ఈ క్రింద చూపిన ప్రభుత్వ శాఖలనుండి రాబట్టాలి.

**నిధుల కేటాయింపు**

| నిధులు కేటాయించిన అధికారి | ఎల్.ఓ.సి. ద్వారా కేటాయించినమొత్తం | ఖాతా పద్దు |
|---|---|---|
| ఇంజనీరు ఇన్ చీఫ్, నీటి పారుదలశాఖ ఐ & సిఎడి, ఎర్రమంజిల్, హైదరాబాద్ | రూ. 5.46 కోట్లు | MH-4701,Col.on M&MI 01-Major Irrigation MH-128, Pulichintala Project GH-11, Normal State Plan GH-500-501 Compensations |

10.11.2008న బహిరంగ కోర్టులో ప్రకటించడమైనది.

**నూర్‌బాషా రహంతుల్లా**

భూసేకరణాధికారి మరియు ప్రత్యేక ఉప కలక్టరు,

భూసేకరణ విభాగము - 1

డా॥ కె.ఎల్.రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టు

గుంటూరు

***జిల్లా కలెక్టర్ కార్యాలయాలలో "తెలుగులో రాయని ఫైళ్లు తిరస్కరిస్తున్నాం. ఫైలు ఆలస్యానికి మీరే బాధ్యులు" అని ముద్ర (స్టాంప్)ను తయారు చేశారా? లేదా? ఫలితం 'పాలనాభాష' సమాచార నేత్రానికి తెలియజేయండి.***

***- ఆం.ప్రద. అధికార భాషా సంఘం***

*(జనవరి, **2009**, పాలనాభాష (సమాచారనేత్రం))*

# 11. ఇంటి భాషంటే ఎంత చులకనో !

భాషను కేవలం కొన్ని కులాల వాళ్ళే పుట్టించరు. వివిధ కులాల వాళ్ళు వాళ్ళ వృత్తుల్ని బట్టి, అవసరాలను బట్టి పదాలను పుట్టిస్తూ, వాడుతూ ఉండటం వల్ల ఆ భాష అభివృద్ధి చెందుతుంది. అన్ని పదాలూ మా గ్రంథాల్లోనే ఉన్నాయనే అహంకారం పనికిరాదు. అన్ని కులాల వాళ్ల భాషనూ, వాళ్ళు వాడే పదాల్నీ నిజాయితీగల భాషా శాస్త్రజ్ఞుడు గుర్తిస్తాడు, గౌరవిస్తాడు. గ్రంథస్తం చేస్తాడు. కొన్ని కులాల వాళ్ళ భాషనూ, వాళ్ళు వాడే పదాలను అపహాస్యం చేస్తూ, నీచంగా భావిస్తూ, అసలు గ్రంథాల్లోకి ఎక్కతగని భాషగా చిత్రీకరిస్తూ, భాష సంపన్నం కాకుండా గతంలో అడ్డుతగిలారు. అలా అడ్డుతగిలే పని ఈనాటికీ చేస్తూనే ఉన్నారు. మన పల్లె భాషను గౌరవించుదాం. మన పక్కెలు, జెల్లలు, గెడ్డలు, మదుములు, పరసలు, వరజలు... ఇంకా నీచమని భావించి మన సంస్కృతాభిమాన పండితులు వదిలేసిన తెలుగు పదాలన్నీ తెలుగు నిఘంటువుల్లోకి ఎక్కిదాం.

కొల్లేరు ప్రాంతానికి వెళ్ళిన విలేఖరులకు అక్కడి ప్రజలు ఎన్ని రకాల చేపలు, పక్షుల పేర్లు చెప్పారో చూడండి : మట్టగిడస, కర్రమోను, బొమ్మిడాయి, శీలావతి, గొరక, ఇంగిలాయి, జెల్ల, బొచ్చె, జడ్డువాయి, చేదు పరిగె, కొరమీను, వాలుగ, పండుకప్ప, గండి బొగడ, కొయ్యంగ, మునుగపాము, గడ్డుగాయి, చేమరాయి, పొట్టిదిలాసు,కట్టినెరసు, బుడపార, చాకరొయ్య, గడ్డికొయ్య, మాల తప్పడాలు, ఏటిజెల్ల, మార్పులు, పల్లెంకాయ, పాలజెల్ల, పారాటాయి...

పరజ, గూడ, అసాబాతు, కళాయి, చేతన బాతు, నల్లముక్కులు, సముద్రపు చిలుక, నత్తకొట్టుడు...

“భాషా సమృద్ధే స్వతంత్రతా భీజం” అన్నారెవరో మహానుభావుడు. పై పదాలన్నీ తెలుగు పదాలు కావా? వృత్తి పదకోశాల్లోకి ఎక్కించడానికి గతంలో కొంత ప్రయత్నం చేశారు. ఏడాదికి సగటున 5 కొత్త యూనివర్శిటీలు ఏర్పడుతున్నా ఇండియాలో 7 శాతం మించి పి.జి. స్థాయికి చేరటం లేదు. దానికి కారణం పేదరికం కాదు, ఇంగ్లీషు భాషపై పట్టులేకపోవటమేనని రాష్ట్ర ఉన్నత విద్యాచైర్మన్ కె.సి.రెడ్డి అన్నారు. (ఆంధ్రజ్యోతి 18.10.2005)

అంటే ఇంగ్లీషు భాష మీద పట్టులేకపోతే మన దేశంలో ఏ వ్యక్తీ, అతనికి ఎంత జ్ఞానం, విజ్ఞానం ఉన్నప్పటికీ ఉన్నత విద్యలోకి ప్రవేశించలేడన్నమాట. ఇంగ్లీషొస్తేనే జ్ఞాని, విద్యావంతుడు. ఇంగ్లీషు రాకపోతే అజ్ఞాని, అనాగరికుడు అని మనమే నిర్ధారించుకుంటున్నాం. ఇంగ్లీషే అన్నింటికి మూలం అన్నట్లుగా మారింది పరిస్థితి.

తెలుగును ప్రాచీన భాషగా ప్రకటించాలని అన్ని పార్టీలవాళ్ళూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించారు. కేంద్రానికి పంపారు. కోర్టుకు గూడా వెళ్ళారు. కొద్దిరోజులకే జార్జిబుష్ హైదరాబాద్ రావటం, సిలికాన్ వ్యాలీలో ఉన్న ప్రతి ముగ్గురు భారతీయ ఉద్యోగుల్లో ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారేనని తేల్చటం, దిల్‌కుష్ అతిథి భవనంలో అమెరికా వెళ్ళటానికి వీసాలిచ్చే కేంద్రం పెడతామనటం, మన మధ్యతరగతి కుటుంబాలన్నిటికి 'ఇంగ్లీషు ఉచ్చు' బిగించిపోవటం చకచకా జరిగిపోయాయి. మరోసారి తాజాగా తెలుగుతల్లి సాక్షిగా ఉద్యోగాల కోసం మన పెద్దలు మొకరిల్లారు : ఇలా ఆంగ్లాన్ని స్తుతించారు.

*ఆంగ్లమేరా జీవితం – ఆంగ్లమేరా శాశ్వతం*
*ఆంగ్లమే మనకున్నది – ఆంగ్లమేరా పెన్నిధీ*
*ఆంగ్లమును ప్రేమించు భాయీ – లేదు అంతకు మించి హాయీ //ఆంగ్ల//*
*తెలుగును విడిచీ – ఆంగ్లము నేర్చీ*
*అమెరికా పోదామూ – బానిసలౌదామూ*
*డాలర్లు తెద్దామూ //ఆంగ్ల//*

అంటూ పాటలు కూడా పాడుతున్నారు. తెలుగుకంటే ఇంగ్లీషెందుకు ముద్దో కారణాలతో సహా వివరిస్తున్నారు.

1. తెలుగులో పెద్దగా విజ్ఞాన సాహిత్యం లేదు. తెలుగు భాషా దురభిమానం ప్రదర్శించడం తప్ప మన పాలకులు, పండితులు మన భాషలో పాలనకు పెద్దగా ప్రోత్సాహించటం లేదు. తెలుగులో చదివితే ఉద్యోగాలూ లేవు.
2. పెద్ద కులాలవాళ్ళు, ఆస్థిపరులు ఇంగ్లీషులో చదువుకుంటూ, పేదకులాల వాళ్ళకు ఇంగ్లీషు చదువులు దక్కకుండా చేయటానికి తెలుగు భాషా ఉద్యమాలు చేయిస్తున్నారు.
3. నిర్బంధ చట్టాలతో తెలుగుభాషను తేవాలని చూసినా, పారిభాషిక పదజాలం యావత్తూ సంస్కృతమయం చేస్తూ, పండితులు తెలుగుభాషను తెలుగువాళ్ళకు రాకుండా చేస్తున్నారు. తెలుగు చదువు కృత్రిమమై ఇంగ్లీషు చదువే సులువుగా ఉంటోంది.
4. దేశం మొత్తానికీ కలిపి ఒకే లిపిలేదు. మరో రాష్ట్రం వెళితే దుకాణాల బోర్డుల పేర్లు చదవాలన్నా ఇంగ్లీషు రావాల్సిందే. హిందీ కూడా అందరికీ రాదు. ఆంగ్ల లిపి పిల్లలకు సులభంగా వస్తుంది.
5. యవ్వనం వచ్చాక బాల్యావస్థకు తిరిగి వెళ్ళగలమా? ఇంగ్లీషొచ్చాక తెలుగెందుకు? ఆధునిక ప్రామాణిక తెలుగు భాష వచ్చాక ఎవరైనా ఇంటి భాషను కోరుకుంటారా? ఆంగ్ల పాలనలో ఎంతో ప్రావీణ్యం సంపాదించిన మన తెలుగుజాతి మళ్ళీ తిరిగి తెలుగుకు పరిమితమై కుంచించుకుపోవాలా? పద్దచన్నులెత్త బ్రహ్మవశమే?

6. కంప్యూటర్‌కు ఆంగ్లం అవసరం. ఇంగ్లీషు రానివాళ్ళు ఎందుకూ పనికిరాని వాళ్ళవుతారు. మనం విశ్వమానవులం. అధునాతన విశ్వచైతన్యాన్ని అందిపుచ్చుకోవాలంటే తెలుగును బలిచేసైనా ఇంగ్లీష్ నేర్వాలి.

7. అప్పడగా బోయిందీ అదీ ఒక తప్పా? ఇప్పుడు తెలుక్కొచ్చిన ముప్పేమీలేదు. మమ్మీ, డాడీ, ఆంటీ, అంకుళ్ళతో తెలుగు సంస్కృతికొచ్చే నష్టం ఏంటట? భాషోద్యమాలతో ఎందుకీ గోల? ఇదంతా ప్రాంతీయ దురభిమానంతో చేస్తున్న వేర్పాటువాదం. ఆంగ్లం వల్ల అధికారం, అధికారం వల్ల భాగ్యం కలుగుతాయి.

ఇక "మనం తెలుగువాళ్ళం" అనీ, "మన తెలుగును రక్షించుకుందాం" అనీ పోరాడే తెలుగు వీరులు చెప్పే సమాధానాలు ఏమిటి?

1. మాతృభాషను కాపాడుకోవటం భాషా దురభిమానం ఎలా అవుతుంది? అలాగయితే ఇంగ్లీషు వాళ్ళది భాషా సామ్రాజ్యవాదం కాదా? సొంతభాష కంటే మనకు ఇంగ్లీషే గొప్పగా కనబడటం బానిస మనస్తత్వం కాదా?

2. మన పాలకులు, అధికారులు డబ్బు సంపాదించటానికి మాత్రమే ఆంగ్ల విద్యను ప్రోత్సహించటం పడుపు కూడు తినటంతో సమానం. అత్యధిక జనాభా మాట్లాడేభాషను నాశనం చేస్తూ పరాయిభాషకు పట్టం గట్టడం అంటే పరస్త్రీ ముందు భార్యను అగౌరవపరచటం లాంటిది. ఇది భాషా వ్యభిచారం, అనైతికం, అసహజం, తెలుగు జాతి ప్రజల హక్కుల ఉల్లంఘన.

3. మన భాషను రక్షించుకోవాలంటే నిర్బంధ చట్టాలు ఉండాల్సిందే. ఇంటి భాషకు సైతం చోటు కల్పిస్తూ పారిభాషక పదజాలం మనం సమకూర్చుకోవాలి. ఇంగ్లీషుకంటే తెలుగే సులువుగా వస్తుంది. మన లిపిని కంప్యూటర్‌కు అనుకూలంగా మార్చుకోవాలి. అవసరమయితే ఆంగ్లలిపినే తెలుగుభాషకు వాడుకుందాం.

4. ప్రపంచవ్యాప్తంగా 15 కోట్ల మంది తెలుగు వాళ్ళున్నారు. 110 దేశాలకంటే మన తెలుగు నేల పెద్దది. ఎన్నో యూరోపియన్ దేశాల భాషలు తెలుగుకంటే చిన్నవే. వాటికున్న గౌరవం మర్యాదకూడా తెలుగుకు రాదా? మనల్ని మనమే కించపరచుకోవటం ఏమిటి?

5. తెలుగు పనికిమాలిన భాషా? దెబ్బ తగిలితే మమ్మీ అని కాకుండా అమ్మా అని ఎందుకరుస్తారు? వచ్చీరాని ఇంగ్లీషు నడమంత్రపు సిరి లాంటిది. బాల్యంలో తీరని కోరికల్ని యవ్వనంలోనైనా తీర్చుకోవాలి గానీ ఆంగ్ల ప్రావీణ్యం అనే యవ్వన గర్వంతో బాల్యాన్ని మరిచి, తల్లిభాషను అధోగతికి దిగజార్చటం ఏరుదాటాక తెప్ప తగలేసే లక్షణం.

6. మన సాహిత్యం, చరిత్ర, విజ్ఞానం, విద్య, పరిపాలన మన భాషలోనే ఉండాలి. కంప్యూటర్ కోసం తెలుగును బలిపెట్టటం ఎలుకలున్నాయని ఇంటిని తగులబెట్టడంతో సమానం.

కంప్యూటర్‌నే తెలుగులోకి వంచుతాం. ఎన్నో భాషల గ్రంథాలు ఇంగ్లీషులోకి అనువదించుకున్నారు. అవసరం అటువంటిది.

7. ఇక్కడ చదివి ఎక్కడికో వెళ్ళి సేవలు చేసే మనస్తత్వం స్వజాతికి ద్రోహం. తెలుగులోనే ఇంజనీరింగు, వైద్యశాస్త్రాలు చదివి తెలుగు ప్రజలకే సేవ చేయగలిగితే మన భాషతో పాటు మన జాతి  వికసిస్తుంది గదా? మీ భోగ భాగ్యాల కోసం తెలుగు ప్రజలందర్నీ ఇబ్బందులకు గురి చేస్తారా? వారి మీద మోయలేని భారం మోపుతారా? వారి భాషను నాశనం చేసి వాళ్ళను మూగవాళ్ళుగా చేస్తారా? మాతృభాషకు ప్రాథమిక విద్యలో కూడా స్థానం లేకుండా చేసే వాళ్ళది ఇంటి కూడు తిని ఎవరి వెంటో పడే తత్వం కాదా? ఇది ప్రజాద్రోహం కాదా?

"మాతృభాషాతృణీకారం మాతృదేవీ తిరస్కారం" అన్నారు మహాత్మాగాంధీ. "మాతృభాష సరిగా నేర్చుకోని వాళ్ళకు ఇతర భాషలు కూడా సరిగా రావు" అన్నారు జార్జి బెర్నార్డ్‌షా. మన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంఘ్వీ ఇలా అన్నారు. "మాతృమూర్తికి ఎంతటి గౌరవం ఇస్తామో మాతృభాషకు అంతటి సమున్నత స్థానం దక్కాలి. నేను తల్లితో సమానంగా తల్లిభాషనే గౌరవిస్తాను. అందరూ మాతృభాషలో మాట్లాడండి. న్యాయస్థానాల్లో వాదనలు కార్యకలాపాలు ఆంగ్లంలో కొనసాగడమేంటి? ఇంకా ఎంతకాలం ఈ దారుణం? న్యాయస్థానాల్లో వ్యవహారాలు సామాన్యుడి భాషలో కొనసాగినపుడే సామాన్యుడికి న్యాయం అందివ్వగలం."

("అమ్మనే మరుస్తారా!" ఈనాడు 27.2.2006)

అమ్మ భాషను మనవాళ్ళు మరచిపోతుంటే ఫ్రాన్సు నుండి పెద్దాపురం వచ్చి బుర్రకథ మీద, తెలుగుభాష మీద పరిశోధన చేస్తున్న డాక్టర్ డానియల్ నెగర్స్ ఇలా అంటున్నారు. "తెలుగునేల మీద విదేశీ భాషలు నేర్చుకోడానికి సీఫెల్ వంటి సంస్థలు పనిచేస్తున్నాయి గానీ, తెలుగుపై మక్కువతో వచ్చే విదేశీయులకు తెలుగు నేర్పేసంస్థ ఏదీఇక్కడ కనిపించలేదు. అమెరికా పలుకుబడి, ఆంగ్లభాష ప్రపంచంలోని అన్ని భాషా సంస్కృతులకు నష్టం కలిగిస్తోంది. ప్రపంచీకరణ పేరుతో ప్రతి ప్రాంతానికీ ఈ ప్రమాదం విస్తరిస్తోంది. ప్రస్తుతం ప్రపంచంలో రెండువేల భాషలున్నాయి. మరో వందేళ్ళు ప్రపంచీకరణ దాడి ఇలాగే కొనసాగితే 200 భాషలే మిగులుతాయి. భాషల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవ అవసరం. ఫ్రెంచి, తెలుగు భాషలు దాదాపు ఒకే సమయంలో సాహిత్య బాషలుగా పరిణితి చెందాయి. అయితే ఫ్రెంచిభాషను ప్రపంచంలో ఎక్కడయినా నేర్చుకునే వీలుందికానీ తెలుగును తెలుగు నేలపై నేర్చుకోవడమే కష్టంగా ఉంది. ఎంతో ప్రాచీనమైన తెలుగుభాష ఉనికిని కాపాడుకోవాలి. ఆంగ్లభాషను రుద్దడం వల్ల భాషల మధ్య ఘర్షణ తప్పదు." (ఆంధ్రజ్యోతి 22.2.2006)

ప్రపంచంలోని అన్ని భాషల కంటే ఎక్కువగా ఆంగ్లభాషలో 7,90,000 పదాలున్నాయట.

వాటిలో 3 లక్షల పదాలు సాంకేతికమైతే, 4,90,000 పదాలు వాడుకలో ఉన్నాయట. అయితే భాషాశాస్త్రజ్ఞుల లెక్క ప్రకారం ఏ ఒక్కరూ తమ జీవితకాలంలో 60 వేలకు మించి రాయడంలో కానీ, చదవడంలో కానీ ఉపయోగించలేరట. అంటే అరవై వేల అవసరమైన పదాలను రాయడంలో, చదవడంలో ఉపయోగిస్తూ ఉంటే భాషను సజీవంగా కాపాడుకోవచ్చు.

మెదక్ జిల్లా రాయికోడు మండలం షంషుద్దీన్‌పూర్ గ్రామనివాసి ఏర్పుల కమలమ్మ 50 రకాల విత్తనాలు సాగుచేసి సరఫరా చేస్తోందట. విత్తనాల పేర్లు చూడండి : "తైదలు, ఉలవలు, సజ్జలు, పచ్చజొన్నలు, తోక జొన్నలు, తెల్లమల్లెజొన్న, ఎర్రజొన్న, బుడ్డజొన్న, అత్తకోడళ్ళ జొన్న, నల్లతొగరి, ఎర్రతొగరి, తెల్లతొగరి, అనుములు, కొర్రలు, బొబ్బర్లు, పెసర్లు, వడ్లు, తెల్లనువ్వులు, ఎర్రనువ్వులు, గడ్డినువ్వులు, పుంట్లు, శనగలు, ఆవాలు, తెల్లకుసుమ, ధనియాలు, వాము, బటాని, సిరిశనగ, మిరప, కోడిసామలు, పల్లీలు, గోధుమ, సాయిజొన్న, నల్లకుసుమ, అవిశలు, లంకలు, సిరిశనగ" (వార్త 6.3.2006)

ఈ తెలంగాణా తల్లికి ఏమి ఇంగ్లీషొచ్చు? అయినా ఈ తెలుగు "నేల తల్లులు" ఎన్నో వందల ఏళ్ళ నుండి మొక్కల పేర్లు, విత్తనాల పేర్లు మక్కువగా గుర్తు పెట్టుకొని వ్యవసాయం నడపలేదా? ఇంగ్లీషు, లాటిన్ పదాలకిచ్చిన ప్రాముఖ్యత, ప్రాధాన్యత మన తెలుగు పదాలకు కూడా ఇవ్వలేకపోవటానికి కారణం ఏమిటి? మనం మనకి అర్థం కాకపోయినా, ఇంగ్లీషు వాళ్ళకు అర్థం కావాలి. ఈ బాబేలు దేశంలో భారతీయులంతా ఒకరికొకరు అర్థం కావాలంటే ఇంగ్లీషే మంచిదనే నిర్ణయానికొచ్చారు. భాషాప్రయుక్త రాష్ట్రాలన్నీ ప్రత్యేక దేశాలుగా ఉంటే మొగలులు, బ్రిటీష్ వాళ్ళు రాకముందున్నట్లుగా ఉంటే, ఎవరి భాషకు వాళ్ళు పట్టం గట్టేవాళ్ళే. ఇప్పుడది సాధ్యంకాదు కాబట్టే మన భాషలకు ఇంగ్లీషు సారథ్యం వహిస్తోంది.

తెలుగు భాషకు మూలపురుషులు ఎవరు? యానాదులు. తెలుగుభాషను నిత్యమూ వాడుతూ బ్రతికిస్తున్నది ఎవరూ? వివిధ కులవృత్తుల్లో ఉన్న శ్రామికులు, గ్రామీణులు. అరవైవేలు కాదు దాదాపు 3 లక్షల పదాలు వీళ్ళంతా కలిసి వాడుతున్నారు. వీళ్ళందరూ వాడుతున్న పదాలలో కొంత వరకూ వివిధ పదకోశాల్లోకి ఎక్కాయి. ఇంకా రక్షించుకోవాల్సిన పదజాలం ఎంతో ఉంది. మాటకు ప్రాణము వాడుక. వాడుక ఎప్పుడు జరుగుతుంది? మన పంచాయితీలు, న్యాయస్థానాలు, అసెంబ్లీ అన్నీ తెలుగులో నడిచినపుడు. కనీసం మన పిల్లలకు ప్రాథమిక విద్య అయినా తెలుగులో అందించినపుడు.

ప్రైవేట్ స్కూళ్ళు తెలుగు నేర్పవు. మార్కుల కోసం కళాశాల విద్యార్థులు సంస్కృతం రెండోభాషగా తీసుకుంటున్నారు. సంస్కృత పరీక్షలో జవాబులు తెలుగు, ఇంగ్లీషు లిపుల్లో దేంట్లోనైనా రాయొచ్చుట. మార్కులు బాగా వేస్తారట. హిందీ పరీక్షకైతే 20 మార్కులు తెచ్చుకున్నా పాస్ చేస్తున్నారు. మరి ఈ రకం రాయితీలు, ప్రోత్సాహకాలు మన తెలుగు భాషకే ఇవ్వవచ్చుగదా?

కర్నాటకలో కన్నడ మాతృభాషకాని వాళ్ళైనా సరే కన్నడాన్ని మూడో భాషగానైనా చదవాల్సిందేనట. మరి మన రాష్ట్రంలో?

కర్నాటకలో కన్నడం లేకుండా హైస్కూలు విద్య పూర్తికాదు. పైగా 15 శాతం మార్కులు కన్నడానికి ప్రోత్సాహకంగా ఇస్తున్నారు. తమిళనాడులో ఎనిమిదవ తరగతిదాకా తమిళాన్ని ఒక భాషగా నిర్బంధం చేశారు. కోయ, గోండు, కొలామి, ఆదివాసి, ఒరియా, సవర, బంజారా, కొండ, కువి మొదలైన గిరిజనులకు వారి మాతృభాషల్లోనే మన రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ముద్రించి బోధిస్తోంది. ఇదే పని తెలుగు పిల్లలకు కనీసం అయిదో తరగతి వరకు నిర్బంధం చేస్తే బాగుంటుంది. ప్రైవేట్ స్కూళ్ళమీద కర్నాటక, తమిళనాడు ప్రభుత్వాలు ఎలా వ్యవహరిస్తున్నాయో మన ప్రభుత్వం కూడా అలానే వ్యవహరించాలి.

"భాషను సాహిత్యానికీ కవిత్వానికీ పరిమితం చేస్తే భాషతోపాటు దాన్ని మాతృభాషగా కలిగిన వారు కూడా వెనుకబడిపోతారు. భాషను ఉపాధితో ముడిపెట్టండి" అన్నారు మౌలానా అబుల్ కలాం ఆజాద్.

గిడుగు రామ్మూర్తి జయంతి ఆగస్టు 29ని "తెలుగు భాషా దినోత్సవం" గానూ, కాళోజీ జయంతి సెప్టెంబరు 19ని "తెలుగు మాండలిక భాషా దినోత్సవం" గానూ జరుపుకుంటున్నాము. ఇంటిభాస ఎసుంటిదైనా మందే కదా? ఆదరిచ్చుదాం. ఇంపుగా నేరుద్దాం. ఇంగిలీసు నేర్చుకోటల్లా? అట్టా.

***(31.3.2006, గీటురాయి వారపత్రిక)***

**ఆంధ్రత్వం అన్ని దిశల ఆలోచన రేపగా**
**తెలుగుల అభిమాన ధనం దిక్కుల వ్యాపించగా**
**ఇదే ఇదే నాదేశం ఇదే ఆంధ్ర దేశం**
**తరతరాల చరిత్రలో తడిసిన సందేశం**

**-నాగభైరవ కోటేశ్వరరావు**



# 12. అధికార భాషా కార్యశీలి ప్రసాద్

ఏ తరానికా తరం విద్యార్థులు తెలుగులో చదువుతుంటేనేగదా తెలుగు బ్రతికేది? తెలుగుమీడియంలో చదివితే ఉద్యోగాలు రావనే భయం వెన్నాడుతుంటే మన పిల్లలు తెలుగులో ఎందుకు చదువుతారు? రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగపరీక్షలు, నియామకాలన్నింటిలో తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు 5 శాతం అదనపు మార్కులిస్తే తెలుగు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా భవిష్యత్తులో కార్యాలయాల్లో తెలుగు వాడకం పెరుగుతుంది.

మన రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షునిగా ఎ.బి.కె. ప్రసాద్ గారు బాధ్యతలు చేపట్టిననాటి నుంచీ, తెలుగు భాషకు అన్నీ శుభాలు చేకూరుతున్నాయి. అవధానాలతో, అర్థంకాని కవిత్వాలతో కాలం గడిపే వ్యక్తికాదీయన. కార్యశీలి, ప్రణాళికా బద్ధంగా, నిర్దుష్టమైన కార్యక్రమాలతో, ఒక్కొక్క పనీ సాధించుకుంటూ ముందుకెళుతున్నారు. అందుకే ఆయన్ని మరో "వావిలాల" అంటున్నారు.

కరీంనగర్ జిల్ల సిరిసిల్ల ఆర్డీవో నాగేందర్ 150 పేజీల రిట్‌ను తెలుగులో రూపొందించి హైకోర్టులో దాఖలు చేస్తే, దానిని హైకోర్టు కూడా సదభిప్రాయంతో స్వీకరించింది. ఇందుకు ఎ.బి.కె. ప్రసాద్ హర్షం వ్యక్తం చేస్తూ, ఆర్డీవోకు అభినందనలు తెలియజేశారు. (ఈనాడు 28.6.2006) ఇలాంటి వారిని గుర్తించడం, ప్రోత్సహించడం ఎ.బి.కె. చేస్తున్న మంచిపని. తెలుగులో కోర్టు వ్యవహారాలు నడపాలని ఆయన గతంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని స్వయంగా కలిసి కోరారు. కొంత మేరకు ఒప్పించారు కూడా.

నేను మొగల్తూరు ఎమ్మార్వోగా పనిచేసినప్పుడు, 1994 ప్రాంతాల్లో హైకోర్టులో మాపై దాఖలైన రిట్‌పిటీషన్లన్నింటికీ తెలుగులో జవాబులిచ్చాను. అయితే తెలుగులో ఉండే ప్రతివాదాలను హైకోర్టు స్వీకరించదు అని జిల్లా అధికారులే వాదించి, వాటన్నింటినీ ఇంగ్లీషులోకి తర్జుమా చేయించి హైకోర్టులో దాఖలు చేశారు. ఎ.బి.కె. ప్రసాద్ అలాంటి దురవస్థ తెలుగు అధికారులకు లేకుండా చేశారు. హైకోర్టులో కూడా తెలుగు స్వేచ్ఛగా వాడే రోజు రావాలి.

ప్రసాద్ గారు న్యాయస్థానాల్లో తెలుగు అర్జీల నమూనాలు తయారు చేయించారు. ఈ నమూనాలను పోలీసు స్టేషన్‌లోను, కోర్టులోనూ ఉపయోగించాలని, 1974 నాటి జీవో ప్రకారం వాదోపవాదాలు, తీర్పులు తెలుగులోనే జరపటానికి సహకరించాలని రాష్ట్ర బార్

కౌన్సిల్ అధ్యక్షుడు ఎ.నరసింహారెడ్డిని కోరారు. అన్ని జిల్లాల న్యాయవాద సంఘాలకు నమూనాల కాపీలను పంపించారు (ఈనాడు 29.6.2006). ఇది ఎంతో సంతోషించాల్సిన విషయం. ఇకమీదట మన అధికారులు తెలుగులోనే ప్రతివాదాలు రాసి ప్రభుత్వ న్యాయవాదుల్ని తెలుగులోనే కోర్టులో దాఖలు చేయమని కోరాలి.

24 పేజీలతో అధికారభాషా సంఘం, తెలుగు మాసపత్రిక ప్రారంభించబోతున్నదని ఎ.బి.కె. ప్రసాద్ వెల్లడించారు. ఇందువల్ల నిరంతరాయంగా తెలుగు పురోభివృద్ధికై అధికారభాషా సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రజలకు తెలుస్తుంటాయి. ప్రజలనుండి సూచనలు అందుతుంటాయి. పాలకులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ కొత్తచట్టాలు చేయడానికి ఉద్యుక్తులవుతారు.

21.2.2006న "తెలుగు అధికారభాష కావాలంటే" అనే నా పుస్తకాన్ని తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ వారు ప్రచురిస్తే, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఎ.బి.కె. ప్రసాద్ గారు ఆవిష్కరించారు. ఆనాటి సభకు హాజరైన రాజకీయ నాయకులు మండలి బుద్ధప్రసాద్ గారు, పీతాని సత్యనారాయణ గారు, పాలకొల్లు ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జీగారు. వారికి నేను మనవి చేసిందేమిటంటే, "తెలుగు భాషాభివృద్ధి కోసం ఎబికె చేసే ప్రతిపాదనలకు అన్ని పార్టీల వాళ్ళూ మద్దతిచ్చి చట్టాలు చేయండి" అని. తెలుగుకు ప్రాచీనభాష హోదా సాధన కోసం అన్ని పార్టీల ప్రతినిధులు కలిసి ఢిల్లీ వెళ్ళి ప్రధానికి విజ్ఞప్తి చేసి వచ్చినట్లే, తెలుగుకు సంబంధించి మన ఇంట్లో, మన రాష్ట్రంలో సరిచేసుకోవాల్సిన విషయాలపై కూడా కలిసి రావాలి. ఈ క్రింది విషయాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**1. తెలుగు సాఫ్ట్‌వేర్ తయారీదారులు :** టైపు చేయడం రాని వాళ్ళు కూడా ఇంగ్లీషు కీబోర్డు మీద ఒంటిచేత్తో కొడుతూ ఏదో రకంగా తమ పని పూర్తి చేస్తుంటారు. ఆ స్థాయికి తెలుగు కీబోర్డు ఎదగాలి. తెలుగు కీబోర్డును ప్రమాణీకరించి స్థిరపరచాలి. వివిధ రకాల ఫాంట్లను ప్రభుత్వం కొనుగోలు చేసి అన్ని కార్యాలయాలకు సరఫరా చెయ్యాలి. విశ్వవిద్యాలయాల్లోని తెలుగు విభాగాలను, తెలుగు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను కలిసి పరిశోధన మరియు అభివృద్ధి కోసం పురమాయించాలి.

**2. లిపి సంస్కర్తలు :** గుణింతాలు, వత్తులు కంప్యూటర్‌లకు కొరుకుడు పడే విధంగా లిపినైనా మార్చాలి లేదా వాటిని సరళంగా సులభంగా టైపు చేయగలిగేలా సాఫ్ట్‌వేర్‌ల తయారీనైనా, ముమ్మరం చెయ్యాలి. తమిళులు ఈ రెండు పద్ధతులూ పాటించి ముందుకెళ్ళారు కాబట్టే వాళ్ళ పుస్తక ప్రచురణ వేగం మనకంటే మూడురెట్లు ఉంటుంది.

**3. తెలుగు టైపిస్టులు :** టైపుమిషన్లు, కంప్యూటర్ల మీద తెలుగులో టైపు చేయగల యువతీ యువకులు వేలమంది రాష్ట్రంలో ఉన్నారు. తెలుగు పత్రికారంగం వీళ్ళ వల్లనే నడుస్తోంది.

ప్రతి కార్యాలయానికీ, కోర్టుకూ, పోలీస్‌స్టేషనుకూ తెలుగు టైపిస్టు తప్పనిసరిగా ఉండేలా చేస్తే అటు తెలుగువాళ్ళకు ఉపాధీ,ఇటు భాషాభివృద్ధి రెండూ సాధ్యమవుతాయి.

**4. తెలుగు మీడియం విద్యార్థులు :** ఏ తరానికా తరం విద్యార్థులు తెలుగులో చదువుతుంటేనే గదా తెలుగు బ్రతికేది? తెలుగుమీడియంలో చదివితే ఉద్యోగాలు రావనే భయం వెన్నాడుతుంటే మన పిల్లలు తెలుగులో ఎందుకు చదువుతారు? రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగపరీక్షలు, నియామకాలన్నింటిలో తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు 5 శాతం అదనపు మార్కులిస్తే తెలుగు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా భవిష్యత్తులో కార్యాలయాల్లో తెలుగు వాడకం పెరుగుతుంది.

**5. నిఘంటుకర్తలు :** నిఘంటువులు శాస్త్రాలవారీగా ప్రచురించే వాళ్ళను ప్రోత్సహించాలి. తెలుగు అకాడమీ వృత్తిపదకోశాల ప్రచురణలో ఎంతో కృషి చేసింది. మారుతున్న కాలంతోపాటు, కొత్తగా వచ్చి పడే పదాజాలాన్నీ ఎప్పటికప్పుడు చేర్చుకుంటూ మన తెలుగు నిఘంటువుల్ని తాజా పరచుకోవాలి. తెలుగు విశ్వవిద్యాలయంతో పాటు, విశ్వవిద్యాలయాల్లోని తెలుగు విభాగాలన్నింటికీ నిఘంటువుల నవీకరణ పని అప్పజెప్పాలి.

అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఈ అంశాలన్నింటినీ సాధించటం కోసం వాటికి సంబంధించిన నిపుణులెందరినో సంప్రదించాలి, సమన్వయపరచాలి. అధ్యక్షపదవి అలంకరించినప్పటి నుండీ అలుపెరుగకుండా నిరంతరం మన భాషాభివృద్ధికోసం శ్రమిస్తున్న ఎబికె ప్రసాద్ అభినందనీయులు. అతనిలో సదాలోచనలున్నాయి. సమర్థిద్దాం. అన్నె భవానీ కోటేశ్వరప్రసాద్ గారి జన్మదినం ఆగస్టు 1 నాటికి మరో మంచి కార్యక్రమం చూద్దాం.

***(4.8.2006, గీటురాయి వారపత్రిక)***

ఉర్దూ - తెలుగు నిఘంటువు 1938లో వరంగల్ ఉస్మానియా కాలేజీలో అరబిక్ ప్రొఫెసర్ ఐ. కొండలరావు సంకలనపరచి ప్రచురించిన పురాతన ప్రతిని తెలుగు అధికార భాషా సంఘం ఏబికె. ప్రసాద్ గారికి 6.10.2008న అందజేశాను. 2009 ఏప్రిల్ 25వ తేదీన 862 పేజీలతో ఈ నిఘంటువును పునర్ముద్రించి అధికారభాషా సంఘం అధ్యక్షుడు ఏబికె ప్రసాద్ గారు విడుదల చేశారు. తెలుగు-ఉర్దూ నిఘంటువు కూడా వస్తే బాగుంటుంది. 9.1.2012న విజయవాడ పుస్తక మహోత్సవంలో "తెలుగు ఖురాన్" (మల్లిక్ గారి అనువాదం)ను ఆవిష్కరిస్తూ గీటురాయి లాంటి ధార్మిక సంస్థలు కూడా ఇలాంటి నిఘంటువులు ప్రచురించాలని కోరాను.

# 13. కంప్యూటర్లో తెలుగు-తెలుగు వెబ్ సైట్లు

తెలుగు భాషలో మంచి సాంకేతిక పరికరాలు వచ్చాయి. కొన్ని సమస్యలు తీరాయి. ఇంకా కొన్ని సమస్యలు తీరాలి. తెలుగులో ఇంకా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి కావాలి. కొన్ని భాషా వ్యాపారసంస్థలు తమ వెబ్‌సైట్లలోని వ్యాసాలని సేవ్ చేసుకునేందుకు దారి ఇవ్వటం లేదు. కాపీ చేసుకోవటాన్ని అరికట్టడానికి డైనమిక్ ఫాంటుని ఎంచుకుంటున్నారు. నాగార్జున వెన్న, uni.medhas.org లాంటి వారు వారి ఫాంటుకి పద్మ ఎక్స్టెన్షన్‌లో సపోర్ట్ కలిగిస్తే ఫైర్‌ఫాక్స్ లో యూనికోడులో కనిపించేవి. వాటిని అప్పుడు యూనికోడులో సేవ్ చేసుకోగలిగేవారు. ఈ సంగతి గమనించిన వ్యాపారస్తులు ఆ ఫాంటుని తొలగించి, పనికట్టుకుని వేరే ఎన్‌కోడింగ్ కల వేరే ఫాంటుని ఉపయోగించటం మొదలుపెడుతున్నారు. ప్రజల విన్నపాలను కూడా తిరస్కరిస్తున్నారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న తెలుగు భాష సాంకేతిక విజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి రానివ్వకపోవడం విచారకరం.

ఆపరేటింగ్ సిస్టమ్‌లలో తెలుగును స్థాపించడం :

http://omicronlab.com/download/tools/iComplex 2.0.0.exe. ఇక్కడి నుండి "iComplex_2.0.0.exe" ఫైల్ డౌన్‌లోడ్ చేసుకుని మీ సిస్టమ్‌లో ఇన్‌స్టాల్ చేసుకోండి.

లిప్యంతరీకరణ ఉపకరణాలు :

ఇవి మీరు ఇంగ్లీష్ లో టైపు చేస్తూ పోతూ ఉంటే, తెలుగులోకి మారుస్తాయి. అంటే, "telugu" అని టైపు చేసి స్పేస్ కొట్టగానే "తెలుగు"గా మారుస్తాయి. లేఖిని ఉపకరణాన్ని offline లో కూడా వాడుకోవచ్చు. లేఖిని ని తిరగేస్తే నిఖిలే.తెలుగు చదవడం రానివారికి తెలుగు సందేశాన్ని నిఖిలే ఇంగ్లీష్ ఉచ్ఛారణలోకి మార్చి పెడుతుంది.

http : //lekhini.org/nikhile.html

లేఖిని :http : //lekhini.org /

itrans -- http : //www.aczoom.com/itrans/html/tlgutx/tlgutx.html

ఇప్పుడు ఇంటర్నెట్‌లో అన్ని బ్రౌజరులు యూనికోడ్‌ను అర్థం చేసుకుంటున్నాయి. కాపీ పేస్టు బాధ లేకుండా, డైరెక్ట్‌గా మెయిల్ విండోలోనే, తెలుగులో టైపు చెయ్యవచ్చు.

గూగుల్ ఇండిక్ లిప్యంతరీకరణ : http : //google.com/transliterate/indic/telugu,

క్విల్‌పాడ్ --http://quillpad.com/telugu/#

స్వేచ్ఛ –http://swecha.org/input/index.html,http://atcweb.atc.tcs.co.in/opensource-downloads

యంత్రం – http://www.yanthram.com/te/

లిపిక్.ఇన్ --http://lipik.in/telugu.html

ఇన్‌స్క్రిప్ట్ -- http://telugublog.blogspot.com/2006/03/xp.html

బరహా - http://www.baraha.com/download.htm

అనుమాడ్యూలర్ - http://crossroads.koodali.org/2007/11/18/typing-unicode-telugu-using-other-keyboard-layouts/

అను ఆపిల్ - http://crossroads.koodali.org/2007/12/25/apple-keyboard/layout/

అక్షరమాల - http://groups.google.com/group/aksharamala

తెలుగు లిపి - http://www.telugulipi.net/

జనగణమన - http://www.janaganamana.net/TeluguJgm.aspx

లినక్స్‌లో -- http://www.swecha.org/wiki/index.php?title=Input

అక్షర్ - http://www.kamban.com.au/

TDIL -- http://www.ildc.in/Telugu/TLindex.aspx

Microsoft - Indian Language input tool -- నేరుగా తెలుగులోనే MS world, Excell లలో టైపు చేసుకోవచ్చు.

లిపులు - లిప్యంతరీకరణ :

అక్షర రూపాల్ని ఫాంట్లు అంటారు. బిట్‌మాప్ (Bit Map), ట్రూ టైప్ (True Type), ఓపెన్ టైప్ (Open Type) ముఖ్యమైన రకాలు. Akshar Unicode, Code 2000, Gautami, Pothana, Raghu Telugu, Saraswati 5, Vemana 2000, RTS, Unicode, ISCII, ITRANS, TSCII, TAB&TAM, ఈనాడు ఫాంటు, వార్తా ఫాంటు, శ్రీలిపి, ఐ-లీప్, అనుపమ వగైరా వగైరా. ఇలా బోల్డన్ని ఫాంట్లు. కానీ ఇప్పుడు యూనీకోడ్ ప్రపంచభాషల్లో చాలావాటికి ప్రామాణికాలేర్పరిచింది. వెన్న నాగార్జున గారు (vnagarjuna@gmail.com) ఫాంట్లన్నిటినీ యూనీకోడ్‌కి మార్చేలాగా పద్మ ఉపకరణం తయారుచేశారు. పద్మ అన్ని భారతీయ భాషల్లోనూ కలిపి దాదాపు 80 ఫాంట్లను యూనీకోడ్‌కి మార్చగల సామర్థ్యానికి ఎదిగింది. http://padma.mozdev.org/.

**హరివిల్లు :**

అను2యూనికోడ్ : అను 6లో గానీ 7లో టెక్స్ట్ ఫార్మాటులో ఉన్న ఫైళ్ళను ఇది యూనీకోడులోకి మారుస్తుంది.

Excel-to-Wiki Converter : http://excel12wiki.net/ ఎక్సెల్ షీటు యధాతథంగా పేస్టు అవుతుంది.

ఈమాట - Non-Unicode Font to Unicode Converter --
http://eemaata.com/fornt2unicode/index.php5,

http://www.eemaata.com/unicode/rts2unicodeExt.html
http://uni.medhas.org/fileconverterindex.php5
Anu veekshanam, Anu rahamthulla version, Anu ATA souvenir version, Anu rangesh konaversion, Tikkana లాంటి కొన్ని అను ఫాంట్ల సమస్య కొలిచాల సురేశ్ (suresh.kolichala@gmail.com) గారివల్ల తీరింది. పలానా పలానా సమస్యలను పరిష్కరించండి అంటూ సాంకేతిక నిపుణుల్ని అడిగేవాడిని. 2009లో అను నుండి యూనికోడ్ లోకి మార్చే ఒక దానికి anurahamthulla version అని నా పేరు కూడా పెట్టారు. ఫాంట్లపై పేటెంట్ రైట్లు గల వ్యాపార సంస్థల వారు ఆయా ఫాంట్లను అందరినీ ఉచితంగా వాడుకోనిస్తే, యూనికోడ్ లోకి మార్చనిస్తే తెలుగు భాషకు సేవ చేసినవారవుతారు.

అనువాద ఉపకరణాలు, నిఘంటువులు, లెక్కకు మిక్కిలిగా రావాలి. ఆన్‌లైన్ లోనూ ఆఫ్‌లైన్ లోనూ వాటిని విరివిగా లెక్సికన్లు వాడుకునే సౌలభ్యాలు కలగాలి.

**యూనీకోడ్ లోకి మారుదాం :**

రకరకాల కీబోర్డులు, ఫాంట్లతో తెలుగు భాషలో కుస్తీపడుతున్నాము. ఈ అవస్థ మనకు తీరాలంటే మనమంతా యూనీకోడ్‌లో మాత్రమే మన పుస్తకాలను ప్రచురించమని కోరాలి. అలా చేస్తే ప్రపంచంలో తెలుగువాళ్ళు ఎక్కడినుండైనా తెలుగు పుస్తకాలను, వ్యాసాలను కంప్యూటర్, ఇంటర్నెట్ లలో సులభంగా చదవగలుగుతారు. వ్రాయగలుగుతారు. విషయాలను వెతుక్కో గలుగుతారు.

రాష్ట్రంలోని ప్రభుత్వ వెబ్‌సైట్లను తెలుగులోకి అనువదించనున్నారు. ఇక నుంచి ప్రతి వెబ్‌సైట్ ఇంగ్లీష్‌తో బాటు తెలుగులోనూ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలుగు భాషకు ఏక సంకేత లిపి సమాఖ్య (యూనీకోడ్ అథారిటీ)లో సభ్యత్వం తీసుకుంది. దీంతో తెలుగు అక్షర, పదాల, సంఖ్యలు, అర్థాలకు సంబంధించిన సంకేతాలు (కోడ్), అనువర్తనాలు (అప్లికేషన్లు) అభివృద్ధి చేయడానికి వీలు కలుగుతుంది. రాష్ట్రంలో వెబ్‌సైట్లకు ఒకే రకమైన ప్రమాణాలు రూపొందించనున్నారు. సెర్చింజన్‌లో తెలుగు భాషలోనూ వెబ్‌సైట్లు సెర్చ్ చేయడానికి వీలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సలహా కమిటీకి ఛైర్మన్‌గా ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ మిశ్రా కూచిభొట్ల ఆనంద్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జి. ఉమామహేశ్వరరావు, టోక్యో యూనివర్శిటీ ఆఫ్ ఫారిన్ స్టడీస్ ప్రొఫెసర్ పెన్ భాస్కర్‌రావు ఈ-తెలుగు గ్రూపు ప్రతినిధి వి. వీరవెంకటచౌదరి, తెలుగు అధికార భాష కేంద్రం తరపున ప్రతినిధి, ఐఈజీ సీఈవో ఉంటారు.

**కమిటీ పర్యవేక్షించాల్సిన అంశాలు :-**

తెలుగు రాయడానికి, తెలుగులో సమాచారం చదవడానికి, చూడటానికి అనుకూలంగా

బ్రౌజర్లు ఉండేలా చూడాలి. ప్రతి సమాచారం ప్రజలకు తెలుగులో డాక్యుమెంటు రూపంలో అందుబాటులో పెట్టాలి.

ఆరు భిన్న రూపాల్లో ఏకసంకేత లిపి తెలుగు ఫాంట్ అభివృద్ధి చేయాలి.

తెలుగు అక్షరక్రమం (స్పెల్లింగ్) సరిచూసుకోవడానికి 'పదాల విశ్లేషణ' సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలి.ఇది ఉచితంగా అందరికీ అందుబాటులో పెట్టాలి.

'న', 'జ' కార పొల్లులతో సహా తెలుగు పదాలు పలికేతీరు ఆధారంగా అచ్చులు, హల్లులకు తేడా లేకుండా యూనికోడ్ భాష ఉండాలి.

తెలుగుభాష అక్షరాలతో బహుభాషా కీలక ఫలకం (కీబోర్డు) ప్రమాణాలు రూపొందిస్తారు. (ఈనాడు 14.6.2011)

తెలుగు యూనీకోడ్ కన్సార్టియమ్‌లో ప్రభుత్వ సభ్యత్వం వల్ల మాత్రమే ఇప్పుడు తాజాగా ఇంటర్నెట్‌లో తెలుగు వాడకంలోకి రావటం లేదు. ఎన్నో ఏళ్ళుగా తెలుగులో మెయిల్స్‌లోనూ, ఫేస్‌బుక్ వంటి వాటిలోనూ టైప్ చేస్తూనే వున్నారు. అలాగే గౌతమి, వేమన, పోతన, ఆకృతి వంటి 50కి పైగా యూనీకోడ్ ఫాంట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే అందుబాటులో ఉన్న తెలుగు వాడే పద్ధతులు ప్రజలకు ప్రచారం చేయాలి. ఇప్పటిదాకా తయారై వాడుకలో ఉన్న ఫాంట్లను యూనికోడ్‌లోకి మార్చే టెక్స్ట్ ట్రాన్స్ ఫార్మర్లు కూడా అనేకం వచ్చాయి. కన్సార్టియమ్ ద్వారా కొత్తగా కొన్ని ఫాంట్లను తేవటం తప్ప ఒరిగింది ఏమిటో అర్థం కావటం లేదు. తెలుగు అక్షరరూపాల వాడుకపై నేటికీ ఆంక్షలున్నాయి. తెలుగు ఫాంట్లను తయారు చేసిన కొన్ని వ్యాపార సంస్థలు ఆయా ఫాంట్ల మీద గుత్తాధిపత్యాన్ని ఇంకా వదులుకోలేదు. ఈ పరిస్థితుల్లో ముందు ఇలాంటి ప్రాచుర్యం పొందిన ఫాంట్లన్నిటినీ జాతీయం చేసేందుకు, వాటిని యూనీకోడ్‌లోకి మార్చేందుకు, అనువాద సాఫ్ట్‌వేర్‌లు తయారు చేసేందుకు ఖర్చుపెట్టాలి. తమిళనాడు తరహాలో బహుమతులు కూడా ఇవ్వవచ్చు. తెలుగు మీడియంలో కంప్యూటర్ చదువులు కూడా రావాలి. అలా చదివిన డిగ్రీ విద్యార్థులకు పోటీ పరీక్షల్లో ప్రోత్సాహకాలు ప్రకటిస్తే తెలుగు చాలాకాలం బ్రతుకుతుంది.

నడుస్తున్న చరిత్ర సెప్టెంబర్ 2011 సంచికలో హైదరాబాదు యూనివర్శిటీ ప్రొఫెసర్ గారపాటి ఉమామహేశ్వరరావు గారు యూనికోడ్ వ్యాసంలో చాలా కొత్త సంగతులు తెలిపారు. యంత్రానువాదాలకూ, లిప్యంతరీకరణకూ, విషయాలకు ఆకారాది సూచికలను తయారు చేయటానికీ, వెతకటానికి అనుకూలంగా తెలుగులో కంప్యూటర్ వాడకం పెరగాలి అన్నారు.

**ఆయనకిలా మెయిల్ పంపాను :-** "సజీవ వాహిని" నిర్వాహకులు తెలుగు భాషలో గొప్ప సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పరిశుద్ధ గ్రంథాన్ని ఎవరికి వారే వెతుక్కునేలా మంచి వెబ్‌సైట్ రూపొందించారు. అయితే ఆన్‌లైన్ లో మాత్రమే లభిస్తున్న ఈ సౌకర్యాన్ని ఆఫ్

లైన్‌లో కూడా అందజేస్తే ఇంటర్‌నెట్ లేని వారికి కూడా సౌకర్యంగా ఉంటుంది. నేను రాసే వ్యాసాలకు సజీవ వాహిని ఎంతగానో ఉపయోగపడుతున్నది.

తెలుగు భగవద్గీతకు గానీ, తెలుగు కేతలిక్ బైబిల్‌కు గానీ, తెలుగు ఖురాన్‌కు గానీ ఇప్పటి వరకు ఇలాంటి సదుపాయం లేదు. http://sajeevavahini.com/telugubible అందరూ చూడదగినది. ఇలాంటి సాఫ్ట్‌వేర్ మిగతా మత గ్రంథాలకు కూడా లభించేలా కృషి చేస్తే లేఖనాల పరిశీలన సులభం అవుతుంది.

తెలుగు భాష శక్తివంతం కావాలంటే తెలుగులో వెలువడిన అనేక ముఖ్య గ్రంథాలకు ఇలాంటి సాఫ్ట్‌వేర్ ఎంతో అవసరం." (నడుస్తున్న చరిత్ర, మార్చి 2012)

అందుకాయన "తెలుగు గ్రంథాలలో వెతుక్కోవడానికి సాఫ్ట్‌వేర్ ఇప్పటికే అందుబాటులో ఉంది. ఏ తెలుగు రచనలోనైనా వెదకడానికి సాధ్యమే" అని 2.2.2012న జవాబిస్తూ Anu2UTF Converter పంపారు. నా పుస్తకం 'తెలుగు అధికార భాష కావాలంటే...' పి.డి.ఎఫ్. ఫైల్ పంపించాను. దానిని యూనికోడ్‌లోకి మార్చి యూనికోడ్‌లోనే ప్రింట్ చేయించాలని నా కోరిక. ఎందుకంటే తెలుగు గ్రంథాలు యూనీకోడ్‌లో ఉంటేనే ఇప్పుడున్న సాఫ్ట్‌వేర్ ఆయా విషయాలను వెతుక్కోటానికి పనికొస్తుంది. కాలంతో పాటు మనం కూడా మారాలి. తెలుగులో తయారైన పి.డి.యఫ్. ఫైలును కూడా నేరుగా యూనీకోడ్‌లోకి మార్చగలిగే స్థాయి రావాలి. డి.టి.పీ చేస్తున్న ప్రింటర్లందరూ క్రమేణా యూనీకోడ్‌లోకి మారాలి. ఎవరి స్థాయిలో వాళ్ళు సహాయపడి తెలుగును బ్రతికించాలి.

**తెలుగు దేశమే నాది**
**తెలుగు బిడ్డనే నేను**
**తెలుగు పేరు వింటేనే మురిసిపోతాను**
**తెలుగు భాష అంటే మైమరచిపోతాను**
**తెలుగువాడు ఏడ నున్న తెలుగువాడు**
**తెలుగు భాషనే సొంపుగా పలుకుతాడు – కొసరాజు**

# 14. దస్త్రాలన్నీ తెలుగు భాషలోనే...

**అ**మ్మ భాషలోనే మన ఆలోచనలు వికసిస్తాయి. అందులోనే మన భావాలను సూటిగా, స్పష్టంగా రాయగలం. అందుకే నా కార్యాలయ దస్త్రాలన్నీ తెలుగులోనే నిర్వహిస్తా'నంటూ సగర్వంగా చెబుతున్నారు నూర్‌బాషా రహంతుల్లా. తెలుగు మాట్లాడేవారన్నా, తెలుగు రచనలన్నా ఎందుకో తక్కువ చూపు చూసే ఎందరో చిన్నదెబ్బ తగిలితే అమ్మా అనే కదా అంటారు. అంటారాయన.

రహంతుల్లా చిన్ననాటి నుంచి తెలుగు భాషాభిమాని. మహ్మదీయుడిగా పుట్టినా నా మాతృభాష తెలుగే. నేను “తెలుగు ముస్లిం” ని అంటారాయన. గుంటూరు జిల్లా బాపట్ల సమీపంలోని కంకటపాలెం ఆయన స్వగ్రామం. అక్కడే తెలుగు మాధ్యమంలో డిగ్రీ వరకు చదివారు. 1985లో తెలుగు మాధ్యమంలో గ్రూప్-2 పరీక్షల్లో విజయం సాధించి, రెవెన్యూ విభాగంలో ఉద్యోగంలో చేరారు. తొలి రోజు నుంచి తన దస్త్రాలన్నింటినీ తెలుగులోనే రాసేవారు. అందరూ ఆయనను ఇంగ్లీష్ రానివాడిగా, తక్కువస్థాయివాడిగా చూసినా చలించలేదు. అమ్మభాష కోసం ఎన్నో మాటలు పడ్డారు. కానీ కాలక్రమంలో సహోద్యోగుల మధ్య తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నారు. ప్రస్తుతం విజిటిఎం ఉడా భూసేకరణ విభాగంలో ప్రత్యేకాధికారిగా పని చేస్తున్నారు.

**ఎన్నో 'తెలుగు' విజయాలు :** రహంతుల్లా పశ్చిమ గోదావరి జిల్లాలో తహసీల్దారుగా పని చేస్తున్న కాలంలో 23 రిట్ పిటిషన్లకు తెలుగులోనే సమాధానాలు రాసి పంపారు. దీంతో పై అధికారులు ఆగ్రహించారు. అలా కుదరదన్నారు. కానీ రహంతుల్లా చలించలేదు. చివరకు న్యాయస్థానంలో విజయం సాధించారు.

తహసీల్దారుగా పనిచేస్తున్న సమయంలోనే త న కార్యాలయంలో దరఖాస్తులు, అభ్యర్థన పత్రాలన్నింటికీ తెలుగు నమూనాలు తయారు చేయించి, రైతులు కూడా స్వయంగా పూర్తి చేసుకునేలా వాటిని తీర్చిదిద్దారు. దీంతో దళారుల ప్రమేయం తగ్గింది. పట్టాదారు పుస్తకాలు, విద్యార్థులకు వివిధ ధృవీకరణపత్రాలు తెలుగులో జారీ చేశారు.

ఇస్లాం క్రైస్తవ మతాల మీద తులనాత్మక అధ్యయనం చేస్తూ తెలుగులో 10 పుస్తకాలు రాశారు. 1986 నుంచి 1991 వరకు 'గీటురాయి' వారపత్రికలో తెలుగు సామెతలతో 'ఉబుసుపోక' అనే శీర్షికలో వ్యంగ్య వ్యాసాలు రాశారు. ఈయన రాసిన 'తెలుగు అధికార భాష కావాలంటే' పుస్తకాన్ని రెండవసారి తెలుగు ఇస్లామిక్ ప్రచురణ సంస్థ ప్రచురించింది. 37 ఏళ్ళుగా వివిధ పత్రికల్లో తెలుగు భాషా పరిరక్షణ తదితర అంశాలపై వ్యాసాలు రాస్తున్నారు. 2003లో అధికార భాషా సంఘం నుంచి “విశిష్ట భాషా పురస్కారం” అందుకున్నారు.

**తెలుగు రాజభాష కావాలి :** తెలుగులో డిగ్రీ చదివిన వారికి ఉద్యోగాల్లో 5% ప్రాధాన్యత మార్కులు ఇవ్వడం వల్లే నాకు ఉద్యోగం వచ్చి ఈ స్థితికి రాగలిగాను. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. తిరిగి ప్రభుత్వం ఆ ఉత్తర్వులిస్తే తెలుగులో పరిపాలనా వ్యవహారాలు నడిపే అధికారులు వస్తారు. ఇంకా, తెలుగు మాట్లాడేవారంటే చిన్నచూపు పనికిరాదు. కిందిస్థాయి నుంచి ప్రతి కార్యాలయంలో తెలుగులోనే దస్త్రాలు తయారవ్వాలి. తెలుగు లిపి సంస్కరణ, మహానిఘంటు నిర్మాణం జరగాలి.

***(ఈనాడు 29.8.2011)***

# తెలుగు 'వెలుగు'కు విశేష కృషి



- భాషకు అక్షర రూపమిస్తున్న రహంతుల్లా
- విశిష్ట పురస్కారంతో ప్రభుత్వం సన్మానం






వైఎస్. నుంచి విశిష్ట పురస్కారం అందుకొంటున్న రహంతుల్లా



అప్పటి గవర్నర్ నుంచి పతకం అందుకొంటూ..

కలెక్టరేట్, న్యూస్‌టుడే

**రా**ష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారిగా వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన సామాన్యులు వాడే పదాలను ప్రోది చేసి తెలుగు మహా నిఘంటువు నిర్మాణానికి, లిపి సంస్కరణకు శ్రీకారం చుట్టారు. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న రహంతుల్లా సామాజిక సమస్యల నివారణకు రెడ్‌క్రాస్ కార్యక్రమాల్లో భాగస్వామ్యులయ్యారు. 12 సార్లు వరుసగా రాష్ట్ర గవర్నర్‌చే రెడ్‌క్రాస్ పతకాలు పొందారు. సమకాలీన సమస్యలపై పోరాటాలతో పాటు తెలుగును పాలనాభాషగా అమలు చేయడంలో పులిచింతల ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ నూర్‌బాషా రహంతుల్లా శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు.

గుంటూరు జిల్లా బాపట్ల మండలం కంకటపాలెంకు చెందిన నూర్‌బాషా రహంతుల్లా 1980 దశకంలో సర్వీసు కమిషన్ ద్వారా డిప్యూటీ తహశీల్దారుగా పశ్చిమగోదావరి జిల్లాలో పలు మండలాల్లో పనిచేశారు. చిన్నతనం నుంచి ఆయన తెలుగు భాషపై మమకారం పెంచుకొన్నారు. రహంతుల్లా రెవెన్యూ ఉద్యోగంలో చేరిన నాటి నుంచి సామాన్యులకు అర్ధమయ్యే విధంగా తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపారు. తహశీల్దారుగా పదోన్నతి పొందిన తర్వాత తాను పనిచేసిన మండలాల్లో రెడ్‌క్రాస్ యూనిట్లు నెలకొల్పి సామాజిక చైతన్యం తెచ్చారు.

**'భాషను నీవు రక్షిస్తే.. భాష నిన్ను రక్షిస్తుంది'.. అనే సూక్తిని ఆ అధికారి ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లోనే ఆచరించారు. అప్పటి నుంచి మాతృ భాషగా తెలుగు వెలుగులీనేందుకు విశ్రమించకుండా కృషి చేస్తూనే ఉన్నారు. భాషకు అక్షర రూపమిస్తూ విశిష్ట పురస్కారాలు పొందారు.**

విశాఖపట్టణంలో డిప్యూటీ కలెక్టర్‌గా ఎన్.టి.పి.సి.లో భూసేకరణ విభాగంలో రహంతుల్లా బాధ్యతలు స్వీకరించారు. భూసేకరణకు అవార్డులు జారీ చేయడం ఆంగ్లేయులు ప్రవేశ పెట్టిన విధానాలనే నేటికీ అనుసరిస్తున్నారు. భూసేకరణలో అవార్డులు జారీ చేయడంలోనూ తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు నెరపడంతో ఆయన గుర్తింపు తెచ్చుకొన్నారు. 'తెలుగు అధికార భాష కావాలంటే'... అనే గ్రంథం రచించారు. రహంతుల్లా ప్రతిభ గుర్తించిన అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఎ.బి.కె.ప్రసాద్ రహంతుల్లా రచించిన గ్రంథాలను సచివాలయంలో ఆయా విభాగాల శాఖాధిపతులకు అందజేశారు. 2006లో ప్రభుత్వం రహంతుల్లాను విశిష్ట పురస్కారంతో సత్కరించింది. ముఖ్యమంత్రి వై.ఎస్. చేతుల మీదుగా రహంతుల్లా అవార్డు అందుకొన్నారు.

*(ఈనాడు, గుంటూరు 23.4.2008)*

# 15. తెలుగు సాహిత్యంలో ముస్లిం కవులు రచయితలు

"సాయిబులకు తెలుగు సరిగా రాదు" అంటూ ముస్లిం పాత్రలకు నీకీ నాకీ అనే డైలాగులతో మన తెలుగు నటులూ, దర్శకులూ భలే ఎగతాళి చేస్తుంటారు. కానీ తెలుగు పండితులెవరికీ తీసిపోని విధంగా తెలుగు సాహిత్యంలో ముప్పైకి పైగా శతకాలు ముస్లిం కవులు రాశారు. భక్తి, నీతి, తాత్విక, ప్రబోధాత్మక శతక సాహిత్యంలో ముస్లిం కవులు శతకాలు రాశారు. తెలుగు ముస్లిం కవులు రాసిన కొన్ని శతకాలు :

**ముహమ్మద్ హుస్సేన్**

భక్త కల్పద్రుమ శతకం (1949)

మొక్కపాటి శ్రీరామశాస్త్రితో కలసి రాసిన శతకం "సుమాంజలి".

హరిహరనాథ శతకము

అనుగుబాల నీతి శతకము

తెనుగుబాట శతకము.

**"మాతృదేవి యొకటి,మాతృభూమి యొకండు**
**మాతృభాష యొండు మాన్యము గదా**
**మాతృశబ్దము విన మది పులకింపదా?**
వినుత ధర్మశీల తెనుగు బాల"

**షేక్ దావూద్**

1963 రసూల్ ప్రభు శతకము

అల్లామాలిక్ శతకము

**సయ్యద్ ముహమ్మద్ అజమ్**

"సయ్యదయ్యమాట సత్యమయ్య" సూక్తి శతకము

**ముహమ్మద్ యార్**

సోదర సూక్తులు

**గంగన్న వల్లి హుస్సేన్ దాసు**

హుస్సేన్‌దాసు శతకము - ధర్మగుణవర్య శ్రీ హుసేన్ దాసవర్య

**హాజి ముహమ్మద్ జైనుల్ అబెదీన్**

ప్రవక్త సూక్తి శతకము, భయ్యా శతకము

**తక్కలపల్లి పాపాసాహెబ్**

"వేంకటేశ్వరుండు, బీబి నాంచారమ్మ
బెండ్లియాడి మతమభేదమనియె

హరి, ప్రమాణమైన వ్యర్థవాదాలేల?
పాపసాబు మాట పైడిమూట"

**షేక్ ఖాసిం**

సాధుశీల శతకము :
"కులము మతముగాదు గుణము ప్రధానంబు
దైవచింత లేమి తపముగాదు,
బాలయోగి కులము పంచమ కులమయా,
సాధులోకపాల సత్యశీల"

**షేక్ అలీ**

"గురుని మాట శయము గూర్చుబాట"
అనే మకుటంతో 'గురునిమాట' శతకం (1950)

మానస ప్రబోధము శతకం

**"ఇంగిలీసు బాస ఎంతగ నేర్చిన**
**పాండితీ ప్రకర్ష పట్టుబడదు**
**పరులభాష గాన బాధను గూర్చును**
గురుని మాట యశము గూర్చు బాట"

"దేశ భాషలెల్ల దీక్ష వహించి నీ
వభ్యసించవలయు నర్భకుండ
**మాతృభాష నేర్చి మర్యాదలందుమా**
గురుని మాట యశము గూర్చు బాట"

**షేక్ రసూల్**

మిత్రబోధామృతము అనే శతకం

**ఉమర్ ఆలీషా**

బ్రహ్మ విద్యా విలాసము.

ఉర్దూ మాతృభాషగా గల ముస్లిములు కూడా తెలుగులో వెలువరించిన సాహిత్యం చాలా ఉంది.

**షంషీర్ అహ్మద్,** అడిషనల్ జాయింట్ కలెక్టర్ (రి)

**కెంపుగుండె 1999**

"ప్రజల భాష తెలుగు, ప్రజల నేలు ప్రభువుల భాష తెలుగు
ఆలు బిడ్డలతో ఆనందంగా, పలకరించి, పులకించి

ప్రేమ మీర పరవశించు, ఆంధ్రుల ఇంటింటా మాటాడు భాష తెలుగు
కాసుకు కల మమ్ముకున్నంతలోనే, నీకు నాకు మధ్య
ఇంగిలీషు దొరతనపుదూరమెందుకో!?
మనం మాట్లాడే భాషలోనే, పాలన మర్మాలు
ప్రజలకు విడమరచి చెప్పలేని, దౌర్భాగ్యమెందుకు?
మండు వేసవిలో మృగతృష్ణల వెంట ఈ పరుగులెందుకు?
అమ్మలాంటి కమ్మనైన గంగిగోవు పాలనొదిలి
ఖరము పాల కొరకు ఇంగిలీషు షోకు వెంట
ఈ పరుగులెందుకు?"

"తెలుగు సాహిత్యం - 1984 వరకు ముస్లిముల సేవ" అనే సిద్ధాంత వ్యాసానికి అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయ ఆచార్యుడు షేక్ మస్తాన్ గారికి పి.హెచ్.డి. వచ్చింది. ఈ సిద్ధాంత గ్రంథాన్ని ఆయన 1991లో ప్రచురించారు.

ఆ గ్రంథంలో 1984 వరకు వెలువడిన 42 మంది తెలుగు ముస్లిముల గ్రంథాలను ఇలా పేర్కొన్నారు :-

| | | |
|---|---|---|
| 1. | అబ్దుల్ గఫూర్ ముహమ్మద్ | ఖుర్-ఆన్ (అను), ఇస్లాం మత ప్రభువులు, మిష్ కాతె షరీఫ్ (అను) జగత్ప్రవక్త |
| 2. | అలి ముహమ్మద్ | ఆణి ముత్యాలు, హృదయమాధురి, వేదనా సౌరభము, మమత. |
| 3. | అహమ్మద్ బాషా సయ్యద్ | శ్రీ ప్రవక్త ముహమ్మద్ రసూల్ వారి దివ్య చరిత్ర. |
| 4. | ఆమిరివ మువ్వలున్ | విశ్వప్రవక్త |
| 5. | ఆలీ షేక్ | గురునిమాట, మానస ప్రబోధము |
| 6. | ఇస్మాయిల్ | చెట్టునా ఆదర్శం, మృతవృక్షం, చిలకలు వాలిన చెట్టు. |
| 7. | ఇస్మాయిల్ | ఆఁ? |
| 8. | ఉమర్ ఆలీషా | అనసూయాదేవి, ఉమర్ ఖయ్యామ్, కళ, ఖండ కావ్యములు, చంద్రుగుప్త, తత్త్వ సందేశము, దానవవధ, బర్హిణిదేవి,బ్రహ్మ విద్యా విలాసము, మహాభారత కౌరవ రంగము, శ్రీ ముహమ్మద్ వారి చరిత్ర, స్వర్గమాత, సూఫీ వేదాంత దర్శనము. |
| 9. | ఖాసింఖాన్ ముహమ్మద్ | ఆవిమారకము, ఆత్మాభిమానము, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ఉత్తరరామ చరిత్ర, ఖురానెషరీప్ (అను), దేవుడు, - నాదేశము, దేశభక్తులు ప్రతిమ, వాసవదత్త. |

| | | |
|---|---|---|
| 10. | ఖాసీంఖాన్ సాహెబ్ షేక్ | వీరభద్ర విజయము |
| 11. | ఖాసీం | సాదుశీల శతకము |
| 12. | గపూర్ బేగ్ ముహమ్మద్ | నిరపరాధులు, గ్రీష్మంలో వసంతం. |
| 13. | జలాలుద్దీన్ యూసఫ్ మొహమ్మద్ | లోక శాంతికి దైవ సూత్రము, మతము, రాజకీయము యదార్ధమేది, దైవనియమావళి. |
| 14. | జైనుల్ అబెదీన్ ముహమ్మద్ | ఖుర్-ఆన్ సూక్తులు, ఖుర్-ఆన్ ప్రవచనములు, ముహమ్మద్ ప్రవక్త జీవితము - సందేశములు, భయ్యా శతకము (అను) ప్రవక్త సూక్తి శతకము. |
| 15. | దరియా హుస్సేన్ షేక్ | పురుషోత్తముడు. |
| 16. | దస్తగిరి అచ్చుకట్ల | మణి మంజూష, అమృతమూర్తి |
| 17. | దావూద్ షేక్ | చిత్త పరివర్తనము, దాసీపన్నా, రసూల్ ప్రభుశతకము, సంస్కార ప్రణయము, సూఫీ సూక్తులు. |
| 18. | నఫీజుద్దీన్ ముహమ్మద్ | కనకపు సింహాసనమున, దేవుడూ నీకు దిక్కెవరు, ధర్మ సంరక్షణార్థం, విముక్తి, విధి విన్యాసాలు. |
| 19. | నూరుల్లా : ఖాద్రిసయ్యద్ | రమజాను మహిమలు, నమాజు బోధిని, సుందరమగు నమూనా, విశ్వాసములు, ఆరుమాటలు, జుబా : |
| 20. | పాపాసాహెబ్ తక్కల్లపల్లి | అంబ, రాణీ సంయుక్త, సత్యాన్వేషణము, పాపసాబు మాట పైడిమూట. |
| 21. | పీరాన్ నిజామి, టి, హెచ్ | హజరత్ హుస్సేన్ సంస్కరణము, సూరాయె ఫాతిహా, హజ్రత్ ముహమ్మద్, సీరత్‌ను గురించి ఉపన్యాసములు. |
| 22. | ఫరీదు షేక్ | వేమన |
| 23. | బుడన్ సాహెబ్ షేక్ | ఖుతుబ్ నామా, జలాల్ నామా |
| 24. | మస్తాన్ సయ్యద్ | మధు |
| 25. | మహబూబ్, ఎస్.ఎమ్. | సమత |
| 26. | మహబూబ్ ఖాన్ | సూరీడు |
| 27. | మహబూబ్ సాహెబ్ షేక్ | శ్రీ శైల క్షేత్ర మహాత్యము. |
| 28. | ముహమ్మద్ అజమ్ | సయ్యద్ సూక్తి శతకము (అము) |
| 29. | ముహమ్మద్ హుస్సేన్ షేక్ | భక్త కల్పద్రుమ శతకము, హరినాధ శతకము, సుమాంజలి, తెలుగుబాల, అనుగు బాల |
| 30. | మిష్కిన్ సాహెబ్ షేక్ | నానార్ధనవనీతము (ఆము) |
| 31. | మీరాజాన్ షేక్ | సర్వమత సార సంగ్రహణము |

| | | |
|---|---|---|
| 32. | మొహియుద్దీన్ హుస్సేన్ సయ్యద్ షాహ్ | తౌహీద్ |
| 33. | మొహిద్దీన్ పీరాన్ పటూరి | ఇస్లాం బోధిని, |
| 34. | మొహిద్దీన్ మల్లిక్ సుల్తాన్ | శ్రేయస్కర మార్గము, మరణానంతర జీవితము, ఇస్లాం జీవిత విధానము, ఆర్థిక సమస్య - ఇస్లాం పరిష్కారము, నిర్మాణము - విచ్ఛిన్నము, కలిమయె-తయ్యిబ-అర్థము, ప్రపంచ మార్గదర్శి, ఇస్లాం శిక్షణ, ఇస్లాం బోధిని, నిర్యాణము, విచ్ఛిన్నము |
| 35. | యార్ ముహమ్మద్ | ఆ వేదన, సోదర సూక్తులు |
| 36. | రసూల్ షేక్ | మిత్ర బోధామృతము |
| 37. | వజీర్ రహమాన్ | ఎచటికి పోతావీరాత్రి, కవిగా చలం. |
| 38. | వలి, ఎన్.కె. | శ్రీమతి లక్ష్మి |
| 39. | వలి, ఎస్.ఎమ్. | ఊర్వశి |
| 40. | సలాం అబ్దుల్ | చలంగారి శ్రీశ్రీ |
| 41. | షంసుద్దీన్ ముహమ్మద్ | కళంకిని, విజయ, నల్లబంగారం, ధనవంచిత అమృతపథం |
| 42. | హమీదుల్లా షరీఫ్ షేక్ | దైవ ప్రవక్తలు, ఖురానీ గాథలు (అను) |

**తెలుగులో వచ్చిన ఖురాన్ అనువాదాలు : 10**

1. 1925 చిలుకూరి నారాయణరావు "ఖురాన్ షరీఫ్" మద్రాసు
2. 1941 ముహమ్మదు ఖాసిం ఖాన్ "ఖురాన్ షరీఫ్" 9 సూరాలు, హైదరాబాద్
3. 1948 మున్షీ మౌల్వి ముహమ్మద్ అబ్దుల్ గఫూర్, "కురానె మజీద్" కర్నూలు
4. 1980 షేక్ ఇబ్రహీం నాసిర్ అహమ్మదియ్యా "కురాన్", హైదరాబాద్
5. 1985 హమీదుల్లా షరీఫ్, "దివ్య ఖుర్ ఆన్" జమాతె ఇస్లామి హింద్ హైదరాబాద్
6. 2004 అబుల్ ఇర్ఫాన్, "ఖురాన్ భావామృతం", హైదరాబాద్
7. 2007 యస్.ఎం. మలిక్, "ఖుర్ ఆన్ అవగాహనం" అబుల్ అలా మౌదూదీ.
8. 2008 డాక్టర్ అబ్దుల్ రహీమ్ బిన్ ముహమ్మద్ మౌలానా, "ఖురాన్" సౌదీ అరేబియా
9. 2009 ముహమ్మద్ అజీజుర్రహ్మాన్, "అంతిమదైవగ్రంథం ఖుర్ ఆన్" (2870) పేజీలు (మౌలానా ముహమ్మద్ జునాగఢీ) గారి (అహ్సనుల్ బయాన్), హైదరాబాద్
10. 2010 అబ్దుల్ జలీల్, "పవిత్ర ఖుర్ ఆన్", దారుల్ ఫుర్ ఖాన్, విజయవాడ 862 పేజీలు.

**స్వాతంత్ర్యానికి పూర్వం ముస్లిములు నడిపిన తెలుగు పత్రికలు :-**

1842 "వర్తమాన తరంగిణి" వార పత్రిక....1842 జూన్ 8న సయ్యద్ రహమతుల్లా

మద్రాసు. సయ్యద్ రహమతుల్లా తెలుగు పత్రికా రంగంలో అడుగు పెట్టిన తొలి ముస్లిం. మొదటి పత్రికలో ఆయన రాసిన మాటలు : "మేము మిక్కిలి ధనవంతులము కాము. ఆంధ్ర బాష యందు మిక్కిలి జ్ఞానము గలవారమూ కాము. హిందువుల యొక్క స్నేహమునకు పాత్రులమై తద్వారా ప్రతిష్ట పొందవలెననే తాత్పర్యము చేత నూరార్లు వ్యయపడి ముద్రాక్షరములు మొదలగు పనిముట్లను సంపాదించి ఈ పత్రికను ఉదయింప జేయడమునకు కారకులమైతిమి."

1891 "విద్యన్మనోహారిణి" మీర్ షుజాయత్ అలీఖాన్, నరసాపురం, తరువాత ఈ పత్రిక వీరేశలింగం గారు నడిపిన "వివేకవర్ధిని" లో కలిసిపోయింది.

1892 "సత్యాన్వేషిణి" బజులుల్లా సాహెబ్, రాజమండ్రి

1909 "ఆరోగ్య ప్రబోధిని" షేక్ అహ్మద్ సాహెబ్, రాజమండ్రి.

1944 "మీజాన్" దినపత్రిక కలకత్తావాలా, హైదరాబాదు అడవి బాపిరాజు సంపాదకుడు.

2010 – రాష్ట్రంలో తెలుగులో రాసిన రాస్తున్న 333 మంది ముస్లిం కవులు, రచయితలు, అనువాదకుల వివరాలతో ప్రముఖ రచయిత, పాత్రికేయుడు, చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ 'అక్షరశిల్పులు' పుస్తకం 2010లో ప్రచురించారు. ఈ గ్రంథంలో 257 మంది ఫొటోలు, చిరునామా, దూరవాణి, సంచారవాణి నంబర్లతో పాటుగా 'ఈమెయిల్' ఐడిలను కూడా సమకూర్చారు.

ఈ పుస్తకంలో ఖాదర్ మొహియుద్దీన్, సౌజన్య (మహమ్మద్ నఫీజుద్దీన్), శాతవాహన (గులాంగౌస్), కౌముది (మహమ్మద్ సంషుద్దీన్), శశిశ్రీ (బేపారి రహంతుల్లా), దేవీప్రియ (షేక్ ఖాజా హుసేన్), స్కైబాబా, షేక్ కరీముల్లా, సత్యాగ్ని హుసేన్, సుగంబాబు, అఫ్సర్, యాకూబ్, డానీ, ఖదీర్‌బాబు, బా రహంతుల్లా, వేంపల్లి షరీఫ్, అక్కంపేట ఇబ్రహీం, దాదా షయాత్, దిలావర్, ఖాజా, పద్మశ్రీ నాజర్, ఇనగంటి దావూద్, షహనాజ్ బేగం, షాజహానా, మహజబీన్, జరీనాబేగం, షహనాజ్ ఫాతిమా లాంటి 333 మంది ప్రముఖ ముస్లిం రచయితల వివరాలు ఉన్నాయి. ఈ పుస్తకం ఒక డైరెక్టరీ లాగా రూపొందించటంలో నశీర్ అహమ్మద్ విశేష కృషి చేశారు. మస్తాన్ గారు 1984 వరకు రచయితల వివరాలు సేకరిస్తే నశీర్ 2010 వరకు ఈ పుస్తకంలో ముస్లిం రచయితల వివరాలు జతపరిచారు. మరిన్ని వివరాల కోసం 'అక్షరశిల్పులు' పుస్తకాన్ని సంప్రదించాలి.

2010 "సలీం" నవల "కాలుతున్న పూటతోట"కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

*గీటురాయి, 18.5.2012*

# 16. తెలుగు కుత్తుకపై కత్తి

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షులు ఏ.బి.కె. ప్రసాద్ గారు సాక్షి దినపత్రికలో 20.1.2012న "తెలుగు కుత్తుకపై కత్తి అనే వ్యాసంలో వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయాలు : "నేడు మన పాలకులు తెలుగుకు పట్టిస్తున్న 'తెగులు' ను చూస్తుంటే ఎన్నెన్నో ఘోరాలు కళ్ళముందు కదలాడుతాయి. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహిస్తున్న 'గ్రూప్ – 1' పరీక్షలలో అనుసరిస్తున్న తీరు తెలుగు మాధ్యమం అభ్యర్థులను నిరుత్సాహపరిచే విధంగా ఉండటం తెలుగు మాధ్యమ అభ్యర్థులకే కాదు, భాషాభిమానులకు, ప్రాచీన భాషా ప్రతిపత్తిని అధికారికంగా పొందిన తెలుగు ఉనికిపట్ల ఆందోళనపడుతున్న భాషా ప్రియులందరికీ ఆగ్రహ కారణమవుతోంది.

ఇంగ్లీష్ ప్రశ్నల్ని ఊతంగా తీసుకుని తెలుగు మాధ్యమం అభ్యర్థులకు తప్పుడు అనువాద పదాలతో కూడిన ప్రశ్నాపత్రాలు ఇచ్చి, సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయడం వల్లనే తెలుగు అభ్యర్థులు ఎక్కువ మార్కులు పొందలేక ఇంటర్వ్యూలకు అనర్హులు కావడం దారుణం. ఈ అనువాద లోపాల్ని కమిషన్ తీవ్రంగా పరిగణించకపోవడం విచారకరం.

తెలుగువాడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సైతం తెలుగు మాధ్యమంలో చదివి తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాయడాన్నీ, తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవడాన్నీ మహా పాపంగాను, మహా నేరంగానూ భావించే దశకు రాష్ట్ర పాలనా వ్యవస్థ దిగజారిపోయింది. తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాసే ఉద్యోగార్థులైన అభ్యర్థుల పట్లనే ఈ వివక్ష దేనికి? మూడేళ్ళ క్రితం వరకూ తెలుగు మాధ్యమంలో విద్యాభ్యాసం చేసి గ్రూప్-1 పరీక్షలలో అట్టడుగు వర్గాలకు చెందిన అభ్యర్థులు సైతం టాపర్స్‌గా వచ్చారు. తెలుగు ప్రథమ అధికార భాషగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ సర్వీసులలోకి రాగోరే అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలలో ప్రశ్నపత్రాలు, సమాధాన పత్రాలలో ఈ అవకతవకలు దేనికి? రాష్ట్రపాలక వర్గానికి, ఇరుగు పొరుగు రాష్ట్రాలలోని ప్రభుత్వాలు విద్యావ్యవస్థలోనూ, ఉద్యోగ వ్యవస్థలోనూ తమ మాతృభాషలను ఎలా పెంచి పోషించుకుంటున్నామో గ్రహింపు ఉండవలసినంతగా లేదు. కనుకనే మన విద్యా వ్యవస్థలోనూ, పాలనా వ్యవస్థలోనూ, తెలుగు వినియోగపు విలువను కాపాడుకోలేకపోతున్నారు. కర్ణాటక ప్రభుత్వం, ఉద్యోగార్థులకు కన్నడ భాషాజ్ఞానాన్ని, వినియోగ పాటవాన్నీ విధిగా ప్రకటించడమే గాక, ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యా దశల్లో సహితం మాతృభాషలో స్పర్శ కోల్పోకుండా ఉంచుతోంది. పొరుగు వాణ్ని చూసైనా మన పాలకులు విద్యావ్యవస్థలో మాతృభాష స్థానాన్ని

స్పష్టంగా నిర్వచించి స్థిరపరచాలి. తెలుగు ప్రజలకిదే గుణపాఠం! బోధనా పరంగానూ, పాలనా పరంగానూ మాతృభాషను చక్కదిద్దుకోవలసిన అవసరం ఎప్పటికన్నా నేడు ఎక్కువగా ఉందన్న గ్రహింపు అవశ్యం, అవసరం! ఈ గుర్తింపునకు ముందు జాతికి జీవగర్రలు ప్రజా హృదయాలేనన్న 'యాది' పాలకులకు నిద్రలో కూడా తన్నుతూ ఉండాలి! అన్యభాషలను గౌరవించటంతో పాటు తల్లి భాషను ఒంటపట్టించుకోవడం ఎలాగో నేర్వాలి, నేర్పాలి!!

"కొమర్రాజు లక్ష్మణరావు గారి "దేశభాషలలో శాస్త్ర పఠనం" అనే వ్యాసంలో శాస్త్రపఠనానికి కొన్ని భాషలు మాత్రమే అర్హమైనవన్న వాదాన్ని తీవ్రంగా ఖండిస్తూ "జ్ఞానమొక భాష యొక్క యబ్బ సొమ్ము కాదు" అన్నాడు. "ఆంగ్లభాషపై అభిమానమున్న యెడల ఆ భాషను క్షుణ్ణముగా అధ్యయనము చేయవచ్చును, కాని కమ్మరము, కుమ్మరమును అదే భాషలో చదువవలసిన అవుసరమేమున్నది" అన్నాడు. ఈ విషయములో జర్మనులు మనకు ఆదర్శము కావలెనన్నాడు.

అలాగే ఔరంగజేబు తన గురువునకు ఉపయోగకరమైన విద్యావసరాల గురించీ, అదీ స్వభాషలోనే జరగాలనీ వ్రాసిన ఉత్తరాన్ని లక్ష్మణరావు పారశీక భాష నుండి తెలుగులోకి అనువదించి ఇలా వ్యాఖ్యానించాడు.

"బాల బాలికలకు బోధింపబడు విషయములు వారికి, వారి జీవితకాలములో నుపయోగకరముగా నుండవలయును. కేవలము పాండిత్యము జూపుటకై అనుపయోగకరములగు విషయములు వారికి నేర్పి గుడ్డిపాఠముచేయించి కాలము వ్యర్థపుచ్చుట, వారికిని, దేశమునకును హానిప్రదము. బాలురకు శాస్త్రములన్నియు వారి మాతృభాషలోనే నేర్పవలయును గాని పరభాషలో నేర్పుట కేవలము ద్రావిడ ప్రాణాయామమని ఔరంగజేబు ఉత్తరము వలన మనవారు ముఖ్యముగా నేర్చుకొనవలయును. మొదట పరభాష నభ్యసించుటకు బాలుర కాలమెంతయో వ్యర్థమగును. అట్టి పరభాష వచ్చిన తరువాత, ఆ భాషలో శాస్త్రముల నభ్యసించుటకంటె మొదట నుండియు స్వభాషలోనే శాస్త్రాధ్యయనము చేసిన యెడల బాలురకెంతయో కాలము, శ్రమయు కలిసివచ్చును కదా? తెలివిగల పిల్లవానికి ఇంగ్లీషుభాష చక్కగ నభ్యసించుటకు సుమారు ఆరేడు సంవత్సరములు పట్టును. అప్పటికా బాలునకు ఇంగ్లీషులో గ్రంథావలోకనము చేయుటకును, శాస్త్రాభ్యాసము చేయుటకును అధికారము కల్గును. ఇట్లు పరభాషాధ్యయనమునకై ఏడెనిమిది సంవత్సరములు వ్యర్థమగుచుననవి. దేశ భాషలలో శాస్త్రములు జెప్పిన యెడల నీ ఏడెనిమిది సంవత్సరములలో నెన్నియో విద్యలలో పారంగతుడు కావచ్చును. కాని సకల శాస్త్రజ్ఞానమును, ఇంగ్లీషుభాషయను గదిలోబెట్టి తాళమువైచి, ఏ.బి.సి.డి. అను తాళపుచెవిని సంపాదించుటకు ఎనిమిది సంవత్సరములు ముక్కు పట్టుకొని తపస్సు చేయనివారలకు జ్ఞానభాండారములోని సొత్తును కొల్లగొట్టునధికారము లేదనియు, విద్యామహిమయు మాతృభాషా ప్రభావమును తెలియని

దూరదృష్టి విహీనులు తప్ప మరెవ్వరును చెప్పజాలరు.... ఇంగ్లీషుభాషనే జ్ఞానసాధనముగా బెట్టిరేని ఔరంగజేబు తన గురువును నిందించినట్లు రాబోవు తరమునందలి విద్యార్థులు తమ యాయుష్యములోని పది సంవత్సరములు పాడుచేసినందులకు మనలను నిందింపక మానరు.”

*(1910 భారతి మాసపత్రిక, సాధారణ సంవత్సరాది సంచిక)*

**నా అభిప్రాయం :**

1. తెలుగు మీడియం ద్వారా డిగ్రీ చదివిన అభ్యర్థులకు పూర్వం ఇచ్చిన పద్ధతిలోనే మళ్ళీ అయిదు శాతం ప్రోత్సాహక మార్కులు ఇస్తే తెలుగులో చదివే విద్యార్థులు పెరుగుతారు.
2. సర్వీస్ కమీషన్ ఇన్ని రకాల పరీక్షలకు బదులు డిగ్రీ అర్హత గల గ్రూప్ 1, 2 ఉద్యోగాలన్నిటికీ కలిపి ఒకే పరీక్ష ప్రతి ఏటా నిర్వహించి అందులో అభ్యర్థులకు వచ్చిన మార్కులను బట్టి పోస్టులు కేటాయిస్తే ఖర్చు ఇద్దరికీ భారీగా తగ్గుతుంది. సమయమూ కలిసి వస్తుంది.
3. తెలుగు మొదటి అధికార భాష కాగా ఉర్దూ రెండవ అధికార భాష మన రాష్ట్రంలో తెలుగు నుండి ఇంగ్లీషుకు, ఉర్దూ నుండి ఇంగ్లీషుకూ నిఘంటువులున్నాయి. కానీ ఈ ఇద్దరు అన్నదమ్ములూ పరస్పరం తెలుగు-ఉర్దూ, ఉర్దూ-తెలుగు నిఘంటువులు నిర్మించుకోలేదు. రెండూ దేశభాషలే. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్ళయినా ఒకరి భాష ఒకరికి సరిగా రాదు.

   ఏబికె ప్రసాద్ గారు తెలుగు - ఉర్దూ నిఘంటువు గురించి ఆయన పదవీ విరమణా నంతరం ఇప్పటికి కూడా ఆరా తీస్తున్నారు.

   ఎన్నో ఉర్దూ పదాలు, ఇంగ్లీషు పదాలు తెలుగు ప్రజల అనుదిన జీవిత సంభాషణల్లో పాతుకుపోయి ఉన్నాయి. అనువాదం చేసే ప్రొఫెసర్లు పండితులు ప్రజలకు అర్థం కాని కృత్రిమ భాషా పదాలను సృష్టించే కంటే ప్రజలలో పాతుకుపోయిన ఉర్దూ, ఇంగ్లీషు పదాలనే వాడితే మన తెలుగు విద్యార్థులను కాపాడిన వారౌతారు.
4. ప్రాచీన భాషా పీఠం మన రాష్ట్రంలోనే పెడతారు కాబట్టి దానికి వచ్చే నిధులతో మహా నిఘంటువు, జాతీయాలు, సామెతలు, జానపదగీతాలు, పాత చిత్రాలలోని పాటలు మొదలైన సాహిత్య గ్రంథాలు ముద్రించాలి.
5. పోటీ పరీక్షల్లో తెలుగు విద్యార్థులకు ఉపయోగపడే సూచనలు సలహాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి ఇస్తూ ఉండటానికి అమలు చేయడానికి ప్రత్యేక యంత్రాంగం, మంత్రాగం ఏర్పడాలి.

21.2.2012న మాతృభాషా దినోత్సవ సందర్భంలో మన తెలుగు ప్రముఖులు పలికిన మాటలు కొన్ని గుర్తుంచుకుందాము :

"ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని సమన్వయ పర్చేందుకు రాష్ట్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి. అధికార భాషా సంఘాన్ని వెంటనే పునరుద్ధరించాలి. ఉద్యోగాల్లో ఐదుశాతం వెయిటేజీ ఇస్తే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుగు నేర్చుకుంటారు."

**- మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు.**

"శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని మాతృభాషలో అందించటం వల్లే ఇటలీ, జర్మనీ, చైనా, రష్యా, జపాన్, కొరియా దేశాలు అభివృద్ధి చెందాయి." **- రాఘవులు**

"ఆంగ్లంలో మాట్లాడకుంటే నన్ను దండించారు. పబ్లిక్ స్కూళ్ళలో ఆంగ్లం తప్ప మరో భాషకు చోటు లేదు. తెలుగు మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తే ఎవరూ బాధ్యతల్ని స్వీకరిస్తారో వెతికిపెట్టండి." **- ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి**

అదే రోజు సిలికానాంధ్ర వాళ్ళు యూనీ కోడులో 3 ఫాంట్లు (అక్షర రూపాలు ఆయా దాతల పేరుతో విడుదల చేశారు.)

**వాటి పేర్లు :** 1. పొన్నాల, 2. రవిప్రకాష్, 3. లక్కిరెడ్డి. అక్షరరూపాలు బాగున్నాయి.

అక్షర దాతలకు ధన్యవాదాలు. తెలుగు భాషకు మరెన్నో అక్షర రూపాలు సమకూర్చాలి, ఇంకా అనేక అక్షర రూపాలను వాటి గుత్తాధిపతుల నుండి ప్రభుత్వం కొనుగోలు చేసి జాతికి అందించాలి. ఫాంటు కన్వర్టర్లను ఎప్పటికప్పుడు తాజా పరుస్తూ ఉండాలి.

**తెలుగు పతాకం ఎగురని దిశయే లేదు**
**తెలుగు దివ్వె వెలుగనట్టి దిశయే లేదు**
**తెలుగు వెలుగు చేరలేని దేశం లేదు**
**తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు**
**కలకాలం మన ఐక్యత కాపాడాలి**
**తెలుగుజాతి గౌరవాన్ని నిలబెట్టాలి** **- దాశరథి**

# 17. తెలుగు భాషకు తీవ్రమైన అన్యాయం

తెలుగు ప్రాచీన భాషా అధ్యయన కేంద్రాన్ని మన రాష్ట్రంలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారు 29.10.2011న కేంద్ర మంత్రి పురందరేశ్వరి గారికి రాసిన లేఖ 2.2.2012న నాకు పంపారు. అందులో పేర్కొన్న అంశాలు :-

మైసూరులోని భారతీయ భాషల కేంద్రంలో తెలుగు భాషకు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నది.

1. ఒకప్పుడు తెలుగు, తమిళం, బెంగాలి భాషలలో కరస్పాండెన్ కోర్సు నడిచేది. 2001వ సంవత్సరంలో తెలుగు కోర్సు మాత్రమే మూసివేయబడినది.

2. 2004వ సంవత్సరంలో భాషా మందాకిని ప్రాజెక్టు ప్రారంభించబడినది. దానిలో తెలుగు భాషను తొలగించి బెంగాలీ భాషను పెట్టారు. 2008వ సంవత్సరంలో తెలుగు విశ్వవిద్యాలయంలో కలసి తెలుగు భాషా మందాకిని ప్రాజెక్టు చేయడానికి ఒప్పందం జరిగింది. అయితే అప్పటి నుంచి ఒకటి, రెండు సమావేశాలు తప్ప ఆ ప్రాజెక్టు అతిగతి లేదు.

3. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ప్రాజెక్ట్ అనేది భారతీయ భాషలలో రచనలు చేసే రచయితల ప్రచురణలకు మరియు పుస్తకాల కొనుగోలుకు ఆర్థిక సహాయం చేసే ప్రాజెక్టు. ఇందులో అతి ఎక్కువ భాగం ఇతర భాషలకు, అతి తక్కువ భాగం తెలుగుకు కేటాయిస్తున్నారు. గత కొద్ది సంవత్సరాల లాంగ్వేజ్ వైజ్ శ్టాటిస్టిక్స్ చూస్తే తెలుగుకు జరుగుతున్న అన్యాయం తేటతెల్లమవు తున్నది.

4. నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్ చాలా పెద్ద ప్రాజెక్టు. ఇందులో వివిధ భాషలకు చెందిన వంద మంది దాకా పనిచేస్తున్నారు. తెలుగు వారు కేవలం ఇద్దరు, ముగ్గురు మాత్రమే ఉన్నారు.

5. భారతీయ భాషల “లింగ్విస్టిక్ డేటా కన్సార్టియం” ఇందులో దాదాపు 70 మంది పనిచేస్తుంటే దురదృష్టవశాత్తు తెలుగువాడు ఒక్కడే.

6. నేషనల్ టెస్టింగ్ సర్వీసెస్. ఇది కూడా చాలా పెద్ద ప్రాజెక్టు.అనేక రకాల పరీక్షల మూల్యాంకనం మరియు పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించే పరీక్షలకు సంబంధించిన విధి విధానాలను సూచన చేసే ప్రాజెక్టు ఇది. ఇందులో కూడ తెలుగు భాషక స్థానం దక్కక పోవటం దురదృష్టం. కేవలం తమిళం, ఉర్దూ భాషలకే పరిమితం చేశారు.

7. మొత్తం ఈ కేంద్రంలో వివిధ ప్రాజెక్టులలో 350 మంది పైగా పనిచేస్తుంటే ఇందులో తెలుగువారు కేవలం 5 గురు మాత్రమే.

తెలుగు వారికి, తెలుగు భాషకు ఆ కేంద్రంలో ఈ దుస్థితి కల్పించిన సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకుని ఈ పరిస్థితి సవరించవలసిందిగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా సహాయమాత్యులు శ్రీమతి దగ్గుబాటి పురందరేశ్వరి గారిని కోరుతున్నాను.

2012 ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రభుత్వానికి 9 డిమాండ్లు పంపింది :-

1. తెలుగు భాషా రక్షణ అభివృద్ధికై ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను వెంటనే ఏర్పాటు చేయాలి.
2. రాష్ట్రంలో అన్ని స్థాయిల్లో అధికార భాషగా తెలుగును అమలు చెయ్యాలి. చట్టసభలు, ముఖ్యమంత్రి కార్యాలయం, సచివాలయం, శాఖాదిపతుల కార్యాలయాల్లో వెంటనే దీనిని అమలు చెయ్యాలి. జిల్లాస్థాయి వరకు న్యాయస్థానాల్లో తెలుగులో వ్యవహారాలు జరిగేందుకు జి.ఓ.నెం. 485(1974) అమలు పరచాలి. అధికార భాషా సంఘాన్ని తగిన అధికారాలు ఇచ్చి వెంటనే నియమించాలి.
3. ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలన్నిటిలో మాతృభాషలోనే ప్రాథమిక విద్యను బోధించడాన్ని తప్పనిసరి చెయ్యాలి.
4. ఇంటర్మీడియట్, డిగ్రీ, పి.జి తరగతుల్లోను సాంకేతిక విద్యారంగంలోను రాష్ట్రంలో తెలుగు భాషను ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చెయ్యాలి. మొదటి తరగతి నుండి ఒక సబ్జక్టుగా మాత్రమే ఆంగ్లాన్ని బోధించాలి.
5. ఇతర రాష్ట్రాల్లోని తెలుగువారి విద్య, భాషా సంస్కృతుల రక్షణకై శాశ్వతస్థాయిన సంయుక్త సభాసంఘాన్ని అన్ని వనరులతో ఏర్పరచాలి.
6. క్లాసికల్ భాషగా తెలుగులో పరిశోధన కేంద్రాన్ని కేంద్రానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినా, దాన్ని ఆంధ్రప్రదేశ్‌లో స్థాపించడానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహించకపోవడం అన్యాయం. వెంటనే తగిన సౌకర్యాలు చూపడంతో పాటు తమిళ, కన్నడాలకు దీటుగా క్లాసికల్ తెలుగు అధ్యయన సంస్థను పూర్తి స్థాయిలో స్థాపించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.
7. పోటీ పరీక్షల్లో తెలుగు మాధ్యమ అభ్యర్థులను ప్రోత్సహించడానికి 5 శాతం అదనపు మార్కులు కలపాలి.
8. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీని, రద్దయిన తక్కిన అకాడమీలను వెంటనే పునరుద్ధరించాలి.

9. ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో తెలుగు మాట్లాడడాన్ని నేరంగా పరిగణించి శిక్షలు వేయడం రాష్ట్రమంతటా ఒక అలవాటుగా మారింది. తెలుగుభాషను తక్కువ చూపుచూడడం, పలురంగాలలో తెలుగును అవమానించడం సర్వసాధారణమైంది. వివిధ ప్రాంతాల మాండలికాలను, యాసలను హేళన చెయ్యడం, వక్రీకరించడం జరుగుతోంది. ఈ పరిస్థితిని నివారించి, తెలుగు భాషా సంస్కృతుల పట్ల గౌరవాన్ని ఇనుమడింపచేసేందుకు వెంటనే ఒక చట్టాన్ని తీసుకురావాలి.

పై కనీస డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తీర్చాలి. తెలుగు భాషపట్ల, తెలుగు జాతిపట్ల తన నిబద్ధతను నిరూపించుకోవాలి. ఎన్నో ఏళ్లుగా ప్రజలు కోరుతున్న ఈ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోతే రాష్ట్రంలోనూ రాష్ట్రం బయటాగల 18 కోట్ల తెలుగు ప్రజలు అసంతృప్తికి పాలక వర్గాలు గురికావలసి వస్తుంది. నిరంతర ఉద్యమాల్ని, ఆందోళనల్ని ఎదుర్కోవలసి వస్తుంది.

"ఇంటా బయటా తెలుగును అణచివేస్తున్నారు" అనే సంపాదకీయం లో సామల రమేష్ గారు ఇలా ఆవేదన చెందారు :

"రాష్ట్రంలో తగినచోటునిచ్చి, తెలుగు భాషా పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించే బాధ్యతను తీసుకునే నాధుడు ఎవరూ ఈ రాష్ట్ర ప్రభుత్వంలో లేడు. తెలుగుకు ఒక మంత్రీ, మంత్రిత్వశాఖ ఉంటేగదా పట్టించుకోవడానికి! ఇదీ మనగతి. ప్రభుత్వ ఉద్యోగులు తెలుగు నేర్చుకోవలసిన అవసరం లేదని కూడా ఇప్పుడు చేతల్లో చెప్పేసిందన్నమాట! తెలుగును తొంభై తీరులుగా తొక్కివేస్తున్నారు. బయటివారు, లోపలివారూ తెలుగును అణచివేస్తున్నారు"

(నడుస్తున్న చరిత్ర ఫిబ్రవరి 2012)

"తెలుగుకు ప్రపంచీకరణ తెగులు" పట్టిందంటూ వెన్నెలకంటి రామారావు ఇలా బాధపడ్డారు :

"తెలుగు జాతిలో మేధావులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ తెలుగు భాషకు పారిభాషిక భాషా లక్షణం తీసుకురావడంలో వారందరూ విముఖంగా ఉన్నారు. తమ పరిశోధనలకు, విద్యా ఉద్యోగాలకు, పరిపాలనకు పరాయి భాషను ఉపయోగిస్తూ మాతృభాషను కేవలం వాగ్వ్యవహారాలకు, దైనందిన కార్యకలాపాలకు వినియోగించడం వలన తెలుగు భాష ఆధునీకరణకు దూరమై ప్రమాదానికి చేరువయ్యింది. మాతృభాషను ఆధునీకరించి తెలుగు జాతి వికాసానికి కృషి చేసే సంకల్పంలేని ప్రభుత్వాల కారణంగా తెలుగు భాషకు ఈ దుస్థితి ఏర్పడింది."

2012 ఫిబ్రవరి 5,6,7 తేదీలలో – ఒంగోలులో జరిగిన 'ప్రపంచ తెలుగు మహోత్సవం'లో "సంస్కృతం, ఆంగ్లం అనే రెక్కలు లేకుండా తెలుగు అనే పక్షి ఎగురలేదు" అని పమ్మి పవన్‌కుమార్ అంటే, "తెలుగు వాళ్ళం చేతగాని వాళ్ళం అయివుండవచ్చు. తెలుగు

చేతగాని నుడికాదు, చేవకలిగిన నుడి.మన చేతగాని తనాన్ని నుడిపైన రుద్దడం తప్పు" అని స.వెం. రమేష్ గారు తెప్పికొట్టారు. నేను అంత సాహసించి మాట్లాడటం లేదు. కనీసం సంస్కృతం, ఆంగ్లం అనే రెక్కలతోనైనా తెలుగు పక్షిని స్వేచ్ఛగా, హాయిగా ఎగరనిద్దాం అంటున్నాను.

మాతృభాషల్లోనే గ్రహాలతో మాట్లాడేదెప్పుడు?" అంటూ ప్రజా సాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు "నిజాం నవాబు కాలంలో ఆనాటి పాలనా భాషైన ఉర్దూలోనే ఇంజనీరింగు న్యాయ, వైద్య, విద్య సుసాధ్యం అయినట్లు యిప్పుడు మాత్రం దేశీయ భాషలలో ఎందుకు సాధ్యంకాదు?" అని ప్రశ్నించారు.

"లోకముతో కూడా మార్పు చెందనిది ఏదీ వృద్ధి పొందదు. లోకమును అనుసరించి మారినవి వృద్ధిపొంది, మారని వాటిని అణగదొక్కి నిర్మూలము చేయకమానవు. ఇది లోకధర్మము" అన్నారు గిడుగు.

ఇంగ్లీషు అలా మార్పు చెందుతూ ఉంది కాబట్టి మిగతా భాషల్ని అణగదొక్కి రాజ్యమేలుతోంది. తెలుగు భాషను కూడా అలా ఆధునిక ప్రజావసరాలన్నింటికీ అనువుగా అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకుంటూ పోకపోతే తెలుగు అణిగి మణిగి పోవడం ఖాయం. ఇంగ్లీషు మాత్రమే వచ్చిన వాడికి ఉద్యోగాలు ఎంత సులభంగా దొరుకుతున్నాయో తెలుగు మాత్రమే వచ్చినవాడికి కూడా అంతే సులభంగా ఉద్యోగం దొరికేదాకా తెలుగు ప్రజలు పోరాడక తప్పదు.

## తమిళ అసెంబ్లీలో తెలుగు గోడు

**హొసూరు ఎమ్మెల్యే గోపీనాథ్ :** మీరు నన్ను నా భాషలో మాట్లాడటానికి ప్రోత్సహించారు. ముఖ్యమంత్రిగారూ మీరు తెలుగులో మాట్లాడుతుంటే నేను పరవశించి పోతున్నాను. మీ మాటలు విన్న యావత్ భారత దేశంలోని తెలుగు ప్రజలు మిమ్మల్ని వేనోళ్ళ కొనియాడుతారు. మా యొక్క గోడు ఏంటంటే మా భాషని కాపాడండి. మాతో పాటు ఉర్దూ కన్నడ మళయాళ భాషలను కాపాడండి అని విన్నవించుకుంటున్నాను.

**ముఖ్యమంత్రి జయలలిత :** అన్ని భాషలను కాపాడటానికి మేము సిద్ధంగా ఉన్నాము. ఏం చెయ్యాలో చెప్పండి మీరు.

**హొసూరు ఎమ్మెల్యే గోపీనాథ్ :** ఏం చేస్తే బాగుంటదో ఏం చేస్తే మా మైనారిటీ భాషలు కాపాడబడతాయో ఆలోచించి మీరే చెయ్యండి.

**ముఖ్యమంత్రి జయలలిత :** కర్నాటకలో విద్యార్థులు కన్నడం చదవకుండా తమ విద్యను కొనసాగించలేరు.

ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులు తమ మాతృభాష ఏదైనప్పటికీ తెలుగు తప్పనిసరిగా చదవాల్సిందే.

కాబట్టి తమిళనాడులోని విద్యార్థులంతా తమ మాతృభాష ఏదైనప్పటికీ తమిళం చదవాల్సిందే అన్న నిబంధనలో తప్పులేదు. ఎలాంటి మార్పు ఉండబోదు.

జయలలిత నోట తెలుగు ఎంతో మధురంగా ఉంది. తమిళనాడు అసెంబ్లీలో తెలుగు వాణి వినిపించిన హొసూరు ఎమ్మెల్యే గోపీనాథ్‌ను చూసిన మీదట మన నాయకులకు తెలుగును రక్షించుకోవాలన్న తెగువ కలగాలి. తమిళనాడులో నివసించే తెలుగు వాళ్ళతో పాటు ఎవరైనా సరే తమిళం చదవాల్సిందేనని 3.2.12న అసెంబ్లీలో జయలలిత తెగేసి చెప్పారు.

తెలుగు భాష పట్ల కూడా అలాంటి దృఢాభిప్రాయం మన నేతలకూ ఉండాలి. "ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులు తమ మాతృభాష ఏదైనప్పటికీ తెలుగు తప్పనిసరిగా చదవాల్సిందే"నన్న జయలలిత మాటలు నిజమైతే చాలు.

**"ఆంధ్ర భాషను నేర్చెడి ఆశలేక**
**ఆంగ్ల బాషకు బోవ అసలేరాక**
**ఉభయ భ్రష్టత్వమైనట్టి యుర్వియైన**
**ఆంధ్రనెచ్చట గలదోయి ఆత్మశాంతి**

**- శృంగారకవి రాధాకృష్ణ** (ఆంధ్రీ శతకము)

**సుందోప సుందులు కాకండర్రా**
**ఓ తెలుగు యువకుల్లారా**
**మిమ్మల్ని భ్రమింప జేస్తున్న రంభ**
**వట్టి పయోముఖ విష కుంభ**
**ఆర్య భూమి సూర్య భూమి వీర భూమిరా మనది**
**సత్య భూమి చిత్వ భూమి తత్వ భూమిరా మనది**
**యంత్ర భూమి తంత్ర భూమి మంత్ర భూమిరా మనది**
**అన్న భూమి వెన్న భూమి కన్న భూమిరా మనది**
**భవ్య భూమిరా మనది దివ్య భూమిరా - బోయి భీమన్న**

# 18. తమిళులు ఎలా చేస్తే మనమూ అలా చేద్దాం

1.8.2006 నుండి తమిళనాడులో కొన్ని సంస్కరణలకు ముఖ్య మంత్రి కరుణానిధి శ్రీకారం చుట్టారు. అందులో తమిళభాషకు ప్రాణం పోసే సంస్కరణలు కొన్ని ఉన్నాయి.

1. అన్ని స్కూళ్ళల్లో తమిళభాష నేర్పటం నిర్బంధం చేశారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలనే తేడా లేదు. ఇంగ్లీషు మీడియం స్కూళ్ళయినా సరే తమిళం నేర్వాల్సిందే.
2. కామరాజు పుట్టిన రోజును "విద్యాభివృద్ధి దినోత్సవం"గా జరుపుతారు.
3. తమిళ పేర్లు పెట్టిన సినిమాలకు ప్రోత్సాహకాలిస్తారు.
4. అన్ని కులాల ప్రజలూ 'అర్చకులు' అవుతారు.

కేవలం బ్రాహ్మణులు మాత్రమే కాక ఏ కులం వ్యక్తి అయినా గుడిలో పూజారి కావచ్చు. పైగా సంస్కృత మంత్రాల స్థానంలో తమిళ మంత్రాలు, ప్రార్థనలు చదవొచ్చు. ఒక పక్క బడుగు కులాల వాళ్ళకు అర్చక పదవుల వల్ల సాంఘిక గౌరవం దక్కుతూ, మరో పక్క వెనుకబడిన కులాలు రక్షించుకుంటూ వస్తున్న తమిళం దేవభాషగా విరాజిల్లుతుంది. ఉభయతారక మంత్రం ఇది.

పై సంస్కరణలు మన రాష్ట్రంలో కూడా త్వరలో రావాలని ఆశిద్దాం. తెలుగు ప్రజలకంటే తమిళుల జనసంఖ్య తక్కువే. అయినా తమిళులకు చేవ ఎక్కువ. తమిళాన్ని దేవభాషగా గౌరవిస్తారు. మన తెలుగు కూడా దేవభాషే అని చాటిచెబుదాం. తెలుగును దేవభాషగా గౌరవిద్దాం. ఇందులో తప్పేం లేదు. ఇంగ్లీషు, సంస్కృతం, అరబీ భాషలను మనం గౌరవించటం లేదా? అలాగే మన భాషను కూడా గౌరవిద్దాం. ***(1.9.2006, గీటురాయి వారపత్రిక)***

కోయంబత్తూరులో జరిగిన ప్రపంచ ప్రాచీన తమిళ మహాసభ అమోదించిన తీర్మానాలపై ఆ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలు ఇవి :

- తమిళానికి కేంద్రంలో అధికార భాషా హోదా కల్పించాలి. ఈ అంశంపై పార్లమెంటులో ఓ తీర్మానాన్ని ప్రతిపాదించి దానిపై చర్చించాలి.
- మద్రాసు హైకోర్టులో తమిళంలో వాదనలకు అనుమతించాలి. దీనిపై ముఖ్యమంత్రి కరుణానిధి కేంద్ర ప్రభుత్వానికి 2006లోనే లేఖ రాశారు.
- తమిళ భాషాభివృద్ధికి పరిశోధనలకు అవసరమైన రాయితీ నిధులను కేంద్రం ఇవ్వాలి. రాష్ట్రంలో శాసన అధ్యయన కేంద్రం నెలకొల్పాలి.
- తమిళంలో చదువుకున్న అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగావకాశాలు, ప్రాధాన్యత ఇవ్వాలి.
- పాఠశాలలు, కళాశాలల పాఠ్యాంశాల్లో తమిళ ప్రాచీన భాషా శీర్షికను చేర్చాలి.

- తమిళ భాషాభివృద్ధికి రూ. 100 కోట్ల నిధులు ఏర్పరచాలి.
- తమిళంలో ఉత్తమ సాఫ్ట్‌వేర్‌ను ఎంపిక చేసి, దాని రూపకర్తకు కన్యన్‌పూంగుండ్రనాథ్ పేరుతో రూ. 1 లక్ష నగదు అవార్డు, ప్రశంసాపత్రం ప్రతి సంవత్సరం పంపిణీ చేయాలి.

మన రాష్ట్రం కూడా తెలుగు భాష గురించి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నాను. తమిళులు ఎలా చేస్తే మనమూ అలా చేద్దాం.

ఇక నుంచి తమిళనాడులోని అన్ని డిగ్రీ కళాశాలల్లో కూడా ద్వితీయభాషగా తమిళమే వుండబోతోందని ఆ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కె. పొన్ముడి పేర్కొన్నారు. వచ్చే ఏడాది నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం నుంచే తమిళ సాహిత్యం, పద్య, గద్య, వ్యాకరణం తదితరాలన్నీ వుంటాయన్నారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరంలో తమిళ వ్యాకరణ చరిత్ర, ప్రాచీన తమిళంలు సబ్జెక్టులుగా వుంటాయన్నారు.

ఆర్ట్స్ అండ్ సైన్స్, ఎయిడెడ్ కళాశాలలు, స్వయంప్రతిపత్తి కళాశాలలకు కూడా ఈ విధానాలే వర్తిస్తాయని పొన్ముడి ప్రకటించారు.మనం కూడా ఇలాంటి ప్రకటన ఆశించవచ్చా?

12.10.2004న తమిళాన్ని ప్రాచీన భాషగా కేంద్రం గుర్తించింది. ప్రాచీన భాష హోదా వల్ల తమిళ పీఠానికి కేంద్రం నుండి వస్తున్న కోట్లాది రూపాయల నిధులతో 29 ఎరకాల స్థలంలో సంస్థ భవనం కట్టారు. ఆ పీఠంలో 11 శాఖలు ఏర్పాటు చేశారు అవి :-

1. సాహిత్యం, 2. భాషాశాస్త్రం, 3. అనువాదం, 4. నిఘంటువులు, 5. భాషా చరిత్ర, 6. పురాతత్వం, 7. శిలాశాసనాలు, నాణాలు 8. రాతప్రతులు, 9. కళలు, శిల్పం, 10. భాషా సాంకేతిక పరిజ్ఞానం, 11. విదేశాల్లో తమిళం.

8.5.2009న తెలుగు కన్నడ పీఠాలు ఏర్పాటు చేయటానికి కేంద్రం అంగీకరించింది. తీరా తెలుగు పీఠం కూడా మైసూరులోనే ఏర్పాటు చేస్తామన్నారు. తెలుగు ప్రజల నిరసనకు తలొగ్గి తెలుగు కేంద్రం తెలుగు ప్రాంతంలోనే ఏర్పాటు చేయటానికి అంగీకరించారు. 17.10.2012న కన్నడ కేంద్రం మైసూరులో ప్రారంభించారు. కన్నడ అభివృద్ధికి 200 కోట్ల బడ్జెట్ పెంచినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సదానంద గౌడ ప్రకటించారు. "క్లాసికల్ కన్నడ" అనే వెబ్‌సైట్ కూడా ప్రారంభించారు.

మన తెలుగు భాషా పరిశోధనా పీఠం ఇంకా ఎక్కడా పెట్టలేదు. త్వరగా మేలిమి తెలుగు కేంద్రాన్ని విజయవాడలో పెడితే బాగుంటుంది. అలాగే తెలుగుపీఠంలో కూడా 11 శాఖలు ఏర్పాటు చెయ్యాలి. 200 కోట్లు నిధులివ్వాలి. "మేలిమితెలుగు" వెబ్‌సైట్‌ను ప్రారంభించాలి. తెలుగులో ఉత్తమ సాఫ్ట్‌వేర్‌ను ఎంపిక చేస్తూ ప్రతిఏటా వాటి రూపకర్తలకు నగదు బహుమతులు ప్రకటించాలి.

# 19. తెలుగుతల్లి భాష కూడా దేవభాషే

హిందూ గ్రంథాల్లో చాలా చోట్ల దేవతలు సంస్కృతంలో మాట్లాడతారని ఉంది కాబట్టి అది దేవతల భాష, అదే దేవ భాష అని హిందూ భక్తుల నమ్మకం. యూదులకు దేవుడు తోరాహ్ ను హెబ్రూ లో ఇచ్చాడు కాబట్టి యూదులకది దేవభాష.యేసు క్రీస్తు మాతృభాష ఆరామిక్ కాబట్టి ఆరామిక్ దేవుని ప్రత్యేక భాష అని క్రైస్తవులు నమ్ముతారు. అరబ్బీ స్వర్గలోకపు భాష అనీ, స్వర్గవాసులందరూ అరబ్బీలోనే మాట్లాడుతారనీ, అల్లాహ్ అరబ్బీలోనే తీర్పు తీరుస్తాడనీ, అసలు ప్రతీ శిశువూ అరబీ భాషాజ్ఞానంతోనే పుడుతుందనీ, తల్లిదండ్రులే వారి వారి భాషలు పిల్లలకు నేర్పుతారనీ "కొందరు ముస్లిములు వాదిస్తున్నారు. నా వాదన ఏంటంటే ఖురాన్ అరబ్బీలో రాశారు. కానీ అల్లాహ్ అరబ్బీలో మాట్లాడతాడని లేదా జన్నత్‌లో అరబ్బీయే సాధికారభాష అని ఎక్కడా చెప్పలేదు" "అన్ని భాషలూ దేవుడే పుట్టించాడు" "అన్ని భాషలూ అల్లావే" అని ఖురాన్ (49:13, 11:118-119) చెబుతోంది" ఎవరి **మాతృభాష** వారికి దేవుడిచ్చిన భాషే కాబట్టి, అదేవారికి దేవభాష అవుతుంది.

పరాయి భాష మాత్రమే మాట్లాడే దేవుడి దగ్గరకు ప్రజలు పోతారా ? పర భాషలో భక్తుల ఆత్మ నివేదన ఏదో మొక్కుబడి వ్యవహారం అన్నట్లుగానే ఉంటుంది తప్ప ప్రార్థనలో తాదాత్మ్యం చెందటం,ఆరాధనలో ఆనందం పొందటం ఉండవు. మన తెలుగు నేలపై మొక్కులందుకుంటున్న తెలుగు దేవుళ్ళూ, తెలుగు దేవతలూ ఎంతో మంది సొంత భాష తెలుగే కదా? లెక్కకు మిక్కిలిగా ఉన్న మన గ్రామ దేవతల సొంత భాష తెలుగే.తెలుగు నేలపై అవతరించిన తెలుగు దేవుళ్ళు మాట్లాడే భాష తెలుగే అని కూడా చెప్పుకోలేని దైన్య స్థితి ఎందుకు? అది సంస్కృత ప్రభావమా, భయమా లేక నిజాన్ని దాచిపెట్టడమా?

2010 కోట్ల బడ్జెట్‌తో దేశంలోనే అతి పెద్ద దేవునిగా అలరారుతున్న మన ఆపద మొక్కుల వాడు, ఏడుకొండల వెంకన్న మాట్లాడేది తెలుగు కాదా? శ్రీశైలం మల్లన్న, శ్రీకాళహస్తీశ్వరుడు, సింహాద్రి అప్పన్న, అన్నవరం సత్యనారాయణ, మంగళగిరి పానకాల స్వామి, యాదగిరిగుట్ట నరసింహుడు, కాణిపాకం వినాయకుడు, బాపట్ల భావన్నారాయణ, నరసరావుపేట కోటప్ప, బెజవాడ కనకదుర్గ, బాసర సరస్వతి, విశాఖ కనకమహాలక్ష్మి, కొండపాటూరు పోలేరమ్మ, శ్రీహరికోట శాస్త్రజ్ఞులకు సదా అభయమిస్తున్న సూళ్ళూరుపేట చెంగాళమ్మ, కాల జ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, పుట్టపర్తి సాయిబాబా, తెలుగు తల్లి, తెలంగాణా తల్లి... ఇలా కొన్ని వందల మంది తెలుగు దేవుళ్ళూ, తెలుగు దేవతలూ, స్వాములవార్లూ హాయిగా తెలుగులో మాట్లాడుతూ, తెలుగు ప్రజలకు చక్కగా తెలుగులోనే జవాబులిస్తుంటే తెలుగును దేవ భాష కాదనటం ఆత్మ వంచన కాదా? సోది చెప్పే వాళ్ళు

నయం అనిపించారు. మన తెలుగు దేవుళ్ళ జాబితా చక్కగా సగర్వంగా చెబుతారు.

సంస్కృతం నేర్చిన తెలుగు పండితులు, పురోహితులు, కూడా వాళ్ళ సొంత అవసరాలు వచ్చేటప్పటికి ఆయా దేవుళ్ళకు సంస్కృతంలో కాకుండా తెలుగులోనే మొర్ర పెడతారు. ఆ దేవుళ్ళు కూడా తెలుగులోనే వరాలిస్తుంటే తెలుగు దేవ భాష అనటానికి ఒక్కరికీ నోరు రాదేమిటి? మన తెలుగు దేవుళ్ళు తెలుగులో మాట్లాడటం కూడా అపరాధమైనట్లు, తెలుగు దేవుళ్ళు తెలుగులో మాట్లాడరాదనీ, వాళ్ళను తెలుగులో పలకరించకూడదనీ వీళ్ళకు వీళ్ళే తీర్మానించటం న్యాయమా? తెలుగు దేవుళ్ళు ఏ భాషలో మాట్లాడాలో కూడా అర్చకులే చెప్పాలా? తెలుగు భాష గురించి తెలుగు దేవుళ్ళకు లేని అభ్యంతరాలు యాజక వర్గానికి ఉండడం అప్రజాస్వామికం నియంతృత్వం. మొదటి నుండీ ఈ వైఖరే మన భాషకు శాపం అయ్యింది. దేవుడు వరమిచ్చినా పూజారి వరమియ్యలేదు అనే సామెత ఇందుకే పుట్టి ఉంటుంది.

మన కార్యాలయాల్లో, కోర్టుల్లో, పాఠశాలల్లో పరాయి భాషలను ఎలా నిర్బంధం చేశారో అలాగే మన గుళ్ళూ గోపురాల్లో తెలుగు దేవుళ్ళకు కూడా ఆంగ్లంలోనే అన్నీ అమర్చేలా ఉన్నారు. పోను పోను ఇంకా ఎన్ని విచిత్రాలు జరుగుతాయో!

**పసిపిల్లలు ఏడ్చేది మాతృభాషలోనే :**

పిల్లలు పుట్టకముందే మాతృభాషను నేర్చుకుంటారు. మాతృభాషలో ఎన్నడూ మాట్లాడనంటూ రాసి ఉన్న బోర్డులను చిన్నారి విద్యార్థుల మెడలో 'ఉపాధ్యాయులు' వేలాడదీయడం అనైతికమే కాదు అసహజం కూడా అని సైన్స్ నిరూపించింది. అప్పుడే పుట్టిన పసిపిల్లలు ఏడ్చే ఏడుపు కూడా మాతృభాషలోనే ఉంటుందని జర్మనీకి చెందిన శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది. అమ్మ గర్భంలో ఉన్న తొమ్మిది నెలల్లో... చివరి మూడు నెలల సమయంలో తల్లి మాటలు వింటూ పిల్లలు మాతృభాష గురించి తెలుసుకుంటారని, పుట్టిన తర్వాత వారి ఏడుపు అదే భాషను ప్రతిఫలిస్తుందని తెలిసింది. పిల్లలు గర్భంలో ఉండగానే తల్లి మాటలు వింటూ ఉచ్ఛారణ గురించి తెలుసుకున్నారని స్పష్టమైంది. పిల్లలు వివిధ రకాల ధ్వనుల్లో ఏడ్చే సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ, మాతృభాషకే ప్రాధాన్యమిస్తున్నారని కూడా ఈ పరిశోధనలో తెలిసింది. అమ్మతో అనుబంధాన్ని పెంచుకోవటం కోసమే శిశువు తనకు తెలిసిన మొదటి విద్యను ఇలా ప్రదర్శిస్తుంటాడు. (ఈనాడు 7.11.2009). కాబట్టి అన్ని మతాల దైవప్రార్థనలు కూడా మాతృభాషల్లో ఉండడం సమంజసమే, న్యాయమే.

పొట్టి శ్రీరాములు గారు చనిపోయింది మద్రాసుతో కూడిన ఆంధ్రరాష్ట్రం కోసం. అయితే తరువాత కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. తరువాత తెలంగాణాను కలుపుకున్నారు. అప్పటికే అక్కడ ఉర్దూ రాజ్యమేలుతూ ఉంది. ఉర్దూను రెండవ అధికార భాష అన్నారు. వాళ్ళ ఉర్దూ పోయింది, మన తెలుగూ పోయింది. ఇంగ్లీషు రాజ్యమేలుతోంది. ఇక

మనం ఆంగ్లాన్ని మోయక తప్పలేదు. తెలుగు రాష్ట్ర పాలనా భాషగా ఇంగ్లీష్ వైభవం వెలిగిపోతోంది. ఎవరి తల్లి వారికిష్టం. ఎవరి మాతృభాష వారికి గొప్ప. సంస్కృతాన్ని కాదని Long Live Classical Divine Tamil అని తమిళులు వారి భాషాభివృద్ధి కోసం శ్రమిస్తున్నారు. తమిళులు భాషాభిమానానికి వాళ్ళను మెచ్చుకోవాలి. తమిళనాట ముస్లిములు కూడా మసీదుల్లో ఉర్దూ అరబీ భాషలకు బదులు తమిళంలోనే మతవ్యవహారాలు నడుపుకొంటున్నారు. మనం కూడా తెలుగును మన తల్లి భాషగా దేవభాషగా Long Live Classical Divine Telugu అంటూ గౌరవిద్దాం. మత వ్యవహారాల్లో క్రైస్తవులు ఎలా తెలుగును వాడుతున్నారో అలా మిగతా మతాలు కూడా తెలుగును విస్తారంగా వాడాలి. భాషకు వాడుకే ప్రాణం. వాడని భాష పాడుపడుతుంది. తెలుగుతల్లికి 18 కోట్ల బిడ్డలున్నారు. ఒక్కొక్క పదాన్నే కూర్చుకుంటూ పాతికేళ్ళపాటు శ్రమపడి పునరుద్ధరించిన హీబ్రూ ను మించిన పుష్టి తెలుగుతల్లికి ఉంది. సకల విజ్ఞానశాస్త్రాలనూ మనభాషలోకి అనువదించుకొని మన భాషలోనే చదువుకొనే అవకాశాలు కలగాలి. తెలుగులో చదివినా ఉపాధి దొరకాలి.

ఒంగోలులో జరిగిన ప్రపంచ తెలుగు మహోత్సవం సందర్భంగా 1.1.2012న జన సాహితి "తెలుగు భాష ఉనికి – ప్రగతి; సంక్షోభం – సంఘర్షణ" అనే కరపత్రం నాలుగోసారి ముద్రించి పంచింది. అందులోనుంచి కొన్ని మాటలు :

"ఏ భాషను ఏ దేవుడూ సృష్టించలేదు. మతాల వారీగా దేవుళ్ని పంచుకున్నట్టు భాషల వారీగా దేవుళ్ళు లేరు. దైవ సృష్టే నిజమైతే 'బ్రహ్మ మొక్కడే' నన్న అన్నమాచార్యుని ప్రకారం, ప్రపంచ ప్రజలందరికి భాషకూడా ఒక్కటే అయ్యేది. కనుక భాషను ఏ భగవంతుడు ఆఖరికి ఆ "బ్రహ్మ" కూడా సృష్టించలేదు.. భాష కేవలం మానవ సృష్టి. భాషా బ్రహ్మ మానవుడే. దేవుడికి సంస్కృతం మాత్రమే వచ్చుననుకునేవారు, సంస్కృత భాషనుండే ప్రపంచభాషలన్నీ పుట్టాయనే మౌఢ్యంతో ఆలోచిస్తుంటారు. వారి సంకుచితత్వం దేవుడి నుండి భాష దాకా విస్తరిస్తుంది. ఈ దృక్పథం తెలుగు భాషాభివృద్ధికి తోడ్పడదు. భావ వ్యక్తీకరణలన్నింటికీ మూలం 'మాతృభాష'. జాతి సంస్కృతి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు భాష. బ్రిటీష్ పాలకులు తెలుగును కూటికి గుడ్డకూ పనికి రాని భాషగా చేశారు."

ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా 18 కోట్ల మందికి తెలుగు మాతృభాష. అంటే అమ్మ నాన్నల నుంచి వారసత్వంగా వచ్చిన భాష. నామిని సుబ్రమణ్యం పుస్తకాలలోంచి 4 మాటలు గుర్తు చేసుకొందాం.

1. తల్లిదండ్రీ ఇచ్చిన భూమిని సంసారి నాకొడుకు ఎవుడన్నా అమ్ముతాడా?
2. సాహిత్యం సమాజంలో నుంచే పుడతాది. అది ఆకాశంలో నుంచి దబీమని నేల పడదు. సమజంలో గూడా మహారాజులూ బీదలూ ఉన్నట్టే సాహితీ వేత్తల్లో గూడా మహా రచయితలూ మామూలు రచయితలు ఉంటారు. మహా రచయితలు మహారాజుల గురించీ

మామూలు రచయితలు మామూలు వాళ్ళ గురించి రాస్తారు.

3. "నా బతుకు నీటికన్నా పలసనా! దూదికన్నా సులకనా!" అని దేవుడి ముందు ఏడుపు పాట పాడేది మా అమ్మ.

4. "దేముళ్ళనే వాళ్ళకు కోపం రాగానే బాణాలు తీసియేసి అవతల వాళ్ళను దెబ్బకు చంపేస్తుంటారు. కానీ జీసస్ మాత్రం ఆయన మొకాన ఎంగిలూంచినా, ఎనకనుంచి ఎగతాళిగా ఎంటికలు పెరికినా, యింకా సిలువెక్కినాక కూడా కొడతావున్నా గమ్మునున్నాడే గాని నోరు తెరిచి ఒక్క తిట్టు తిట్టినాడా!"

5. "ఈ మఖా తల్లికి బ్రహ్మ రెక్కలిచ్చినాడే గానీ కష్టింజేసుకునేదానికి బూములు బావులిచ్చినాడా? పైగా ఏటా బాలింతను జేసి పిల్లకాయల్నిచ్చినాడు ఘనంగా, మనపిలకాయలకంత సంగటి పెడతాడు గదాని ఈ మఖాతల్లి కొంగు పరిచింది గానీ, బ్రహ్మ పెట్టింది తిని మదంబట్టిపోయి గాదు. నీకు ధర్మమనేది తెలిసుంటే ఆదున్నపోతు మీద బ్రహ్మనెక్కించుకుని నరకానికి తోడకపోయ్ నీతనివిడీరా చిత్రింసలు బెట్టుకో" అని శివుడు యమ ధర్మరాజుతో అంటాడు.

పై మాటలన్నీ మన తెలుగు భాషకు వర్తింపజేసుకుంటే నాకు ఇలా అనిపిస్తోంది.

1. తల్లీ దండ్రీ వారసత్వంగా ఇచ్చిన తెలుగు భాషను కాపాడుకోవాలి.
2. మనం దేవుళ్ళ బాషతో పాటు మామూలు తెలుగు భాషను కూడా గౌరవించాలి.
3. అలా గౌరవించి కాపాడకపోతే మన తల్లి బాష తెలుగు భాష పలచనా, చులకనా అయిపోయిందని మళ్ళీ ఆ దేవుడి ముందే ఏడవాల్సి వస్తుంది.
4. శక్తి చాలని వాడు సాధుత్వం వహించాడనీ, తప్పించే దిక్కు లేక దెబ్బలకోర్చాడనీ ఎగతాళి చేసే దుర్మార్గపు సమాజం మనది. తెలుగు భాషకు జరిగిన అవమానం మహానుభావుడైన ఏసు క్రీస్తుకు జరిగిన అవమానంలాగానే వుంది.
5. యమ దేవ భాషల పాశాల నుండి కాపాడే పరమ శివుడు తెలుగు భాషకు కావాలి.

సంస్కృత పదాలను పూర్తిగా నిరాకరించిన బంగారయ్య గారి మాటలను ఎత్తి చూపిస్తూ జయధీర్ తిరుమలరావు గారు ఇలా అన్నారు.

"సంస్కృతం కలగలిసిన తెలుగుని ఆంధ్రం అంటున్నాం. ఇది తెలుగు భాషని దూరం నెట్టి తాను ఆంధ్రమైంది. ఆంధ్రభాష పేరుతో అది పుస్తకాలకెక్కింది. ఇది తెలుగు లిపిలో ఉన్న సంస్కృతం. దీనిని ప్రజలు మాట్లాడరు. అది వ్యవహార దూరమైన భాష. ప్రజలు తమ నిత్యవ్యవహారంలో మాట్లాడే తెలుగుభాషకు రాతరూపం ఏర్పడలేదు.

పండిత వర్గం పట్టునుండి తెలుగును విడిపించడం సులభం కాదు. కింది వర్గాల నుండి వచ్చిన వాళ్ళని కూడా వ్యతిరేకించేట్లుగా పండితవర్గం చేయగలదు. ఆంగ్ల భాషా

వ్యామోహంలో కొట్టుకుపోయే ఆలోచనా పరులకు ఇదొక వ్యర్థ ప్రయాసగా తోస్తుంది. ఆలోచించడానికి కూడా సమయం కేటాయించడం కష్టంగా ఉంటుంది. ఈ ధోరణే తెలుగుభాషకు శత్రువు.

తెలుగు మీదకన్నా సంస్కృతంపై ఎక్కువ అభిమానం చూపే (సంస్కృతమే తెలుగు అనుకునే) వారు తెలుగువారా? సంస్కృతీయులా?

"తెలుగులో ఏ పరిభాష ఉందండీ కుక్క, నక్క, పిల్లి వంటివి తప్ప" అని తెలుగు శిష్టులు అంటారు. మీరు తమని తాము తెలుగువారని అనుకోరు. ఆర్యులమనే భావిస్తారు. కుక్క నక్కల భాషని చదవడం కన్నా అవమానం ఏముంటుంది. అందుకే ఇంగ్లీషు చదువులకు ప్రజలకు సులభంగా దారి ఏర్పడుతుంది. తెలుగు భాషకి జరిగిన అన్యాయం అంతా కవులవల్లే జరిగింది. 'ఎందుకంటే' కవుల చేతిలో నుడి సరిగా పెరగదు' అని ఖరాఖండిగా చెప్పారు బంగారయ్య. అంతేకాదు మనకి కవులు కాదు రచయితలు కావాలి. రచయితే భాషని బ్రతికిస్తాడు. తెలుగులో కవులూ, అనువాదకులే చాలామంది ఉన్నారు. కాని రచయితలు లేరు. ఈ అనువాదకులు తెలుగులో సొంతంగా రాయలేదు. కవికంటే రచయితే ముఖ్యం అని 23 అంశాలను పట్టికగా తయారు చేసి ఉదహరించి చూపాడు. అంతేకాదు కవిత్వానికి అధిక ప్రాధాన్యత ఇస్తే ఏమవుతుందో 12 అంశాలలో విడమరచి చెప్పాడు. తెలుగులో వివిధ అంశాలకు సంబంధించిన పదజాలం ఉంది. కాని అదంతా ఎటుపోయింది. దాన్ని గుర్తించనీయకుండా కేవలం కవిత్వం మాత్రమే రాయడం వల్ల ఆ భాషని పట్టించుకోలేకపోయాం. కవిత్వ భాషే ప్రాధాన్యత సంతరించుకొంది."

తెలుగు పద సంపద గురించి పరివేదన చెందిన బంగారయ్య గారి మాటలు ఒకసారి విందాం. :

"నుడిగంటుకారులు-తెలుగు దేసి గ్రామ్యపు మాటలను విడతియ్య లేకపోయిన అప్పుడు - వాటిని అన్నిటిని తెలుగు మాటలుగానే సూచించి ఉండవచ్చునుగా? ఎందుకు అలాగ చెయ్యలేదు? ఎందుకు అన్నిటిని దేసీయాలు అని చూపించినారు. దీనికి ఒకటే జవాబు. వారికి తెలుగు అంటే కంటగింపు ! తెలుగు అనే మాటను చూస్తేనే చీదర ! తెలుగు జాతి అంటే లోకువ.

గత వెయ్యి ఏళ్ళుగా తెలుగునాటిలో మనుసులు నివసించలేదా? వారి బొందిలోని బాగాలకు పేర్లులేవా? గత వెయ్యి ఏళ్ళుగా తెలుగునాటిలో మంది ఇళ్ళు కట్టి కాపురాలు చెయ్యలేదా? మరి ఇంటిలోని బాగాలకు, ఇల్లు కట్టే పనిముట్లకు పేర్లులేవా? గత వెయ్యి ఏళ్ళుగా తెనుగులు బట్టలు నెయ్యలేదా? కట్టలేదా? అయిన అప్పుడు బట్టలకు నేతకు సంబంధించిన మాటలు పెరగలేదా? గత వెయ్యి ఏళ్ళుగా తెలుగు జాతి నేలను సాగు చెయ్యలేదా?

అలాటి అప్పుడు సాగుకు చెందిన మాటలు ఏర్పడలేదా? గత వెయ్యి ఏళ్ళుగా తెనుగులు పోరులు చెయ్యలేదా? తళ్ళులు వెళ్ళలేదా? రాజ్జా'లను జయించలేదా? వాటిని ఏల లేదా, పరిపాలించ లేదా? రాయబారాలను నడపలేదా? సంది సరతులను విదించలేదా, అంగీకరించలేదా? మరి ఈ మాట మూట అంతా ఏమి అయింది? గత వెయ్యి ఏళ్ళుగా తెలుగుజా'తి బేరసారాలు చెయ్యలేదా? పడవ, ఓడ, నావ పయినాలు చెయ్యలేదా? ఈ పొత్తులో పెరిగిన మాటలు ఏమి అయినాయి? గత వెయ్యి ఏళ్ళుగా తెలుగునాటిలోను జనులు జబ్బులు పడలేదా, మందులు వాడలేదా? ఈ మాట సంపద అంతా ఏమి అయింది? గత వెయ్యి ఏళ్ళు తెలుగు జాతి బతకలేదా, పెళ్ళిళ్ళు చేసుకోలేదా, పిల్లలను కనలేదా, వారిని పెంచలేదా? ఈ పొత్తులో పెరిగిన మాట మూట ఏమి అయింది? తెలుగులో మాటలు లేవు అని చెప్పతెగించే తెంపరులు ఈ అడకలకు జవాబు చెప్పరు, చెప్పలేరు.

నామిని అనేక అవమానాలు పడి, తిట్టించుకుని, తన్నించుకుని మరీ వాళ్ళ 'అమ్మ చెప్పిన కథలు' 'చదువులా చావులా?' లాంటి పుస్తకాలు సైకిలు మీద కట్టుకుని స్కూళ్ళకు తీసికెళ్ళి అమ్ముతాడు. మా తెలుగు తల్లికి పాట రాసిన శంకరంబాడి సుందరాచారి కూడా అంతే, కొన్ని భాషలు దేవభాషలుగా సంపన్నమైపోతుంటే, నా తల్లి భాష, తెలుగుభాష, నానాటికీ పేదదైపోతూ చులకనై పలచనైపోతుంటే, సంపన్న భాషలతో సంపర్కమై సంకరమైపోతే ఇంత సంకటన్నా దొరుకుతుందిలే అనే పేద స్థితికి దిగజారిపోతుంది.

**ఇప్పుడు నా ప్రశ్నలు ఏంటంటే :**

1. 'అన్ని భాషల రుచికన్న మిన్న తెలుగు' అంటాము కానీ 'కొలువుకు పరభాషయే మేలు. పొట్టనింపని తెలుగేల మట్టికుడువ?' అనీ సమాధానం చెప్పుకుంటాము. ఎంత విచిత్రమైన పరిస్థితి?
2. మన గ్రంథాలలో ఉన్నది ఎక్కువ శాతం తెలుగులిపిలో ఉన్న దేవభాష సంస్కృతమే అయినపుడు దేవభాష హోదా తెలుగుకు ఎందుకురాదు?
3. మనం అనునిత్యం మల్లె పూదండలు వేసి మంగళారతులిస్తున్న తెలుగుతల్లి మాట్లాడే భాష దేవభాషే కదా? తెలుగుతల్లి దేవత అయితే ఆ దేవత మాట్లాడే భాష ఖచ్చితంగా దేవభాషే అవుతుంది కదా?
4. "తెనుగు దేశమే దేశం, తెనుగు భాషే భాష
తెనుగు మనుషులే మనుషులు, తెనుగు వేషమే వేషం.
ఏ జాతి యెదటా ఏ సందర్భంలోనూ
ఎందుకున్నూ నా తెనుగు జాతి తీసిపోదు"
అని శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి ఎంతో గర్వంగా చెప్పుకున్నాడు.

"ప్రతి తెలుగు వాడూ తెలుగుభాషను తన ప్రాణంతో సమానంగా చూసుకుంటాడు. దేనినైనా మార్చుకుంటాడు గానీ మాతృభాషను మాత్రం మార్చుకోడు" అని ధీమాగా చెప్పుకున్నాడు బుచ్చిబాబు.
వీళ్ళంత గట్టిగా వాదించలేను గానీ కనీసం నా భాషలో కూడా దైవప్రార్థనలూ, కర్మకాండలూ చేయకూడదా? అని అడుగుతున్నాను.

## కర్మకాండలలో తెలుగు

నమాజు తెలుగులో చేయాలని నేను చాలా కాలంగా వాదిస్తున్నాను. 'నడుస్తున్న చరిత్ర' మే 2011 సంచికలో డా. జి.వి. పూర్ణచందు గారు రాసిన 'నిత్య జీవితంలో కర్మకాండలకు తెలుగు పనికారాదా?' అనే వ్యాసం చూసి ఆనందంతో ఒక లేఖ రాశాను. వ్యాసం ఆద్యంతం ఆసక్తిదాయకంగా, హేతుబద్ధమైన ఆలోచనలు రేపుతూ సాగింది. సంస్కృతాధిపత్యం నిలబడాలనే కొందరికి ఈ వ్యాసం రుచించకపోవచ్చు కానీ రచయిత మెజారిటీ ప్రజలు మాట్లాడే భాష పక్షాన నిలబడి న్యాయం అడిగాడు. తెలుగు పట్ల చిన్న చూపు ఎందుకు అన్నాడు? దేవుడికి తెలుగు రాదా? అని తార్కికంగా ప్రశ్నించాడు. కర్మకాండలలో మాతృభాషా వినియోగం జరగాలనీ, తెలుగులో పెళ్ళి జరపాలనీ సమంజసమైన న్యాయమైన ఆలోచనలు రేకెత్తించాడు. పూర్ణచందు గారి ఆలోచనలు ఆచరణలోకి వస్తే తెలుగు ప్రజల పరాధీనత పోతుంది. తెలుగు ప్రజల హృదయాలు మాతృభాషలో స్వేచ్ఛగా తెరుచుకుంటాయి. అర్థంకాని మంత్రాలకంటే గుండె లోతుల్లోంచి అమ్మభాషలో పెల్లుబికివచ్చే ప్రార్థన ఎంతో బాగుంటుంది. ఎంతో హాయినిస్తుంది. సంకెళ్ళు తెగిపోయి మన ప్రజలు సుఖపడతారు. మానవహక్కుల పరిరక్షణ కోసం మతము, న్యాయము, విద్య, పాలన, వ్యాపారము మాతృభాషలో జరగాలి. (నడుస్తున్న చరిత్ర జూన్ 2011)

## పులికొండ సుబ్బాచారి ఇలా అన్నారు :-

"తెలుగు నేలమీద తెలుగు వారి ఇండ్లలో, గుడులలోను చదివే మంత్రాలు పూజలు తెలుగు భాషలో జరగవు. దేవాలయంలో కాని ఇంటి వద్ద కాని చేసే యజ్ఞయాగాదులన్నింటా చదివేది మనకు తెలియని సంస్కృత భాషే. దీనికి బదులు ఇదే విషయాన్ని తెలుగులో మనమే చెప్పకూడదా? కుటుంబ క్షేమాన్ని కోరి వ్రతం చేస్తున్నాను దేవా అని దేవునికి తెలుగులో మనం చెప్పుకోలేమా? పవిత్రత సంస్కృత భాషని బట్టి వస్తుందా లేదా చేసే మనసును బట్టి వస్తుందా? చాలా మత గ్రంథాలు సామాన్య మానవులు మాట్లాడే భాషలో లేవు. మత సంబంధమైన కార్యక్రమాలు అందరికీ అర్థంకాని భాషలో ఉంటాయి. ఒక భాషకు మతగౌరవం లభించిన తర్వాత ఆ భాష అర్థంకాకపోయినా ఫర్వాలేదనుకుంటారు.

చాలా గ్రామ దేవతల గుడులలో తెలుగులోనే పూజా కార్యక్రమాలు జరుగుతాయి. గ్రామదేవతల గుడులలో రజకులు, క్షురకులు, కొమ్ములవాళ్ళు, బైండ్లవాళ్ళు, దళిత పూజారులు వారి పూజలు మంత్రాలను ఆచారాలను తెలుగులోనే చేస్తారు. దేవుని దృష్టిలో మనుషుల మధ్య తారతమ్యాలు లేనట్లే భాషల మధ్య కూడా ఉండవు. మన తెలుగుకు మతసంస్కార స్థాయిని కల్పించి గుడిలో ఇంట్లో అన్ని మతకార్యాలకు తెలుగే ఎందుకు వాడకూడదు?

ఈ విషయంలో క్రిస్టియన్లు కొంత మెరుగు. వారు మత కార్యక్రమాలు అన్నీ ఆయా ప్రజల మాతృభాషలోనే చేస్తారు. క్రీస్తు భాష అని హిబ్రూ భాషలో చేయరు.

తెలుగు మతసంస్కారస్థాయిని, పవిత్రస్థాయిని తెచ్చుకోవడం మన చేతల్లోనే ఉంది. దీనికోసం ప్రత్యేకంగా ఒక ఉద్యమం చేసైనా తెలుగుకు మతపవిత్రస్థాయి కూడా తెచ్చుకోవాలి.

(సూర్య 9.4.2012)

# బైబిల్ ప్రకారం దేవ భాషలు - మానవ భాషలు

## భాషలు తారుమారు చేసింది దేవుడే

"భూమియందంతట ఒక్క భాషయు ఒక్క పలుకును ఉండెను. అప్పుడు యెహోవా ఇదిగో జనము ఒక్కటే; వారికందరికి భాష ఒక్కటే; వారు గోపురం పని ఆరంభించి యున్నారు. ఇకమీదట వారు చేయ దలచు ఏపని యైనను చేయకుండ వారికి ఆటంకమేమియు నుండదు గనుక మనము దిగిపోయి వారిలో ఒకని మాట ఒకనికి తెలియకుండ అక్కడ వారి భాషను తారుమారు చేయుదము రండని అనుకొనెను. దానికి బాబెలు అను పేరు పెట్టిరి; ఎందుకనగా అక్కడ యెహోవా భూజనులందరి భాషను తారుమారు చేసెను. (ఆదికాండము 11:1-9)

## యూదేతర భాషల వారిపై నెహెమ్యా దౌర్జన్యం :

"ఆ దినములలో అష్డోదు అమ్మోను మోయాబు సంబంధులైన స్త్రీలను వివాహము చేసికొనిన కొందరు యూదులు నాకు కనబడిరి. వారి కుమారులలో సగము మంది అష్డోదు భాష మాటలాడువారు. వారు ఆయా భాషలు మాటలాడువారు గాని యూదుల భాష వారిలో ఎవరికిని రాదు. అంతట నేను వారితో వాదించి వారిని శపించి కొందరిని కొట్టి వారి తలవెంట్రుకలను పెరికివేసి మీరు వారి కుమారులకు మీ కుమార్తెలను ఇయ్యకయు, మీ కుమారులకైనను మీకైనను వారి కుమార్తెలను పుచ్చుకొనకయు ఉండవలెనని వారిచేత దేవుని పేరట ప్రమాణము చేయించి, ఇట్టి కార్యములు జరిగించి ఇశ్రాయేలీయుల రాజైన సొలొమోను పాపము చేయలేదా ? అని అడిగితిని. ప్రధాన యాజకుడును ఎల్యాషీబు కుమారుడునైన యోయాదా కుమారులలో ఒకడు హోరోనీయుడైన సన్బల్లటునకు అల్లుడాయెను. దానినిబట్టి నేను అతని నాయొద్ద నుండి తరిమితిని. నెహెమ్యా 13:24-28

**మాతృభాష బదులు పితృభాష శాసనం :**

"పురుషుడు తన యింటిలో అధికారి"గా నుండవలెననియు, "ప్రతి పురుషుడు తన స్వభాష ననుసరించి తన యింటివారితో మాటలాడవలెనని" యు ఆజ్ఞ ఇచ్చి, ప్రతి సంస్థానమునకు దాని వ్రాత ప్రకారముగాను, ప్రతి జనమునకు దాని భాష ప్రకారముగాను రాజు అహష్వేరోషు హిందూ దేశం నుండి ఇథియోపియా వరకు తన ఏలుబడిలో ఉన్న 127 దేశాలకు తన సకలమైన సంస్థానములకు తాకీదు పంపాడు. (ఎస్తేరు 1:22)

**రాత్రికి పగలుకు భాష లేదు :**

ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచుచున్నది. పగటికి పగలు బోధచేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటికి బాషలేదు మాటలు లేవు వాటి స్వరము వినబడదు. (కీర్తన 19.3)

**రాజభాషకు సాష్టాంగం :**

"కల్దీయుల విద్యను భాషను వారికి నేర్పుము."

**మొదట :** ఆయా భాషలు మాటలాడువారును సాగిలపడి, రాజగు నెబుకద్నె జరు నిలువబెట్టించిన బంగారు ప్రతిమకు నమస్కారము చేసిరి.

**తరువాత :** యేభాష మాటలాడువారిలో గాని షద్రకు, మేషాకు, అబేద్నెగో యనువారి దేవుని ఎవడు దూషించునో వాడు తుత్తునియలుగా చేయబడును; (దానియేలు 3)

ఆ దినములలో ఆయా భాషలు మాటలాడు అన్యజనులలో పదేసిమంది యొక యూదుని చెంగుపట్టుకొని దేవుడు మీకు తోడుగా ఉన్నాడను సంగతి మాకు వినబడినది గనుక మేము మీతో కూడ వత్తుమని చెప్పుదురు. (జెకార్యా 1)

నాగరికములేని ఆ జనమును గ్రహింపలేని గంభీరభాషయు నీకు తెలియని అన్య భాషయు పలుకు ఆ జనమును నీవికను చూడవు. (యేషయా 33:19)

**ఎక్కువ భాషలలో ఉంటే ఎక్కువ మంది చదువుతారు :**

యేసు సిలువవేయ బడిన స్థలము పట్టణమునకు సమీపమైయుండెను, అది హెబ్రీ గ్రీకు రోమా భాషలలో వ్రాయబడెను గనుక యూదులలో అనేకులు దానిని చదివిరి. (యోహాను 19:20)

**దేవభాషకు దివ్య శక్తులు**

నా నామమున దయ్యములను వెళ్ళగొట్టుదురు; కొత్త భాషలు మాటలాడుదురు. (మార్కు 16:17)

అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించిన కొలది

అన్యభాషలతో మాటలాడసాగిరి. ఈ శబ్దము కలుగగా జనులు గుంపులుగా కూడివచ్చి, ప్రతి మనుష్యుడు తన తన స్వభాషతో వారు మాటలాడుట విని కలవరపడిరి. మనలో ప్రతివాడు తాను పుట్టిన దేశపుభాషతో మీరు మాటలాడుట మనము వినుచున్నామే; ఇదేమి? క్రేతీయులు అరబీయులు మొదలైన మన మందరమును, వీరు మన భాషలతో దేవుని గొప్ప కార్యములను వివరించుట వినుచున్నామని చెప్పుకొనిరి. తమలోని విధవరాండ్రను చిన్న చూపు చూచిరని హెబ్రీయుల మీద గ్రీకుభాష మాట్లాడుయూదులు సణుగసాగిరి. సౌలా సౌలా, నన్నెందుకు హింసించుచున్నావు ? అని హెబ్రీభాషలో ఒక స్వరము నాతో పలుకుట వింటిని. (అపోస్తలుల కార్యములు 2)

## దేవదూతల భాషలలో మాట్లాడితే సరిపోదు అర్థం చెప్పాలి

మరియొకనికి నానావిధ భాషలును, మరి యొకనికి భాషల అర్థము చెప్పు శక్తియు అనుగ్రహింపబడి యున్నవి. అందరు భాషలతో మాటలాడుచున్నారా? అందరు ఆ భాషల అర్థము చెప్పుచున్నారా ? (కొరింథీయులకు 12:10,30)

మనుష్యుల భాషలతోను దేవదూతల భాషలతోను నేను మాటలాడినను, ప్రేమలేనివాడనైతే మ్రోగెడు కంచును గణగణలాడు తాళమునై యుందును. (1 కొరింథీ 13.1)

సంఘము క్షేమాభివృద్ధి పొందునిమిత్తము భాషలతో మాట లాడువాడు అర్థము చెప్పితేనేగాని వానికంటె ప్రవచించువాడే శ్రేష్ఠుడు. (1 కొరింథీ 14.5)

భాషతో మాటలాడువాడు అర్థముచెప్పు శక్తి కలుగుటకై ప్రార్థన చేయవలెను. (1 కొరింథీ 14.13)

భాషతో ఎవడైనను మాటలాడితే, ఇద్దరు అవసరమైన యెడల ముగ్గురికి మించకుండ, వంతులచొప్పున మాటలాడవలెను, ఒకడు అర్థము చెప్పవలెను. (1 కొరింథీ 14.27)

## మర్మభాష

భాషలో మాటలాడువాడు మనుష్యులతో కాదు దేవునితో మాటలాడుచున్నాడు; మనుష్యుడెవడును గ్రహింపడుగాని వాడు ఆత్మవలన మర్మములను పలుకుచున్నాడు. (1 కొరింథీ 14.2)

లోకమందు ఎన్నో విధములగు భాషలున్నను వాటిలో ఒకటైనను స్పష్టముకానిదై యుండదు. (1 కొరింథీ 14.10)

## ఆత్మకొక భాష మనసు కొక భాష

నేను భాషతో ప్రార్థన చేసినయెడల నా ఆత్మ ప్రార్థన చేయును గాని నా మనస్సు ఫలవంతముగా ఉండదు. (1 కొరింథీ 14.14)

సంఘములో భాషతో పదివేల మాటలు పలుకుటకంటె, ఇతరులకు బోధకలుగునట్లు నా

మనస్సుతో అయిదు మాటలు పలుకుట మేలు.(1 కొరింథీ 14.19)

భాషలు విశ్వాసులకు కాదు అవిశ్వాసులకే సూచకమైయున్నవి (1 కొరింథీ 14.22)

**వెర్రి భాష :**

సంఘమంతయు ఏకముగా కూడి అందరు భాషలతో మాటలాడుచుండగా, ఉపదేశము పొందనివారైనను అవిశ్వాసులైనను లోపలికి వచ్చినయెడల, మీరు వెఱ్ఱిమాట లాడుచున్నారని అనుకొందురుకదా ? (1 కొరింథీ 14.23)

**క్రూర మృగ భాష**

పరిశుద్ధులతో యుద్ధము చేయను వారిని జయింపను పది కొమ్ములును ఏడు తలలును గల యొక క్రూరమృగముకు అధికారమియ్యబడెను. ప్రతి వంశము మీదను ప్రతి ప్రజమీదను ఆయా భాషలు మాటలాడువారి మీదను ప్రతి జనము మీదను అధికారము దానికియ్యబడెను. (ప్రకటన 13.7)

**బైబిల్ తెలుగు అనువాదాలు :**

ప్రపంచంలోని అత్యధిక భాషలలోకి అనువదింపబడ్డ గ్రంథం బైబిల్.

1727 – బెంజమిన్ షూల్జ్ (జర్మన్ లూథరన్ మిషనరీ) కొత్త నిబంధన (అముద్రిత ప్రతులు జర్మనీలో ఇప్పటికీ ఉన్నాయి)

1732 – బెంజమిన్ షూల్జ్ పాత నిబంధన (అముద్రిత ప్రతులు జర్మనీలో ఇప్పటికీ ఉన్నాయి)

1742 – ఫిలిప్ వేబ్రియన్ (ఆముద్రితం)

1795 – కెప్టెన్ డాడ్స్ (ఈస్ట్ ఇండియా కంపెనీలో స్కాట్లాండ్ ఉద్యోగి). ఇతని మరణానంతరం తోటి ఉద్యోగులు ఇతని అనువాదాన్ని చిత్తు కాగితాలుగా భావించి పొరపాటున తగలబెట్టారట.

1800 – తొలి క్యాథలిక్ బైబిల్

1812 – డిగ్రాంజన్, ఆనందరాయరు – నాలుగు సువార్తలు (కలకత్తా కరెస్పాండింగ్ కమిటీ)

1818 – జాన్ గోర్డన్, ఎడ్వర్డ్ ప్రిచెట్, ఆనందరాయరు (విశాఖపట్నం బైబిల్ సొసైటీ)

1818 – విలియం కేరీ – కొత్త నిబంధన (మద్రాసు)

1821 – విలియం కేరీ పాత నిబంధనలోని అయిదు కాండాలు (మద్రాసు)

1841 – జె. రీడ్ ఆదికాండం (మద్రాసు ఆగ్జిలరీ సొసైటీ)

1844 – న్యూవెల్ – కొత్త నిబంధన (మద్రాసు)

1844 – తెలుగు బైబిల్ అనువాద సంఘం ఏర్పాటు

1853 – చార్లెస్ ఫిలిప్బ్రౌన్ (ఆముద్రితం)

1881 – బాప్టిస్ట్ అనువాదం (మద్రాసు)

1888 – డౌనీ, రాఘవయ్య – తెలుగు రిఫరెన్స్ కొత్త నిబంధన

1898 – బైబిల్ సవరణ సంఘం ఏర్పాటు (ఉల్ఫ్, ఆబర్లీ, అనంతం, శీనయ్య... 8మంది సభ్యులు)

1904 – సవరించిన పూర్తి ప్రొటెస్టెంట్ బైబిల్, రెండవ క్యాథలిక్ బైబిల్ (తోమాసు, బాలానందం, రాజేందర్, లాటిన్ నుండి)

1914 – లక్కవరం జమీందారు రాజా మంత్రి ప్రేగ్గడ భుజంగరావు – కొత్త నిబంధన కావ్యం

1927 – ఇ. ఒమాగ్రన్ – మత్తయి, లూకా, యోహాను సువార్తలు
జేమ్స్ – నాలుగు సువార్తలు

1941 – బాగ్స్ – తెలుగు రిఫరెన్స్ బైబిల్

1976 – కొండవీటి వేంకట కవి – రక్షణ వేదం (క్యాతలిక్ బైబిల్) (సంపాదకులు గాలి బాలి, పాటిబండ్ల విలియం, సి.ఇగ్నేషియస్)

1990 – లివింగ్ బైబిల్స్ ఇండియా – వాడుక భాషలో పరిశుద్ధ బైబిల్, పూదోట జోజయ్య – సంపూర్ణ క్యాతలిక్ బైబిల్ 'పవిత్ర గ్రంథము'

1987 – జి.ఆర్.క్రో – పవిత్ర గ్రంథం

1994 – జి.ఆర్.క్రో – పవిత్ర గ్రంథం (వ్యాఖ్యాన సహితం)

1995 – వాడుక భాషలో బైబిల్

– హెప్సీబా సుంకరి (తెలుగు బైబిలు అనువాద చరిత్ర)

**తేనె కన్నా మధురంరా తెలుగు**
**ఆ తెలుగుదనం మా కంటి వెలుగు**
**మన గత చరిత్ర ఎంత ఖ్యాతి ?**
**గర్వించదగ్గ జాతి తెలుగు జాతి !     – ఆరుద్ర**

# ౨౦. అన్ని భాషలూ దేవభాషలే

ఖురాను గ్రంథాన్ని వివిధ భాషలలోనికి అనువాదంచేసి దైవసందేశాన్ని సర్వభాషల వారికి అందించాలని ఎందరో మహాత్ములు విశ్వ ప్రయత్నం చేశారు. కొందరు తమ ప్రయత్నంలో సఫలులుకాగా మరికొందరు మత చాందసుల చేతిలో హింసించబడ్డారు. ఖురాను గ్రంథాన్ని ఏ భాషలోనికీ అనువదించకూడదని మూర్ఖంగా వాదిస్తూ హత్యలకు తలపడినవారూ కొన్ని దేశాలలో ఉన్నారు.

సర్వభాషలూ దేవునివే అని ఒక ప్రక్క చెబుతూనే మరో ప్రక్క అరబ్బీ భాషను సర్వజనంపై నిర్బంధంగా రుద్దజూస్తున్న వారి బెడద నేడు తీవ్రమైంది. ఖురాను గ్రంథం సర్వమానవాళి కోసం వచ్చిందని చెప్పేవారే ఆ మానవాళికి దేవుడు వివిధ మాతృభాషల నిచ్చాడని మరిచిపోయి అరబ్బీని తప్పనిసరి చేస్తున్నారు.

ప్రతి ప్రవక్తకూడా తన మాతృభాషలోనే మత ప్రచారం చేసేవారు. అసలు దైవసందేశం కూడా ప్రవక్తల యొక్క మాతృభాషలోనే వచ్చేది. ఎందుకని? ప్రవక్తకు ముందు అర్థం కావాలి. ఆ తరువాత ఏ ప్రజలకైతే చెప్పబోతున్నాడో ఆ ప్రజలకు అర్థం కావాలి. అర్థమయ్యేందే మతం.

ఈ మర్మం ఖురాను లోనే విప్పి చెప్పబడింది. ఖురానును దేవుడు అరబ్బీ లోనే ఎందుకు పంపాడు?

"నీకు అర్థం కావాలని ఖురానును అరబ్బీభాషలోనే పంపాము." (ఖురాను 12:2)

మేము ఖురానును అరబ్బుకాని వారికెవరికైనా పంపిన తరువాత వారు దాన్ని చదివి అరబ్బులకు వినిపిస్తే వారు దాన్ని నమ్మరు (ఖురాను 26 :198, 199.).

అరబ్బులు గ్రహించడం కోసం అది ఖురానుగా చేయబడింది. " మీరు గ్రహించటం కోసం మేము అరబ్బీ ఖురానుగా చేసితిమి " (ఖురాను 43 :2,3).

మరి తెలుగు వాళ్ళు గ్రహించాలంటే అది తెలుగు ఖురానుగా చేయబడవద్దా? ఖురాను అరబ్బీలో ఎవరికోసం వచ్చింది?

"నీవు మక్కావారిని చుట్టుపక్కల ఉన్నవారిని హెచ్చరించటం కోసం అరబ్బీ భాషలో ఖురాను ను నీవద్దకు పంపాము." (ఖురాను 12:7)

మరి మచిలీపట్నం వారిని హెచ్చరించాలంటే అరబ్బీ భాషలో ఎంత అరచినా వారికి అర్థంకాదు, "దేవుని తీర్పు సింహాసనం ముందు మనమంతా ఒక రోజు

నిలబడతాము" అని తెలుగులో చెప్పి హెచ్చరించవచ్చు గదా! అర్థం కాని కర్మకాండ బండెడు చేసేకంటే అర్థవంతమైన సత్క్రియ ఒక్కటేచాలు.

స్వర్గప్రాప్తి కోసం మనిషి చేయవలసింది ఏమిటి?

" దేవుడే మాప్రభువు అని, ఎవరు సద్వర్తనులై ఉంటారో వారికి ఎలాంటి భయంగాని దుఃఖగాని లేవు. వారు స్వర్గనివాసులు. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. అది వారు చేసుకున్న కర్మల ఫలితం." (ఖురాను 46:13,14)

అంటే సత్క్రియల ఫలితమే స్వర్గం! ఈ పరమ సత్యాన్ని అన్నిమతాలు బోధిస్తున్నవి. వివిధ ప్రాంతీయ భాషలలోనికి చొచ్చుకొని వెళ్ళి, ఆయా ప్రజల సంస్కృతిని దెబ్బతీయకుండా వారివారి భాషల్లోనే "ఏకేశ్వరోపాసన" వ్యాప్తి చేయవచ్చు. అర్థం కాని, అరబ్బీని ఆంధ్రముస్లింలపై రుద్దటం కంటే ....... తెలుగులోనే వారిని ఖురాను చదువుకోనివ్వటం, నమాజు చేసుకోనివ్వటం, వివాహాలు జరుపుకోనివ్వటం మేలు. ఈ విషయంలో సంస్కరణలు జరగాలి. **(ఆంధ్ర పత్రిక 19.7.87)**

మానవ నిర్మితమైన పారంపర్యాచారాలను నిలుపుకోవాలనే తలంపుతో, దైవోపదేశాలను వదిలివేసి, కేవలం మన హేతుబుద్ధితో అగోచర విషయాలను తర్కించబూనటం అవివేకం అవుతుంది. (ఇమ్రాన్ : 7)

అరబీ భాష అత్యున్నతమైనదే కావచ్చు. అది అర్థం అయ్యే వారికే దాని గొప్పతనం తెలుస్తుంది. అందరికీ అదే భాషను అవశ్యం చెయ్యటం కంటే ఆ భాషలో వెలువడిన దైవ సందేశాన్ని అందరికీ అర్థం అయ్యేట్లు చెప్పటం వివేకవంతంగా ఉంటుంది. ఎందుకంటే దేవుని ద్రుష్టిలో కూడా భాషకంటే భావమే విలువైనది.

ఖురాన్ బోధ చాలా సులువైనది. (చంద్రుడు 17,22,40)

కానీ ప్రపంచంలోని కోట్లాది అరబ్బేతరులకు అది అర్థం కాని మంత్ర పఠనం లాగా ఎందుకు ఉంది? కేవలం ఆ మహా ఘనత గల దైవ సందేశాన్ని (కహఫ్:1) అరబీ భాషలో బంధించటం వల్లనే కదా?

'ఏ జాతి వారి తాత ముత్తాతలకు భయబోధ చేయబడలేదో వారిని భయపెట్టటం కోసం ఈ అరబ్బు ప్రవక్తగా పంపబడ్డారు. (యూసీన్ : 6)

ఈ అరబ్ ప్రవక్త తెచ్చిన భయబోధ ఆ జాతి వారికే పరిమితమై ఉంటుందని, అరబ్బేతరులకు వర్తించదని ఎవరైనా చెప్పగలరా? అందరికీ వచ్చే భాష అందరికీ అర్థమయ్యే భాష ఏది?

"వీళ్ళు గ్రహించటం కోసం ఈ కురాన్ను నీ భాషలో సులువుగా చేశాము" (పొగ : 58)

అంటే అరబ్బులు తప్ప ఇతర భాషల జనం దాన్ని గ్రహించకూడదని దేవుని భావం కాదు. ప్రవక్త అరబీయుడు, అతని స్వజనం అతని మాటలు వినాలంటే అతని భాషలోనే దైవ సందేశం రావాలి. ప్రవక్తకే అర్థం కాని భాష ప్రవక్త జాతి ప్రజలకు అర్థం ఎలా అవుతుంది?

ఒకవేళ దేవుడు పరాయి భాషలను అర్థం చేసుకునే అద్భుత శక్తిని ప్రవక్తకు ఇచ్చి సందేశాన్ని పంపినప్పటికీ ఆ జనం "అరబ్బీ ప్రవక్త – అర్థంకాని అజమీ కురాన్" అని ఎగతాళి చేస్తారు. (సజ్దా : 44)

అరబ్బేతరుడు అరబీలో ప్రవచిస్తూ వస్తే అతన్నీ నమ్మరు (కవులు :198, 199)

అందువలన ప్రవక్త స్వభాషలోనే ప్రవచనం రావటం ఎంత ఆవశ్యకమో ఆ ప్రవచనం ఆయా ప్రజల మాతృభాషలలోనే వారికి అందించబడటం కూడా అంతే అవసరం. అద్వితీయ దేవుని గురించి అరబ్బులకు అరబీలో చెబుతుంటేనే, "నీ మాటలు మా హృదయాల్లో దూరవు. మా చెవులు చెవిటివైపోయాయి. నీకూ మాకూ మధ్య పెద్ద తెర ఒకటి అడ్డంగా ఉంది, నీ దారి నీదీ మా దారి మాదీ" అన్నారు. (హామీం : 5)

అరబ్బేతరులకు అరబీలో చెప్పి ఒప్పింపచేయటం అలవి అయ్యే పనేనా? రాజ్యాధికారం పొందిన ఆంగ్లేయులు ఇంగ్లీషును అందరిమీదా రుద్దినట్లు అరబీని అందరికీ అంటగట్టగలిగితేనే అది సాధ్యం అవుతుంది.

అయినా ఇక్కడ సమస్యను చిటికెలో తీర్చగల సర్వలోకాల ప్రభువు కురాన్ను అరబీలో పంపిన ఉద్దేశం వెల్లడించాడు. అది విశ్వాసులకు స్థిరత్వం ఇవ్వాలి, సన్మార్గం చూపించాలి, సువార్త వినిపించాలి. (తేనెటీగ : 103)

నమాజులోకానీ, మరో చోట కానీ అరబీ కురాన్ వింటుంటే మనకు పై మూడు ప్రయోజనాలు కలగటం లేదు, తెలుగు కురాన్ ద్వారా అవి మనకు సిద్ధిస్తున్నాయి. నిశ్చయంగా కురాన్ మనను కష్టపెట్టడానికి గాక మనకు బోధ చెయ్యడానికే వచ్చింది (ఓ మానవుడా:2,3).

ప్రతి ప్రవక్త కూడా తన మాతృభాషలోనే దైవ సందేశం ప్రచారం చేసేవాడు. దైవసందేశం కూడా ప్రవక్తల మాతృభాషలోనే వచ్చేది. ఎందుకని? ముందు ప్రవక్తకి అర్థం కావాలి. ఆ తరువాత ఏ ప్రజలకైతే చెప్పబోతున్నాడో ఆ ప్రజలకూ అర్థం కావాలి. అర్థమయ్యిందే సరైన మతం. ఈ మర్మం కురానులోనే విప్పిచెప్పబడింది.

కురానును అల్లా అరబ్బీలోనే ఎందుకు పంపాడు?. “ప్రవక్తకు అర్థం కావడానికి” (కురాను 12:2) 2. “అరబ్బులు గ్రహించటం కోసం” (43:2,3). 3. “మక్కా చుట్టుపక్కల ఉన్నవారిని హెచ్చరించటం కోసం” (కురాను 12:7). మరి మన తెలుగువాళ్ళు గ్రహించాలన్నా, అర్థం చేసుకోవాలన్నా, హెచ్చరిక పొందాలన్నా అది తెలుగులోనే సాధ్యం. మాటిమాటికి పఠించే వాక్యాలు ప్రతి ప్రార్థనలో మనకు బోధ చేస్తూ ఉండాలి. అది మన మాతృభాషలోనే మనకు సాధ్యమవుతుంది.

**మనిషిని ఉద్ధరించగల ప్రార్థనలో 4 ముఖ్య విషయాలున్నాయి :-**

1. మనల్ని చూస్తున్న దేవుని ముందు మనం నిలబడ్డామని గ్రహించాలి.
2. ఆయన గొప్పతనం మన హీనత్వం గుర్తించాలి.
3. ఆయన మనల్ని ప్రేమించి సహాయం చేయజూస్తున్నాడని తెలిసికొని అడగాలి.
4. మనం అడిగేదేమిటో మనకు అర్థమై ఉండాలి.

ఇలా చేసే ప్రార్థన మనల్ని దేవునికి సన్నిహితులుగా మారుస్తుంది. పాపకార్యాలకు పాల్పడనీయదు. దుష్టతలంపులను కలుగనీయదు. దేవుని సర్వోన్నతను పదే పదే గుర్తు చేస్తుంది. క్రమశిక్షణను, ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంది. హృదయాన్ని శుద్ధి చేస్తుంది. దేవునిపై ఆధారపడే స్వభావాన్ని పెంచుతుంది. దేవుని ప్రీతికోసం ఎట్టి త్యాగానికైనా తగిన తెగింపును ఇస్తుంది. మరి ఇదంతా నైతికమైన సముద్ధరణే గదా?

‘నిశ్చయంగా నమాజు సిగ్గుమాలిన పనుల నుండి అధర్మకార్యాల నుండి ఆటంకపరుస్తుంది” (సాలెపురుగు : 46)

ఈ వచనాన్ని గురించి అబ్దుల్ గఫూర్ గారు ఇలా వ్యాఖ్యానించారు.

“నమాజు చాలా మహిమగలది. దానిని నియమముగా భక్తి పూర్వకముగా చేసినచో అది భక్తులను సిగ్గుమాలిన పనులనుండి పాపకార్యముల నుండి మానిపించును. దుర్గుణములను తొలగించి మంచి గుణములను కలిగించుట దాని స్వభావము. ఎట్లు మందును నియమముగా పథ్యముతో సేవించిన రోగము పోయి ఆరోగ్యము చేకూరునో, అట్లే నమాజు సలుపుచు దానికి విరోధ కార్యములను మానుకొనినచో, ఆత్మ సంబంధమైన రోగములు అను దుర్గుణములు నశించి, ఆత్మకు ఆరోగ్యము అనెడి సుగుణములు అలవడును. భక్తుడు పాపములు వదలుకొనును, దొంగ భక్తి వలన పాపములు తొలగనిచో అది వాని తప్పుయే. కాని నమాజు చేసి నమాజు ముగించిన పిదప పాప కార్యములు చేయువాడు మాట తప్పిన వాడగును. అట్లు చేయవలదు అని నమాజు హెచ్చరించు చుండును.

"నేను జిన్నాతులను మానవులను పుట్టించినది వారు నన్ను ఆరాధించుట కొరకే" (51:56)

అంటే మనిషి జీవిత ఉద్దేశమే దైవారాధన. మీరు నన్ను పోషించనవసరం లేదు. నాకు అన్నం పెట్టనక్కరలేదు. నేనే మీకు అవన్నీ ఇస్తాను. నా ద్వారా మేళ్ళు పొంది కృతజ్ఞులై నన్ను ఆరాధించండి అని దేవుడు అంటున్నాడు. తీర్పు దినాన దేవుని సింహాసనానికి కుడివైపు చేరిన సజ్జనులు నరకాగ్నిలో మాడుతున్న వారిని ఒక ప్రశ్న వేస్తారు :

"మీరు నరకంలో త్రోయబడటానికి కారణం ఏమిటి?" అంటే వాళ్ళు నాలుగు కారణాలు చెబుతారు. అందులో మొదటిది "నమాజు చెయ్యకపోవటం" (74 :43)

"ఓ విశ్వాసులారా, శుక్రవారం నాడు నమాజుకు పిలుపు వినబడగానే మీ వ్యాపారాన్ని వదిలిపెట్టి దేవుని ధ్యానించటానికి పరుగెత్తి రండి. అది మీకెంతో మేలైనదని తెలిసికోండి" (62:9)

మరి ఇంతమేలైనది, మనల్ని నరకశిక్ష నుండి తప్పించేది, నైతికంగా ఉద్ధరించేది అయిన నమాజు అనేక మందికి నిరుపయోగంగా ఉంటున్నది. నమాజు ద్వారా మనిషి పొందవలసినంత ప్రయోజనం పొందటం లేదు. అర్థంకాని మంత్రాల లాంటి కొన్ని పదాలను వల్లించటం అనే తంతుతో నమాజు ముగుస్తున్నది. గొంతులోనుండి వెలువడే నమాజు ఉచ్ఛారణ కంటే, హృదయంలో నుంచి పెల్లుబికే ప్రార్థన నిశ్చయంగా గొప్పది.

నమాజు అనేకుల జీవితాల్లో మార్పుతేలేకపోవటానికి ఒక కారణం 'ఆ నమాజు వాళ్లకు అర్థంకాక పోవటం". అర్థంకాకపోవటానికి కారణం అతనికి అరబ్బీ భాష రాకపోవటం. దేవునికి అరబ్బీ భాషలో మాత్రమే నమాజు చెయ్యాలి అని కట్టడి చేయటం. ప్రతి విశ్వాసీ తప్పని సరిగా అరబ్బీ నేర్వాలి అని నిర్బంధించటం. అర్థం అయినా కాకపోయినా సరే అరబ్బీలో రాయబడిన కురానే చదవాలి అని ఒత్తిడి చెయ్యటం. ఇది అనుల్లంఘనీయమైన సంప్రదాయం కావటం.

"మోకరించి మీ మాతృభాషలో దేవుని అయిదుపూటలా ప్రార్థించుకోండి, మీకు వచ్చిన భాషల్లోనే కురాన్ చదువుకోండి అంటే ప్రపంచ ప్రజలందరికీ "అర్థం అయ్యే నమాజు" అందుబాటులో ఉండేది. కానీ అరబ్బీలో మాత్రమే ఇలా ఇలా వంగుతూ లేస్తూ నమాజు చెయ్యాలి అనటంతో ఈ శారీరక విన్యాసంలోని అంతరార్థమేమిటో ప్రజలకు అర్థం కాలేదు. "అర్థం లేని చదువు వ్యర్థము" అన్నట్లే "అర్థం కాని ప్రార్థన కూడా వ్యర్థమే."

మహా ప్రవక్త గారి మాతృభాషలోనే దైవ సందేశం ఎందుకు వచ్చింది? మరో భాషలోవస్తే ఆయనకు అర్థం కాదనే గదా!"

"సకలలోకాల ప్రభువా! అనంత కరుణామయుడా! అపారకృపాశీలుడా! తీర్పు దినపు యజమానీ! మా దేవా! నీకే స్తోత్రములు! మేము నిన్నే ఆరాధిస్తాము. సహాయం కోసం నిన్నే అర్థిస్తున్నాము. నీవు దీవించిన వారి మార్గం, నీ ఆగ్రహానికి గురి కాని వారి మార్గం, మార్గభ్రష్టులు కాని వారి రుజుమార్గం మాకు చూపించు." అని చెప్పుకుంటే ఒక తెలుగు వానికి నమాజు అర్థవంతంగా ఉంటుంది. అల్లా అంటే ఒక్కడేననీ ఆయనకు ఆలుబిడ్డలు లేరనీ, ఆయన ఎవరికీ పుట్టలేదనీ, ఆయన ఎవరినీ కనలేదనీ ఆయన సర్వోన్నతుడైన ఏకైక దేవుడనీ – విగ్రహారాధన హేయమనీ, తీర్పు రోజున మనం లెక్క అప్పజెప్పుకోవలసి ఉంటుందనీ తెలుగు జనానికి తెలుగులోనే అర్థం అవుతుంది. ఆయన అద్వితీయుడనీ ఆయనకు సాటి కల్పించరాదని తెలుగులో చెబితే తెలుగుజనం సుళువుగానే అర్థం చేసికొంటారు. కానీ అక్కడి నుండి ఆరంభమయ్యే అరబ్బీ ఆంక్షలు, నియమనిష్టలు, ప్రత్యేక తరహాలో సాగే ప్రార్థనా పద్ధతులు వారిని అల్లా సన్నిధికి రాకుండా ఆటంకపెడుతున్నాయి.

ఆయన సన్నిధికి వచ్చి "అలహందులిల్లాహి" అనవలసినదే గాని "సర్వలోకాల ప్రభూ" అని సంబోధించలేడు తెలుగువాడు. గుండెలోని భావం గొంతుదాటి రాకూడదా? అది దేవుడు వినడా? అరబ్బీ రాని ప్రజల యాతన చూడండి. మతంలో బలాత్కారం లేదన్న వాళ్ళే బలవంతంగా ఒక భాషను నిర్బంధం చేసారు. ఆ భాషరానిదే నీవు ముస్లిం కాదు పొమ్మన్నారు. దేవుని ప్రార్థించుకోటానికి ఆ భాషలో ఉచ్చరించనిదే మసీదు గడపతొక్కటానికి సైతం నీకు అర్హత లేదు పొమ్మన్నారు. అన్ని రంగులూ అన్ని భాషలూ దేవునివేనని చెప్పేవారూ ఈ భాష తప్ప మరో భాషలో చేసే ప్రార్థన దేవునికి అర్థం కాదు అన్నట్లుగా అరబీ పట్టుపడుతున్నారు. అదేమంటే అరబీ ప్రార్థన అల్లానే విధించాడు. మనిషి దానిని మార్చకూడదు అంటున్నారు.

నమాజు మనిషిని నైతికంగా ఉద్ధరిస్తుంది. కాని అరబిక్ సూరాల కంఠస్థం అవశ్యం కావటం వల్ల అన్యుల ప్రవేశానికి ఆటంకం కలిగిస్తోంది. హృదయంలో వున్న విషయాలను చెప్పుకొను వీలు లేదు. తెలుగు భక్తుడు, అరబ్బీ దేవుడు. తెలుగు ముస్లిములు అయిదు వేళలా దేవుని తెలుగులోనే ధ్యానిస్తే వారి మది సేద తీరుతుంది. దేవుని స్తుతించి, హృదయమంతా ఆయన ప్రసన్నతను నింపుకొని, ఆయన ఆజ్ఞలను మనస్సులో నిలుపుకొని జాగ్రత్తతో బ్రతుకవచ్చు. కానీ అరబ్బీ ఆచార సంపన్నులు తెలుగు ముస్లిముల తెలుగు

ప్రార్ధనలకు ఆమోదముద్ర వేయరట! మరి మన తెలుగు ప్రార్ధనలు అల్లా దరి జేరవా? గడ్డం పెంచలేదనీ, నమాజు సమయంలో కాలి గిలకలు కానరాలేదనీ, అన్నం తిన్నాక ఫలానా వరుసలో చేతివేళ్ళు నాకలేదనీ, అరబ్బీ రాదనీ విమర్శలు ఎందుకు? అన్ని భాషలూ దేవునివే గనుక అయితే, అన్ని భాషలను ఆయనే అనుమతించి వుంటే ఈ ప్రత్యేక భాషాదాస్యం చెయ్యమని ఆయన చెప్పడు. తెలుగు ముస్లిములకోసం తెలుగులో నమాజును, తెలుగు మసీదులను ప్రారంభించాలి. అప్పుడు అల్లా సన్నిధికి చేరి మన హృదయాలను ధారాళంగా తెరిచే అవకాశం మనకు తెలుగులోనే దొరుకుతుంది.”



***తెలుగు ఖురాన్ అనువాదకులు అజీజుర్రహ్మాన్, హమీదుల్లా షరీఫ్, మల్లిక్, అబుల్ ఇర్ఫాన్‌లతో 20.11.2011***

**ఇస్లాం ఒక ‘జాతికి’ చెందిన మతం కాదు :**

“దూదేకుల సాయిబుకి ఉర్దు రాకపోవటానికి కారణం ఏమిటి?” అని గుంటూరు నుండి షేక్ వహాబ్ అడిగిన ప్రశ్నకు 21.8.87 గీటురాయిలో మలిక్ గారిచ్చిన సమాధానం చూడండి.

‘దూదేకుల సాయిబులు’ అని పేరు పెట్టి ఉర్దూ మాట్లాడే ‘సాయిబులు’ వారిని దూరం చెయ్యడం మూలాన.

అన్ని రకాల తారతమ్యాలను, నిమ్నోన్నతా భావాలను, హెచ్చుతగ్గుల్ని, దూరం చెయ్యడానికి కంకణం కట్టుకున్న ఇస్లాంను స్వీకరించినప్పటికీ ముస్లిములు తమలో తాము

ఈ విధంగా విభేదాలు సృష్టించుకుని ఇలాంటి ప్రశ్నలకు తావివ్వడం ఎంత శోచనీయం?! మరో విషయం ఏమిటంటే ఉర్దూ ముస్లిముల భాష కాదు. ఆ మాటకు వస్తే ముస్లిముల భాష అంటూ ప్రపంచంలో ఏదీ లేదు. అన్ని భాషలూ దైవం సృష్టించినవే. అందువల్ల అన్ని భాషలు ముస్లిములవే.

ముస్లిములు ఏ భాష మాట్లాడినా, ఏ దేశంలో వున్నా, ఏ దుస్తులు ధరించినా వారు మౌలికంగా ఇస్లామీయ సిద్ధాంతాలను, విశ్వాసాలను, విధానాలను అవలంభించినంత వరకు వారు ముస్లిములే. ఇస్లాం ఓ జీవన విధానం, ఒక సంతతికి, ఒక 'జాతికి' చెందిన మతం కాదు. దాన్ని ఎవరు ఆచరిస్తే అది వారిదే అవుతుంది. భారతదేశంలోని ముస్లిములు ఏ ప్రాంతంలో ఉండేవారు ఆ భాష మాట్లాడతారని తెలుసుకోండి. కేరళలో ఉండే ముస్లిములు మలయాళం, తమిళనాడులో ఉండే ముస్లిములు తమిళం, కర్ణాటక కెనరా జిల్లాల్లో ఉండే ముస్లిములు కన్నడ భాషలే మాట్లాడతారు. అలాగే గుజరాతీ, సింధీ, బెంగాలీ అస్సామీ భాషలు మాట్లాడే ముస్లిములున్నారు. అలాంటప్పుడు తెలుగు మాట్లాడే ముస్లిములు ఆశ్చర్యం గొలుపుతున్నారా? విద్యా విజ్ఞానాలు ఇంతగా పెంపొందిన ఈ రోజుల్లోను ఇలాంటి ప్రశ్నలడిగే వారున్నారంటే ఆశ్చర్యం వెయ్యదూ?

*21.8.87 గీటురాయి*

"నేను ముస్లిమునేగాని నా మాతృభాష తెలుగు" అంటే తుర్లపాటి కుటుంబరావు గారు ఒక పట్టాన నమ్మలేకపోయారు. ముస్లిముల మాతృభాష ఉర్దూ మాత్రమేనని ఆంధ్రలో చాలా మంది అనుకొంటారు. నేను పాలకొల్లు ఎమ్మార్వోగా పని చేసేటప్పుడు హైదరాబాద్ నుండి ఒక ఉర్దూ ముస్లిం అధికారి వచ్చారు. పాలకొల్లు ఎమ్మెల్యే అల్లు సత్యనారాయణ మమ్మల్నిద్దర్నీ కలిపి "ఇక మీరు మీ భాషలో మాట్లాడుకోండి" అన్నారు. ఆ అధికారికి ఉర్దూభాషొచ్చి నోరు తెరిస్తే నాకు ఉర్దూ భాషరాక నోరు తెరిచాను. నాకు ఉర్దూరాదు బాబో అంటే ఇంగ్లీషులోకి మళ్ళాడు. ఉర్దూరాని సాయిబులు (తెలుగు ముస్లిములు) కూడ ఉంటారని ఎమ్మెల్యే గారికి తెలిసొచ్చింది.

## అల్లాహు అక్బర్ అంటే అక్బర్ చక్రవర్తిని తలుచుకుంటున్నారేమో అనుకున్నా:

ఆకివీడులో కొన్నేళ్ళ క్రితం రంజాన్ నెలలో ఇఫ్తార్ విందులో పాల్గొన్నాను. స్థానిక ముస్లిములంతా అజాన్ ఇచ్చి నమాజు చేసుకొచ్చారు. అప్పటిదాకా వాళ్ళ నమాజును చూస్తూ పురప్రముఖులంతా కూర్చున్నారు. తరువాత విందు ఆరగించారు. అప్పుడు నేను మీరిచ్చిన అజాన్ అర్థం,మీరు చేసిన ప్రార్థన అర్థం తెలుగులో చెబితే తెలుగు వాళ్ళందరికీ

అర్థమవుతుంది అన్నాను. అప్పుడొకాయన దాని అర్థం తెలుగులో చెప్పాడు. అది విన్న ఆనాటి మంత్రి కలిదిండి రామచంద్రరాజు గారు "అజాన్‌లోఇంత మంచి అర్థం వుందా? నేను చిన్నప్పటి నుంచి ఈ అజాన్ వింటున్నాను. మా గాయత్రీ మంత్రానికీ మీ అజాన్‌కీ తేడా ఏమీ లేదు, అల్లాహు అక్బర్ అంటే మీరు అక్బర్ చక్రవర్తిని తలుచుకుంటున్నారేమో అని ఇంతకాలం అనుకున్నాను" అన్నారు. అంతేగాకుండా ఆయన హాజరయిన ప్రతి జన్మభూమి సభలో "ముస్లిముల పిలుపుల్లో ప్రార్థనల్లో ఎన్నో మంచి విషయాలున్నాయి, వాటిని మనమంతా తెలుసుకోవాలి" అంటూ ఈ సంఘటనను ప్రజలకు తెలియజేశారు. రోజుకు అయిదుసార్లు మసీదు మైకుల్లో నుండి అందించే అజాన్ (ప్రార్థనా పిలుపు) ముస్లిమేతరులకు, ముస్లింలకు కూడ అర్థం కాకపోవటానికి కారణం అది అరబీ భాషలో మాత్రమే ఉండటం. దాని అర్థాన్ని తెలుగులో కూడా చెబుతూ వచ్చినట్లయితే మసీదు చుట్టు ప్రక్కల ఉన్న తెలుగు సోదరులంతా విని స్పందించేవారు.

అరబీ భాష మాట్లాడే యూదులూ క్రైస్తవులు కూడా దేవుడిని అల్లాహ్ అనే పిలుస్తారు. మొత్తం ప్రపంచ ముస్లిముల్లో అరబ్బు ముస్లిములు 25 శాతం మాత్రమే.

**ఏ భాషకైనా పరిమితులుంటాయి :**

"అరబీ భాష దాని నుడికారం రీత్యా ఎంతో సుసంపన్నమయిందే, అయినా అదీ మానవ భాషే. మనిషి మాట్లాడే భాషలు ఏవైనా సరే ఎన్నో పరిమితులతో కూడుకున్నవి. అవి ఖురాన్‌లోని సువిస్తారమైన విషయాలకు సమగ్రమయిన మకుటాలు కాగల పదాలు, సమాసాలు అందజేయలేవు."- (అల్ బకర సూరా ప్రవేశికలో మౌలానా మౌదూదీ గారి వ్యాఖ్యానానికి మలిక్ గారి అనువాదం.)

Many more Surahs of the Quran have been named in the same way because no comprehensive words exist in Arabic (in spite of its richness) to denote the wide scope of the subject discussed in them. As a matter of fact all human languages suffer from the same limitation. – మౌదూదీ

**భాష అర్థం కావాలి :**

తన సొంత జనం భాష రాని ఏ వ్యక్తినీ దేవుడు ప్రవక్తగా పంపలేదు. (ఖురాన్ 14.1)

దావూదు, సులైమానులకు పక్షుల జంతువుల భాషలు, దేవదూతల (జిన్నాతులు) భాషలు కూడా అర్థం చేసుకునే శక్తి అల్లాహ్ ప్రసాదించాడట. ఖుత్బా ప్రసంగం ప్రజలు అర్థం చేసుకునేలా ఉండాలి (2.140 సున్నా ఫిఖా)

**అవసరం కొద్దీ కొత్త భాష :**

ప్రవక్త అరబ్బేతర భాషల వారితో వ్యవహారాలు నడిపేందుకు వీలుగా జైదును హెబ్రూ, సిరియా భాషలు నేర్చుకొమ్మన్నారు.

సుహైబ్ గ్రీకు భాష వారి మధ్య పెరిగి అరబ్బీ మరచిపోయాడు. అయినా అతను విశ్వాసాన్ని బట్టి ముస్లింగానే పరిగణించబడ్డాడు.

సల్మాన్ అనే పర్షియన్ కు జొరాష్ట్రియన్, క్రైస్తవ లేఖనాలూ, ఖురాన్‌లోనూ మంచి పరిజ్ఞానం ఉంది. **ముహమ్మద్ ప్రవక్త గారి జీవిత కాలం లోనే ఖురాన్‌ను ఫారసీ భాషలోకి తర్జుమా చేసిన మొదటి వ్యక్తి ఈయనే.**

**విలక్షణమైన, ప్రభావవంతమైన ఖురాన్ భాష :**

ఖురాన్ గ్రంథం జబీర్ అనే క్రైస్తవుడు రాశాడని కొందరు ఖురైషులు విమర్శిస్తే అతను అరబ్బు కాదనీ, అతనికి అరబ్బీ భాష బాగా రాదనీ, ఎవరైనా సరే ఖురాన్ వాక్యం లాంటి వాక్యం తేవచ్చు అని సవాలు చేస్తే ఎవరూ తేలేకపోయారు.

ఖలీఫా అలీ ఖురాన్ జ్ఞాని. ఆయన్ని "రెండవ సోలోమోన్" అంటారు. ఆయన అరబ్బీ భాషకు వ్యాకరణం రాసిన మొదటి వ్యక్తి. ఖురాన్ వాక్యాల నిర్మాణం అద్భుతమని చెప్పాడు.

**అర్థమైతే మనసు మార్చే భాష :**

ఖురాన్ వాక్యాలు విన్న ఉమర్ మనసు మారి పోతుంది. ప్రవక్తను చంపుదామని బయలు దేరిన వాడు సంధి చేసుకుంటాడు. ఖురాన్ ఎవరికి వారే చదివి అర్థం చేసుకోవాలని అందరికీ అరబ్బీలో చదువు నిర్బంధం చేశాడు. ఆయనకు హెబ్రూ కూడా వచ్చు. జుహైర్ కవితలు చాలా సుళువైన భాషలో ఉంటాయని తెగ మెచ్చుకునేవాడు.

12 మంది అరబీ క్రైస్తవ పండితుల బృందం ఖురాన్ వాక్యాలు విని ముస్లిములుగా మారారు.

గీటురాయి వార పత్రిక సంపాదకులు మలిక్ గారు భాషలపై పాఠకుల ప్రశ్నలకు ఇచ్చిన కొన్ని సమాధానాలు :

ముస్లిం సమాజానికి సంబంధించిన విషయాల చర్చలు, పెళ్ళిళ్ళు,కుటుంబ తగాదాల తీర్పులు. ప్రయోజనకరమయిన సామాజిక కార్యకలాపాలు మస్జిదుల్లో జరపవచ్చు (16.3.84)

పఠనం సరిగ్గా జరగాలి, అంత సమయం లేదనుకుంటే కొంతభాగమే పఠించాలి.

అర్థం కాని భాషలో, శబ్దాలు కూడా సరిగ్గా వినరాకుండా కునికిపాట్ల మధ్య వినే ఖురాన్ ఏ విధంగానూ ఫలప్రదం కాదు (19.7.85)

చదవడమంటే అర్థం చేసుకుని చదవడమే. అర్థం చేసుకుంటూ 'చదివితే' పుణ్యమూ లభిస్తుంది. జీవితంలో అది కోరే మార్పూ వస్తుంది. అలాకాక కేవలం పారాయణం చేసుకున్నట్లయితే స్వచ్ఛమయిన నీటి సెలయేరు పారుతుండగా దప్పిక గొన్న వాడు దాని ఒడ్డున కూర్చుని "దాహం, దాహం" అని అరవడంతో సమానం. పారాయణ పుణ్యంతో సరిపెట్టుకునే దురదృష్టవంతులు ఎందుకవ్వాలి ముస్లిములు? (20.4.87)

మస్జిద్‌లో తెలుగు భాషలో ధార్మిక విషయములు మైకులో చెప్పటం ఏ మాత్రం తప్పు కాదు. చాలా మంది తెలియక ఇలాంటి అడ్డంకులు సృష్టిస్తున్నారు. దైవ ప్రవక్తలు కూడా తమ జాతి ప్రజలు మాట్లాడే భాషల్లోనే వారిని సంబోధించారు. భాషతో ధర్మానికి సంబంధం లేదు. దివ్య ఖురాన్ మూలగ్రంథం అరబీలో ఉండటం మూలాన మనం దానికి ప్రత్యేకతనిస్తాము. కానీ ప్రసంగాలు, బోధనలు, ఉపదేశాలు, హితబోధలు అన్నీ ఆయా ప్రజల భాషల్లోనే జరగాలి, జరుగుతున్నాయి కూడా. ఉదాహరణకు ఉర్దూ అర్థం చేసుకునే ఉత్తర భారతీయులకు ఉర్దూలో అవన్నీ జరిగినట్లే దక్షిణ రాష్ట్రాల్లో ఉర్దూ పదం ఒక్కటీ అర్థం కాదు. అక్కడ మలయాళం, తమిళం, కన్నడం, తెలుగు భాషల్లోనే జరుగుతున్నాయి బోధనలన్నీ. అంతే కాని ఏదో తెలియని భాషలో అన్యమనస్కంగా, పరిపరి విధాల పోయే హృదయాన్ని అదుపులో పెట్టుకోవడం చేతకాక ఉపన్యాసాలు చెయ్యడం, వినడం, ఎక్కడా జరగడం లేదు. సంకుచిత భాష, వర్గ, జాతి పరిధుల నుండి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిది. (11.10.85)

చమురు నిక్షేపాలు బయటపడిన తరువాత ప్రపంచంలో అరబీ తిరిగి ప్రాముఖ్యం సంతరించుకోసాగింది. అయితే ఈసారి సాంస్కృతిక, నాగరిక, శాస్త్రీయ ప్రాధాన్యతలు లేవు. కేవలం వాణిజ్యమే మూలకారణం. అనేక విధాలుగా దిగజారిపోయిన ముస్లిములు అరబీ భాష విషయంలో పూర్తిగా పడిపొయ్యారు. చివరికి ఖురాన్ పారాయణం చెయ్యడానికి (చదివి అర్థం చేసుకోవడం కాదు) కూడా వారికి తీరిక లేదు. కేవలం తాము జీవికకై చదువుకున్న భాషలో 'లిప్యంతరీకరణ' (trans literation) చేసిన ఖురాన్ ప్రతులు కావాలని అడుగుతుంటారు. ఆ భాషల్లో అరబీలోని ఉచ్చారణలన్నీ సరిగ్గా రావని తెలిసినా అదే కావాలంటారు. (29.7.88)

బ్రహ్మీ లిపి కూడా మౌలికంగా కుడి నుంచి ఎడమకు వ్రాయబడేదే. కాలానుగుణంగా మార్పులు సంభవించాయి. లిపులకన్నా, భాషలకన్నా అవి అందజేసే భావాలే ముఖ్యమైనవి. భాషల గురించి లిపులగురించి ఎన్ని వివాదాలున్నా భావాలే మనసుల్ని ఏలగలవన్నది మాత్రం నిర్వివాదాంశం. (29.7.83)

ఖురాన్ ఉరవడిని, వేడిమిని గ్రహించిన కవులు దాని ఎదుట తమ కవితా ఖండాలను ఇట్టే వదులుకున్నారు. అంతేకాక ఇది మానవ మాత్రుని శైలి కాదు అని దాన్ని దైవవాక్కుగా అంగీకరించి ఇస్లాం స్వీకరించారు. (10.1.86)

**కవిభాష కాదు:**

తుఫైల్‌బిన్ అమర్ అనే ప్రసిద్ధ అరబీ కవి ఖురాన్ వాక్యాలు వినిన వెంటనే అవి కవుల కల్పనా వాక్యాలు కాదని తెలుసుకొని ముస్లిం అయ్యాడు.

**ఎవరి భాష వారిది :**

యోనా తిమింగలం కడుపులో దైవస్తోత్రం చేస్తుంటే మిగతా జల చరాలు చుట్టూ చేరి వాటివాటి భాషల్లో స్తోత్రం చేశాయట.

**ప్రవక్త నా గడ్డ మీద పుడితే**
**పవిత్ర గ్రంథం నా భాషలోనే ఉండేది**
**- స్త్రైబాబా, జగ్‌నేకీరాత్**

# 21. తెలుగు లో పెళ్ళి

తెలుగులో పెళ్ళి జరగాలనే కోరిక తెలుగు వారిలో పెరుగుతోంది. 'తెలుగు ప్రజలు తమ నిత్య జీవితంలో ముఖ్య ఘట్టాలన్నిటిలో తమ తల్లి భాషతో సంబంధం కోల్పోయారు. పుట్టుక దగ్గర నుండి చావు వరకు చావు తరవాత కూడా జరిగే ముఖ్య సందర్భాల్లో తెలుగుకు చోటులేదు. అర్థంకాని మంత్రాల ఘోషలో తలలూపడం తప్ప ఏమీ చేయలేని అనాధలయ్యారు తెలుగు వారు. వివాహ విధి విధానమంతా మనకు తెలియాలి' అంటూ సామల రమేష్ బాబు గారు తన ఇద్దరు కొడుకుల పెళ్ళి తెలుగులోనే చేశారు. ఈ సంస్కరణ కోసం అందరికీ పిలపు కూడా ఇచ్చారు. తెలుగు పెళ్ళి పద్ధతి అంతా నడుస్తన్న చరిత్ర సెప్టెంబర్ 2009లో వివరించారు.

తెలుగు క్రైస్తవులకు ఈ సమస్య లేదు. వారిలో పెళ్ళి, సమాధి లాంటి జీవితంలోని ముఖ్య ఘట్టాలన్నీ తెలుగులోనే జరుగుతున్నాయి. తెలుగు ముస్లిములకు మాత్రం ఇంకా ఈ సమస్య తీరలేదు.

**పులికొండ సుబ్బాచారి ఇలా అన్నారు :-**

పెళ్ళిలో పూజారి వరుడితో మంత్రం అనిపిస్తాడు. నోరు తిరిగినా తిరగకపోయినా పెళ్ళికొడుకు దాన్ని చెప్పి తర్వాత ఆమె మెడలో మాంగల్యాన్ని కడతాడు. పెండ్లి కొడుకులకు దీని అర్థం అర్థంకాదు. కట్టించుకునే పెండ్లి కూతురికీ అర్థంకాదు, చుట్టూ ఉన్న బంధుమిత్రులకూ అర్థంకాదు. ఇంత బాధ ఎందుకు? నేను నూరేండ్లు హాయిగా ఈమెతో కలిసి జీవించడానికి గాను ఈమె కంఠంలో మాంగల్యాన్ని కడుతున్నాను అని పెండ్లి కొడుకు చక్కగా తెలుగులో చెప్పి కట్టవచ్చుగా. కాని పెండ్లివేళ అక్కడికి ఆవాహన చేసిన దేవుళ్ళకి ఈ తెలుగు అర్థంకాదట. దేవుళ్ళకి అలా సంస్కృతం మంత్రాలలో చదివితేనే పవిత్రమైనదని వారికి తెలుస్తుందట. మంత్రాలని తెలుగులో చదివి చెప్పడాన్ని పెళ్ళి చేయించుకునే ప్రజలు ఎవరూ అంగీకరించేలా కూడా లేరు. వారికి కూడా సంస్కృతం మంత్రాలు చదివితేనే తృప్తి. అక్కడికి అది పవిత్రమౌతుందని భావం కలుగుతుంది. గుడిలో జరిగే విషయంలోను ఇదే జరుగుతుంది.

కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పెండ్లిండ్లు అన్నీ తెలుగులో చేయాలని ఒక ఉద్యమం చేపట్టారు. వెనిగళ్ళ సుబ్బారావు 'పెండ్లి మంత్రాల వెనుక బండారం' అనే పుస్తకంలో పెండ్లి మంత్రాలన్నీ తానే చదివి దేవునికి అప్పగిస్తే పెండ్లి కొడుకు ఊరక అతను చెప్పినవన్నీ చేస్తే ఆమె ఎవరి భార్య అవుతుంది అనే తీవ్రమైన ప్రశ్నలు కూడా లేవనెత్తాడు."

*(సూర్య 9.4.2012)*

### తెలుగు 'నిఖానామా' పత్రాలు జారీ చేయాలి!

మన రాష్ట్రంలో తెలుగు మాతృభాషగల 'తెలుగు ముస్లిములు' లక్షలలో వున్నారు. నిత్యం ఉర్దూ మాట్లాడే ముస్లింలలో కూడా పలువురికి ఉర్దూ చదవడం, రాయడం రాదు. వీరంతా తెలుగులోనే రాతకోతలు సాగిస్తుంటారు. ఉర్దూ రాని ముస్లింలకు కూడ వివాహ ధృవీకరణ (నిఖానామా) పత్రాలను ఉర్దూలోనే జారీ చేస్తున్నారు. తెలుగు ముస్లిముల సౌలభ్యం కోసం ఖాజీలు తెలుగులోనే నిఖా ప్రసంగాలు చేస్తున్నారు. ఖురాన్, హదీస్ వంటి మూల గ్రంథాలన్నిటిని తెలుగులో ముద్రించారు. అలాగే వివాహ ధృవీకరణ పత్రాలను కూడ తెలుగులో ముద్రించి ఇస్తే తెలుగులోనే పూరించి ఇస్తామని ఖాజీలు అంటున్నారు. కాబట్టి వక్ఫ్ బోర్డు వివాహ ధ్రువపత్రాలను తెలుగు భాషలో కూడా ప్రచురించాలని మనవి. **– నూర్ బాషా రహంతుల్లా,** విజయవాడ

*(సాక్షి 19.10.2011)*

## తెలుగులో పెళ్ళి పుస్తకం (నిఖానామా)

ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు ఉర్దూలో ప్రింటు చేసి ఖాజీలకు సరఫరా చేస్తున్న నిఖానామా 'పెళ్ళి పుస్తకం' ఉర్దూలో 8 పేజీలు ఉంది.దానిని తాడేపల్లి మండలం నులకపేట మసీదు ఇమాం అబ్దుల్ జలీల్ గారు తెలుగులోకి అనువదించి ఇచ్చారు. తెలుగు ముస్లిముల కోసం 'పెళ్ళిపుస్తకం' తెలుగులోనే జారీ చేస్తే వాళ్ళు దాన్ని చదువుకొని మరీ సంతకాలు చేస్తారు. అందులో పేర్కొన్న విషయాలపై ఏమైనా అనుమానాలుంటే అడిగి నివృత్తి చేసుకుంటారు. పుస్తకంలో ఏముందో చూడండి :

### 1వ పేజీ ముఖ పత్రం :

"అనంత కరుణామయుడు అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో"

"వివాహం నా సంప్రదాయం"

### "వివాహ ధృవీకరణ పత్రము"

(వరుడికొక ప్రతి, వధువుకొక ప్రతి)

పెళ్ళి పుస్తకం సంఖ్య :.........................

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డుచే జారీ చేయబడినది.

(వక్ఫ్ బోర్డు ముద్ర)

| | |
|---|---|
| సంతకం | సంతకం |
| Chief Executive Officer | Chief Khazi |
| AP State Wakf Board | AP Wakf Board |

## 2వ పేజీ

"వివాహం నా సంప్రదాయం. దీనిని ఇష్టపడని వారు నా వారు కారు."

భార్యా భర్తల పరస్పర హక్కులు, బాధ్యతలు :

వివాహ బంధము ప్రేమానుబంధము. భార్యాభర్తలు పరస్పరము ప్రేమానురాగములతో జీవితం గడపాలి.

భర్త తన భార్యా బిడ్డలకు ఆహారము, దుస్తులు, నివాసము ఏర్పాటు చేయాలి. మంచి మర్యాదగా వ్యవహరించాలి. ఇతర జీవిత అవసరాలు సమకూర్చాలి.

నమాజు ఉపవాసములు వగైరా ధర్మోపదేశాలు పాటించాలి.

సంతానానికి ఆహార పానీయాలు దుస్తులు విద్యా ఇతర పోషణ ఏర్పాట్లు చేయాలి.

బలమైన కారణము లేనిదే విడాకులు మాట ఎత్తకూడదు.

తప్పనిసరి పరిస్థితిలో ఒక్క తలాఖ్ మాత్రమే చెప్పాలి.

ఒకేసారి మూడు తలాఖ్‌లు చెప్పకూడదు. అది కూడా బహిష్టు అనంతరం పరిశుభ్రత పొందిన తర్వాత సంభోగము చేయక ముందే చెప్పాలి.

## 3వ పేజీ

**మొదటి పెండ్లి :**

**విచారణ వివరాలు**

ప్రశ్న జవాబు

1. ఈ పెళ్ళి సమయములో వరుడికి నలుగురు భార్యలున్నారా?....................
2. వధూవరులకు ధర్మ నిషిద్ధ సంబంధం ఏదైనా ఉందా?.......................
3. వధువు వరుని భార్యకి లేక విడాకులిచ్చి ఉన్న భార్యకి తోబుట్టువా? వధూవరులు ఒకే తల్లి పాలు త్రాగి ఉన్నారా? వధువు వరుడికి మేనకోడలు, పిన్ని మేనత్త, అన్న కుమార్తె, సవతి సోదరి అవుతుందా?.......................
4. వధువుకు యుక్త వయసు రానట్లయితే ఆమె సంరక్షకుడు ఈ పెళ్ళికి ఒప్పుకున్నారా?

గమనిక : పెండ్లి తర్వాత సంసారములో కలహాలు ఏర్పడిన ఎడల భార్యా భర్తలు తమ తమ పెద్దల తీర్పుకి లోబడి ఉండవలెను.

| వరుడి తరపు సాక్షి | వధువుతరపు సాక్షి | వధువు సంరక్షకుడిసాక్షి | వధువు | వరుడు |
|---|---|---|---|---|
| సంతకం | సంతకం | సంతకం | సంతకం | సంతకం |

సంతకం తేదీ.

– పెళ్ళి చేసిన ఖాజీ / ప్రతినిధి

## 4వ పేజీ

**రెండవ పెళ్ళి :**

**విచారణ వివరాలు**

ప్రశ్న జవాబు

1. ఈ పెళ్ళి సమయములో వరుడికి నలుగురు భార్యలున్నారా ?..................
2. వధువు, వరుడి యొక్క ప్రస్తుతము ఉన్న భార్యకి లేక విడాకులిచ్చి ఉన్న భార్యకి తోబుట్టువా? వధూవరులు ఒకే తల్లి పాలు త్రాగి ఉన్నారా ?
సవతి సోదరి, మేనకోడలు, పిన్ని, మేనత్త, అన్న కుమార్తా ?
4. వధువుకు యుక్త వయసుకి చేరి ఉండని ఎడల ఆమె సంరక్షకుడు ఈ పెళ్ళికి ఇష్టపడ్డారా?
4. వధువు ప్రస్తుతము ఎవరికైనా భార్యగా ఉన్నదా?
5. వధువు, ఈ వరుడు పూర్వము మూడు తలాఖ్‌లు ఇచ్చిన ఆమె అయి ఉన్నదా? అయితే ఈ స్త్రీ మరొకరిని పెండ్లి చేసుకొని ఆ భర్తతో మూడు తలాఖ్‌లు పొంది యున్నదా?
6. వధువు పూర్వపు భర్తతో విడాకులు పొందినా, లేక వితంతువైనా నిర్ణీత కాల పరిమితి (ఇద్దత్) పూర్తి అయినదా?......................
7. వధువుకి పూర్వపు భర్త వలన గర్భము ఏమైనా ఉన్నదా?..................

గమనిక : పెండ్లి తర్వాత సంసారములో కలహాలు ఏర్పడిన ఎడల భార్యా భర్తలు తమ తమ పెద్దల తీర్పుకి లోబడి ఉండవలెను.

| వరుడి తరపు సాక్షి | వధువుతరపు సాక్షి | వధువు సంరక్షకుడిసాక్షి | వధువు | వరుడు |
|---|---|---|---|---|
| సంతకం | సంతకం | సంతకం | సంతకం | సంతకం |

సంతకం తేది.

– పెళ్ళి చేసిన ఖాజీ / ప్రతినిది

5, 6, 7, 8 పేజీలలో వధువు, వరుడు, వారి తండ్రులు, సాక్షుల చిరునామా, వయసు, సంతకాలు ఉంటాయి. భరణం వివరాలు కూడా నమోదు చేస్తారు.

**"ఇంగ్లీషులోన మ్యారేజీ**
**హిందీలో అర్థము షాదీ**
**ఏ భాషలో ఏమన్ననూ**
**మన తెలుగులోన పెళ్ళి"** **– ఆరుద్ర**



# 22. తెలుగు భాషకు సత్యసాయి అండ

"దైవారాధనలో వాడే భాషను దేవ భాష అంటారు. తెలుగును దైవారాధనలో వాడరు కాబట్టి అది దేవ భాష కాదు. అసలు తెలుగు దేవభాష అనటానికి ఆధారాలేంటి? దానికా హోదా ఎవరిచ్చారు?" లాంటి ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వలేక చాలా సార్లు నాకు తలకొట్టేసినట్లయ్యింది. ఎవరి దేవుడి భాషకు వాళ్ళు స్తోత్ర గీతాలు పాడుతున్నారు. ముక్కోటి దేవతల్లో తెలుగు మాట్లాడే దేవుడే లేడంటే నాకు అవమానంగానూ అనుమానంగానూ ఉంది. పైగా తెలుగును ఇంత దిక్కుమాలిన భాషగా చేసి 18 కోట్ల ప్రజలను పరభాషా దాసులుగా పడి ఉండండి అని మన తలరాత ఇలా రాసిన దేవుళ్ళ రాజకీయం కూడా నాకు నచ్చకుండా పోయింది. పోనూపోనూ నాకూ ఇందులో మానవ కుట్రే ఏదో దాగి ఉందనీ అనిపించింది. దేవుడు సమవర్తి కదా మనిషికి లాగా ఆయనకు ఇంత భాషా పక్షపాతం ఎందుకుంటుంది? ఇదేదో భక్తి రంగంలోనే తేల్చుకోవాలి అనిపించింది.

రాయిని విగ్రహంగా చేసి మొక్కితే దేవుడిలా పూజలందుతుంది. మొక్కటమే ఇక్కడ ముఖ్యం. 18 కోట్ల ప్రజలు మాట్లాడుతున్న సజీవ భాషకు ఆపాటి గౌరవం కట్టబెట్టలేమా? మన జనమే మన భాషను అవహేళన చేస్తుంటే పరాయి వాళ్ళు పొగుడుతారా? ప్రజల విస్తృత వాడకంలోకి తేకపోతే ఈ భాష కొడిగట్టడం చచ్చిపోవడం ఖాయం అని ఐక్యరాజ్యసమితి తేల్చింది. ప్రజలు తెలుగును విస్తృతంగా వాడాలంటే తెలుగు దేవ భాషే అని మనమంతా గట్టిగా నమ్మి, మరింత సమర్ధవంతమైన వాదనలతో ఋజువు చేసుకుంటూ వెళ్ళాలి. ప్రవాహంలో పడి కొట్టుకెళ్ళేవాడు ప్రాణ రక్షణ కోసం ఏ గడ్డిపరకనైనా పట్టుకుంటాడు. అలాంటి ప్రమాద బాధితుడి ఆర్తనాదమే ఈ వ్యాసం. మరణశయ్య మీద ఉన్న వాడు ఏ మతస్థుడి సహాయమైనా సరే ఇష్టంగానే తీసుకుంటాడు. తెలుగు భాష ప్రాణం నిలవటానికి అండగా నిలిచిన వారు, ఆ భాష గొంతులో కాసిని నీళ్ళు పోసిన వారు ఏరంగంలోని వారైనా సరే ఆశ్రయించాను. అవసరం కొద్దీ తప్పులేదు. బాబాలపై నాకు వ్యక్తిగత విశ్వాసాలు ఏమీ లేకపోయినా సరే నా భాషకు కూడా దైవ భాష హోదా ఉంది అనే వాదనలో కొన్ని మెట్లు ఎక్కటానికి వారి సాహిత్యం ఉపయోగపడింది. విమర్శలు ఎన్నో వైపుల నుండి వస్తాయని తెలుసు. ఇది అవకాశవాదం కాదు ప్రాణం మీదకొచ్చిన ఒక భాషకు అవసరమైన వాదం.

తెలుగు భాషలో రచనలు చేసిన వాగ్గేయకారులు, భక్తి వేదాంత జ్ఞానులపై దృష్టి నిలిపాను. గతించిన మహానుభావులు గతించిపోగా మన సమకాలికుల్లో సత్యసాయిబాబా కూడా

నాకు ఒక తెలుగు పరిరక్షకుడిగా కనబడ్డారు. కారణాలు వరసగా వివరిస్తాను. ఆయన మహిమలూ గట్రా పక్కన పెట్టి తెలుగు భాషకే జీవితాంతం ఎలా కట్టుబడిపోయాడో మిగతా ప్రపంచాన్ని తన తెలుగు భాషతో ఎలా ప్రభావితం చేశాడో అన్న అంశం వరకే పరిమితమై పరిశోధించాను.

## సాయి భక్తుల నమ్మకం

"బాబా దేవుడు. ఆయనకు అన్ని భాషలూ వచ్చు. ఆయన ఒక భాషకు పరిమితం కాలేదు. ఆయన భాషా పక్షపాతి కాడు. అన్ని భాషలూ ఆయనవే. సంస్కృతం దేవ భాష అనీ ఆయన చెప్పాడు కానీ తెలుగు భాష గొప్పదనీ, అందులోనే పరిపాలన జరగాలనీ, ఆయన ఎప్పుడూ చెప్పలేదు. కాకపోతే ఆయన వాళ్ళ అమ్మకు ఇచ్చిన మాట నిలుపుకునేందుకు పుట్టపర్తిలో నిలిచిపోయాడు. తెలుగు నేలపై ఒక తెలుగు తల్లికి పుట్టాడు గనుక తెలుగులోనే మాట్లాడాడు. అంతకంటే ఆయన దృష్టిలో తెలుగు బాషకు ప్రత్యేక గుర్తింపు గౌరవం ఏమీలేవు" అని పలువురు బాబా భక్తులు అన్నారు.

## హేతువాదుల వాదన

బాబాకు తెలుగు తప్ప మరే భాషా రాదు. అన్ని బాషలూ వస్తే అనువాదకులను ఎందుకు పెట్టుకుంటాడు? అని భాషోద్యమకారుల్లోని హేతువాదులు కొందరు వాదించారు. అయితే సాయి తెలుగువాడు కావటాన భక్తి గొడవ వదిలేసి భాషాపరంగా ఆయనపై తెలుగు ప్రేమ చూపించారు.

బాబా గురించిన ఇలాంటి నమ్మకాలూ అద్భుతాల వాదనలూ విమర్శలూ వినీ వినీ తెలుగు భాషకు పనికొచ్చే నాలుగు ముక్కలు ఏమన్నా దొరక్కపోతాయా అన్న ఆశతో 2012 మార్చి 13, 14 తేదీలలో పుట్టపర్తి వెళ్ళాను. మిత్రులు బొడ్డు రామయ్య గారు ఆతిథ్యమిచ్చారు. 80 ఏళ్ళ వయసులో కాళ్ళు ఈడ్చుకుంటూ కూడా నాకు వండి వడ్డించి నేను తిన్నాకనే తాను తిన్నారు. అదేంటంటే బాబా మాకు నేర్పిన పద్ధతి అన్నారు. తెలుగు భాషతో సంబంధం వున్న అందరి దగ్గరకూ తీసికెళ్ళారు. వాళ్ళందరినీ ఒకటే అడిగాను. తెలుగు భాష గురించి బాబా ఎక్కడెక్కడ ఏమేమి చెప్పారో ఆ వాక్యాలు కావాలన్నాను.

తెల్లారేలోగా లైబ్రరీలో నరసింగరావు గారూ, వెంకట మునియప్ప గారూ ఆయా పుస్తకాలను వెతికి పట్టుకొని టేబుల్ మీద పెట్టారు. నాకు చాలా సమయం కలిసి వచ్చింది. ఇక అక్కడ తెలుగు విభాగంలో పనిచేస్తున్న గరిమెళ్ళ కృష్ణమూర్తి గారు "ఇప్పటి దాకా బాబా సందేశాలను భక్తి కోణం నుంచి మాత్రమే పరిశోధించాను. ఇక మీదట భాషాకోణం నుంచి కూడా పరిశీలిస్తాను, తెలుసుకున్న విషయాలు మీ దృష్టికి తెస్తాను" అన్నారు. బాబా అనువాదకులు కామరాజు అనిల్ కుమార్ గారు 'ఈ విషయంలో శ్రీనివాసులు దిట్ట.అతను ఎంత చెబితే నేనూ

అంతే” అన్నారు. శ్రీనివాసులు గారు “ఇక నేను కూడా తెలుగు భాష గురించి బాబా గారు సెలవిచ్చిన ముత్యాలు ఏరి మీకు పంపిస్తాను” అన్నారు. బాబా తన జీవితాంతం చేసిన అసంఖ్యాక ప్రసంగాల్లో తన తల్లి బాష గురించి ఎక్కడా ఏమీ చెప్పలేదా? అన్న నా ప్రశ్నతో వాళ్ళూ పునరాలోచనలో పడ్డారు. “వెతికి తీస్తాం సార్” అన్నారు.

ఆధారాలు, ఋజువులూ, సాక్ష్యాలూ లేకుండా న్యాయవాది వాదిస్తే న్యాయమూర్తి ఒప్పుకోడు. తెలుగు దేవ బాషే అని నిరూపించటానికి ఎక్కడెక్కడ ఎన్ని ఆధారాలు దొరికితే అన్నీ తీసుకోవాలి. భవిష్యత్తులో నన్నా మన జనానికి కనువిప్పు కలగొచ్చు. తెలుగుకింత దివ్య శక్తి వుందా అని తెలుసుకొని తప్పిపోయిన కుమారుల్లాగా తిరిగి రావచ్చు. తల్లి భాషకు పట్టం గట్టి పూజించనూ వచ్చు. చరిత్ర తిరగబడనూ వచ్చు.

బాబా మహత్యాల గురించిన చర్చలోకి నేను వెళ్ళను. ఆయన తెలుగు భాషకు ఏ మాత్రం సాయపడ్డాడో ఆలోచిద్దాం. తెలుగు బాషకు బాబా సమకూర్చిపెట్టిన అండా దండా ఏమైనా ఉందా? అని పరిశీలిద్దాం. 125 దేశాల్లో ఉన్న బాబా భక్తులు ఆయన తెలుగులో చేసిన ప్రసంగాలు కలకాలం నిలిచే నిత్య సత్యాలు అని నమ్ముతున్నారు. ప్రపంచంలోని ఏ భాషస్తులైనా సరే తన సందేశాలను తెలుగు భాషలో విని, చదివి, అనువదించుకొని పోవాల్సిన గొప్ప స్థాయిని, గత్యంతరం లేని స్థితిని బాబా తెలుగుకు కలుగజేశారు.

## ఇంతకీ భాషల గురించి బాబా ఏమన్నారు?!

“గంగా యమునల్లాగా ఈ సభలో తమిళులు, తెలుగులు ఇద్దరున్నారు. నేను ఎప్పుడూ ఒకే భాషలో మాట్లాడుతాను. శ్రోతల కోసం నా భాష నేను మార్చుకోను. తెలుగు రాని వారు కూడా నా సందేశ సారాంశం తెలుసుకుంటారు. నాతో వ్యవహరించటానికి భాష ఒక అడ్డంగా ఉంది. మానవ జీవన యాత్రలో అన్ని భాషలకూ గొప్ప పాత్ర వుంది. వారి భావాలను వ్యక్తం చేయటానికీ, వారి బలహీనతలను దాయటానికీ, వారి ఆలోచనలు రూపుదిద్దుకోటానికీ వగైరా...కానీ నేను హృదయ భాషలో మాట్లాడుతాను, వింటాను. మనుషులు నాలుకలతో మాట్లాడే బాషలు అయోమయంలో పడేస్తాయి. వాటివలన తెగలు, విభేదాలు, అడ్డుగోడలు పుడతాయి. ఈ ప్రపంచమే నా ఇల్లు. అందులో ఎన్నో గదులున్నాయి. నీ భాషకు ప్రాముఖ్యత ఇవ్వక భావానికి ఇవ్వు. దయా దాక్షిణ్యాలతో నిండిన హృదయ భాషే అసలైన భాష. అది అందరికీ అర్థమయ్యే భాష. మూగవాడు కూడా మాట్లాడే భాష. చెవిటి వాడు కూడా వినగలిగే భాష. ఒక భాష కంటే మరో భాష గొప్పదని గర్వపడకండి. తగాదాలు పెట్టుకోకండి. అనేక భాషలలోని బలహీనతలను అధిగమించటానికి సులభంగా అర్థమయ్యే వాడుక భాషను హృదయ భాషను నేర్చుకొని, ఉపయోగించండి” అన్నారు బాబా. (18.8.1984) SatyaSayi Speaks vols. II,IV)

## హృదయభాష అంటే?

ఎవరి మాతృభాషే వారి హృదయ భాష. బాబా హృదయ భాష తెలుగు. ఈయన ద్వారా వెలువడిన సాహిత్యమంతా తెలుగులో వచ్చింది. ఆయన తెలుగు సాహిత్యం కావాలనుకున్న వాళ్ళంతా వారి వారి భాషలలోకి దానిని మార్చుకున్నారు. అయితే మూల భాషకు అన్ని మతాలూ దేవ భాష అంటూ పెద్దపీట వేస్తాయి. తమ మూల భాష కోసం ఆయా మతస్తులు ప్రాణమిస్తారు. బైబిల్‌కు హెబ్రూ, గ్రీకు – ఖురాన్ కు అరబీ – గీతకు సంస్కృతం లాగా సత్యసాయి భక్తులకు తెలుగే మూల భాష కాబట్టి దేవభాషల సరసన తెలుగు కూడా చేరింది. ఆంధ్రుల హృదయ భాషైన తెలుగును మన ప్రభుత్వం మన పాఠశాలల్లో తప్పనిసరి చేయలేక పోయింది. కానీ బాబా విశ్వవ్యాప్తమైన తన భక్తులందరికీ తెలుగులో మాత్రమే తన సందేశాలను వినిపించారు. తెలుగులో వినక తప్పని పరిస్థితి కల్పించారు. బాబా బోధనలకు తెలుగే మూల భాష కాబట్టి సాయి భక్తులకు తెలుగే దేవభాష.

## తెలుగులో అశువుగా పద్యాలు

‘అల్లా యంచు మహమ్మదీయులు జహోవా యంచు సత్ క్రైస్తవుల్
పుల్లాబ్జాక్షుడటంచు వైష్ణవులు శంభుండంచు శైవులు సదా
ఉల్లాసంబున గొల్వ నెల్లరును నాయుర్భోగ భాగ్యాది సం
పల్లాభంబు లొసంగి బ్రోచు పరమాత్ముం డొక్కడే చూడుడీ’

………అని బాబా సర్వ మత హితంగా సందేశమిచ్చారు. (27.7.1978)

తేట తెలుగులో ఆశువుగా బాబా ఎన్నో పద్యాలు చెప్పారు. పద్యాలే కాదు పాటలు కూడా రచించారు, పాడారు. తెలుగు భాషకు బాబా చేసిన సేవ చాలా గొప్పదే. మహిమలూ మహత్యాలూ సరే గానీ ఆయన భాషను అందులోని చమత్కారాలనూ పదసంపదనూ ఇకనైనా తెలుగు భక్తులు పరిశోధించాలి.

## రాజీ పడని తెలుగు బోధకుడు :

తెలుగు దేశంలో తెలుగు శ్రోతల ముందు తెలుగులో మాట్లాడటానికి బెదిరిపోతున్న బ్రహ్మానంద పాండా అనే ఒరియా పండితుడిని తెలుగులో మాట్లాడు అంటాడు బాబా. నేను తెలుగులో మాట్లాడుతాను, నీవు ఆంగ్లంలోకి అనువదించు” అంటాడు బాబా. (సనాతన సారధి, ఏప్రిల్ 2009)

రాజకీయ రంగంలో ఎన్టీ రామారావు లాగా ఆధ్యాత్మిక రంగంలో సత్యసాయి తెలుగు భాషకు ఎనలేని కీర్తిప్రతిష్టలు తెచ్చి పెట్టారు.తెలుగు మామూలు బాష కాదు, అది విలువైన భాష, మహా గొప్ప భాష అని అందరూ తెలుసుకునేలా చేశారు. వీళ్ళిద్దరూ తెలుగుకు వారి

వారి రంగాలలో ఒక అధికార హోదా తెచ్చి పెట్టారు. గొప్పల కోసం మాతృభాషను వదలలేదు. మరో భాష కోసం పరుగులు తీయలేదు. అవసరాల కోసం రాజీ పడి తల్లి భాషను వదులుకోలేదు. తెలుగు పుటక పుట్టిన అనేక మంది ప్రముఖ బోధకులు వారికి తెలుగు వచ్చినా ఇంగ్లీషులో మాత్రమే మాట్లాడుతూ తెలుగు అనువాదకుల్ని పెట్టుకోవటం చూస్తున్నాము. సత్యసాయి ఈ కృత్రిమ స్వభావం చూపకుండా యావజ్జీవితం నిక్కమైన తెలుగు వాడిగా నిలిచాడు.

## తెలుగుభాషకు పట్టిన మహద్భాగ్యం.

"జగద్గురువుగా నిర్గుణ పరబ్రహ్మము తన సకల శక్తులతో మానవరూపంలో మన మధ్య అవతరించడం, అందునా తెలుగు దేశంలో అవతరించడం, సర్వప్రపంచ భాషలలో మాట్లాడగలిగిన్నీ వారు మన తెలుగులోనే మాట్లాడటం, ఈ పత్రికలో వారు మాట్లాడిన తెలుగు సందేశాలను ముద్రించడం ఇవన్నీ సామాన్య అదృష్టాలు కావు. ఇవన్నీ సాయి భగవానుని అపార అనుగ్రహానికి సంకేతాలు"..... ముదిగొండ వీరభద్రయ్య సంపాదకుడు సనాతన సారథి, ఏప్రిల్ 2009).

సాక్షాత్తూ భగవంతుని నోట వెలువడిన ఈ తెలుగు పద్యాలను ఆంగ్లంలోకి అనువదించాను. ఎల్.బి. సీతారాం.(సత్యాసారం - పద్యరూపం)

"భగవాన్ బాబా తెలుగు దేశంలో పుట్టటం, తెలుగులో రచించటం, తెలుగు పాటలు పద్యాలూ పాడటం, తెలుగు దేశానికీ తెలుగు భాషకూ పట్టిన మహద్భాగ్యం. తెలుగు జాతికి తరగని ధనం - బి. రామరాజు (23.11.2005) శ్రీ సత్యసాయి నాథ సుధ"

## తెలుగుకు బాబా బంగారం లాంటి అవకాశం

మాతృభాషను విడనాడకుండా బాబా అన్యాయమై పోతున్న తెలుగుకు రక్షకుడుగా నిలిచాడు. నీవొకందుకు పోస్తే నేనొకందుకు తాగాను అన్నట్లు నేను భాషా కోణంలో నుంచి బాబాను చూశాను. బాబా కూడా ఒక అన్నమయ్య, ఒక త్యాగయ్య, ఒక రామదాసు, ఒక ఉమర్ అలీషా లాగా తెలుగులో విస్తారమైన భక్తి వేదాంత సాహిత్యాన్ని రచించారు, ప్రసంగించారు, పాడారు. ఆయనకు దైవత్వాన్ని ఆపాదించి, ఆయన భక్తిలో మునిగిపోతున్న భక్తులు ఆయన భాషపై తగినంత శ్రద్ధ పెడితే భాషకు పెద్ద లాభం కలుగుతుంది. తెలుగు దేవ భాషే అనే నమ్మకం ఒకసారి రుజువై బలపడితే అన్ని భాషల భక్తులూ తెలుగు భజనలు చేస్తారు. తెలుగులో పాడక తప్పని పరిస్థితి వస్తే ఆ భాష నేరుస్తారు. ఆయా మతాల వాళ్ళు నానా కష్టాలూ పడి సంస్కృతం, అరబీ, హెబ్రీ నేర్చుకుంటున్నట్లే విశ్వ వ్యాప్తంగా ఉన్న బాబా భక్తులు తెలుగు భాష వల్లె వేస్తారు. బాబా ఇచ్చిన బంగారం లాంటి అవకాశం బాబా భక్తుల్లోని తెలుగు భాషోద్యమ కారులు, భాషాభిమానులు వాడుకోవాలి. ఎందుకంటే ఇలాంటి పని ఇతర భాషల వాళ్ళు

చెయ్యరు. ఆయన సాహిత్యమంతా వారి సొంతం అయ్యాక బాబా మా ఆంగ్లేయుడు, మా తమిళుడు అంటే మాత్రం ఏం చేస్తాం? అసలే శక్తి చాలక సాధుత్వం వహించే తెలుగు వాళ్ళం కదా?

## బాబా చేతిరాత

"బలమే జీవం. బలహీనతే మరణం" అన్నాడు వివేకానందుడు. భాషలకు కూడా ఈ సూక్తి వర్తిస్తుంది. నిజాం నవాబుల చేతి రాతలను కూడా హైదరాబాదు మ్యూజియంలో భద్రపరచుకొని మురిసిపోతున్నారు వారి వారసులు. బాబా చేతిరాత సాహిత్యం యావత్తూ తెలుగులోనే ఉంది. దానిని స్కానింగ్ తీయించి తెలుగు భక్తులు "ప్రేమధార', 'దివ్యజ్ఞాన దీపికలు' లాంటి పుస్తకాలు ప్రచురించారు. 14.10.1946 న బాబా రాసిన పద్యం ఆయన చేతివ్రాతలో ఎలా ఉందో చూడండి.


POEMS WRITTEN BY SATHYA SAI BABA.

14th OCTOBER 1946 (14-10-46)

ఇండియా టుడే 2012 జనవరిలో Divine Grace satya saibaba అనే 120 పేజీల ప్రత్యేక సంచిక విడుదల చేసింది. అందులో బాబా ఇంగ్లీషులో రాసిన 4 ఉత్తరాలను స్కాన్ చేసి ముద్రించింది. ఆయన తెలుగు లిపిలో రాసిన లేఖలు గానీ, ఆంగ్లలిపిలో రాసిన తెలుగు లేఖలు గానీ, ముద్రించలేదు. తెలుగు దేవభాష అంటే తప్పు బాబా రాసినవైనా సరే ఒక్క తెలుగు లేఖను కూడా ఇతర భాషల వాళ్ళు ముట్టరు. తమిళులు త్యాగయ్య రచించిన తెలుగు కీర్తనలను అనువాదం చెయ్యకుండా యదాతదంగా తమిళంలో రాసి పాడుకొంటున్నారు. దానికి కారణం సంగీతం, త్యాగయ్య తెలుగు సంగీత బాణీలు తమిళంలో ఇమడవు. సంగీత జ్ఞానమున్న భక్తి వినాసన్మార్గము కలదే ఓ మనసా? అన్న త్యాగరాజు తమిళ ప్రాంతంలో ఉండి కూడా తెలుగు పాటలు పాడాడు. మూల భాష తప్పనిసరి అనే షరతు పెడితే సరి – తెలుగు వాళ్ళు తమిళ పాశురాలు పాడినట్లు, తమిళ భక్తులు త్యాగయ్య కీర్తనలను తెలుగులోనే పాడినట్లూ, బాబా కీర్తనలను కూడా ప్రపంచమంతా తెలుగులోనే పాడుతారు. బాబా తెలుగులో చేసిన ప్రసంగాలన్నింటినీ, మన తెలుగు భక్తులు ఆంగ్లంలోకి, తమిళంలోకి అనువదించిపెట్టాక ఇక తెలుగు అవసరం ఏముంటుంది? అవసరం తీరాక తెలుగును తీసి అవతల పారేస్తే ఎలా? మిగతా మతాల లేఖనాల మూల భాషలు దేవ బాషలు ఎలా అయ్యాయో అలాగే సాయి లేఖనాల మూల భాష కూడా దేవ భాషే అవ్వాలి కదా? నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా అన్నట్లు దేవభాషల దారిలోనే మనమూ పోవాలని అడగటం న్యాయమే కదా?

## బాబా మూల భాష తెలుగు

సాయి ప్రసంగాల మూల భాషే తెలుగు అయినప్పుడు తెలుగులో ఆయనప్పుడు సాహిత్య ముద్రణ పరాయి భాషలకంటే సులభం. అనువాదమే అక్కరలేని తెలుగు వాళ్ళు ఇంకా ఆ పని పూర్తి చేయలేదు. తెలుగు భక్తులు ఆయన సాహిత్యాన్ని ఇంగ్లీషులోకి, అరవంలోకి అనువాదం చేసిపెట్టారు గానీ తమ సొంత భాషలోకి Satya Sayi Speaks తరహాలో 42 సంపుటాలు తేలేకపోయారు. బలవంతుడు తోసుకొని ముందుకెళుతుంటే పోనీలే అని ముచ్చటపడి వెనక్కి తగ్గే సహనశీలత, పక్కకు జరిగి ప్రోత్సహించే ఉదారత తెలుగు వాడిది. అదే తెలుగుతనం ఇక్కడా గోచరిస్తోంది.

“పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపించిన భరత భూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
ధీ శక్తి చూపిన దివ్య భూమి
ఔర ఏమందు భారత పాలనంబు

ఏనుగెట్టుల తన బలమెరుగదో
అట్టులైనారు మన భారతీయులు నేడు" అని బాబా ఆవేదన చెందారు.

మిగతా భాషల సంతేమో గానీ తెలుగు వారికి ఈ పద్యం చక్కగా సరిపోతుంది. చేతిలోని ముద్దను చెరువులో విసిరేసి చెయ్యి నాకినట్లుగా ఉంది మన పరిస్థితి.

**దివ్యాత్ముని మాతృభాష తెలుగు**

బాబా తెలుగు ప్రసంగాలను ఇంగ్లీషులోకి అనువదించే అనిల్‌కుమార్ గారు బాబా సమాధిని ఇలా వర్ణించారు.

'బంగారూ' అని తెలుగులో పిలిచే సాయి శయన మందిరం ఇది. ఈ మహా సమాధి దర్శన అనుభవం సరస్వతీ దేవాలయం, మక్కాలోని కాబాలాగా, బెత్లెహేమూ, ఎరూషలేముల్లోని క్రీస్తు జ్ఞాపకాల్లాగా, సిక్కుల గురుద్వారా, బుద్ధగయ, అరుణాచల క్షేత్రం, శ్రీశైలకాశీ క్షేత్రం, షిర్డీ సమాధి, మసీదు దర్గాల సందర్శన అనుభవంలాగా ఉంటుంది. (సనాతన సారధి సెప్టెంబర్ 2011)

సమాధి దర్శనమే ఇంత భాగ్యదాయకంగా ఉంటే ఆ సమాధిలో శయనించిన దివ్యాత్ముని సందేశ శ్రవణం కూడా భాగ్యదాయమే కదా మరి. అదీ ఆయన మాతృభాష (దేవభాష) లో ఆయన చెప్పింది చెప్పినట్లు వినే భాగ్యం తెలుగు వాడిదే. తనను తాను తగ్గించుకోవటం తనను తాను ఉపేక్షించుకోవటం తెలుగు వాడి సహజ లక్షణమా?

బాబాతో ఆడి పాడిన బాల్య మిత్రుడు కరీంసాహెబ్ "ఆ స్వామి హజ్రత్ మహమ్మదు, హజ్రత్ ఇబ్రాహీము, ఏసుక్రీస్తు లాంటి వాడు" అన్నాడు (సనాతన సారధి మార్చి 2008)

మరి అలాంటి స్వామి సొంత భాషను దేవభాషే అని ఎందుకు అనుకోరు? సాయి భక్తులు సాయి భాషను కూడా గొప్పగా పొగడాలి. దేవుళ్ళను చాలా గొప్పగా చెప్పి, వాళ్ళ భాషను తక్కువ చేసి మాట్లాడే వాళ్ళ కోసమే నేను ఇలా కావాలని అడుగుతున్నాను.

## తెలుగు కీర్తనలకు దేవుళ్ళు దిగి వచ్చారు.

బమ్మెర పోతన, కంచర్ల గోపన్న (రామదాసు), త్యాగయ్య, అన్నమయ్య లాంటి ఆధ్యాత్మిక వేత్తలు, సంగీత కారులు, మహా భక్త గాయకులు, భగవంతుని దయానుగ్రహాలపై తమకు హక్కు ఉన్నట్లుగా రచించిన కీర్తనలన్నీ తెలుగులోనే ఉన్నాయి. ఆ తెలుగు కీర్తనలు విని దేవుళ్ళు దిగి వచ్చారని బడాయి పోతుంటాము. వారి భాషను మాత్రం దైవ భావన లేకుండా అగౌరవ పరుస్తాము. ఇదేం నీతి?

'పలికెడిది భాగవతమట, పలికించెడువాడు రామభద్రుండట" అని పోతన అంతటోడే అన్నప్పుడు తెలుగును దేవ భాష అనటానికి మనకెందుకు సిగ్గు, సందేహం?

సంస్కృత వాసనలేమీ సోకకుండా అచ్చు తెలుగులో లక్ష్మీదేవి హావ భావాలను ఆ రామభద్రుడే ఎలా పలికించాడో చూడండి.

"అడిగెదనని కడు వడి జను
నడిగిన దను మగడు నుడువడని నాడ యుడుగున్
వెడ వెడ సిడిముడి తడబడి
నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్"...(శ్రీమదాంధ్ర భాగవతం 8.103)

రామభద్రుడే ఇలా తెలుగులో పలికించాడనీ, పోతన రాయలేక వదిలేసిన పద్యాలను రాముడే వచ్చి స్వయంగా తెలుగులో పూరించి పోయాడనీ, తానీషాకు డబ్బు చెల్లించి రామదాసును విడిపించాడనీ... ఇంకా ఎన్నో గొప్పలు చెప్పుకుంటారు. అలాంటి వాళ్ళకు కూడా తెలుగు దేవ బాషే అనిపించటం లేదా? అలా అనిపించకపోతే వాళ్ళలో ఏదో తేడా ఉన్నట్లే.

"ఇది నాదు మాతృదేశము
**ఇది నా ప్రియ మాతృభాష,** ఇది నా మతమం
చెద గొట్టి నుడువ నేరని
బతికిన జీవి యొకండీవసుధను గలడా?" – సత్యసాయి (25.5.1990)

అర్థం కాక పోయినా కొన్ని భాషలను ఏవేవో కారణాలతో ఏవేవో ప్రయోజనాలు ఆశించి నెత్తిన మోసేవారు తెలుగు దగ్గరకొచ్చేసరికి ఎందుకో విచిత్రంగా బిగుసుకు పోతున్నారు. ఆంగ్ల భాషా మోహ మావరించిన వారికి ఒకటే చెప్పేది. మీరు నెత్తిన పెట్టుకొని మొయ్యాలనుకున్న భాషలను మొయ్యండి. మా భాషను కూడా సమానంగా గౌరవించండి. మా పిల్లలకు వాతలు పెట్టకండి. మా పిల్లల మెడల్లో పలకలు కట్టకండి. మా భాష ఉసురు తీయకండి. అని కోరుతున్నాం. ఇంగ్లీషు మీడియంలో చదివితేనే మోడల్ స్కూళ్ళలో ఉపాధ్యాయ ఉద్యోగాలు దొరికే "ఆదర్శ" సమాజం గదా మనది? తెలుగులో చదివిన వాళ్ళకు కూడా ఉద్యోగాలిచ్చి ఆదుకోండి అని ప్రాధేయపడుతున్నాం. దిక్కు (లేని) మాలిన మాతృభాషలో చదివి వెనుకబడి పోయినందుకు జాలిపడి కాసిని మార్కులు ముష్టిపడెయ్యమంటున్నాం. మా పిల్లలు మా భాషలోనే చదివేలా సహాయపడండి అని వేడుకుంటున్నాం.

'పాశ్చాత్య విద్యల ప్రాభవంబదియేమో
సంస్కృతి అడుగంటి సన్నగిల్లె
**తల్లి భాషను మాట్లాడుట తప్పు ఆయె**
జన సమ్మతమైనట్టి మార్గంబు దూరమాయే
మాతృభావము కంటే మాన్యమెద్ది?
ఆంగ్ల భాషా మోహ మావరించిన నాడే

స్వమత విజ్ఞానంబు సన్నగిల్లే
ఆంగ్ల విద్యయె ప్రాముఖ్య మందియుంట
ఆత్మ విద్యనుపేక్షింప నారిపోయే — సత్యసాయి (21.5.1992)

**"తల్లి భాష మాటాడ తప్పు తోచే**
సంఘ మర్యాద పాటింప జంకు పుట్టే
ధర్మమన్నది బోధింప తప్పిపోయే
ఇట్టు లైనది భారత జాతి నేడు" — సత్యసాయి (4.10.1967)

## అచ్యుత భాష తెలుగు

ఇలాంటి వక్ర స్థితిని నయమార్గమున త్రిప్పి నడుపు కొరకు అచ్యుతుడు పుట్టపర్తిలో అవతారం దాల్చాడు.. కామరాజు అనిల్ కుమార్ (సనాతన సారధి మే 2009).

ఈ అచ్యుతుని తల్లి భాష తెలుగు కాబట్టి తెలుగు దేవ భాషే అయి తీరాలి. మాతృభాషను విడిచిన తెలుగు ప్రజల వక్రస్థితిని సరిచేసి వారిని నయ మార్గం (సహజభాష) లోకి త్రిప్పటానికి బాబా తన వంతు కృషి తాను చేశాడు. మాతృభాషకు పట్టం గట్టండి అంటూ బాబా ఆవేదన పడ్డాడు.

## సత్యశాయి - తెలుగు వాయి

భక్తుల అభిప్రాయం ప్రకారం సాయికి అన్ని భాషలు వచ్చనుకుందాం. ఏదో భాషను కాకుండా తన మాతృభాష తెలుగును మాత్రమే ఎంచుకున్నందుకు ఆజన్మాంతం తెలుగులోనే ప్రసంగించినందుకు తెలుగు భక్తులు ఆయన్ని అభినందించాలి.

హేతువాదుల లెక్క ప్రకారం బాబాకు తెలుగు తప్ప మరే భాషా రాదనుకుంటే అది కూడా తెలుగు జనానికి మహా భాగ్యమే అయి కూర్చుంది. ఆ నోరే తెలుగు నోరు. ఓ తెలుగు వాడిగా సాయి తెలుగు భాషను తన భక్త ప్రపంచం గుర్తించక తప్పని పరిస్థితిని, తెలుగును ఆశ్రయించక తప్పని పరిస్థితిని తెచ్చినందుకు తెలుగు భాషా ప్రేమికులు ఆయన్ని అభినందించాలి.

## తెలుగు భాష వర్ధిల్లటానికి సాయి మార్గం

భారతీయ భాషలు చచ్చిపోకుండా వుండాలంటే ఏం చెయ్యాలో సత్యసాయి చెప్పాడు. "కొంతమంది ఎక్కువ జీతం వస్తుందని విదేశాలకు వెళుతున్నారు. అక్కడ నెలకు ఐదు వేల డాలర్లు సంపాదించవచ్చు. ఇండియన్ కరెన్సీతో పోల్చుకుంటే అది ఎన్నో లక్షలౌతుంది. కానీ అక్కడ ఆ దేశానికి ఎంత ఆదాయమో ఇక్కడ ఈ దేశానికి అంత నష్టం. అక్కడ అయిదు వేల డాలర్లు సంపాదించే బదులు ఇక్కడ ఐదు నూర్లు సంపాదించినా చాలు మనకు. ఈ సత్యాన్ని గుర్తుంచుకొనలేక అనేకమంది అనేక రకములైన ఆశలు పెంచుకొని విదేశాలకు పోతున్నారు.

కానీ ఎబ్రాడ్‌లో ఏముంది? బ్రాడ్‌నెస్ (విశాలభావం) మీలోనే వుంది. దానిని వదిలిపెట్టి మీరు అబ్రాడ్ పోవటం చాలా పొరపాటు. మీరు విదేశాలకు పోనక్కరలేదు. ఇక్కడే వుండి మీ తల్లి దండ్రులను సేవించండి. భారతీయ సంస్కృతిని మీ బిడ్డలకు నేర్పండి.” అని సత్యసాయి చెప్పాడు.

15.1.2008 (సనాతన సారధి, మార్చి 2008)

## మాతృభాషను ప్రేమించటమే నిజమైన దేశభక్తి

ఇప్పుడు 32 లక్షల మంది భారతీయులు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. మిగతా దేశాల్లో ఇంకెంతమంది ఉన్నారో! అవకాశం వస్తే విదేశాలకు ఉరకాలని లక్షల మంది కాచుకొని ఉన్నారు. వీళ్ళంతా మన దేశంలోనే ఉండి మన ప్రజలకే సేవ చేసే పరిస్థితి మన ప్రభుత్వం, మన పారిశ్రామిక వేత్తలూ కల్పిస్తే విదేశాల తలదన్నేలా మన దేశం అభివృద్ధి చెందదా? మన మాతృభాషలు ఇలా మరణ శయ్యమీదకు చేరుతాయా? అన్ని భాషలూ ఇంగ్లీషు దెబ్బకు చచ్చిపోతున్నాయి. భారతీయ సోదరులారా, ఎన్నో శతాబ్దాల పాటు నిర్మించుకున్న మన సాహిత్యం, దేశీయ జన విజ్ఞానం మట్టిపాలు కానీయవద్దు. మీ దేశ భక్తి భాషాభిమాన కబుర్లు ఆపి ఈ ఒక్క సాయి సలహా పాటించండి చాలు. పదేళ్ళలో మళ్ళీ మన భాషలు ప్రాణం పోసుకొని తిరిగి జనశక్తితో తప్పక లేస్తాయి. మన భాషలు బ్రతకాలంటే ఇలా చెయ్యక తప్పదు.

## నోరెత్తి అడుగరా తెలుగోడా చుక్కాని బట్టరా తెలుగోడా

‘మాతృభాషను ప్రేమించటమే నిజమైన దేశభక్తి’ అనే సూక్తికి లోబడి విదేశాలలో తెలుగు ఘనకీర్తులు చాటుతున్న తెలుగు వీరులారా లేవండి. పల్లవి మార్చండి. ఆంధ్రదేశమే మాకు అమర దైవతము అనండి. ఆంధ్రత్వము లేని బ్రతుకును ఆశించకండి. తెలుగు గడ్డమీదకు తరలి రండి. తెలుగు ప్రజలకే సేవ చెయ్యండి. చనిపోయే వ్యక్తికి సాయపడాలని మానవత్వం ఉన్న ఏ వ్యక్తికైనా అనిపిస్తుంది కదా? అలాంటి ఉదారబుద్ధితోనే తెలుగు భాషకు సహాయపడండి. అని మనవి చేస్తున్నాను. (నడుస్తున్న చరిత్ర, ఏప్రిల్ 2012)

**మధుర మధురమైన మన భాష కంటెను**
**చక్కనైన భాష జగతి లేదు**
**జన్మభూమి కన్న స్వర్గంబు వేరేది?**
**మాతృభాష కన్న మధురమేది?**
**తల్లి కన్న వేరెదైవ మింకేదిరా?**
**తెలియుమోయి నీవు తెలుగు బిడ్డా — నార్ల చిరంజీవి**